ఈనాడు

విజయవాడ 4-8-2025 సోమవారం సిటీ సంపుటి 51 . సంచిక 356

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 12 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

మద్యం సొమ్ముతో జల్సాలు


ప్రైవేటు విమానంలో వెంకటేశ్ నాయుడి దర్జా

జనం రక్తమాంసాలే వైకాపా ముఠాకు ఇం'ధనం'

ప్రత్యేక విమానాలు, ఖరీదైన కార్లలో షికార్లు.. విలాసాలు

వెంకటేశ్ నాయుడి వీడియోలు మరిన్ని వెలుగులోకి

వార్షికాదాయం రూ.4.59 లక్షలేనని అఫిడవిట్.. మరి ఈ భోగాలకు డబ్బు ఎక్కడిదో

ఈనాడు - అమరావతి

పేదల రక్తమాంసాలను పీల్చేసి మద్యం కుంభకోణంలో రూ.వేల కోట్లు కొల్లగొట్టిన వైకాపా ముఠా.. ఆ ముడుపుల సొమ్ముతో అత్యంత విలాసవంతమైన జీవితాన్ని గడిపింది.. రాజభోగాలు అనుభవించింది. ప్రత్యేక విమానాలు, ఖరీదైన కార్లలో తిరుగుతూ జల్సాలు చేసింది. ముడుపుల సొమ్ము దాచిపెట్టిన డెన్‌కు ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించిన కీలక నిందితుడు సీహెచ్ వెంకటేశ్ నాయుడు (ఏ-34) గడిపిన విలాసవంత జీవితానికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు మరి కొన్ని ఆదివారం వెలుగులోకి వచ్చాయి. ప్రత్యేక విమానంలో ప్రయాణిస్తున్న వీడియోలు, సినిమా తారలతో కలిసి ప్రత్యేక విమానంలో వెళ్తున్న ఫొటోలు, అత్యంత ఖరీదైన కార్లలో షికార్లు చేస్తున్న ఫొటోలు, వైకాపా నాయకులతో అత్యంత సన్నిహితంగా ఉన్న చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మద్యం ముడుపుల సొమ్ము దాచిపెట్టిన ఒక డెన్‌లో వెంకటేశ్ నాయుడు.. కోట్ల రూపాయల నోట్ల కట్టల్ని లెక్కిస్తూ వాటిని పంపిణీకి సిద్ధం చేస్తున్న దృశ్యాలు రెండు రోజుల కిందట వెలుగులోకి రాగా.. తాజాగా ఆయన విలాసాల వీడియోలు బయటపడ్డాయి. 'జనం నుంచి కొట్టేసిన మద్యం సొమ్ముతో ఏం జల్సాలు చేశారో కదా?' అంటూ సామాజిక మాధ్యమాల్లో ఆ వీడియోలకు పెద్ద ఎత్తున కామెంట్లు వస్తున్నాయి.

నేరుగా విమానాశ్రయం ప్రవేశద్వారం వద్దకే..

ఓ విమానాశ్రయం నుంచి వెంకటేశ్ నాయుడు ప్రత్యేక విమానంలో ప్రయాణిస్తున్న వీడియో బయటికొచ్చింది. ఖరీదైన కారులో నేరుగా వచ్చి విమానాశ్రయ ప్రవేశ ద్వారం దగ్గర ఆయన దిగారు. రన్‌వేపై దర్జాగా నడుచుకుంటూ (మిగతా 2లో)

ఆస్తులేమీ లేవంటూనే..

ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీచేసేందుకు డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన వెంకటేశ్ నాయుడు.. ఎన్నికల అఫిడవిట్‌లో 2022-23 సంవత్సరానికి తన వార్షికాదాయం రూ.4.95 లక్షలుగా చూపించారు. బ్యాంకు ఖాతాల్లో, తన చేతిలో కలిపి మొత్తం రూ.10.70 లక్షలు ఉన్నట్లు తెలిపారు. అంతకుమించి ఏ ఆస్తులూ లేవని పేర్కొన్నారు. అంత తక్కువ వార్షికాదాయం కలిగిన వ్యక్తి ఖరీదైన ద్విచక్ర వాహనంపై తిరగడమే కష్టం. అలాంటిది ఈ ఖరీదైన కార్లు ఎక్కడి నుంచి వచ్చినట్లు? ఈ ప్రత్యేక విమానాల్లో ప్రయాణాలు ఎలా సాధ్యమైనట్లు? కోట్ల రూపాయల నోట్ల కట్టలు ఎక్కడి నుంచి సమకూరినట్లు? దీన్ని బట్టి ఇదంతా మద్యం ముడుపుల సొమ్మేనని తేటతెల్లమవుతోంది.

దూసుకుపోతున్నారు

- 'ఉపాధి'లో రాష్ట్ర మహిళల రికార్డు
- పనిదినాల వినియోగంలో వారిదే 60.14%
- జాతీయ స్థాయి సగటు కన్నా అధికం

ఈనాడు - అమరావతి

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని (నరేగా) వినియోగించుకోవడంలో పురుషుల కంటే మహిళలే ముందుంటున్నారు. జాతీయ స్థాయి సగటు కంటే అత్యధికంగా పనిదినాలు ఉపయోగించుకోవడంలో రాష్ట్ర మహిళలు రికార్డు సృష్టిస్తున్నారు. గత ఏడాది (2024-25) జాతీయ స్థాయిలో సరాసరి పని దినాలు వినియోగించుకున్న మహిళలు 58.1% అయితే.. ఏపీలో ఇది 60.14 శాతంగా ఉండటం గమనార్హం. రాష్ట్రానికి గత ఏడాది కేటాయించిన 21.51 కోట్ల పనిదినాల్లో మహిళలు 14.57 కోట్లకు పైగా వినియోగించుకున్నారు.

జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికీ ఏడాదిలో వంద రోజులపాటు ఉపాధి అందుతోంది. పనులకు హాజరు, పనిదినాలు వినియోగించుకోవడంలో గతంలో వెనుక వరసలో ఉండే మహిళలు ప్రస్తుతం పరుగులు తీస్తున్నారు. ప్రత్యేకించి మిగతా రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్ మహిళలు ముందున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప, (మిగతా 2లో)



సులువుగా చేస్తున్నారు

- సొంత గ్రామంలో ఉపాధి పనులకే మహిళలు ప్రాధాన్యమిస్తున్నారు
- నైపుణ్యాలు లేకపోవడంతో బయట పనుల కంటే 'ఉపాధి' పనులే మేలని భావిస్తున్నారు
- వేతనం కూడా అధికంగా వస్తోంది
- అలవాటు పడిన పనులు కావడంతో సులువుగా చేస్తున్నారు
- 60 ఏళ్లు పైబడిన వారికి కూడా ఉపాధి కల్పిస్తున్నందున మొగ్గు చూపుతున్నారు

60% నిధులు వారి ఖాతాల్లోకే

ఉపాధిహామీ పథకంలో రాష్ట్రానికి కేంద్రం ఏటా కేటాయిస్తున్న వేతన బడ్జెట్‌లో 60% నిధులు మహిళా శ్రామికుల ఖాతాల్లోకే వెళుతున్నాయి. 26 జిల్లాల్లో ఏటా 25 కోట్ల పని దినాలు వినియోగించుకుంటున్నారు. కేంద్రం ప్రకటించిన కనీసవేతనం కింద లెక్కిస్తే వేతనం బడ్జెట్ రూ.6,600 కోట్లు. 60% అంటే మహిళా శ్రామికుల బ్యాంకుఖాతాల్లో రూ.3,600 కోట్లు జమవుతున్నాయి.

సమున్నతంగా తిరుమల నిర్వహణ



కనులారా శ్రీవారి దర్శనం	సామాన్యులకు పెద్దపీట వేసిన తితిదే
గతేడాది జులైతో పోలిస్తే ఈ జులైలో 7.40% భక్తుల పెరుగుదల	
అన్నప్రసాదాల్లో 38.83% వృద్ధి	లడ్డూల ఉత్పత్తిలో 19.63%

3లో


అడవి ఏనుగులను మళ్లించడానికి వెళ్తున్న కుంకీలు

కుంకీలు మొదలెట్టేశాయ్!

రాష్ట్రంలో కుంకీ ఏనుగుల తొలి ఆపరేషన్ విజయవంతమైంది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు చిత్తూరు జిల్లా పలమనేరు అడవి ప్రాంతంలో కుంకీ ఏనుగులు గస్తీకాశాయి. 8 అడవి ఏనుగుల గుంపు టేకుమంద ప్రాంతంలో తిరుగుతున్నట్లు సమాచారం రావడంతో కృష్ణ, జయంత్, వినాయక్ అనే కుంకీలను శిక్షకులు ఆ వైపు తీసుకెళ్లారు. పంటల వైపు రాకుండా అడవి ఏనుగులను కుంకీలు మళ్లించాయి. అడవి నుంచి వచ్చిన గుంపులో ఓ గున్న ఏనుగు ఉండటంతో వాటిని మళ్లించడం కాస్త కష్టమైందని పలమనేరు డీఎఫ్‌ఓ వేణుగోపాల్ తెలిపారు. -న్యూస్‌టుడే, పలమనేరు



భళిరా.. బాహుబలి

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ జిల్లాలో వరదలు ప్రజల జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఛోటా బఘాడా ప్రాంతానికి చెందిన దంపతులు అనారోగ్యంతో ఉన్న తమ నవజాత శిశువును ఆసుపత్రికి తరలించడానికి అవస్థలు పడుతున్న దృశ్యమిది. పీకల్లోతు ఉన్న నీటిలో తమ చిన్నారిని కాపాడుకోవడం కోసం 'బాహుబలి' సినిమాను తలపించే సాహసం చేశారు. చిన్నారిని రెండు చేతులపై ఉంచుకొని నీటిలో మునగకుండా రక్షిస్తూ వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది.

ఉత్తరాదిన కుండపోత 10లో

నీట మునిగిన పలు ప్రాంతాలు

11 ఏళ్లవుతున్నా.. హైదరాబాదే దిక్కా?



తెలంగాణలోనే జనాభా లెక్కలు, ఆధార్ కార్యాలయాలు

అవి అమరావతికి వచ్చేదెప్పుడు?

ఈనాడు - అమరావతి

రాష్ట్ర విభజన జరిగి 11 ఏళ్లయినా.. కొన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు హైదరాబాద్ నుంచి అమరావతికి రావట్లేదు. ఆధార్ ప్రాంతీయ కార్యాలయం, జనాభా లెక్కల సేకరణ కార్యాలయం తెలంగాణ నుంచే పనిచేస్తున్నాయి. త్వరలో జనగణన ప్రారంభమవుతోంది. దీనికి సంబంధించి శిక్షణ ఇవ్వాలి. తరచూ అధికారులతో సమావేశాలు పెట్టాలి. అయినా డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ కార్యాలయాన్ని అమరావతికి తరలించాలనే ఆలోచన ఎవరికీ రాలేదు. ఏపీ సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి నివాస్‌ను నియమిస్తూ జులై 16న కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ ఇచ్చింది. అందులోనూ హైదరాబాద్ కేంద్రంగా పనిచేయాలనే నిర్దేశించింది.

ఏపీకి వెబ్‌సైట్ కూడా లేదు

దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల కార్యాలయాలకు సొంత వెబ్‌సైట్లు ఉన్నాయి. అందులో ఆయా రాష్ట్రాలు, జిల్లాలవారీగా జనాభా లెక్కల వివరాలు, గెజిట్ నోటిఫికేషన్లు ఉంటాయి. పక్కనే ఉన్న కర్ణాటక, తమిళనాడు, ఒడిశా కార్యాలయాలకూ వెబ్‌సైట్లు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ కార్యాలయానికి మాత్రం వెబ్‌సైట్ లేదు.

ఆధార్ అక్కడి నుంచేనా?

ఆధార్ వ్యవహారాలను పర్యవేక్షించే యూఐడీఏఐ (యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా) ప్రాంతీయ కార్యాలయం కూడా హైదరాబాద్‌కే పరిమితమైంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, అండమాన్ నికోబార్ దీవులకు అక్కడి నుంచే సేవలందుతున్నాయి. దేశవ్యాప్తంగా 8 ప్రాంతీయ కార్యాలయాలున్నాయి. ప్రజల సౌలభ్యం కోసం ఆర్‌ఓల పరిధిలో రాష్ట్ర కార్యాలయాలు ఏర్పాటుచేశారు. ఇందులో భాగంగానే హైదరాబాద్ ఆర్‌ఓ పరిధిలోని ఒడిశాకు భువనేశ్వర్‌లో రాష్ట్ర కార్యాలయం ఏర్పాటైంది. అమరావతిలో ఈ కార్యాలయం ఊసే లేదు. ప్రజలకు ఏవైనా సమస్యలున్నా.. హైదరాబాద్‌లోని అధికారులనే సంప్రదించాలి. ఆధార్ సేవాకేంద్రాలున్నా.. ఏదైనా ఉంటే ప్రాంతీయ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచిస్తున్నారు. ఫోన్ చేసి అడిగినా అక్కడి నుంచి సరైన సమాధానం రాదు. అధికారులు అందుబాటులో లేరనో.. తర్వాత ఫోన్ చేయాలనో చెబుతారు.


బద్దలైన క్రషెనిన్నికోవ్ అగ్నిపర్వతం

రష్యాలో భూకంపం

మాస్కో: రష్యాలోని కమ్చట్కా ద్వీపకల్పంలో క్రషెనిన్నికోవ్ అగ్నిపర్వతం 600 ఏళ్ల తర్వాత బద్దలైంది. దీంతో 6 వేల మీటర్ల ఎత్తుకు పైగా బూడిద ఎగసిపడింది. శనివారం అర్ధరాత్రి తర్వాత జరిగిన ఈ విస్ఫోటం అనంతరం భూకంపం, సునామీ ఒకదాని తర్వాత మరొకటి రష్యాను వణికించాయి. కమ్చట్కా ద్వీపకల్పానికి సమీపంలో ఉన్న కురిల్ దీవుల్లో ఆదివారం రిక్టరు స్కేలుపై 7.0 తీవ్రతతో భూకంపం సంభవించింది. (మిగతా 2లో)

క్వారీలో ఘోరం

గ్రానైట్ పలకరాయి పడి ఆరుగురి దుర్మరణం


క్వారీలో గ్రానైట్ పలకలు ఊడిపడిన చోటు

- ఎనిమిది మందికి తీవ్రగాయాలు
- మృతులంతా ఒడిశా వాసులే
- బాపట్ల జిల్లా బల్లికురవ సమీపంలో ఘటన

ఈనాడు, అమరావతి-న్యూస్‌టుడే, బాపట్ల, అద్దంకి, బల్లికురవ: బాపట్ల జిల్లా బల్లికురవ సమీపంలోని గ్రానైట్ క్వారీలో ఆదివారం ఘోర ప్రమాదం జరిగింది. గ్రానైట్ పలకల రాయిని వేరు చేయడానికి కార్మికులు డ్రిల్లింగ్ చేస్తుండగా పైనుంచి గ్రానైట్ పలకల రాళ్లు జారి పడటంతో అక్కడికక్కడే నలుగురు ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన పదిమందిని పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మార్గమధ్యలో మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, 8మంది చికిత్స పొందుతున్నారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. బాధితులంతా ఒడిశా వాసులు.

ప్రమాదం జరిగింది ఇలా..

సత్యకృష్ణ గ్రానైట్ క్వారీలోకి ఆదివారం ఉదయం 9 గంటలకు 16 మంది కూలీలు డ్రిల్లింగ్ పనికి వెళ్లినట్లు తెలుస్తోంది. వీరు జాకీలతో డ్రిల్లింగ్ చేస్తున్నారు. 11గంటలకు గ్రానైట్ రాళ్లు జారి కార్మికులపై పడ్డాయి. రెండు రోజులుగా ఈ ప్రాంతంలో వర్షం (మిగతా 2లో)


బాక్స్‌ఫోన్లలో కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న విద్యార్థులు



మేం స్మార్ట్‌ఫోన్ వాడం

ఈ కాలంలో బాక్స్ ఫోన్లేంటి అనుకుంటున్నారా? స్మార్ట్‌ఫోన్లతో విద్యార్థుల ఏకాగ్రత దెబ్బతినకుండా ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ ప్యారడైజ్ రెసిడెన్షియల్ స్కూలులో వీటిని ఏర్పాటు చేశారు. ఇక్కడ 900 మంది విద్యార్థులు ఉన్నారు. సెల్‌ఫోన్లు వినియోగించడానికి వారిని అనుమతించరు. స్మార్ట్‌కార్డులతో పనిచేసే 12 బాక్స్ ఫోన్లను ఏర్పాటు చేశారు. కార్డులో ముందే మూడు నంబర్లను నిక్షిప్తం చేస్తారు. రూ.500 వరకూ రీఛార్జి చేసుకోవచ్చు. బాక్స్‌లో కార్డు పెట్టాక.. స్క్రీన్‌పై నంబర్లు కనిపిస్తాయి. మూడు మీటల్లో ఒకదాన్ని నొక్కితే సంబంధిత నంబరుకు ఫోన్ వెళుతుంది. ఆ కాల్ 15 నిమిషాలే ఉంటుంది. వారానికోసారి విద్యార్థులకు ఫోన్ మాట్లాడే అవకాశమిస్తారు.

- ఈనాడు, ఏలూరు, న్యూస్‌టుడే, ఆగిరిపల్లి

ఎరుపెక్కిన కళ్లు.. పొడిబారిన పెదాలు..!

కొత్త స్నేహాలు.. అదుపులేని ఖర్చులు.. మీ పిల్లలు మత్తుకు బానిస అయ్యారని తెలిపే లక్షణాలు..! తొలి దశలోనే గుర్తించి.. చక్కదిద్దకుంటే అందివచ్చిన వాళ్లు.. అక్కరకు రాకుండా పోయే ప్రమాదముంది!

హైదరాబాద్ ఫిల్మ్‌నగర్ ప్రాంతానికి చెందిన యువకుడు వాహనం నడుపుతూ ప్రమాదానికి గురై చనిపోయాడు. అతడిని ఎవరో ఢీకొట్టడం వల్లే మరణించాడని తల్లిదండ్రులు అనుమానించారు. తీరా పోలీసుల దర్యాప్తులో వారు నిశ్చేష్టులయ్యే నిజాలు తెలిశాయి. ఆ యువకుడు మద్యం, గంజాయిలకు అలవాటుపడ్డాడని... ఆ మత్తులో వేగంగా బండి నడిపి డివైడర్‌ను ఢీకొట్టడం వల్ల మరణించాడని... అంతకుముందు మాదాపూర్ ప్రాంతంలో తన అతివేగంతో మరొకరి మరణానికీ కారణమయ్యాడనీ తేలింది.



ఇలా గుర్తించండి.. అప్రమత్తం కండి

తొలుత సిగరెట్లు, మద్యం తీసుకోవడం మొదలైన తర్వాత మాదకద్రవ్యాల వైపు మొగ్గు చూపుతారని నిపుణులు చెబుతున్నారు. కొన్ని సంకేతాల ద్వారా పిల్లలు మత్తుకు బానిసవుతున్నారని గుర్తించొచ్చని స్పష్టం చేస్తున్నారు.

- ఆకలి తగ్గిపోవడం
- తరచూ మానసిక ఒత్తిడికి లోనుకావడం
- జ్ఞాపకశక్తి మందగించడం
- చేతులు, కాళ్లు వణకడం
- జుట్టు పొడిబారి, వయసు మీరినట్లు కనిపించడం
- మాట తడబడటం
- కళ్ల కింద నల్లటి వలయాలు ఏర్పడటం
- కుటుంబసభ్యులతో కాకుండా ఒంటరిగా గదిలో ఉండటం
- సాధారణం కన్నా ఎక్కువగా వాదనకు దిగడం
- అంతకుముందులా కాకుండా అతిగా నిద్రించడం.. లేదా నిద్రకు దూరమవడం.



పల్లె, పట్నం తేడా లేకుండా మత్తు మహమ్మారి బారిన పడి ఎందరో యువకుల భవిష్యత్తు బుగ్గి పాలవుతోంది. గంజాయి వినియోగం విపరీతంగా పెరగడం ఆందోళనకు గురిచేసే అంశంగా మారింది. మిగతా మాదకద్రవ్యాలతో పోలిస్తే సులభంగా, చవకగా లభ్యమవడం ఇందుకు కారణంగా కనిపిస్తోంది. తొలుత రుచి చూడాలనే ఉత్సుకతతో మత్తు ఊబిలోకి దిగుతున్న యువత బానిసలుగా మారాక కానీ కుటుంబసభ్యులు గుర్తించలేకపోతున్నారు. అప్పటికే పరిస్థితి చేయి దాటి పోతుండడంతో ఆయా కుటుంబాల బాధ వర్ణనాతీతంగా ఉంది. బయటికి చెబితే పరువు పోతుందనే బాధ ఓవైపు.. ఎదిగిన పిల్లలు చేయి దాటి పోతున్నారనే ఆవేదన మరో వైపు వారిని దహించివేస్తోంది. (మిగతా 2లో)

ఎరుపెక్కిన కళ్లు.. పొడిబారిన పెదాలు..!

(మొదటి పేజీ తరువాయి)

ఈనేపథ్యంలో ప్రాథమిక దశలోనే గుర్తించి వ్యసన విముక్తి కేంద్రాల్లో చేర్పగలిగితే 'మత్తు' వదిలించేందుకు ఆస్కారముంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

కదలికలపై కన్నేయాలి..

- చరవాణుల్లో వాట్సాప్, స్నాప్‌చాట్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్‌లాంటి యాప్‌లను తరచూ తనిఖీచేయాలి. చాటింగ్‌లలో mal, stuff, dum, MD, khash, weed, score, stamp, crystal, acid, paper, ocb, boom, coke, joint, stash, stoner, peddler లాంటి సంభాషణలుంటే అనుమానించి ఆరా తీయాలి.
- మీ పిల్లలు తీసుకున్న డబ్బుకు కచ్చితమైన లెక్కలడగాలి. ఇంటికి దూరంగా ప్రైవేటుగదుల్లో, వసతిగృహాల్లో గనక ఉంటే ఆకస్మికంగా సందర్శించి పరిస్థితులను గమనించాలి.
- సహజంగా బర్త్‌డే పార్టీల్లాంటి వేదికల్లోనే తొలుత మాదకద్రవ్యాలను రుచి చూసే ప్రమాదముంది. అందుకే అలాంటి వేడుకల విషయాల్లో అప్రమత్తంగా ఉండాలి.
- ఒకవేళ ఇంటికి తరచూ ఆలస్యంగా వస్తున్నప్పుడు ఎలాంటి స్థితిలో ఉన్నారో గమనించాలి. మాట తడబడటం, కళ్లు ఎర్రబారడం, మగతగా ఉన్నట్లుంటే వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలి.
- విద్యార్థుల బ్యాగ్‌ల్లో ఒ.సి.బి. పేపర్, లైటర్, ఐడ్రాప్స్ తదితర వస్తువులుంటే మాదకద్రవ్యాలు తీసుకుంటున్నట్లే. ఎక్కువగా తినడం, ఎక్కువగా నిద్ర పోవడమూ గంజాయి వాడకంలో ప్రాథమిక లక్షణంగా గుర్తించాలి.

– ఈనాడు, హైదరాబాద్

విముక్తి ఇలా...

పిల్లలుగనక వ్యసనం బారిన పడినట్లు తెలిస్తే ప్రభుత్వ యంత్రాంగాల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా సాంత్వన పొందొచ్చు. వ్యసనం నుంచి విముక్తి కోసం డీఅడిక్షన్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. దీంతోపాటు మాదకద్రవ్యాల సరఫరా, విక్రయాల సమాచారం గురించి కూడా ఫిర్యాదు చేయొచ్చు.

- తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో(టీజీఏఎన్‌బీ) టోల్ ఫ్రీ నంబర్: 1908
- కంట్రోల్ రూం నంబర్: 8712671111
- ఆంధ్రప్రదేశ్‌లో మాదకద్రవ్యాల నిరోధానికి ఈగల్ అనే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేశారు. 1972 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదులను ఇవ్వచ్చు.
- నషాముక్త్ భారత్ నేషనల్ హెల్ప్‌లైన్ నంబర్: 14446

దూసుకుపోతున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకాశం జిల్లాల్లో మహిళలు ఈ పనులకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారు.

రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో గత మూడేళ్లలో మహిళల పెరుగుదల ఇలా..

ఏడాది	మొత్తం పని దినాలు (కోట్లలో)	మహిళలు వినియోగించుకున్నవి	శాతం	జాతీయ సగటు
2023–24	25.30	15,47,23,679	60.56	58.09
2024–25	21.50	14,57,14,388	60.14	56.36
2025–26 (జులై 31 వరకు)	15.00	8,99,24,693	60.77	56.36

విషపూరిత మద్యంతో ప్రజల ప్రాణాలు తీశారు

- మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజం



ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణంలో కొల్ల గొట్టిన సొత్తును దాచిపెట్టిన డెన్‌లు, డంప్‌ల దృశ్యాలు చూస్తుంటే.. వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి ఎన్ని వేల కోట్ల రూపాయలు దోచుకున్నారో కళ్లముందు కనిపిస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. ఇలా లూటీ చేసిన డబ్బుతో ఈ మద్యం ముఠా టన్నులకొద్దీ బంగారం కొనడంతోపాటు విదేశాల్లో మైనింగ్ వ్యాపారం చేసిందని, దుబాయ్‌లో డొల్ల కంపెనీలు ఏర్పాటుచేసుకుందని ఆరోపించారు. ఈ ముడుపుల సొమ్మునే గత సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులకు పంపిణీ చేసి.... అడ్డదారుల్లో గెలిచేందుకు విశ్వప్రయత్నాలు చేసిందన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు.

- మద్యపాన నిషేధం అమలు చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన వైకాపా.. ఆ హామీని అడ్డం పెట్టుకుని కనీవినీ ఎరుగని రీతిలో మద్యం కుంభకోణానికి పాల్పడి రూ.వేల కోట్లు దోచుకుంది. ముడుపుల కోసం ఊరూపేరూ లేని విషపూరిత 'జే' బ్రాండ్లు అమ్మి.. ప్రజల ధన, మాన, ప్రాణాలతో చెలగాటమాడింది. వైకాపా హయాంలోని ఐదేళ్లలో 'జే' బ్రాండ్లు తాగడం వల్ల 30వేల మంది చనిపోయినట్లు సర్వేల్లో వెల్లడైంది. కూటమి అధికారంలోకి వచ్చాక తెచ్చిన నూతన మద్యం విధానంతో పొరుగు రాష్ట్రాల్లో మద్యం విక్రయాలు తగ్గాయి. ఏపీలో ప్రస్తుతం నాణ్యమైన మద్యం లభిస్తుండడంతో ఇతర రాష్ట్రాల నుంచి దొంగచాటుగా మద్యం తీసుకొచ్చే పరిస్థితికి అడ్డుకట్ట పడింది.

వైకాపా నేతలకు ఇక నిద్రలేని రాత్రులే

పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్



ఈనాడు, అమరావతి: బ్రాండెడ్ మద్యాన్ని అందుబాటులో లేకుండా చేసి.. లిక్కర్ దందాలు నడిపిన వైకాపా నేతలకు నిద్రలేని రాత్రులు మొదలయ్యాయని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. 'నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన వైకాపాకు దిమ్మతిరిగేలా సిట్ తిరుగులేని ఆధారాలు సంపాదించింది. మద్యం కుంభకోణంలో డొంక కదిలి నేతల నిజస్వరూపం బయటపడుతోంది. రోజుకో పరిణామం వెలుగుచూస్తోంది. తప్పుడు పనులు చేసిన వైకాపా నేతల మైండ్ బ్లాంక్ అవుతోంది' అని ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు. 'గత ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్యాన్ని గుల్లచేస్తూ విషపూరిత మద్యం విక్రయించారు. కూటమి ప్రభుత్వంలో తక్కువ ధరలోనే నాణ్యమైన బ్రాండ్‌లతోపాటు విదేశీ బ్రాండ్లు దొరుకుతున్నాయి. అత్యుత్తమ విధానాలతో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త పాలసీ బాగుంది. ప్రజలకు నాణ్యమైన మద్యం అందిస్తున్నాం. మద్యం డిపోల నిర్వహణ, ట్రాక్ అండ్ ట్రేస్ విధానం, మద్యం సరఫరా ఆర్డర్ల జారీలో పారదర్శకతకు పెద్దపీట వేశాం' అని మంత్రి వివరించారు.

ఆర్నెల్ల సన్నద్ధతతో.. బ్యాంకులో పాగా!

- ఈనాడు, టైమ్ సంస్థలు నిర్వహించిన వెబినార్‌లో నిపుణుల సూచనలు

T.I.M.E. Triumphant Institute of Management Education Pvt. Ltd.

ఈనాడు, హైదరాబాద్: ఆరు నెలలు నిబద్ధతతో కృషి చేస్తే బ్యాంకు పరీక్షల్లో విజయం సాధించడానికి అవకాశం ఎక్కువనీ, కొత్తగా సిద్ధమవుతున్నవారు మొదటి రెండు నెలలూ ప్రాథమికాంశాలను (బేసిక్స్) బాగా నేర్చుకోవాలనీ నిపుణులు తెలిపారు. ఐబీపీఎస్/ బ్యాంకింగ్ కెరియర్, నియామక పరీక్షలపై అవగాహన కోసం ఈనాడు- చదువు, టైమ్ సంస్థలు సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ఉచిత వెబినార్‌లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అభ్యర్థులు పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

'గిరిగీసుకుని ఫలానా పరీక్షలే రాస్తాననుకోవడం సరికాదు. అన్ని బ్యాంకు పరీక్షలూ రాసి, వచ్చిన ఉద్యోగంలో చేరి, ఆ తర్వాత మీ ఆశయానికి తగ్గ కలల కొలువు కోసం ప్రయత్నించాలి' అని టైమ్ సంస్థ జీఎం అకడమిక్స్- ఆపరేషన్స్ హిదయతుల్లా సూచించారు. ఎస్‌బీఐ విశ్రాంత జనరల్ మేనేజర్ ఏవీ బ్రహ్మారావు మాట్లాడుతూ.. ప్రొబేషనరీ ఆఫీసర్లు (పీవో) అంటే జూనియర్ మేనేజర్లను పరీక్ష, ఇంటర్వ్యూలతో నియమిస్తారు. ఇలా చేరినవారు మేటి పనితీరుతో దశలవారీగా ఛైర్మన్ హోదాకు చేరుకోవచ్చు. ఈ స్థాయికి చేరుకోవాలంటే బ్యాంకు ఉద్యోగాల ఆశావహులు నిబద్ధతతో కృషి చేయాల'ని ఉద్బోధించారు. 'ప్రతి పరీక్షలోనూ 30-40 శాతం ప్రశ్నలు ప్రాథమిక స్థాయిలో, 20-25 శాతం ప్రశ్నలు మధ్యస్థంగా, మిగిలినవి కొంచెం కఠినంగా వస్తాయి. సాధన చేసినవాళ్లు ఎదుర్కొనేలాగే అడుగుతార'ని సమన్వయకర్తగా వ్యవహరించిన ప్రొ. నీలమేఘశ్యామ్ దేశాయ్ తెలిపారు.



వెబినార్‌లో పాల్గొన్న హిదయతుల్లా, బ్రహ్మారావు. ఇన్‌సెట్‌లో నీలమేఘశ్యామ్ దేశాయి

ఏటా లక్ష ఉద్యోగాలు

- బ్యాంకింగ్ ఉద్యోగాలు ఏటా సుమారు లక్ష భర్తీ అవుతాయి. పోటీ తీవ్రమే. అయినా ఒకే తరహా సన్నద్ధతతోనే పరీక్షలన్నీ ఎదుర్కోవచ్చు.
- ప్రిలిమినరీ స్థాయిలో.. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్, ఇంగ్లిష్ విభాగాల్లో పరీక్ష రాయాలి. మెయిన్స్ స్థాయిలో వీటితోపాటు అదనంగా జీకే, కంప్యూటర్స్ చదవాలి. పరీక్షలు ఏవైనప్పటికీ ప్రశ్నాంశాలు మాత్రం ఇవే. ప్రశ్నల సంఖ్య, స్థాయిలోనే వ్యత్యాసం ఉంటుంది. సిలబస్ దాదాపు అన్ని పరీక్షలకూ ఒకటే. ఈ సన్నద్ధతతో ఏడాదిలో దాదాపు 20-25 పరీక్షలు రాయడానికి అవకాశం ఉంది.
- బ్యాంకు పరీక్షలో ప్రశ్నల స్థాయిని విశ్లేషణ చేయాలి. వీలైనన్ని ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి. తక్కువ వ్యవధిలో సమాధానం గుర్తించగలగాలి. సన్నద్ధత వీటన్నింటికీ అనుగుణంగా కొనసాగాలి.

పరీక్షలు ఆన్‌లైన్‌లోనే..

- చదవడం పూర్తయిన తర్వాత టాపిక్‌ల వారీ ఆన్‌లైన్‌లో ప్రాక్టీస్ టెస్టులు రాయాలి. పరీక్షలు ఆన్‌లైన్‌లో రాయాల్సి ఉన్నందున ప్రాక్టీస్ టెస్టులూ ఆన్‌లైన్‌లోనే రాయడం ముఖ్యం.
- ప్రిలిమ్స్, మెయిన్స్ రెండు పరీక్షలనూ విడిగా చూడొద్దు. కాంబినేషన్‌గా భావించాలి. కేవలం ప్రిలిమ్స్ కోసమే సన్నద్ధమైతే మెయిన్స్ రాయడం ఇబ్బందవుతుంది. జనరల్ అవేర్‌నెస్, జీకే కోసం రోజూ గంట నుంచి గంటన్నర న్యూస్ పేపర్ చదవాలి.
- రుణాత్మక మార్కులు ఉన్నందున తెలియని ప్రశ్నలకు జవాబులు గుర్తించొద్దు. పరీక్ష రాస్తున్నప్పుడు తేలికైన ప్రశ్నలకు ముందుగా జవాబు గుర్తించాలి.
- కరెంట్ అఫైర్స్ కోసం పరీక్షకు ముందు ఆరు నెలల సంఘటనలు బాగా చదవాలి. తొమ్మిది నెలలయితే ఇంకా మంచిది. గత పరీక్షలను పరిశీలిస్తే పరీక్షకు 3-4 నెలల ముందు అంశాల్లో ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయి.

రోజుకు ఎన్ని గంటల ప్రిపరేషన్?

డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో ఉన్నవారు, జాబ్ చేస్తున్నవారే కాకుండా డిగ్రీ పూర్తయినవారూ 80 శాతం మంది బ్యాంకు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. కోచింగ్ సెంటర్‌లో చేరినవారికి నాలుగైదు గంటలు క్లాసులుంటాయి. అదనంగా మరో 6 నుంచి 8 గంటల సమయం ప్రిపరేషన్‌కు కేటాయించాలి. కోచింగ్ తీసుకోనివారైతే రోజులో 10 నుంచి 12గంటల వరకు ఇదే ప్రిపరేషన్‌లో ఉండాలి. ఒకవేళ జాబ్ చేసేవారు, డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నవారైతే రోజూ రెండు, మూడు గంటలు కేటాయించి.. వీకెండ్స్‌లో (శని, ఆదివారాల్లో) మాత్రం కనీసం 10 గంటలు చదవగలిగితే బాగుంటుంది.

పూర్తి కథనం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

క్వారీలో ఘోరం

(మొదటి పేజీ తరువాయి)

కురుస్తుండటంతో పట్టుసడలి జారిపడినట్లు తోటి కూలీలు చెబుతున్నారు. ఘటనపై వెంటనే కలెక్టర్ వెంకటమురళి స్పందించారు. ఘటనపై రెవెన్యూ, పోలీసు, గనుల శాఖ అధికారులతో సమీక్షించారు. ప్రమాదంపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఎస్పీ తుషార్ డూడీ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద కారణాలు తెలుసుకున్నారు.

మృతులు వీరే: దండ బడత్యా (48), ముస్నా జన (43), తకున దలాయ్ (37), బనమల బెహరా (30) భాస్కర్ బిషోయ్ (40) సంతోష్ గౌడ (36)

అద్దంకి ఆసుపత్రిలో మృతదేహాలు

ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందిన నలుగురి మృతదేహాలను అద్దంకి ప్రభుత్వాసుపత్రి శవాగారానికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మార్గమధ్యలో చనిపోయిన మరో ఇద్దరి మృతదేహాలను నరసరావుపేట ప్రభుత్వాసుపత్రి శవాగారంలో ఉంచారు. పరిస్థితి విషమంగా ఉన్న ముగ్గురిని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

- క్వారీ ప్రమాదంలో ఎంతమంది గాయపడ్డారన్న విషయంపై అధికారుల వద్ద సరైన సమాచారం లేదు. ఘటన సమయంలో తొమ్మిది మందే ఉన్నారని, ఆరుగురు చనిపోగా ముగ్గురికి గాయాలయ్యాయని ఎస్పీ తుషార్ డూడీ చెప్పారు. రెవెన్యూ అధికారులు, తోటి కార్మికుల సమాచారం ప్రకారం ప్రమాదానికి ముందు 16 మంది కార్మికులు అక్కడ ఉన్నారని తెలిసింది. క్వారీలో రాళ్లకింద మరికొన్ని మృతదేహాలు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కలెక్టర్‌తో మాట్లాడిన సీఎం

ప్రమాదఘటనపై సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, అధికారులతో మాట్లాడి ప్రమాద కారణాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా సాయం అందించాలని.. ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి, మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ ఘటనపై విచారం వ్యక్తం చేశారు.

గవర్నర్ దిగ్భ్రాంతి: క్వారీ ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడం, పలువురు గాయపడ్డ ఘటనపై గవర్నర్ అబ్దుల్‌నజీర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాల్సిందిగా జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి: జగన్

ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని వైకాపా అధినేత జగన్ కోరారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

మృతుల కుటుంబాలకు రూ.14 లక్షల ఆర్థికసాయం

- తీవ్రంగా గాయపడినవారికి రూ.10 లక్షలు
- క్షతగాత్రులను పరామర్శించిన బాపట్ల కలెక్టర్
- క్వారీ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే నరసరావుపేట అర్బన్, మల్లమ్మసెంటర్: గ్రానైట్ క్వారీ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.14 లక్షలు, తీవ్రంగా గాయపడ్డవారికి రూ.10 లక్షలు, స్వల్పగాయాలైన వారికి రూ.లక్ష చొప్పున యాజమాన్యం నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని బాపట్ల కలెక్టర్ వెంకటమురళి ప్రకటించారు. బల్లికురవ గ్రానైట్ క్వారీ ప్రమాదంలో గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవారిని కలెక్టర్ పరామర్శించి మెరుగైన వైద్యం అందేలా చూడాలని సూచించారు. గాయపడిన వారందరూ పూర్తిగా కోలుకునేవరకు వైద్య ఖర్చులన్నింటినీ ప్రభుత్వమే భరిస్తుందన్నారు. మృతదేహాలను సొంత ప్రదేశాలకు తరలించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదసమయంలో 16 మంది ఒడిశా కార్మికులు పని చేస్తున్నారని, రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రానైట్ రాయి జారిపడడంతో ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో క్వారీ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదుచేసి ఘటనపై సమగ్ర విచారణ జరుపుతామన్నారు. మైనింగ్‌శాఖ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలుంటాయన్నారు. బల్లికురవ ఘటనలో గాయాలపాలైన వారిని నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పల్నాడురోడ్డులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న వారిలో సుదర్శన్(20), అలక్‌నాయక్(24), సిరాగౌడ(37), బెంకయ్య(37), సుభాష్ మాలిక్(25), పవిత్ర బెహరా(30), శాంత నాయక్(30), దంబా(30) ఉన్నారు.

సౌర ప్రాజెక్టుల ప్రక్రియ వేగవంతం

- మొదటిదశలో 3 లక్షల కనెక్షన్లకు ఏర్పాటు
- 5,983 ఎకరాల మేర భూముల గుర్తింపు



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పీఎం కుసుమ్ పథకం కింద ఫీడర్ల వెంట మినీ సౌరవిద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటు టెండర్లలో యూనిట్‌కు కనిష్ఠంగా రూ.3.19, గరిష్ఠంగా రూ.3.60 ధరను గుత్తేదారులు కోట్ చేశారు. ఈ పథకం కింద 1,185.80 మెగావాట్ల ప్రాజెక్టుల ఏర్పాటుకు డిస్కంలు ఈ ఏడాది మార్చిలో సర్కిళ్లవారీగా టెండర్లు పిలిచాయి. త్వరలో వాటిని గుత్తేదారులకు కేటాయించనున్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి ప్రాజెక్టులు పూర్తిచేయాలని కేంద్రం లక్ష్యాన్ని విధించింది. ఈ దృష్ట్యా ప్రాజెక్టుల కేటాయింపు ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. వీటి కోసం ఇప్పటికే 5,983 ఎకరాల మేర భూముల గుర్తింపు పూర్తయింది.

మొదటిదశలో 3 లక్షల కనెక్షన్లు

మొదటిదశలో 3 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు సరిపడా విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రాజెక్టులను పీఎం కుసుమ్ కింద ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనికోసం 1,185 మెగావాట్ల ప్రాజెక్టుల ఏర్పాటుకు డీపీఆర్‌లను కేంద్రానికి ప్రభుత్వం పంపింది. తర్వాత మరో 2 లక్షల కనెక్షన్లకు సరిపడా ప్రాజెక్టులకు అనుమతి తీసుకోవాలన్నది ప్రభుత్వ ఆలోచన. దశలవారీగా 3,725 మెగావాట్ల మేర మినీ సౌర విద్యుత్ ప్రాజెక్టులు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. మొదటిదశలో ప్రతిపాదించిన ప్రాజెక్టుల ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియ చేపట్టింది. ఈ పథకం కింద ఏర్పాటు చేసే ప్రాజెక్టులకు కేంద్రం మెగావాట్‌కు రూ.1.04 కోట్లు రాయితీ కింద అందించనుంది.

- ఎస్‌పీడీసీఎల్ పరిధిలోని 9 సర్కిళ్లలో 610 మెగావాట్ల ప్రాజెక్టుల ఏర్పాటుకు డిస్కం టెండర్లు పిలిచింది. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ కడప, శ్రీ సత్యసాయి, అనంతపురం, నంద్యాల, కర్నూలు సర్కిళ్ల పరిధిలో ప్రాజెక్టుల ఏర్పాటుకు 3,055 ఎకరాల ప్రభుత్వ ప్రైవేటు భూములను గుర్తించింది.
- సీపీడీసీఎల్ పరిధిలోని 4 సర్కిళ్లలో 355.50 మెగావాట్ల ఉత్పత్తి ప్రాజెక్టుల ఏర్పాటు.. ప్రభుత్వ ప్రైవేటు భూములు 1,842 ఎకరాల గుర్తింపు.
- ఈపీడీసీఎల్ పరిధిలో 220.30 మెగావాట్ల ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రతిపాదన.. ఇందుకు 1,086.5 ఎకరాల గుర్తింపు.

ప్రభుత్వానికి తగ్గనున్న సబ్సిడీ భారం

వ్యవసాయ కనెక్షన్లకు ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రస్తుతం ఏటా సుమారు రూ.12,000 కోట్లు సబ్సిడీ కింద ప్రభుత్వం డిస్కంలకు చెల్లిస్తోంది. మినీ సౌరవిద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటు వల్ల ప్రభుత్వానికి సబ్సిడీ భారం కొంతమేర తగ్గనుంది. ప్రస్తుతం డిస్కంలు విద్యుత్ కొనుగోలు, నిర్వహణ ఖర్చులు, సరఫరా, పంపిణీ నష్టాలు కలిపి యూనిట్‌కు సగటున ధర రూ.7.50 అవుతోంది. పీఎం కుసుమ్ కింద గరిష్ఠంగా యూనిట్‌కు రూ.3.60 వరకు మాత్రమే గుత్తేదారు సంస్థలు కోట్ చేశాయి. ఈ ప్రకారం యూనిట్‌కు రూ.3.90 చొప్పున ప్రభుత్వానికి మిగలనుంది. ఫీడర్ దగ్గరే ప్రాజెక్టులు ఉండటం వల్ల సరఫరా నష్టాలు మరింత తగ్గుతాయని అధికారులు చెబుతున్నారు.

రాయలసీమకు భారీ వర్ష సూచన

ఈనాడు, విశాఖపట్నం: నైరుతి బంగాళాఖాతం ఉత్తర తమిళనాడు తీరంలో ఉపరితల ఆవర్తనం విస్తరించింది. దీని ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని దక్షిణ కోస్తా, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. సోమవారం అనంతపురం, శ్రీ సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది.


రష్యాలో భూకంపం

(మొదటి పేజీ తరువాయి)

దీని ధాటికి పలు నగరాల్లోని భవనాలు ఊగిపోయాయని రష్యా మీడియా తెలిపింది. ప్రజలు భయభ్రాంతులకు గురై ఇళ్ల నుంచి పరుగులు తీసినట్లు పేర్కొంది. అనంతరం పసిఫిక్ సముద్రంలో సునామీ హెచ్చరికలను జారీ చేశారు. ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన సమాచారం తెలియలేదు.

త్వరలోనే జగన్ అరెస్టు

మంత్రి సత్యకుమార్ యాదవ్



తిరుపతి (గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: మద్యం కుంభకోణంలో అసలైన సూత్రధారి జగన్ త్వరలోనే అరెస్టు కానున్నారని, అందువల్లే సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. "వైకాపా ఐదేళ్ల పాలనలో నాసిరకం మద్యం తాగి ప్రజలు అనారోగ్యానికి గురికావడం వాస్తవం కాదా? నోట్ల కట్టలతో బయటికొచ్చిన వీడియోలోని వ్యక్తి జగన్ అనుచరుడు కాదా?'' అని ప్రశ్నించారు. తిరుపతిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. "కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ప్రజల దృష్టి మళ్లించేందుకు జగన్ అభూతకల్పన చేస్తున్నారు. కూటమి ఏడాది పాలనపై జగన్ సొంత ఛానల్‌లో చర్చకు నేను సిద్ధం. త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాలకు జగన్ వచ్చి ప్రజల సమస్యలపై చర్చించగలరా?'' అని సత్యకుమార్ యాదవ్ అన్నారు.

రూ.10 లక్షల కోట్ల చేనేత ఎగుమతులే లక్ష్యం

హైదరాబాద్, న్యూస్‌టుడే: రానున్న ఐదేళ్లలో చేనేత ఎగుమతులను రూ.10 లక్షల కోట్లకు తీసుకెళ్లడమే లక్ష్యంగా రాష్ట్రాలతో కలిసి కేంద్రం ముందుకు సాగుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవంలో ప్రసంగించారు. దేశ ఎగుమతుల్లో చేనేతవే 13 శాతం. వాటి విలువ రూ.3లక్షల కోట్లుగా ఉందన్నారు.

మద్యం సొమ్ముతో జల్సాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రైవేట్ జెట్ వద్దకు వెళ్లి లోపలికి ఎక్కారు. తర్వాత దిగేటప్పుడు రన్‌వేపై సిద్ధంగా ఉన్న ఓ బుగ్గ కారులో ఎక్కారు. దీన్ని బట్టి ఆయన ఏ స్థాయిలో విలాసవంతమైన జీవితం గడిపారో అర్థం చేసుకోవచ్చు. బుగ్గకారు ప్రోటోకాల్ ఇచ్చారంటే అత్యంత ప్రముఖులతో కలిసి ఆయన ప్రత్యేక విమానంలో ప్రయాణించినట్లు అర్థమవుతోంది.





ఛార్టర్డ్ ఫ్లైట్ దిగి రన్‌వేపైనే రెడీగా ఉన్న బుగ్గ కారు వద్దకు వెళ్తున్న వెంకటేశ్ నాయుడు

చెవిరెడ్డికి డమ్మీగా నామినేషన్

వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వెంకటేశ్ నాయుడుల మధ్య విడదీయలేనంతగా బంధం పెనవేసుకుంది. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గం నుంచి వైకాపా అభ్యర్థిగా పోటీచేసిన భాస్కరరెడ్డి.. వెంకటేశ్ నాయుడితో అక్కడ డమ్మీ నామినేషన్ వేయించారు. అప్పట్లో అది తిరస్కరణకు గురైంది. వెంకటేశ్ నాయుడితో చెవిరెడ్డి నిరంతరం సంప్రదింపుల్లో ఉన్నట్లు సిట్ ఇప్పటికే గుర్తించింది. మద్యం ముడుపుల సొమ్మును చెవిరెడ్డి చెప్పిన చోటుకు చేర్చడంలో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించినట్లు తేల్చింది. 2022 జనవరిలో నాటి ముఖ్యమంత్రి జగన్ నివాసమైన తాడేపల్లి ప్యాలెస్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబరాల సందర్భంగా చెవిరెడ్డి భాస్కరరెడ్డి.. వెంకటేశ్ నాయుడిని జగన్ వద్దకు తీసుకెళ్లి కలిపించారు. దీన్నిబట్టి వీరి మధ్య ఎంత గాఢమైన బంధముందో అర్థం చేసుకోవచ్చు.

వైకాపా నాయకులతో సంబంధాలు

వెంకటేశ్ నాయుడికి తొలి నుంచీ వైకాపా అధినేత జగన్‌తో సంబంధాలున్నాయి. 2013 నుంచి పలుమార్లు జగన్‌తో కలిసి ఫొటోలు దిగారు. వాటన్నింటినీ ఆయన తన ఫేస్‌బుక్ పేజీలో పెట్టుకున్నారు.



జగన్‌తో మద్యం ముఠాలో కీలక సభ్యుడు వెంకటేశ్ నాయుడు

గ్రహం అనుగ్రహం

4–8–2025 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, శుక్లపక్షం

దశమి: ఉ. 9-46 తదుపరి ఏకాదశి

అనూరాధ: ఉ. 8-32 తదుపరి జ్యేష్ఠ

వర్జ్యం: మ. 2-39 నుంచి 4-24 వరకు

అమృత ఘడియలు: రా. 1-09 నుంచి 2-54 వరకు

దుర్ముహూర్తం: మ. 12-31 నుంచి 1-22 వరకు తిరిగి 3-04 నుంచి 3-55 వరకు

రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు

సూర్యోదయం: ఉ.5.42; సూర్యాస్తమయం: సా.6.29

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
ఒంగోలు	38.5	28.4
రాజమహేంద్రవరం	38.5	27.0
గుంటూరు	37.0	27.0
విశాఖపట్నం	36.8	27.0
నరసాపురం	36.7	28.0
విజయవాడ	36.5	28.0
నెల్లూరు	36.4	29.3
తాడేపల్లిగూడెం	36.2	28.0
ఖమ్మం	36.2	25.6
తిరుపతి	35.8	27.3
శ్రీకాకుళం	35.0	27.0
విజయనగరం	35.0	26.0
కడప	35.0	25.0
అనంతపురం	34.5	23.1
కర్నూలు	34.0	26.0
హైదరాబాద్	33.6	23.5

● విజయవాడ కరెన్సీ నగర్‌కు చెందిన రఘునాథ్ ఇంట్లో ఏసీ పాడైంది. ప్రైవేటు టెక్నీషియన్‌ను సంప్రదిస్తే 5 రోజుల తర్వాత వచ్చారు. ఏసీ ఇన్‌సైడ్, అవుటర్ యూనిట్లలో సమస్య ఉందని రూ.3,500 వసూలు చేశారు. 3 రోజులకే సమస్య మొదటికొచ్చింది. ఫోన్ చేస్తే.. సమాధానం లేదు. దీంతో రఘునాథ్ 'హోం ట్రైయాంగిల్' యాప్‌లో సంప్రదించగా నిపుణులు వచ్చి 2 గంటల్లో పని చేసి, బిల్లు రూ.2 వేలు తీసుకున్నారు.

మార్కెట్లో మెప్మా టెక్నీషియన్లు!

- 'స్వయం సంఘాల' కుటుంబ సభ్యులను నిపుణులుగా తీర్చిదిద్దుతున్న సంస్థ
- అన్ని రకాల సేవలు అందిస్తున్న సభ్యులు

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) స్వయం సహాయక సంఘాల సభ్యులు, వారి కుటుంబ సభ్యులను సాంకేతిక నిపుణులుగా మార్చి వారికి ఉపాధి చూపిస్తోంది. ఆ నిపుణులు రాష్ట్రంలో ఇప్పటికే వేల సేవలు అందించి, ప్రజల నమ్మకం చూరగొన్నారు. ఇంట్లో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు, ఇంటి మరమ్మతుల కోసం మెప్మా తీర్చిదిద్దిన నిపుణులను సంప్రదిస్తే తక్కువ ఖర్చులో పరిష్కారం అవుతుందని ప్రజలు భావిస్తున్నారు.


ఎలక్ట్రికల్ పనులు చేస్తున్న టెక్నీషియన్ భార్గవ్

స్వయం సహాయక సంఘాల సభ్యుల్లో, వారి కుటుంబ సభ్యుల్లో ఆసక్తి గల 13,104 మందిని మెప్మా ఎంపిక చేసింది. వారందరికీ జాతీయ ఒకేషనల్, ఎడ్యుకేషన్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఏసీ, ఫ్రిజ్ మరమ్మతులు మొదలుకొని ఎలక్ట్రికల్, ఇంటి నిర్మాణం, బ్యూటీషియన్ తదితర పనుల్లో శిక్షణ ఇచ్చింది. వారు ఉపాధి పొందేలా 'హోం ట్రయాంగిల్' అనే సంస్థతో అవగాహన ఒప్పందం చేసుకుంది. శిక్షణ పొందిన 12,524 మంది పేర్లు, వారి నైపుణ్యం మేరకు సదరు సంస్థ 'హోం ట్రయాంగిల్ యాప్‌'లో నమోదు చేసింది. ప్రజలు ఏవైనా పనుల కోసం ఆ యాప్‌లో 'రిక్వెస్ట్' పెడితే.. ఈ సభ్యులు వచ్చి వెంటనే చేసేస్తున్నారు. మార్కెట్‌లో మిగతా వారి కంటే తక్కువ సర్వీస్ ఛార్జీలు వసూలు చేస్తుండటంతో వీరికి చేతినిండా పని దొరుకుతోంది. ఈ ఏడాది జనవరిలో ప్రారంభించిన ప్రాజెక్టు ప్రస్తుతం వరకు 18 వేల పనులు చేశారు. అత్యధికంగా విశాఖపట్నంలో 7,685, విజయవాడలో 3,778, తిరుపతిలో 2,330, గుంటూరులో 1,090 మంది ప్రజలు సేవలు పొందారు. దీని వల్ల ఒక్కో సభ్యుడు నెలకు గరిష్ఠంగా రూ.18 వేల వరకు ఆదాయం పొందుతున్నారు.


ఏసీ సర్వీసింగ్ చేస్తున్న టెక్నీషియన్ వెంకట్

15 రకాల సేవలు..

ప్రస్తుతానికి వీరు 15 రకాలు సేవలు అందిస్తున్నారు. మెప్మానే సర్వీస్ ఛార్జీలు నిర్ణయించింది. సర్వీస్ ఛార్జీలు, స్పేర్ పార్ట్‌లతో కలిపి మొత్తానికి ఆన్‌లైన్ బిల్లు అందిస్తారు.

● స్వయం సహాయక సంఘాల మహిళలు చాలా మంది బ్యూటీషియన్, వెల్‌నెస్ సంబంధించిన సేవలు అందిస్తున్నారు. వారి కుటుంబ సభ్యులు ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్, కార్పెంటరీ వంటి పనులకు హాజరవుతున్నారు.

ముఖ్యమైన సేవలు.. వాటి ఫీజులు (రూ.ల్లో)

ఏసీ గ్యాస్ ఫిల్లింగ్	2,499
ఇండోర్, అవుట్ డోర్ క్లీనింగ్, గ్యాస్ చెకింగ్, ఇతరత్రా పనులకు	1,199
ఏసీ ఇన్‌స్టాల్	1,099
ఏసీ తొలగింపు	499
ఫ్యాన్ బిగింపు, మరమ్మతు	299
ఎలక్ట్రికల్ వైరింగ్ ఏదైనా	399
కిచెన్, బాత్‌రూంలో చెదల నివారణ	1,199
అపార్ట్‌మెంట్‌లో చెదల నివారణ	1,149

- ఈనాడు, అమరావతి

'మరాఠ్వాడా' తెలియక తికమక!

- నాటి రెవెన్యూ పరిభాషను అర్థం చేసుకోవడంలో ఇబ్బందులు
- పోలవరం భూసేకరణలో ఇదే కీలకం

కుక్కునూరు, న్యూస్‌టుడే: పోలవరం భూసేకరణలో మరాఠ్వాడా ప్రాంతపు భాష అధికారులను తికమక పెడుతోంది. ప్రాజెక్టు ముంపులో పరిధిలో ఉన్న మండలాల్లో ఇప్పటికే భూసేకరణ చేపట్టగా, ఇంకా కొంత సేకరించాల్సి ఉంది. ఆయా మండలాల్లోని భూ చిత్రపటాలు (నక్షా) మరాఠీ భాషలోనే ఉన్నాయి. వాటిల్లోని అంకెలు, ఇతర వివరాలు ఆ భాష తెలిసిన వారికే అర్థమవుతాయి. అందుకోసం గతంలో చేపట్టిన భూసేకరణలో తెలంగాణలో పనిచేసి పదవీ విరమణ చేసిన కొందరు అధికారులు, సర్వేయర్లను ఒప్పంద పద్ధతిపై వినియోగించుకున్నారు. వైకాపా ప్రభుత్వంలో భూసేకరణ మరుగున పడటంతో వారిని తొలగించారు. ప్రస్తుతం తిరిగి భూసేకరణ ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. 41.15 కాంటూరు స్థాయిలో నీరు నిలిపేందుకు కసరత్తు చేస్తున్న ప్రభుత్వం.. ఆ స్థాయిలో ముంపునకు గురయ్యే గ్రామాలను ఖాళీ చేయించాలి. అక్కడి మిగులు భూములను సేకరించాలి. గిరిజన రైతులకు భూములిచ్చేందుకు కూడా భూసేకరణ చేయాలి. దీంతో మళ్లీ మరాఠీ తెలిసిన అధికారులు, ఉద్యోగుల అవసరం కన్పిస్తోంది. స్వాతంత్ర్యానికి పూర్వం కుక్కునూరు, వేలేరుపాడు, బూర్గంపాడు మండలాలు పాల్వంచ పర్గనాలో నైజాం పాలనలో ఉండేవి. ఇక్కడ ఉర్దూ, మరాఠీ భాషల్లో దస్త్రాలు తయారయ్యాయి. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ)ను గిర్దావర్, డిప్యూటీ తహసీల్దార్ (డీటీ)ని నాయబ్ తహసీల్దార్‌గా సంబోధించేవారు. ఇక రికార్డుల్లో మెట్టభూమిని 'ఖుష్కీ'గా, మాగాణిని 'తరి'గా నమోదు చేసేవారు. రెవెన్యూ గ్రామాన్ని 'మౌజే' అనేవారు. అడంగల్‌ను పహణీ, ఫైసల్ పట్టీ పేర్లతో రెవెన్యూ దస్త్రాలు ఉండేవి. ప్రస్తుతం ఈ పేర్లను మార్చి పలుకుతున్నా, భూ చిత్రపటం మరాఠీలోనే ఉండటంతో తెలంగాణ అధికారుల సహాయాన్ని ఆశిస్తున్నారు.

పట్టణ మౌలిక సదుపాయాల్లో ముందడుగు

- రూ.5,286 కోట్లతో పెండింగ్ పనుల పూర్తికి కార్యాచరణ

ఈనాడు, అమరావతి: పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోంది. వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన కేంద్ర ప్రాయోజిత పథకాలకు రాష్ట్రవాటా నిధులు సమకూర్చి తిరిగి గాడిలో పెడుతోంది. ప్రత్యేకించి రక్షిత తాగునీరు, ప్రజారోగ్యం, రహదారులు, కాలువలు, వీధిదీపాలు.. ఇలా పలు మౌలిక సదుపాయాల కల్పనలో భారీ లక్ష్యాలతో కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. వివిధ ప్రాజెక్టుల పనులు గడువులోగా పూర్తయితే 2029 నాటికి నగరాలు, పట్టణాల స్వరూపం పూర్తిగా మారనుంది. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు రూ.5,286 కోట్లతో పూర్తిచేసేందుకు కూటమి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది.

◆ రాష్ట్రంలోని పుర, నగరపాలక సంస్థల్లో తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు 12,989 కోట్లతో ప్రారంభించిన ప్రాజెక్టుల్లో పెండింగ్ పనుల పూర్తికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అమృత్-1, అమృత్ 2.0 పథకాలతోపాటు ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ), పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి ఫండ్ (యూఐడీఎఫ్) రుణ సహాయంతో.. వివిధ దశల్లో నిలిచిపోయిన 240 ప్రాజెక్టుల పనులు రూ.5,034 కోట్లతో 2029 నాటికి పూర్తి చేయనున్నారు. ఈ చర్యలతో రోజూ 289 మిలియన్ లీటర్ల నీరు అదనంగా అందుబాటులోకి రానుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు.

◆ ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యమిస్తూ ఘన వ్యర్థాల నిర్వహణతోపాటు మురుగునీరు శుద్ధి చేసే కార్యక్రమాలు చేపడుతున్నారు. అమృత్, స్మార్ట్‌సిటీ, స్వచ్ఛ భారత్‌తోపాటు హడ్కో రుణ సహాయంతో.. 43 నగరాలు, పట్టణాల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రాజెక్టుల పనులు పూర్తి చేయనున్నారు. రూ.252 కోట్లతో చేపడుతున్న ప్లాంట్ల నిర్మాణ పనులతో రోజూ 120 మిలియన్ లీటర్ల మురుగు నీటిని శుద్ధిచేసే వీలుంటుంది. ప్రస్తుతం శుద్ధి చేయకుండా నదులు, జలాశయాల్లో నేరుగా వదిలేస్తున్నారు.

'ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేయాలి'

తాడేపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేయాలని ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ కోరారు. తాడేపల్లిలోని ఆర్టీసీ, ఎన్ఎంయూఏ రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి అధ్యక్షతన ఆదివారం కేంద్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్సీ ఏర్పాటు, డీఏల మంజూరు, బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం దృష్టి సారించాలని, పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఆర్టీసీలో ప్రవేశపెట్టిన విద్యుత్ బస్సులను ప్రభుత్వ సహకారంతో ఆర్టీసీనే కొనుగోలు చేయాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని అమలుచేసేందుకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తామన్నారు. రాష్ట్రంలో ఉన్న వివిధ బస్సు డిపోల్లో ఉన్న గ్యారేజీలను ఆధునికీకరించాలని కోరారు. ఎన్ఎంయూఏ ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి రాజేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజులు, సూర్యచంద్రరావు, పివి శివారెడ్డి, ఎన్వీ రమణ, భాస్కర్‌నాయుడు, రాష్ట్ర నేత డీవీ రమణతో పాటు వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న 'మాచ్‌ఖండ్ రిటైనింగ్ వాల్'


కోతకు గురైన రిటైనింగ్ వాల్

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల సరిహద్దులోని మాచ్‌ఖండ్ జలవిద్యుత్కేంద్రానికి చెందిన పవర్‌కెనాల్ (ఫ్లూమ్‌ఛానెల్) రిటైనింగ్ వాల్ 15 అడుగుల మేర కోతకు గురైంది. పలు చోట్ల కెనాల్ గోడలకు రంధ్రాలు పడి నీరు లీకవుతోంది. డుడుమ జలాశయం నుంచి విడుదలైన నీటిని కెనాల్ మార్గంలో టీపీ డ్యాం వరకు చేరవేస్తారు. అక్కడి నుంచి సొరంగమార్గంలో విద్యుత్తు కేంద్రానికి పంపిస్తారు. డుడుమ జలాశయం వద్ద ఉన్న పవర్‌గేట్లు సరిగా పనిచేయడం లేదు. ఈ నెల 2న పవర్‌గేట్లు తనిఖీల నిమిత్తం ఎత్తిదించారు. ఈ క్రమంలో రెండు గేట్లు పూర్తిగా మూసుకోకపోవడంతో అధిక స్థాయిలో నీరు ప్రవహిస్తోంది. దీంతో బురుడాయిల్ ప్రాంతంలో కూరగాయల పంటలు ధ్వంసమయ్యాయి. కెనాల్ కూడా దెబ్బతింది. ఏడు దశాబ్దాలుగా కాలువకు మరమ్మతులు చేపట్టలేదు. ఈ విషయాన్ని సీలేరు కాంప్లెక్స్ సీఈ కె.వి.రాజారావు వద్ద ప్రస్తావించగా.. సివిల్ అధికారులతో మాట్లాడి వెంటనే మరమ్మతు పనులు చేపడతామని తెలిపారు.

ఏఐతో వారానికి 10 గంటలు ఆదా

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో సృజనాత్మక స్వేచ్ఛ
- ఐటీ రంగంలో ఏఐపై నాస్కామ్ అధ్యయన నివేదిక

ఈనాడు, హైదరాబాద్: కృత్రిమమేధ(ఏఐ) రాకతో సాఫ్ట్‌వేర్ అభివృద్ధి వ్యవస్థ మారిపోతోంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు 70% వరకు రోజువారీ కార్యకలాపాల్లో ఏఐని వినియోగిస్తున్నారు. దీంతో వారు వారానికి 10 గంటలకు పైగా సమయాన్ని ఆదా చేస్తున్నారు. ఉద్యోగం, వ్యక్తిగత జీవితంలో సమతౌల్యత సాధిస్తున్నారు. కోడింగ్ నుంచి టెస్టింగ్ వరకు అన్ని విషయాల్లోనూ ఏఐ కీలకంగా మారింది. ఒకరకంగా సాఫ్ట్‌వేర్ నిపుణులకు సహ పైలట్‌గా వ్యవహరిస్తోందని నాస్కామ్(నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్) పేర్కొంది. ఈ మేరకు 'సాఫ్ట్‌వేర్ అభివృద్ధి జీవితచక్రం(ఎస్‌డీఎల్‌సీ) రీ-ఇంజినీరింగ్' పేరిట ఒక అధ్యయన నివేదికను ఇటీవల విడుదల చేసింది. ఏఐ వినియోగంతో సాఫ్ట్‌వేర్ డెవలపర్లకు సమయం ఆదా అవుతోందని, తద్వారా సృజనాత్మక స్వేచ్ఛ పొందుతున్నారని తెలిపింది.



అధ్యయనంలో వెల్లడైన అంశాలు

◆ ప్రతి 10 మందిలో ఏడుగురు సాఫ్ట్‌వేర్ డెవలపర్స్ ఏఐ టూళ్లను విరివిగా వాడుతున్నారు.

◆ ఏఐ విస్తృతి, వినియోగం పెరగడంతో ఉద్యోగులు రోజువారీ ఒత్తిడి నుంచి బయటపడి, సృజనాత్మకతపై దృష్టిపెడుతున్నారు.

◆ ప్రాజెక్టు మేనేజర్లు వేగంగా నిర్ణయాలు తీసుకోగలుగుతున్నారు.

◆ ఐటీ సంస్థలు ఏఐతో 20-50% సమయం ఆదాతోపాటు 80-90% కోడ్‌పై కచ్చితత్వం సాధిస్తున్నాయి.

◆ సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఏఐపై పెట్టుబడులను రానున్న మూడేళ్లలో దాదాపు మూడు రెట్లు పెంచనున్నాయి. ఇది 2028 నాటికి 630 బిలియన్ డాలర్లకు చేరుతుంది.

ఎస్‌డీఎల్‌సీ దశల్లో ఏఐ ప్రాత

ప్రణాళిక: అవసరాలను అంచనా వేయడం, నష్టాలను గుర్తించడం

డిజైన్: నమూనాలు ఉత్పత్తి చేయడం, డిజైన్‌ను సానుకూలం మార్చడం

అభివృద్ధి: రియల్ టైమ్ కోడ్ సమీక్షలు, వేగవంతమైన కోడింగ్

పరీక్ష: స్వీయ పరీక్షలు నిర్వహించుకోవడం, ఆటోమేషన్

విస్తరణ: భవిష్యత్తు వ్యూహాలు, రోల్‌బ్యాక్ ఆటోమేషన్

నిర్వహణ: సమస్యలను ముందుగానే గుర్తించడం, నవీకరణలను ఆటోమేట్ చేయడం

మానవ పర్యవేక్షణ లేకపోతే సవాళ్లే..

ఏఐ టూళ్ల సమర్థవంత వినియోగానికి డెవలపర్లు, టెస్టర్లకు శిక్షణ అవసరం. కొన్ని టూళ్లు ఆధునిక సాంకేతిక వెర్షన్లకు అనుకూలంగా ఉండకపోవచ్చు. అందుకే నిరంతరం మానవ పర్యవేక్షణ అవసరం. లేదంటే బగ్గీకోడ్, డేటా ప్రైవసీ, భద్రతపరమైన సమస్యలు ఉత్పన్నమవుతాయి. కంపెనీలు సంస్థాగత మార్పులు, మౌలిక సదుపాయాల ఖర్చులను వెంటనే పరిష్కరించాలి. ఏఐ, మానవ ప్రయత్నాలను మరింత సమర్థంగా కలిపి వినియోగిస్తేనే మెరుగైన అభివృద్ధి సాధ్యమని నివేదిక తెలిపింది.

ముగిసిన డీఎస్సీ క్రీడా కోటా ధ్రువపత్రాల పరిశీలన

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మెగా డీఎస్సీకి క్రీడా కోటా కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన విజయవాడలోని ఇందిరా గాంధీ నగరపాలక సంస్థ (ఐజీఎంసీ) స్టేడియంలో ముగిసింది. ఈ ప్రక్రియ శని, ఆదివారాల్లో సాగింది. 421 పోస్టులకు గాను 1,221 మంది అభ్యర్థులను పిలవగా.. 1,172 మంది హాజరయ్యారని శాప్ పరిపాలనాధికారి ఆర్.వెంకటరమణ నాయక్ తెలిపారు. మరో రెండు రోజుల్లో టెంటెటివ్ జాబితాను ఆన్‌లైన్‌లో పెడతామన్నారు. దాంట్లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఏడు రోజుల్లోగా తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

చూశారా ఈ చిత్రం.. ఇదో మొక్కుబడి వ్యవహారం!



అధికారుల నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యంలా నిలుస్తోంది చిత్రం. అన్నమయ్య జిల్లా గాలివీడులో రహదారి విస్తరణలో భాగంగా కి.మీ. పొడవునా గత ప్రభుత్వంలో సీసీ రహదారి నిర్మించారు. గుత్తేదారు రోడ్డు వేయడమే తన పని అన్నట్లుగా చేతిపంపును తొలగించకుండా మొక్కుబడిగా పని పూర్తి చేసి వదిలేశారు. అధికారులూ సమస్యను పట్టించుకోలేదు. ఈ మార్గంలో కొత్తవారు ఎవరైనా వెళ్తే ప్రమాదాలు జరిగే అవకాశముందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటివరకు సమస్య తన దృష్టికి రాలేదని, వెంటనే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ తెలిపారు.

– న్యూస్‌టుడే, గాలివీడు

బియ్యం కాదు.. భోజనమే తీసుకొస్తాం!


నాడు జగన్ చిత్రాలతో రేషన్ బండి వాహనం



నేడు మధ్యాహ్న బడి భోజనం తీసుకెళ్లేందుకు మార్చారు ఇలా..

గత ప్రభుత్వంలో రేషన్ సరకుల పంపిణీ కోసం వినియోగించిన ఎండీయూ వాహనాలను కూటమి ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. ఆ విధానంలో సరకుల పక్కదారి పడుతుండటంతో ఈ నిర్ణయం తీసుకుంది. వాటిని ఇప్పుడు మరో రకంగా ముస్తాబు చేసి కొత్త బాధ్యతలకు వినియోగిస్తున్నారు. 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం' కింద పాఠశాల విద్యార్థులకు భోజనం అందించేందుకు వైఎస్సార్ కడప జిల్లాలోని జమ్మలమడుగు మండలంలో రెండు స్మార్ట్ కిచెన్‌లను ప్రారంభించారు. అక్కడి నుంచి సుమారు 50 పాఠశాలలకు ఆహారాన్ని పంపించాల్సి ఉంటుంది. ఇందుకు 5 ఎండీయూ వాహనాలను కొత్తగా ముస్తాబు చేసి ఉపయోగిస్తున్నారు. విద్యార్థులకు ఏ రోజు ఏయే రకాల భోజనం వడ్డిస్తారనే మెనూతో పాటు డొక్కా సీతమ్మ చిత్రాన్నీ వీటిపై ముద్రించారు. చూడగానే చిన్నారులను ఆకర్షించేలా ఈ వాహనాలు ఉన్నాయి.

– న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

సమున్నతంగా తిరుమల నిర్వహణ

- అన్నప్రసాదాల్లో 38.83% వృద్ధి
- లడ్డూల ఉత్పత్తిలో 19.63%..

ఈనాడు డిజిటల్, తిరుపతి: తిరుమల శ్రీవారిని కనీసం ఏడాదికి ఒకసారైనా దర్శించుకోవాలని భక్తులు ఆశపడతారు. ఎన్ని వ్యయప్రయాసలు ఎదురైనా కోనేటిరాయుడి దివ్యమంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించి తన్మయత్వం చెందుతారు. ఐదేళ్ల వైకాపా పాలనలో తిరుమలలోని అన్ని వ్యవస్థలూ దిగజారాయి. కూటమి అధికారంలోకి రాగానే సామాన్య భక్తుల సౌకర్యార్థం అనేక ప్రక్షాళన చర్యలు చేపట్టింది. దీంతో ఇప్పుడు సామాన్య భక్తులు శ్రీవారిని తన్మయత్వంతో దర్శించుకుంటున్నారు. మెరుగైన సేవలు, రద్దీ నియంత్రణకు తితిదే పలు సంస్కరణలు అమలుచేస్తోంది. క్యూలైన్ మేనేజ్‌మెంట్, క్రౌడ్ మేనేజ్‌మెంట్ విధానాల అమలుతో రద్దీని పర్యవేక్షిస్తూ..





భక్తులు ఇబ్బంది పడకుండా చూస్తోంది. వీటి ఫలితం ఇప్పుడిప్పుడే కనిపిస్తోంది. 2024 జులైలో 22,13,330 మంది శ్రీవారిని దర్శించుకోగా.. 2025 జులైలో 23,76,949 మందికి పెరిగారు. అంటే 1,63,619 (7.40%) మంది భక్తులు పెరిగారు. లడ్డూల ఉత్పత్తి సుమారు 19.63 శాతం మేర పెరిగింది. ఈ ఏడాది వేసవి సెలవుల్లో కంటే.. తర్వాతే అధికసంఖ్యలో భక్తులొచ్చారు. అయినా తితిదే సమగ్ర ప్రణాళికలతో రద్దీని అధిగమించింది. దీంతో భక్తుల సంఖ్యతో పాటు సేవలూ పెద్దఎత్తున పెరిగాయి.

2024, 2025 జులై నెలల్లో విభాగాల వారీగా పెరుగుదల వివరాలు

విభాగం	2024 జులై	2025 జులై	పెరుగుదల	పెరుగుదల శాతం
దర్శనం	22,13,330	23,76,949	1,63,619	7.40
అన్న ప్రసాదాలు	68,12,221	94,58,008	26,45,787	38.83
రిసెప్షన్	12,47,18,085	13,89,18,037	1,41,99,952	11.39
హుండీ ఆదాయం	125,35,72,000	129,45,70,000	409,98,000	3.27
లడ్డూల ఉత్పత్తి	1,04,57,550	1,25,10,300	20,52,750	19.63
లడ్డూల ఆదాయం(రూ.)	41,06,58,350	50,57,37,000	9,50,78,650	23.15
తలనీలాలు సమర్పించిన భక్తుల సంఖ్య	8,67,232	9,13,650	46,418	5.35

తాజా పరిణామాలు పరిశీలిస్తే..

◆ శ్రీవాణి టికెట్లు పొందిన భక్తులకు ఏ రోజుకారోజే దర్శనం కల్పిస్తుండటంతో గదుల కోసం రద్దీ తగ్గింది.

◆ **క్యూలైన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్:** గతంలో క్యూలైన్ల పర్యవేక్షణ కొరవడడంతో రద్దీ ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం ఆలయానికొచ్చే ప్రతి భక్తుడి కౌంట్ నమోదవడం, లైన్లలో అన్ని సౌకర్యాలు కల్పించడంతో రద్దీ నియంత్రణ సాధ్యమవుతోంది.

◆ **క్రౌడ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్:** రద్దీ ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ.. ఎక్కువగా ఉన్న భక్తులను ఫ్రీజోన్‌లకు తరలించి తోపులాటలు జరగకుండా నియంత్రిస్తున్నారు. అనూహ్య రద్దీ ఏర్పడినప్పుడు ముందుగా భక్తులను అప్రమత్తం చేస్తున్నారు. అధికంగా ఉండే భక్తులు రోడ్లపై ఇబ్బందులు పడకూడదని నాలుగు పీఏసీల్లో వసతులు కల్పిస్తున్నారు.


◆ **తితిదే సేవలు:** గురువారం తిరుప్పావడ, శుక్రవారం అభిషేకం సేవలను నిర్ణీత సమయంలోపు పూర్తి చేయడంతో ఆలస్యం కాకుండా భక్తులు సులభంగా శ్రీవారిని దర్శించుకుంటున్నారు.

◆ **బ్రేక్ దర్శనం వేళల మార్పు:** గతంలో ఉదయం 5 గంటల నుంచి మొదలయ్యే బ్రేక్ దర్శనాలను కూటమి ప్రభుత్వం వచ్చాక.. ఉదయం 5.45 గంటల నుంచి ప్రారంభించి 10-11 గంటలలోపు ముగిస్తుండడంతో సర్వదర్శనం చేసుకునే భక్తులకు ఎక్కువ అవకాశం లభిస్తోంది.

◆ **ప్రసాదాల కొరత రాకుండా..** రోజూ మూడు లక్షల లడ్డూల బఫర్ స్టాక్ నిర్వహిస్తున్నారు.

'ఏఐతో గంటలో శ్రీవారి దర్శనం' ఆలోచన విరమించుకోవాలి

- తితిదే మాజీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం
- అవి అవగాహన లేని వ్యాఖ్యలు: తితిదే ఛైర్మన్


ఎల్వీ సుబ్రహ్మణ్యం

తిరుమల, న్యూస్‌టుడే: కృత్రిమ మేధ(ఏఐ)ను ఉపయోగించి గంట లేదా మూడు గంటల్లో భక్తులకు శ్రీవారి దర్శనం చేయిస్తామనే ఆలోచనను తితిదే విరమించుకోవాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి, తితిదే మాజీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం సూచించారు. ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్న ఆయన.. ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. 'ఏఐ ద్వారా గంట లేదా మూడు గంటల్లోనే శ్రీవారి దర్శనం చేయిస్తారనే విషయాన్ని భక్తులు మాట్లాడుకోవడం నేను విన్నా. అలాంటి దర్శనం అసంభవం. దాని గురించి ప్రయత్నించడం కూడా క్షేమం కాదు. ఏఐని మానవుడు తన శక్తితో ఎంత గ్రహించినా ఆలయంలో కొన్ని పరిమితులున్నాయి. తితిదే ఏఐ ఆలోచనను విరమించుకుని ఆలయంలో సౌకర్యాలను మెరుగుపరచాలి' అని ఎల్వీ సూచించారు.

ఆ వ్యాఖ్యలు బాధాకరం: బీఆర్ నాయుడు

దేవస్థానం ఈవోగా గతంలో పనిచేసిన ఎల్వీ సుబ్రహ్మణ్యం ఏఐ టెక్నాలజీపై అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేయడం బాధాకరమని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ఓ ప్రకటనలో ఆక్షేపించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలు దృష్టిలో పెట్టుకుని గూగుల్, టీసీఎస్ తదితర సంస్థల సహకారంతో ఉచితంగా ఏఐ సాంకేతికతను ఉపయోగించి రెండు గంటల్లోపు భక్తులకు దర్శనం కల్పించాలని తితిదే పాలకమండలి నిర్ణయించిందని ఆయన గుర్తుచేశారు. ఈ తరుణంలో భక్తుల్లో గందరగోళాన్ని సృష్టించేలా ఏఐ నిరుపయోగమని వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. తితిదే సాంకేతికతను వాడటంలో ఎలాంటి తప్పూ లేదని, ఎల్వీ సుబ్రహ్మణ్యం వ్యాఖ్యలను పూర్తిగా ఖండిస్తున్నామని ఛైర్మన్ వెల్లడించారు.

రేపటి నుంచి శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయంలో ఈ నెల 5 నుంచి 7 వరకు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. సోమవారం అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 5న పవిత్రాల ప్రతిష్ఠ, అష్టదళ పాదపద్మారాధన సేవ, 6న పవిత్ర సమర్పణ, 7న పూర్ణాహుతి, తిరుప్పావడ సేవలు నిర్వహిస్తారు. అంకురార్పణ నిర్వహించనుండటంతో సోమవారం తితిదే సహస్ర దీపాలంకార సేవను రద్దుచేసింది. 5 నుంచి 7 వరకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలూ రద్దయ్యాయి.

'సైబర్' బాధితుల్లో ప్రైవేటు ఉద్యోగులే అధికం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా...

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో జరుగుతున్న సైబర్ నేరాల్లో అత్యధిక బాధితులు ప్రైవేటు ఉద్యోగులే. వీరిలోనూ సాంకేతిక పరిజ్ఞానం, సైబర్ నేరాలపై ఎంతో కొంత అవగాహన ఉన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా ఉండటం గమనార్హం. బాధితుల్లో ప్రైవేటు ఉద్యోగుల తర్వాత స్వయం ఉపాధి పొందుతున్నవారు, వ్యాపారులు ఉంటున్నారు. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో అంటే జనవరి నుంచి జూన్ వరకు సైబర్ నేరాలపై వచ్చిన ఫిర్యాదుల తీరును సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు విశ్లేషించినప్పుడు ఈ విషయం వెల్లడయింది.



మిమ్మల్ని మీరు గౌరవించుకుంటున్నారా?

ఇతరులు మిమ్మల్ని సరిగా గౌరవించడం లేదా? అయితే- ముందు మిమ్మల్ని మీరు గౌరవించుకుంటున్నారో లేదో చూసుకోండి. ఎప్పుడూ జంక్‌ఫుడ్ ఆరగిస్తూ.. రాత్రుళ్లు బాగా పొద్దుపోయేదాకా టీవీ చూస్తూ.. నిరంతరం ఫోన్ స్క్రోల్ చేస్తూ ఉంటే మీకు ఆత్మగౌరవం లేదన్నమాటే. ముందుగా అవి మానేసి, మీ శక్తిని సరైన పనుల కోసం వినియోగించండి. ఆ తర్వాత ఇతరులు మిమ్మల్ని గౌరవించడం మొదలుపెడతారు.

– గిలామె అమెయే, ఫిట్‌నెస్ కోచ్

కాలనీలా.. కారడవులా!

ఏలూరు పరిసర ప్రాంతాల్లోని పోణంగి రోడ్డు, పెదవేగి మండలం లక్ష్మీపురంలో వైకాపా చేపట్టిన జగనన్న కాలనీలు ఇవీ. పేదల కోసం ఊళ్లకు ఊళ్లే నిర్మిస్తామని నాటి పాలకులు చెబితే.. స్థలాలు పొందిన లబ్ధిదారులు కొందరు అప్పులు చేసి మరీ ఇళ్లు మొదలుపెట్టారు. నాటి పాలకులు ఏ ఒక్క వసతీ కల్పించకపోవడంతో పాటు ఇళ్లూ పూర్తి చేయలేకపోయారు. ఇప్పుడు కాలనీ చిట్టడవిలా మారింది. రహదారులు, కాలువలు, తాగునీరు, విద్యుద్దీపాలు ఏర్పాటు చేయలేదు. కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టిసారించి సొంతింటి కలను నెరవేర్చాలని, సౌకర్యాలు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. దీనిపై గృహనిర్మాణశాఖ పీడీ జి.సత్యనారాయణ మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలు పాటించని గుత్తేదారులను నిలిపివేయడంతో కొన్ని అసంపూర్తిగా ఉన్నాయన్నారు. జిల్లాలో 13 వేల గృహాలు పూర్తిచేయాలనే లక్ష్యంతో పనులు చేస్తున్నామని ప్రస్తుతానికి 9 వేల గృహాలు పూర్తయినట్లు తెలిపారు.


ఏలూరు పోణంగి రోడ్డులో పునాదుల్లో కంపచెట్లు


పెదవేగి మండలం లక్ష్మీపురంలో ఇలా..

– ఈనాడు, ఏలూరు

ఈనాడు

అనుభవ సంపన్నులకు ఏదీ ఆసరా?

బాధ్యతలన్నీ తీరిపోయి హాయిగా కాలం వెళ్లబుచ్చాల్సిన వయసులో చేతిలో చిల్లిగవ్వ లేక, ఆరోగ్యం సహకరించక దేశీయంగా ఎంతోమంది వృద్ధులు నరక యాతన అనుభవిస్తున్నారు. గత్యంతరం లేక ముదిమి ప్రాయంలో మళ్లీ పని బాట పడుతున్నారు. ఈ మేరకు తాజా నివేదిక ఒకటి చేదు వాస్తవాలెన్నో వెల్లడించింది. పిల్లల అభ్యున్నతి కోసం సర్వం ధారపోస్తున్న తల్లిదండ్రులు తమ భవిష్యత్తు అవసరాలకు ఏమీ మిగుల్చుకోవట్లేదు. ఫలితంగా మూడొంతుల మంది వృద్ధులు ఆర్థికంగా ఇక్కట్ల పాలవుతున్నారు. ఖర్చులకు తగినంత పైకం చేతిలో లేక అర్ధాకలితోనో లేదా పస్తులతోనో కాలం వెళ్లదీస్తున్నారు. పట్టించుకునేవారు లేక, రేపటి రోజుపై బెంగతో 30శాతం వయోధికులు కుంగుబాటుకు గురవుతున్నారు. ఒంటరి మహిళలను ఈ సమస్య మరింతగా వేధిస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 60ఏళ్లు పైబడినవారి జనాభా 15.8 కోట్లు. 2050 నాటికి అది అంతకు రెట్టింపవుతుందని అంచనా. జనాభా నియంత్రణను పటిష్ఠంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాల్లో వృద్ధుల సంఖ్య దేశ సగటు కన్నా ఎక్కువగా పెరగనుంది. దీనికి అనుగుణంగా పండుటాకుల బాగోగులపై ప్రభుత్వాలు ఇప్పటి నుంచే దృష్టిసారించాలి!

హెల్పేజ్ ఇండియా సంస్థ నివేదిక ప్రకారం, ఇండియాలో 71శాతం వృద్ధులకు కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ఆర్థిక భరోసా దక్కట్లేదు. తల్లిదండ్రులూ సీనియర్ సిటిజన్ల పోషణ, సంక్షేమ చట్టంపై 88శాతం మందికి అవగాహన లేదు. దానివల్ల సొంతవారి దాడులు, వేధింపులు, అనాదరణను పెద్దలు మౌనంగా భరించాల్సి వస్తోంది. దేశీయంగా 70శాతానికి పైగా వృద్ధులు ఎలాంటి పింఛన్లకు నోచుకోవట్లేదు. ఒకవేళ అవి అందుతున్నా చాలా చోట్ల అరకొరగానే ఉంటున్నాయి. వయోధికుల్లో అధికశాతం రక్తపోటు, మధుమేహం, కీళ్ల సమస్యలతో బాధపడుతున్నారు. ఒకటికన్నా ఎక్కువ జబ్బులతో సతమతమవుతున్న వారి సంఖ్యా గణనీయంగా ఉంది. 70 ఏళ్లు పైబడిన వారందరికీ అయిదు లక్షల రూపాయల ఆరోగ్య బీమా కల్పిస్తూ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని కేంద్రం విస్తరించింది. కానీ, ప్రజారోగ్య వ్యవస్థలో లోపాల వల్ల చికిత్స వ్యయాలను సొంతంగా భరించాల్సి రావడం అభాగ్య వృద్ధులకు గోరుచుట్టుపై రోకటిపోటులా మారుతోంది. ఈ దుర్భరావస్థలో ఆత్మహత్యలకు ఒడిగడుతున్న అసహాయుల సంఖ్య పెరుగుతోంది. జీవనగమనంలో అలసిపోయిన వారికి మలిసంధ్యలో సురక్షితమైన, సంతోషకరమైన జీవితాన్ని అందించలేనిది నాగరిక సమాజం కానేకాదు!

రెక్కలొచ్చిన పిల్లలు ఎగిరెళ్లిపోవడంతో ఏకాకులుగా మిగిలే వృద్ధుల కోసం తెలంగాణ ప్రభుత్వం డే కేర్ కేంద్రాల ఏర్పాటుకు నడుంకట్టింది. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు విభిన్న రకాల ఆటలు, లైబ్రరీ వంటి వసతులతో సీనియర్ సిటిజన్లలో నూతనోత్సాహం నింపాలని నిశ్చయించింది. ఎలాంటి ఆదరువు లేని పెద్దల ఆలనాపాలనా కోసం ఏపీ ప్రభుత్వం కొత్త వృద్ధాశ్రమాల నిర్మాణానికి సంకల్పించింది. స్థానిక అవసరాలను బట్టి అన్ని రాష్ట్రాలు ఇలాంటి వాటిని విరివిగా నెలకొల్పాలి. సత్తువ ఉన్నన్ని రోజులు అయినవారికోసం శ్రమించి వయసుపైబడ్డాక నానా కష్టాలు పడేవారిని చూస్తే యువతలో ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. రాబోయే రోజుల్లో తమకూ అదే దుర్గతి దాపురిస్తుందేమోనన్న ఆందోళన వారిని పట్టి పీడిస్తుంది. అది నవతరాన్ని నైరాశ్యంలో ముంచి దేశ పురోగతికి ప్రతిబంధకమవుతుంది. కాబట్టి వృద్ధులు గౌరవప్రదంగా మనగలిగే వాతావరణ కల్పనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టిగా పరిశ్రమించాలి. వయోధికుల సంక్షేమంకోసం సామాజిక, ఆర్థిక భద్రతా పథకాలను, వైద్యవసతులను విస్తృతపరచాలి.




మనిషి నలుగురితో కలిసిమెలిసి జీవించడానికి ఏదో ఒక కారణం ఉంటుంది. మన జీవితాన్ని మార్చుకోవడానికి ఇతరుల అవసరం రావచ్చు, లేకపోతే మనమే ఇతరుల జీవితాన్ని మార్చేవాళ్లం కావచ్చు.

– గోవింద్ మిశ్రా, నవలా రచయిత

తథాస్తు దేవతలు

తథాస్తు... మూడక్షరాల ముచ్చటైన దీవెన! దేవతలు మెచ్చి మానవులకు ఇచ్చే విలువైన కానుక! కష్టనష్టాల నుంచి కాపాడమని, కోరికలు తీర్చి కరుణించమని దేవతలను ప్రార్థించడం మనుషుల సహజ నైజం.

ఆకాశానికి, అంతరాళానికి నడుమ త్రిశంకులా ఊగిసలాడడం మనుషులకు ఆ భగవంతుడు ఇచ్చిన వరమో, శాపమో తేల్చడం సాధ్యం కాదు. ఊగుతూ, ఉన్నచోటే ఉండిపోవడం కన్నా, ముందుకు సాగిపోవడమే మిన్న అన్న భావన కొందరిని నిలబడి నీళ్లు తాగనివ్వదు. అటు స్వర్గానికి, ఇటు నరకానికి కాకుండా మనిషి మధ్యన వేలాడటానికి కారణం లేకపోలేదు. పైవారికి (దేవతలకు) చావురాదు. కింది వారికి (దానవులకు) చావంటే భయం లేదు. మధ్యముడైన మనిషికే చావు తప్పదు. అందుకే అదంటే అంత భయం. మనిషి పూర్తిగా చెడ్డవాడని కానీ, నూరు శాతం మంచివాడని కానీ చెప్పలేం. కాకపోతే దివ్యమానవుడిగా ఎదిగే అవకాశం ఉన్నవాడు. సాధన ద్వారా జీవితంలో అనుకున్నది సాధించగలడు. ఏదో ఒక రోజు పూర్ణత్వం సంపాదించుకోవచ్చు. అందుకు మానవ ప్రయత్నం అవసరం. అది సఫలం కావడానికి దైవబలమూ తోడు కావాలి. చిత్తశుద్ధితో, బుద్ధి ఏకాగ్రం చేయగలిగితే ఎంతటి భోగలాలసుడైనా యోగసిద్ధేశ్వరుడుగా మారవచ్చు. అందుకు పెట్టుబడి... పట్టుదల, అవిరళ కృషి. పట్టు విడవని విక్రమార్కుడు ఎన్నో సాహస కార్యాలు సాధించి దేవి అనుగ్రహం పొందాడు. మనం తలవకపోయినా, కొలవకపోయినా, పైనుంచి అదృశ్య శక్తులు మనల్ని వీక్షిస్తూనే ఉంటాయి అంటారు పెద్దలు. చెడుపనులు, చెడుభావనలు చేయకూడదన్న కట్టుబాటు మానవ ప్రగతికి దారిదీపం లాంటిది.



అంతర్యామి

తథాస్తు దేవతలు తమకు అండగా ఉంటారని భక్తుల నమ్మకం. ప్రాచీన గ్రీకుదేశ వాసులు దారిచూపే దేవతలను 'ఎగ్రిగోర్స్' అని పిలిచేవారు. యుద్ధరంగానికి బయల్దేరే ముందు విజయం కోరి వారిని ప్రార్థించేవారు. శుభకార్యాలు నిర్విఘ్నంగా జరగాలని, ముందుగానే వారికి మొక్కుబళ్లు చెల్లించేవారు. ఇలాంటి సంప్రదాయం హిందూ ధర్మానికి కూడా దారిదీపంగా నిలిచింది. 'తమసోమా జ్యోతిర్గమయ' అన్న ఉపనిషత్ మహావాక్యం జాతి హృదయంలో సుస్థిరమైంది.

ఈ ప్రపంచంలోని జడ, జీవ పదార్థాలను ఒక యదార్థం శాసిస్తోంది. ఇంద్రియాల వెనుక మనసు ఉన్నట్లే కార్యం వెనుక కారణం ఉంటుంది. భావమే బాహ్యరూపంలో జీవితాన్ని నడిపిస్తుంది. సదాచార, సద్విచారాలే మోక్ష ద్వారాలు. కొన్ని ఆకృతులు కంటికి కనిపించకపోయినా మనసును అలరిస్తాయి. కలవరపాటుకు గురిచేస్తాయి. పంచభూతాలు అందరికీ సమానంగా తమ శక్తులను పంచుతాయి. ప్రతిఫలం ఆశించవు. అలాగే ప్రతిఫలం కోరకుండా మనం పనులు చక్కబెడితే తప్పకుండా దేవతలు మెచ్చి 'తథాస్తు' అని దీవిస్తారు.

– ఉప్పు రాఘవేంద్రరావు

తెలుగు సంస్కృతికి నిలువుటద్దం

గాంధీ మహాత్ముడు ప్రవచించిన సిద్ధాంతాలకు, పాటించిన విలువలకు, స్థాపించిన ప్రమాణాలకు త్రికరణశుద్ధిగా కట్టుబడి నిరాడంబరంగా జీవించేవారు అసలైన గాంధేయవాదులు- ఓ గుల్జారీలాల్ నందాలా... ఓ వావిలాల గోపాలకృష్ణయ్యలా! వారికి గాంధేయవాదమంటే నినాదం కాదు- జీవన విధానం. ఆ కోవలోనివారు మండలి వేంకట కృష్ణారావు. నేటి నుంచి ఆయన శతజయంతి సంవత్సర వేడుకలు ప్రారంభమవుతున్నాయి.

పూలదండకు తలను వంచని బుద్ధిమంతులు ఉండరన్నారు సినారె. కానీ, అలాంటివారు ఉన్నారు. మండలి ఎన్నడూ పూలదండలను అనుమతించలేదు. తలను వంచలేదు. అన్నేళ్ల అధికారంలో ఉన్నా- ఆయనకు హైదరాబాద్‌లో సొంత ఇల్లు లేదు. ఇంటిస్థలం లేదు. ఆఖరికి కారు కూడా లేదు. శాసనసభ్యుడి కోటాలో హౌసింగ్ బోర్డు ఇంటిని కేటాయిస్తే- ప్రభుత్వం క్వార్టర్స్‌ను ఇచ్చింది చాలన్నారాయన. ఆపద్ధర్మ ప్రధానిగా అనేకమార్లు వ్యవహరించిన నందా శేషజీవితాన్ని దిల్లీలోని కూతురింట్లో గడిపారు. ఆయనకు సొంతిల్లు లేదు. వావిలాల గోపాలకృష్ణయ్య జీవితమంతా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. హైదరాబాద్-అవనిగడ్డల మధ్య మండలి సామాన్య ప్రయాణికుడిలా బస్సుల్లో తిరిగేవారు. గాంధేయవాదమంటే ప్రదర్శన కాదు- ప్రవర్తన! స్వాతంత్ర్య సమరయోధుల కోటాలో లభించిన అయిదెకరాల భూమిని పేదలకు పంచి ఇచ్చారు మండలి. చిన్నతనంనుంచే ఖద్దరు ధరించడం తండ్రి వెంకట్రామయ్య నుంచి సంక్రమించిన సంస్కార విశేషం. మండలి విషయంలో ఖద్దరు వస్త్రధారణమనేది గాంధీయిజానికి సంపూర్ణ శరణాగతిగా గుర్తించాల్సి ఉంది. ఎందుకంటే ఆయన గాంధీజీని అనుకరించలేదు- అనుసరించారు. గాంధీజీ శతజయంతిని పురస్కరించుకొని 1969లో అవనిగడ్డలో 'గాంధీక్షేత్రం' ఏర్పాటుచేశారు మండలి. అది అక్షరాలా గాంధీజీ ఆశయాల సాధనకు ఆవిర్భవించిన కార్యక్షేత్రం. గ్రంథాలయాలు, మహిళా మండళ్లు, కార్యకర్తల శిబిరాల్లో చరఖా శిక్షణల వంటివి గాంధీక్షేత్రానికి అనుబంధ సుగంధాలు. 'ఆనందమనేది ఎన్నింటిని పొందామనేదానికన్నా- ఎన్నింటిని ఒదులుకొన్నామన్నదానిపై ఎక్కువ ఆధారపడి ఉంటుంది' అన్నారు గాంధీజీ. కృష్ణారావు జీవితంలో ఆ తరహా చిత్తశుద్ధిని గుర్తించారు కాబట్టే- కృష్ణాపత్రిక సంపాదకీయంలో మండలిని 'అవనిగడ్డ గాంధీ'గా అభివర్ణించారు పిరాట్ల వేంకటేశ్వర్లు.



ప్రజలకు తోడూనీడై...

సిరిసంపదలు వెనకేసుకోవడం కాదు, అవసరమైతే తమ పెద్దలు వెనకేసిన దాన్ని సైతం ప్రజల కోసం వెచ్చించేందుకు వెనకాడకపోవడం రాజకీయ నేతలకు ఆదర్శం- ఓ లాల్‌బహాదుర్ శాస్త్రిలా... ఓ టంగుటూరి ప్రకాశంలా! మండలి ఆ జాబితాలో చేరిన నాయకుడు. 1977 దివిసీమ ఉప్పెన ఆ ప్రాంత వృద్ధులకు ఇప్పటికీ ఓ భయంకరమైన పీడకల. దశాబ్దాల అభివృద్ధిని ఓ కాళరాత్రి తుడిచి పారేసింది. ప్రజల బతుకుల్లో చీకటిని చిమ్మింది. చలించిపోయారు మండలి. ఉన్మత్త చిత్తులైపోయారు- దుఃఖంతో. పంచె పైకి ఎగగట్టి బురదలోకి దిగారు- కసిగా..! శ్రమించింది- ఒకటి రెండు రోజులుకాదు- నెలరోజులుపైగా! 1972లో తనను శాసనసభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న తన ప్రజలకు తానెంతవరకు చేయగలరో- అంతకుమించి చేశారు. చేయించారు. తిండితిప్పలకు లోటులేకుండా చూశారు. బాధితులు మానసికంగానూ తేటపడేందుకు హైదరాబాద్ నుంచి ఎందరో కళాకారులను రప్పించి బుర్రకథలను, నాటకాలను నడిపించారు. జనం త్వరగా తేరుకొనేలా చేశారు. ఓదార్పు అనే మాటకు అర్థం- మళ్లీ మనిషిని చేయడమేనని నిరూపించారు. ఎక్కడో రైలు ప్రమాదం జరిగితే ఆ శాఖ మంత్రిగా కలత చెందిన లాల్‌బహాదుర్ శాస్త్రి మంత్రి పదవికి రాజీనామా ఎందుకు చేశారంటే- అదంతే! బారిస్టర్‌గా భారీ ఆదాయాన్ని ఆర్జిస్తున్న ప్రకాశం ప్రజలకోసం వృత్తిని వదిలేసి, చిరిగిన చొక్కాను తానే స్వయంగా కుట్టుకుని ధరించేంత పేదరికాన్ని ఎందుకు వరించారంటే- అదంతే! ఇప్పటి నాయకులకు అర్థమయ్యే విషయం కాదది. గాంధీయిజం పరువొక్కటేకాదు- చాలా బరువు కూడా! మండలి కృష్ణారావు వంటి ఆ తరం నేతలకే తెలుస్తుందది. కాకలు తీరిన నాయకుడు బెజవాడ గోపాలరెడ్డి- 'నా అరవై ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ మంత్రికైనా చేతులెత్తి నమస్కారం చేస్తున్నానంటే- ఒక్క మండలి కృష్ణారావుకే' అని విజయవాడ సభలో బాహాటంగా ప్రకటించారు. అది మండలి సేవాతత్పరతకు విలువైన యోగ్యతాపత్రం!

'విద్యాగంధం లేని విద్యామంత్రి' అన్నారు మండలినొక ప్రతిపక్షనాయకుడు. అదే మండలికి ఉపాధ్యాయ 'దినం' పదంలోని అపశ్రుతి చెవికి సోకి సెప్టెంబరు 5వ తేదీని 'గురుపూజోత్సవం'గా మార్చాలన్న ఊహ తోచింది. శబ్దశక్తి తెలియడమంటే- అది! చదువుతో రాదది- సంస్కారంతో వస్తుంది. ఆ భాషా సంస్కారం- తెలుగు తియ్యదనాన్ని పౌరుషాన్ని శరీరంలోని అణువణువునా జీర్ణించుకున్న నందమూరి తారక రామారావులో చూస్తాం. తెలుగు ప్రజల ఖ్యాతిని దశదిశలా చాటిచెప్పాలన్న తపన- బెజవాడ గోపాలరెడ్డికీ ఉండేది. ఆ ఇద్దరి సరసన చేరగల వీర భాషాభిమాని- మండలి.

అమ్మభాషకు అక్షరాభిషేకం

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక తెలుగుభాషకు తొలిసారిగా జరిగిన వైభవోపేతమైన సీమంతపు వేడుకలే- ప్రపంచ తెలుగు మహాసభలు! 1975 ఏప్రిల్ 12 ఉగాదినాడు మొదలై వారంపాటు అమ్మ భాషకు జరిగిన నిలువెత్తు అక్షరాభిషేకం- నభూతో..! దాని పురోహితులు- మండలి కృష్ణారావు! రాజకీయ సాహిత్య సాంస్కృతిక రంగాలకు చెందిన మహామహుల ప్రతిభావిన్యాసాలతో, ఆత్మీయమైన ఆతిథ్యమర్యాదలతో, 'చేయెత్తి జైకొట్టిన తెలుగోడి' హర్షధ్వానాలతో సభా ప్రాంగణం దద్దరిల్లిపోయింది. తెలుగు భాషా సాంస్కృతిక వారసత్వం సహస్రాక్షత్ సహస్రపాత్... అన్నట్లుగా వేయి ముఖాలతో నర్తించింది. ఆ విశ్వరూపాన్ని ఆసాంతం ఆస్వాదించి ఆలకించి తిలకించి పులకించినవారికి ఆ ఘట్టం గుర్తొస్తే ఇప్పటికీ శరీరం రోమాంచితమవుతుంది. నాటి తీర్మానాల్లోంచి చిగురు తొడిగిందే- 'అంతర్జాతీయ తెలుగు సంస్థ!' మంత్రి పదవిని తీసుకోమని ముఖ్యమంత్రి అంజయ్య కోరితే- వద్దు, ఆ సంస్థకు అధ్యక్షుడిగా ఉంటానన్నారు మండలి. ఆ భాషా ప్రియత్వానికి, ఆయన దక్షతకు మూలకారణం- 'ఆయన ప్రకృతియు నా యది మాయురే! ఒక జాతి ద్రవ్యమా అనిపించున్' అన్న విశ్వనాథ ప్రశంసలో దొరుకుతుంది. ఒక మహా కవిసమ్రాట్‌దీ, మండలి వేంకట కృష్ణారావుదీ- ఒకే జీవ ప్రకృతి అట! అది ఈ జాతి ద్రవ్యమట! ఇంతకన్నా ఏం కావాలి మండలి వారికి!

– ఎర్రాప్రగడ రామకృష్ణ



ప్రాణాలకు తెగించి...

అది ఇంగ్లాండ్‌లోని ప్రముఖ వైద్యకళాశాల విద్యార్థుల గ్రాడ్యుయేషన్ సెరెమనీ. ప్రధానమంత్రి ముఖ్యఅతిథిగా వచ్చారు. కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ఓ సీనియర్ సర్జన్, ప్రొఫెసర్ తన స్వానుభవాన్ని ఇలా పంచుకున్నారు...

'నేను డాక్టరుగా ప్రాక్టీస్ ప్రారంభించిన తొలిరోజులవి. ఓ అర్ధరాత్రి మా ఇంటి తలుపులను ఎవరో తడుతున్న చప్పుడైంది. ఉలిక్కిపడి లేచి బయటికి వెళ్లేసరికి గుమ్మం ముందు కన్నీళ్లతో నడివయసు మహిళ. ఎవరని అడిగేలోపే "అయ్యా! నా కొడుకు చావుబతుకుల్లో ఉన్నాడు. వచ్చి కాపాడండి" అని ఏడుస్తోంది. ఆ తల్లి కన్నీళ్లని చూసి మనసు కదిలిపోయి వెంటనే బయల్దేరాను. బయటచూస్తే ఉరుములు మెరుపులతో కుండపోత వర్షమూ చలీ... దారంతా చీకటి. అయినా ఆమెను అనుసరించాను. ఎంతో కష్టపడి ఎట్టకేలకు వాళ్ల ఇంటికి చేరుకున్నాం. కొన్నాళ్ల క్రితమే తండ్రిని కోల్పోయిన ఆ బాలుడు తీవ్ర అస్వస్థతతో వణికిపోతున్నాడు. పరీక్షించి మందులు ఇచ్చాను. కొద్దిగా కోలుకున్నాక, ప్రాణాపాయం లేదని భరోసా ఇచ్చి బయల్దేరుతున్నాను. ఇంతలో ఆ తల్లి కృతజ్ఞతలు చెబుతూ నా చేతిలో కొంత డబ్బు పెట్టింది. వాళ్ల పరిస్థితి కళ్లారా చూశాక, డబ్బులు తీసుకోబుద్ధి కాలేదు. తరవాత తీసుకుంటానని చెప్పి తిరిగిచ్చేశాను. ఆ అబ్బాయి కోలుకునేవరకూ వెళ్లి చూసేవాణ్ని. వృత్తిజీవితంలో నాకది మరచిపోలేని అనుభవం. ప్రజలు దైవంతో సమానంగా గౌరవించే వృత్తి మనది' అంటూ ఉద్వేగంగా ప్రసంగాన్ని ముగించారు. వెంటనే వేదికపై ఉన్న ప్రధాని లాయిడ్ జార్జ్ లేచి ఆ ప్రొఫెసర్ చేతులను ముద్దు పెట్టుకున్నారు. 'నా బాల్యంలోనూ ఇలాంటి ఘటనే జరిగింది. తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్న నన్ను ఒక వైద్యుడు ఇంటికొచ్చి చూసేవారు. ఆయనకు సరిగ్గా కృతజ్ఞతలు చెప్పుకోలేకపోయానని అమ్మ బాధపడేది. మీరు కాపాడింది నన్నే అనుకోండి' అన్నారు.

ప్రధాన మంత్రిగా లాయిడ్ జార్జ్ ఒక ప్రసంగంలో చెప్పిన స్వానుభవాన్ని ఆధారంగా చేసుకుని అల్లిన కథ ఇది. వైద్య విద్యార్థుల్లో సేవాభావం పెంచడానికి, ప్రతిఫలాపేక్ష లేకుండా పనిచేయాలని చెప్పడానికి, వైద్యవృత్తి గొప్పదనాన్ని తెలియజేయడానికి దీన్ని తరచూ చెబుతుంటారు. దాదాపు వందేళ్ల క్రితం దాకా ప్రపంచ దేశాలన్నిట్లోనూ వైద్యులు రోగుల ఇళ్లకు వెళ్లడం మామూలే. ప్రధాన నగరాల్లో తప్ప ఆస్పత్రులు అందుబాటులో ఉండేవి కావు. అలాగే రవాణా సాధనాలూ అంతగా అభివృద్ధి చెందలేదు. దాంతో వైద్యులే రోగుల ఇళ్లకు వెళ్లాల్సి వచ్చేది. మానవత్వం మూర్తీభవించిన మంచి వైద్యులు ఎందరో ప్రతికూల వాతావరణాన్ని సైతం లెక్కచేయకుండా ప్రాణాలకు తెగించి వెళ్లి రోగుల ప్రాణాలను కాపాడేవారు. ముఖ్యంగా ప్రమాదాలు జరిగినప్పుడు, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు, అంటువ్యాధులు ప్రబలినప్పుడు వారు చేసిన సేవలు వెలకట్టలేనివి. అలాంటి ఎందరో అజ్ఞాత వైద్యుల దయార్ద్ర హృదయాలకు ప్రతీకగా, నేటి విద్యార్థులకు ప్రేరణగా ఈ కథ ఎంతో ప్రాచుర్యం పొందింది.

– మనోజ్ఞ

వాహనాల మోత!



పట్టణాల విస్తరణ, జీవనశైలిలో మార్పులు, వినియోగం పెరగడం తదితర కారణాలతో వాహనాలకు గిరాకీ పెరుగుతోంది. తద్వారా తయారీ ఊపందుకొంటోంది. ఈ క్రమంలో 2019-20లో దేశీయంగా అన్ని రకాలు కలిపి 2.63 కోట్ల వాహనాలు ఉత్పత్తయ్యాయి. తరవాతి ఏడాది వాటి సంఖ్య 2.26 కోట్లకు తగ్గితే, 2023-24లో 2.84 కోట్లకు పెరిగింది. ఆ తరవాతి సంవత్సరంలో వాటి ఉత్పత్తి మరో 26 లక్షల మేర పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా ఆయా వాహనాల ఉత్పత్తి... (లక్షల్లో)

ప్రయాణికుల వాహనాలు	50.61
వాణిజ్య వాహనాలు	10.32
త్రిచక్ర వాహనాలు	10.50
ద్విచక్ర వాహనాలు	238
ఇతరాలు	0.064

(ఆధారం: సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మ్యానుఫ్యాక్చరర్స్)

మహా మృత్యుకాల హెచ్చరిక!


ఉష్ణమండల అడవులను కాపాడుకోగలిగితేనే కర్బన ఉద్గారాలను తగ్గించి వాతావరణాన్ని రక్షించుకోగలుగుతామని తాజా అధ్యయనం ఒకటి స్పష్టీకరిస్తోంది. పర్యావరణ మార్పులకు కారణమవుతున్న మానవ చర్యలపై అది ఆందోళన వ్యక్తంచేస్తోంది. దాన్ని పట్టించుకోకపోతే నష్టపోయేది మనమే!

భూమిపై 53.88 కోట్ల సంవత్సరాల క్రితం మొదలైన పేలియోజోయిక్ యుగంలో చివరి అంకమైన పెర్మియన్ దశ 29.89 కోట్ల సంవత్సరాల నుంచి 25.19 కోట్ల సంవత్సరాల మధ్య నడిచింది. పెర్మియన్ దశలోనే భూమిపై పాంజియా అనే మహా ఖండం ఏర్పడింది. పెర్మియన్ దశ తరవాత 25.2 కోట్ల ఏళ్ల నుంచి 24.7 కోట్ల ఏళ్ల వరకు తొలి ట్రయాసిక్ దశ నడిచింది. పెర్మియన్- తొలి ట్రయాసిక్ దశల మధ్య భూమిపై వాతావరణ ఉత్పాతం సంభవించింది. ఇంతవరకు భూమిపై అయిదుసార్లు జీవజాతులు అంతమైపోగా, వాటిలో ఒకటి ఈ కాలంలోనే సంభవించింది. పెర్మియన్- తొలి ట్రయాసిక్ దశల మధ్య భూమిపై 80శాతం జీవరాశులు అంతరించిపోయాయి. దీన్నే మహా మృత్యుకాలంగా పరిగణిస్తారు.

అంతుచిక్కని రహస్యం

మహా మృత్యుకాలంలో అతి శీతల సైబీరియాలో అగ్ని పర్వతాల మహా విస్ఫోటనాలు సంభవించాయి. వాతావరణంలోకి కనీవినీ ఎరుగనంత కర్బన ఉద్గారాలు విడుదలయ్యాయి. అవే మహా విలయానికి మూలకారణాలయ్యాయి. సైబీరియాలో భూమి కేంద్రక పెంకు (క్రస్ట్) గుండా మాంటిల్ శిలా ద్రవం ఉవ్వెత్తున విరజిమ్మడం వల్ల వాతావరణంలోకి భారీ పరిమాణంలో కర్బన ఉద్గారాలు చొచ్చుకొచ్చాయి. పెర్మియన్-ట్రయాసిక్ కర్బన ఉద్గారాల వల్ల 80శాతం భూ, జల జీవజాతులు అంతరించిపోయాయి. కార్బన్ డయాక్సైడ్, నీటి ఆవిరి, సల్ఫర్ డయాక్సైడ్‌లతో నిండిన ఉద్గారాలివి. సల్ఫర్ డయాక్సైడ్ కర్బన ఉద్గారం కాకపోయినా అది నీటి ఆవిరితో కలిసినప్పుడు ఆమ్ల వర్షం కురవడమే కాదు, తీవ్ర వాయు కాలుష్యమూ ఏర్పడుతుంది. సల్ఫర్ డయాక్సైడ్ వాతావరణంలో సృష్టించే ఏరోసాల్స్ వల్ల వాతావరణంలో వేడి పెరిగిపోతుంది. అగ్నిపర్వతాలు విరజిమ్మే వాయువులలో మీథేన్ కూడా ఉండి భూఉష్ణోగ్రతను పెంచేస్తుంది. పెరిగిపోయిన కర్బన ఉద్గారాలు, వాయు, సముద్ర కాలుష్యాలు కలిసి సముద్రాలను విపరీతంగా వేడెక్కించాయి.

ఈ మహోగ్ర ఉష్ణ పరిస్థితులు ఏకంగా 50 లక్షల సంవత్సరాలపాటు కొనసాగి భూమిని కొలిమిలా మార్చేశాయి. దీనికి కారణమేమిటో శాస్త్రజ్ఞులకు ఇప్పటికీ అంతుచిక్కలేదు. కార్బన్ డయాక్సైడ్ కలిసిన వర్షపు



నీరు కొంత ఆమ్లత్వాన్ని సంతరించుకుంటుంది. దానివల్ల రాళ్లలోని సిలికాన్ కరిగిపోయి స్థిరమైన కార్బనేట్ శిలలుగా మారతాయి. దీనివల్ల కర్బన విభజన జరిగి పర్యావరణం మళ్లీ స్థిరత్వం సంతరించుకుంటుంది. దానివల్ల వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్ అగ్నిపర్వత విస్ఫోటనాలకు ముందునాటి స్థాయికి తగ్గిపోవాల్సి ఉన్నా అలా జరగలేదు. భూతల, సముద్రతల పర్యావరణ వ్యవస్థలు లక్ష సంవత్సరాలైనా పూర్వ స్థితికి రాలేదు. ఈ విపరీత పరిణామంపై వుహాన్‌లోని చైనా భూతత్వ శాస్త్రాల విశ్వవిద్యాలయం, బ్రిటన్‌లోని లీడ్స్ విశ్వవిద్యాలయ పరిశోధకులు కలిసి ఓ అధ్యయనం చేశారు. దాని ఫలితాలు విఖ్యాత వైజ్ఞానిక పత్రిక 'నేచర్'లో ఇటీవల ప్రచురితమయ్యాయి. ఆ అధ్యయనంలో భాగంగా నైరుతి చైనాలోని శిలల్లో పెర్మియన్-ట్రయాసిక్ యుగంలో అంతరించిపోయిన జీవజాతుల ఆనవాళ్లను విశ్లేషించారు. నాటి శిలాజాలనూ పరిశీలించారు. తద్వారా పెర్మియన్-ట్రయాసిక్ యుగంలో వృక్షజాతుల తీరుతెన్నులను ఆరాతీశారు.

అడవులే రక్షా కవచాలు

పెర్మియన్-ట్రయాసిక్ యుగంలో ఆమ్ల వర్షాలు, అత్యధిక వేడిమి వల్ల ఉష్ణ మండల అరణ్యాలు నశించిపోయాయి. ఫలితంగా వాతావరణంలో అతిగా చేరిపోయిన కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకోగల చెట్లు లేకుండా పోయాయి. దీంతో కార్బన్ డయాక్సైడ్ ప్రభావం దీర్ఘకాలం కొనసాగి భూతాపం అడ్డులేకుండా పెరిగింది. పెర్మియన్-ట్రయాసిక్ యుగం ఏకంగా 50 లక్షల సంవత్సరాలపాటు కొనసాగిందంటే కారణమిదే. అడవులు మళ్లీ వేగంగా పెరిగి ఉంటే ఈ ఉష్ణ యుగం ముందుగానే ముగిసి వాతావరణం మళ్లీ తేరుకునేది.

పెర్మియన్ మహా మృత్యుకాలపు వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ ఆరు రెట్లకు పైగా పెరిగిపోయింది. ఆ కాలంలో భూవాతావరణంలోకీ, సముద్రాల్లోకీ 3,900 నుంచి 12వేల గిగాటన్నుల వరకు కర్బనం చేరిపోయింది. దీంతో పోలిస్తే 2022లో కర్బన ఉద్గారాల పరిమాణం 36.8 గిగాటన్నులు మాత్రమే. అయినా కూడా ఇప్పుడు భూఉష్ణోగ్రత మానవులు భరించలేని స్థాయికి చేరుకుంది. గడిచిన ఎనిమిది లక్షల సంవత్సరాలలో ఎన్నడూ లేనంతగా ఇప్పుడు వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ సాంద్రత అధికమైంది. ఆ మేరకు వాతావరణ మార్పుల దుష్ప్రభావాన్ని మానవుడు ఇప్పటికే చవిచూస్తున్నాడు. కాబట్టి ఇకనైనా అడవుల నరికివేతను అడ్డుకోవాలి. కొత్త అడవులను పెంచాలి. చెట్లు కిరణజన్య సంయోగక్రియ ద్వారా వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్, నీటిని ఆక్సిజన్‌గా, గ్లూకోజ్‌గా మారుస్తాయి. అవి సమస్త ప్రాణులకు జీవనాధారంగా నిలుస్తాయి.




సీపీ రాజేంద్రన్

భూ విజ్ఞాన శాస్త్రవేత్త, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్‌లో అనుబంధ ఆచార్యులు

ఇంకోలా చేస్తే..!

వెంకటాపురంలో అమ్మనాన్నలతో కలిసి ఉండేవాడు చిన్నా. వాళ్ల నాన్న రాజయ్య రిక్షాలో పక్క ఊళ్లన్నీ తిరుగుతూ ప్లాస్టిక్ సామాను తీసుకుని ఉల్లిపాయలు, డబ్బులు ఇచ్చే వీధి వ్యాపారం చేసేవాడు. చిన్నా అక్కడే స్కూల్లో ఏడో తరగతి చదువుతున్నాడు. రోజంతా తిరిగినా వాళ్ల నాన్నకి చాలా తక్కువ డబ్బులే మిగిలేవి. ఒక్కోసారి అసలు వ్యాపారం సరిగ్గా అయ్యేదే కాదు. ఒకరోజు చిన్నా స్కూల్ నుంచి వచ్చేసరికి దిగాలుగా కూర్చుని ఉన్నాడు రాజయ్య. అది చూసి.. 'నాన్నా! ఎందుకలా ఉన్నావు? అయినా నువ్వు రోజూ ఈ సమయానికి ఇంట్లో ఉండవు కదా. ఒంట్లో ఏమైనా బాలేదా?' అని కంగారుగా అడిగాడు. దాంతో విషయమంతా చెప్పాడు వాళ్ల నాన్న. అదంతా విని.. 'మరేం బాధపడకు నాన్నా. నేనొక ఉపాయం



చెబుతాను.. దాన్ని అనుసరించు. అప్పుడు మన వ్యాపారం బాగానే ఉంటుంది' అన్నాడు చిన్నా. 'ఏంటో చెప్పు' అన్నాడు రాజయ్య. 'పొద్దున్నే ఖాళీ బండి మీద కేవలం ఉల్లిపాయలతో కాకుండా మన దగ్గర ఉన్న కొన్ని ప్లాస్టిక్ సామాన్లను కూడా తీసుకుని బయలుదేరు నాన్నా. చూడటానికి కాస్త మంచిగా ఉల్లిపాయలు అందరికీ బయటికి కనిపించేలా పెట్టాలి. ఉదయాన్నే ఇంత నిండుగా ఉందంటే ఇతని దగ్గర సరకు బాగానే ఉండీ ఉంటుందని కొంతమందైనా కొనడానికి ప్రయత్నిస్తారు. మెల్లగా మన వ్యాపారమూ మెరుగుపడుతుంది' అని చెప్పాడు చిన్నా. కొడుకు చెప్పినట్లుగానే మరుసటి రోజు ఉదయాన్నే బయలుదేరాడు రాజయ్య. ముందురోజుల కంటే కాస్త బాగానే వ్యాపారం జరిగింది. ఇంటికి వచ్చి కొడుకును మెచ్చుకున్నాడు. 'మనం ఏదైనా పని చేస్తే దాన్ని మధ్యలోనే వదిలేయకూడదు. ఇంకోలా చేస్తే సాధ్యమవుతుందేమో ప్రయత్నించాలి' అని స్కూల్లో టీచర్ చెప్పారు నాన్నా.. అదే నేనూ చెప్పాను అన్నాడు చిన్నా.

– కాకరపర్తి సుబ్రహ్మణ్యం

హాయ్! బుజ్జీ!!

ఆ ఒక్కటి ఏది?

ఇక్కడ ఇచ్చిన అంశాల్లో ఒక్కటి మాత్రం మిగతా వాటికి భిన్నంగా ఉంటుంది. ఆ ఒక్కటి ఏదో కనిపెట్టండి చూద్దాం.

1. వాచ్, బంతి, ఉంగరం, గాజులు
2. దోమ, తూనీగ, చీమ, ఈగ
3. రామచిలుక, కోడి, బాతు, పిల్లి

జవాబు: 1. ఉంగరం 2. ఈగ 3. పిల్లి



కృష్ణానదికి వరద రావడంతో విజయవాడ ప్రకాశం బ్యారేజీ గేట్లు ఎత్తివేశారు. దీంతో కృష్ణమ్మ పరుగులు చూసేందుకు ఆదివారం తరలివచ్చిన ప్రజలు




ఆనందం సరే.. అపాయం కనరే

కృష్ణానదికి వరద పోటెత్తడంతో ప్రకాశం బ్యారేజీ గేట్లన్నీ ఎత్తారు. దీంతో సముద్రం వైపు పరుగులు పెడుతున్న కృష్ణమ్మను చూసేందుకు ప్రజలు భారీగా తరలివస్తున్నారు. అయితే బ్యారేజీ దిగువన కొందరు నీళ్లలో దిగి సాహస విన్యాసాలు చేస్తున్నారు. ఒడ్డున ఉన్న వారు వారిని ప్రోత్సహిస్తున్నారు. ఎక్కడ లోతు ఎక్కువగా ఉందో తక్కువగా ఉందో తెలీదు. అలాంటిది ఆనందం కోసం ఇలా నీళ్లలోకి దూకేస్తే ఏదైనా జరగరానిది జరిగితే మిగిలేది కన్నీటి సుడులే..

- ఈనాడు, అమరావతి

ఇంటిగ్రేట్.. అయ్యేదెన్నడు?!

తాజాగా మరోసారి గడువు పొడిగించాల్సిందే ★ వచ్చే ఏడాది సెప్టెంబరుకు పూర్తయ్యే వీలు

ఈనాడు, అమరావతి - గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే

విజయవాడ విమానాశ్రయంలో గ్లాస్ అండ్ స్టీల్ స్ట్రక్చర్‌తో ప్రకృతి విపత్తులను సైతం తట్టుకునేలా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ నిర్మాణం పూర్తవడానికి నిర్దేశించిన గడువు మరోసారి పొడిగించాల్సిందే. 2025 ఆగస్టు 15లోగా పూర్తిచేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించినా.. అది అసాధ్యమని తేలిపోయింది. రూ.470 కోట్లతో నిర్మిస్తున్న టెర్మినల్ పనుల పూర్తికి కనీసం మరో ఏడాది పట్టే వీలుంది. రోజువారీ ప్రగతిని చూపించాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంతో పోలిస్తే ప్రస్తుతం పనులు జోరుగా సాగుతున్నాయి. పురోగతి కనిపిస్తోంది. ప్రస్తుతం టెర్మినల్‌కు వెలుపల వైపు గ్లాస్‌లను బిగించే పనులు ఆరంభించారు.

వైకాపా విస్మరించింది... ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ పనులు 2022 సెప్టెంబరు నాటికే పూర్తిచేయాలనేది లక్ష్యం. కానీ.. గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోక పోవడంతో భారత విమానయాన సంస్థ(ఏఏఐ) కూడా విజయవాడ విమానాశ్రయంపై శీతకన్ను వేసింది. దీంతో టెర్మినల్ పనులు పూర్తిగా పక్కన పెట్టేశారు.

పలు విమానాశ్రయాల్లో టెర్మినల్ భవన నిర్మాణ సమయం
- ★ హైదరాబాద్‌లోని శంషాబాద్: 2.2 ఏళ్లు
- ★ బెంగళూరులోని బీఎల్ఆర్: 2.8 ఏళ్లు
- ★ చెన్నై ఇంటర్నేషనల్: 3 ఏళ్లు
- ★ గన్నవరం: ఐదేళ్లు దాటినా 75 శాతమే పూర్తి


ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనానికి వెలుపల గ్లాస్‌లు బిగించే పనులు

కూటమి రాకతో ఊపు... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరడం, కేంద్ర పౌరవిమానాయాన మంత్రిగా రామ్మోహన్‌నాయుడు బాధ్యతలు చేపట్టడంతో మళ్లీ గన్నవరంపై దృష్టిసారించారు. ఈ ఏడాది జూన్ నాటికే పూర్తిచేసి తీరాలని గడువు నిర్దేశించారు. ఆ తర్వాత ఆగస్టుకు పెంచారు. ప్రస్తుతం పనుల వేగం పెరిగింది. ప్రధానంగా.. దేశంలో ఇతర విమానాశ్రయాల నుంచి ఇంజినీర్లను అదనంగా తీసుకొచ్చి పనులు చేయిస్తున్నారు. విమానాశ్రయాల్లో వేగంగా పనులు చేయడంలో అనుభవం ఉన్న గుత్తేదారులను సైతం ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో పనులు వచ్చే ఏడాది సెప్టెంబరుకు పూర్తయ్యే వీలుందని అధికారుల అంచనా.

సిద్ధమైన ఆరు ఏరో బ్రిడ్జిలు... ప్రయాణికులు నేరుగా విమానం దిగి.. టెర్మినల్ లోపలకు నడిచి వచ్చేందుకు ఏర్పాటు చేస్తున్న ఆరు ఏరో బ్రిడ్జిల పనులు పూర్తయ్యాయి. రన్‌వే వైపు నుంచి టెర్మినల్ వెనుక వైపు ఏరో బ్రిడ్జిలను బిగించారు. ప్రస్తుతం గన్నవరంలో అసలు ఏరో బ్రిడ్జిలే లేవు. దీంతో ప్రయాణికులు విమానం దిగాక.. రన్‌వే వద్ద నుంచి బస్సుల్లో వారిని టెర్మినల్ వద్దకు తీసుకొస్తున్నారు.

భవనం లోపల పనులు.. ప్రస్తుతం బయట వైపు కాంక్రీట్ పనులు 85 శాతంపైగా పూర్తయ్యాయి. లోపల వైపు గదుల ఏర్పాటు, విద్యుత్తు వైరింగ్, ఫాల్స్ సీలింగ్ పనులు జరుగుతున్నాయి. చెకిన్ కౌంటర్లు, ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ కౌంటర్లు, డిపార్చర్, అరైవల్ బ్లాకుల్లో బ్యాగేజీ కన్వేయర్లు, బ్యాగేజీ హ్యాండ్లింగ్ వ్యవస్థ, సెంట్రల్ ఏసీ, సీసీ టీవీలు బిగించడం.. ఈ పనుల పూర్తికి ఆరేడు నెలలుపైగానే సమయం పట్టే వీలుంది.

మహోన్నత నాయకుడు వెంకటరత్నం


కాకాని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాధవ్, తరుణ్, శ్రీరామ్ తదితరులు

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: తెలుగు ప్రజల ఉనికి కోసం జైఆంధ్ర ఉద్యమాన్ని నిర్మించిన మహోన్నత నాయకుడు కాకాని వెంకటరత్నం అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. కాకాని ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో స్వాతంత్య్ర సమరయోధుడు, జైఆంధ్ర ఉద్యమ సారథి, మాజీ మంత్రి కాకాని వెంకటరత్నం జయంతి సందర్భంగా ఆదివారం విజయవాడ బెంజ్ సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి మాధవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ మంత్రిగా అనేక పశువుల ఆస్పత్రులు నెలకొల్పారని, విద్యావ్యాప్తికి కృషి చేశారని గుర్తు చేశారు. భాజపా జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, మాజీ ఎమ్మెల్సీ కాపు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. పేద మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు.

కొడాలికి.. విశాఖ పోలీసుల నోటీసులు

ఈనాడు, అమరావతి, గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ వైకాపా నేత, మాజీ మంత్రి కొడాలి నానికి విశాఖ పోలీసులు శనివారం రాత్రి 41 సీఆర్‌పీసీ నోటీసులను అందజేశారు. తెదేపా అధినేత చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులను అసభ్య పదజాలంతో దూషిస్తూ వ్యాఖ్యలు చేయడంతోపాటు వారిని కించపరిచేలా సామాజిక మాధ్యమాలలో కొడాలి నాని పోస్టులను పెట్టారని.. విశాఖకు చెందిన ఎస్.అంజనాప్రియ 2024లో మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై సెక్షన్ 351(4), 352, 353(2), 196(1), బీఎన్ఎస్ 467, ఐటీ చట్టం కింద కొడాలిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు నోటీసులనే గుడివాడకు వచ్చి నానికి అందజేశారు.

గుడివాడకు వచ్చి అందజేత

ఇప్పటికే పలు కేసులు... కొడాలి నానిపై ఇప్పటికే మద్యం గోడౌన్ వ్యవహారంలో యజమానిని బెదిరించిన కేసు గుడివాడ రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో నమోదైంది. ఎన్నికల సమయంలో వాలంటీర్లతో బలవంతంగా రాజీనామాలు చేయించినందుకు గుడివాడ వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో మరో కేసు నమోదైంది. తెదేపా మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, ఆయన కార్యాలయంపై వైకాపా నేతలు పెట్రోలుతో దాడికి యత్నించిన కేసులో కొడాలి నాని ఇప్పటికే ముందస్తు బెయిలు తెచ్చుకున్నారు. ఈ కేసుకు సంబంధించి గుడివాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంతకం పెట్టేందుకు కొడాలి శనివారం హైదరాబాద్ నుంచి వచ్చారు. ఆ సమయంలోనే విశాఖ మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సంతోష్ సిబ్బందితో వచ్చి కొడాలికి నోటీసులు ఇచ్చారు.

‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’ నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలో ఈనెల 4న సోమవారం ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/నగరపాలక సంస్థ, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారన్నారు. కలెక్టరేట్‌లో పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతి పత్రాలను స్వీకరిస్తారని వివరించారు. మీకోసం వెబ్‌సైట్.. meekosam.ap.gov.in లోనూ ప్రజలు తమ అర్జీలను దాఖలు (నమోదు) చేయవచ్చన్నారు. ఇందులో దాఖలైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 నంబరుకు నేరుగా ఫోన్ చేయవచ్చని వివరించారు.

తూకాల్లో తిరకాసులు..!

చౌక బియ్యం సరఫరాలో మాయాజాలం
క్వింటాకు 3 కిలోలకుపైగా వ్యత్యాసం...

ఈనాడు, అమరావతి

ఎం.ఎల్.ఎస్. పాయింట్ల నిర్వాహకులు చౌక బియ్యం సరఫరాలో మాయాజాలం చేస్తున్నారు. ప్రభుత్వం మారినా వారి తీరు మారడంలేదు. డీలర్లపై ఆజమాయిషీ చేసి తూకాల్లో తేడాలు సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారు. డీలర్ల పరిస్థితి కక్కలేక మింగలేక అన్నట్లు ఉంది. ఒక్కో దుకాణానికి నెలకు భారీగా నష్టపోతున్నారు. దీనిపై అధికారులు అరకొర చర్యలతో మమ అనిపిస్తున్నారు.

క్వింటాకు 3 కిలోలు తక్కువ... ఉమ్మడి జిల్లాలో ఒక్కో రేషన్ దుకాణానికి కార్డులను బట్టి నెలకు 100-150 క్వింటాళ్ల సరుకు అవుతుంది. ఇందులో దాదాపు 90 శాతం బియ్యం ఉంటుంది. నిబంధనల మేరకు ప్రతి బస్తా సంచి బరువుతో కలిపి 50.580 కేజీలు ఉండాలి. కానీ 48-49 కిలోలే ఉంటోంది. సగటున 50 కేజీల బస్తాకు 1.5 కేజీల తేడా వస్తోంది. క్వింటాకు 3 కేజీలు తేడా.

బందరు రెవెన్యూ డివిజన్‌లో ఓ డీలర్‌కు 150 క్వింటాళ్ల చౌక బియ్యం పాయింట్ నుంచి ఇవ్వాలి. నిర్వాహకులు డీలర్లకు తూకం వేయకుండా పంపేశారు. డీలర్ స్థానికంగా ఓ వేబ్రిడ్జి దగ్గర తూకం వేయిస్తే 4.5 క్వింటాళ్లు తగ్గింది. ఇదేంటని అడిగితే పై నుంచి అలాగే వచ్చిందన్నారు. ఇది ఈ ఒక్క డీలర్‌కే కాదు. 90 శాతం డీలర్ల పరిస్థితి ఇదే.

ఎన్టీఆర్ జిల్లాలో ఓ ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి ఓ డీలర్‌కు 100 క్వింటాళ్ల చౌక బియ్యం పంపాలి. ప్రతి సారి 97 క్వింటాళ్లనే పంపుతున్నారు. డీలరుకు తూకం ఎప్పుడు వేస్తున్నారో సమాచారం ఇవ్వరు. ఇచ్చినా వాళ్లు వచ్చి చూసుకునే వరకు ఆగకుండానే లారీల్లోకి ఎక్కించేస్తారు.

- ★ **ఉమ్మడి జిల్లాలో కార్డులు:** 11,12,832
- ★ **మొత్తం దుకాణాలు:** 2,016
- ★ **నెలకిచ్చే బియ్యం:** 17,000 మెట్రిక్ టన్నులు
- ★ **ఎం.ఎల్.ఎస్. పాయింట్లు:** 14


గొల్లపూడి ఎంఎల్ఎస్ పాయింట్‌లో రేషన్ బియ్యం


ఓ ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి తెచ్చిన చౌక బియ్యం తూకంలో తేడా

8 వేల క్వింటాళ్లు దోపిడీ.. కొందరు ఎంఎల్ఎస్ పాయింట్ల నిర్వాహకులు అనధికార నియంత్రణ వ్యవహరిస్తున్నారు. నిబంధనల మేరకు డీలర్లకు తూకం వేసే సమయం ముందే చెప్పాలి. వారి ముందే తూకం వేసి సంతకం తీసుకోవాలి. కానీ ఈ వ్యవహారం జరగడం లేదు. డీలర్లు రావడానికి ముందే తూకం వేసి లోడ్ కూడా సిద్ధం చేస్తున్నారు. వారు ఇచ్చిన దానికి సంతకం పెట్టమంటున్నారు. పొరపాటున ఎవరైనా తమ ముందే తూకం వేయాలంటే వారికి ఆలస్యంగా, తూకం వేసేందుకు 15 నిమిషాల ముందు తెలిపి నానా యాతన పెడుతున్నారు. దీంతో ఎందుకొచ్చిన కష్టాలని.. ఇచ్చింది తీసుకుని మొత్తం అందినట్లు సంతకం చేసి వెనుదిరుగుతున్నారు. నెలకు ఒక్కో దుకాణానికి 4-5 క్వింటాళ్ల బియ్యం నష్టపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో నెలకు 8-10 వేల కింటాళ్ల బియ్యం దారి మళ్లుతున్నాయి.

రాజధానితో సమానంగా విజయవాడ అభివృద్ధి

పటమట, న్యూస్‌టుడే: రాజధాని అమరావతితో సమానంగా విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యేల సహకారంతో కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఆదివారం విజయవాడ గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం - చంద్రగూడెం మార్గంలో ఆర్వోబీ, విజయవాడ - మచిలీపట్నం ఆరు లైన్ల రహదారి అభివృద్ధికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అంగీకరించారని తెలిపారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో హైదరాబాద్ - విజయవాడ ఆరు వరుసల జాతీయ రహదారి విస్తరణ పనులను మార్చి వరకు పూర్తి చేసేందుకు కేంద్ర మంత్రి అంగీకరించారని, ఆదేశాలు కూడా ఇచ్చారని చెప్పారు. ఎమ్మెల్యేలు బొండా ఉమా, తంగిరాల సౌమ్య, కొలికపూడి శ్రీనివాసరావు, ఎంపీ సానా సతీష్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, నాయకులు నాగుల్ మీరా, జొన్నల సుధాకర్, లుక్కా సాయిరాం గౌడ్, దూండి రాకేష్, రాధారాయలు తదితరులు ఎంపీతో కేక్ కోయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తలు శివనాథ్‌కు పూలాభిషేకం చేశారు.


కేక్ కోస్తున్న ఎంపీ శివనాథ్, పక్కన ఎమ్మెల్యే బొండా ఉమా తదితరులు

పుట్టపర్తికి ప్రత్యేక రైళ్లు నడపాలి...

విజయవాడ సిటీ: పుట్టపర్తిలో నవంబరు 15 నుంచి 24 వరకు జరుగనున్న సత్యసాయి బాబా శత జయంతి వేడుకలకు వచ్చే భక్తుల [illegible] దిల్లీలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి [illegible] సినట్లు సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు తెలిపారు. వేడుకలకు వేలాదిగా భక్తులు వస్తున్నందున పుట్టపర్తికి ప్రత్యేక రైళ్లు నడపాలని, ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్‌లో కొద్దిసేపు రైళ్లు నిలపాలని, మరికొన్నింటిని ప్రశాంతి నిలయం వైపు మళ్లించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. వినతులపై మంత్రి సానుకూలంగా స్పందించి, ప్రణాళికలు సిద్ధం చేయాలని జనరల్ మేనేజర్లకు ఆదేశించారన్నారు. వేడుకలకు కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మలను ఆహ్వానించామన్నారు.




ఎక్కడ ఉంచాలో... చెప్పండయ్యా?!

ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు పాదరక్షలు ఎక్కడ భద్రపరచాలో తెలియడంలేదు. అసలే వేసవిని తలపించేలా ఎండలు మండుతున్నాయి. మల్లికార్జున మహామండపం వద్ద దేవస్థానం వారు పెట్టిన ఉచితంగా చెప్పులు భద్రపరిచే కౌంటరు వద్ద సరిపడా స్థలం లేదు. పైగా అక్కడ పట్టించుకునే సిబ్బందీ లేక అవస్థలు పడుతున్నారు. భక్తులు ఆలయ పరిసరాల్లో ఎక్కడ పడితే అక్కడ చెప్పులు వదిలేస్తున్నారు. ఇదే అదనుగా చెప్పుల దొంగలు తమ హవా చూపిస్తున్నారు.

– ఈనాడు, అమరావతి



కూలుతున్నాయ్.. కళ్లు తెరవండి..!

విజయవాడ ప్రభుత్వాసుపత్రి అత్యవసర విభాగం బ్లాక్ భవనం శ్లాబులు పెచ్చులూడి పడుతున్నాయి. గోడలు వర్షాలకు చెమ్మగిల్లుతున్నాయి. ఇదే బ్లాకు రెండో అంతస్తులో పురుషుల మెడికల్ వార్డు వద్ద శ్లాబు పెచ్చులూడి ఇనుపచువ్వలు కనిపిస్తున్నాయి. అవి మీద పడక ముందే స్పందించి బాగుచేయాలని రోగులు కోరుతున్నారు.

-ఈనాడు, అమరావతి

ఎన్నాళ్లీ.. దరువు..!

★ కాంప్లెక్స్ ఎరువుల ధరల పెంపు
★ బస్తాకు రూ.100-250 భారం...

ఈనాడు, అమరావతి

ప్రకృతి వైపరీత్యాలు.. నీరందక ఇక్కట్లు.. పెరిగిన పెట్టుబడి.. తగ్గిన రాబడి.. వంటి అనేక కష్టాలు రైతన్న వెన్ను విరుస్తున్నాయి. గోరు చుట్టుపై రోకటి పోటులా ఈ ఏడాది పెరిగిన ఎరువుల ధరలు మరిన్ని ఆర్థిక ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. ఇప్పటికే సాగు భారమైన అన్నదాతకు ఈ పరిణామం మరింత తలపోటులా మారింది.

రూ.21 కోట్ల భారం... ఉమ్మడి జిల్లాలో 5.25 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేస్తారు.. ఇప్పటికే 50 శాతం పైగా నాట్లు పూర్తయ్యాయి. దీంతో ఎరువుల కొనుగోలు ప్రక్రియలో వేగం పెరిగింది. ప్రస్తుత వినియోగం ప్రకారం ఎకరానికి యూరియా కాకుండా మూడు విడతలుగా మూడు బస్తాల వరకు కాంప్లెక్స్ ఎరువులు వాడతారు. పెరిగిన ధరలను బట్టి ఎకరానికి రైతుకు రూ.300-400 భారం పడుతోంది. ఈ లెక్కన జిల్లాలో సాగు విస్తీర్ణం మేరకు రైతులపై రూ.21 కోట్ల అదనపు భారం పడుతోంది. ఒక్కో రైతుకు ఎకరానికి రూ.1,200 వరకు భారం పడుతోంది.

గత మూడేళ్లలో (50 కేజీల బస్తా రూ.లలో) కాంప్లెక్స్ ఎరువుల ధరల్లో పెరుగుదల..

ఎరువు రకం	2023	2024	2025	గతేడాది కంటే పెంపు
ఎంవోపీ	1,400	1,550	1,800	250
10–26–26	1,375	1,720	1,850	130
16–16–16	1,250	1,475	1,600	125
13–35–14	1,450	1,800	1,900	100
20–20–13	1,175	1,300	1,400	100



దిగుమతి వల్లే... కాంప్లెక్స్ ఎరువులు అన్నింటిలో పొటాష్, ఫాస్ఫరస్ వంటివి ఎక్కువగా ఉంటాయి. దేశీయంగా వీటి లభ్యత లేదు. దీంతో ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. వీటి ధరలు భారీగా పెరగడంతో అన్ని ఎరువులపై ఆ ప్రభావం పడింది. బస్తాకు రూ.100-250 వరకు పెరిగింది. యూరియాకు బస్తా తయారీకి రూ.1,614 ఖర్చు అవుతుండగా కేంద్రం రూ.1347.5 రాయితీ ఇవ్వడంతో రైతులకు రూ.266.5లకే వస్తోంది. దాదాపు 83.5 శాతం రాయితీ వస్తోంది. కాంప్లెక్స్ ఎరువుకు 25 శాతం మించి రాయితీ ఉండదు. దీంతో ఆ భారం రైతులు భరించాల్సిందే. కాంప్లెక్స్ ఎరువుల వినియోగం తగ్గించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నా ఆస్థాయిలో ప్రత్యామ్నాయ మార్గాలు లేక రైతులు వాటినే వాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రద్దీపై అస్త్రశస్త్రాలు..

ట్రాఫిక్ పోలీసుల వినూత్న చర్యలు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

బెంబేలెత్తించే బెజవాడ ట్రాఫిక్‌ను గాడిన పెట్టేందుకు విజయవాడ పోలీస్ యంత్రాంగం వినూత్న చర్యలు చేపట్టింది. ఇంటెలిజెన్స్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టంతో కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటోంది. మైకుల ద్వారా సూచనలు చేస్తూ క్రమబద్ధీకరిస్తున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే.. రద్దీపై నిఘా ఉంచేందుకు ‘అస్త్రం’ యాప్ రూపొందించారు.

ప్రత్యేకత ఏంటంటే... నగరంలోని ట్రాఫిక్ సమాచారం తెలుసుకునేందుకు ఈ యాప్‌ను రూపొందించారు. నగరంలో ఎక్కడైనా వాహనాలు నిలిచిపోతే దీనికి తక్షణం సమాచారం వస్తుంది. 300 మీటర్ల వరకు నిలిచిపోతే ‘మోడరేట్’, 300 నుంచి 500 మీటర్ల వరకు నిలిచిపోతే ‘హై’ అని, 500 మీటర్లు మేర ట్రాఫిక్ నిలిచిపోతే ‘సివియర్’ అని సందేశం వస్తుంది. వీటికి ఆయా ప్రాంతాల ట్రాఫిక్ సీఐలు తక్షణం స్పందిస్తారు. హుటాహుటిన అక్కడకు చేరుకుని ‘మోడరేట్’ ట్రాఫిక్‌ను ‘హై’ వరకు చేరకుండా చర్యలు తీసుకుంటారు.

నెల	నిలిచిన ట్రాఫిక్ (కి.మీ.లలో)
అక్టోబరు	3,468
నవంబరు	2,203
డిసెంబరు	2,741
జనవరి	2,294
ఫిబ్రవరి	1,906
మార్చి	1,969
ఏప్రిల్	2,546
మే	2,375
జూన్	1,002



‘అస్త్రం’ యాప్

సమాచార విశ్లేషణకు కమాండ్ కంట్రోల్.. అస్త్రం సమాచారాన్ని కమాండ్ కంట్రోల్ కేంద్రంలో విశ్లేషిస్తారు. దీని కోసం ‘వెర్టికల్ మేసేజ్ సిస్టం’ అందుబాటులోకి తెచ్చారు. ప్రతి 15 నిమిషాలకు ట్రాఫిక్ వివరాలు నమోదవుతూ ఉంటాయి. ఎక్కడైనా తరచూ వాహనాలు నిలిచిపోతుంటే కారణాలను అన్వేషిస్తారు. పరిష్కారం కనుగొంటారు. ఆగిపోయిన వాహనం, ధర్నా, ర్యాలీ తదితర విషయాలను నమోదు చేస్తారు. ట్రాఫిక్ క్లియర్ అయిన తర్వాత ఆ ఫొటో తీసి దాన్ని కూడా అప్‌లోడ్ చేస్తారు.

గణనీయంగా తగ్గిన జామ్‌లు: అస్త్రం యాప్ ద్వారా నిఘా ఉంచడంతో విజయవాడలో ట్రాఫిక్ జామ్‌లు గణనీయంగా తగ్గాయి. జనవరి నుంచి మార్చి వరకు తగ్గాయి. ఏప్రిల్, మే నెలల్లో విపరీతంగా పెరిగింది. ఏప్రిల్‌లో జాతీయస్థాయి పోటీ పరీక్షలు ఎక్కువగా ఉండడంతో వాహన రాకపోకలు పెరిగాయి. తద్వారా ఎక్కువగా నిలిచిపోయాయి. మే నెలలో అకాల వర్షాల కారణంగా పలు చోట్ల వర్షం నీరు నిలిచి జామ్ అయ్యింది.

ముందస్తు ప్రణాళిక: నగరంలోని కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్ల వివరాలను యాప్‌లో పొందుపరిచారు. ఏదైనా కార్యక్రమం జరుగుతుంటే.. ముందుగానే నిర్వాహకులు కార్యక్రమం వివరాలను అందులో నమోదు చేస్తారు. ఎన్ని వాహనాలు వస్తాయి? వీఐపీల వివరాలు ఇవన్నీ ఉంచుతారు. తద్వారా ట్రాఫిక్ పోలీసులు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ మళ్లింపులు వంటి జాగ్రత్తలు తీసుకుంటారు. ముందుగానే సమాచారం రావడంతో ట్రాఫిక్ జామ్‌లు గణనీయంగా తగ్గిపోయాయి.

స్వచ్ఛ విజయవాడలో భాగస్వాములు కావాలి

భవానీపురం, న్యూస్‌టుడే: స్వచ్ఛ విజయవాడలో నగర ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ, జిల్లా అధికారుల ఆధ్వర్యంలో భవానీపురంలోని హరిత బరంపార్కులో ఆదివారం సాయంత్రం సంప్రదాయ నృత్య పోటీలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నగరంలోని ఔత్సాహిక నృత్య కళాకారులు తమలోని ప్రతిభ చూపేందుకు ఇలాంటి వేదికలు దోహదం చేస్తాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు తరచూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. తద్వారా ప్రజల్లో అవగాహన పెరుగుతుందన్నారు. కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ. . నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించినట్లు తెలిపారు. ఐదు ఆదివారాల పాటు హరిత బరంపార్కు వేదికగా వివిధ కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తామని.. చివరి ఆదివారం బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని వెల్లడించారు. స్వచ్ఛ విజయవాడ సాధనే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్య పోటీలను తిలకించేందుకు నగర వాసులు ఆసక్తి చూపించారు. జేసీ ఎస్.ఇలక్కియా, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, పక్కన వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర


హాజరైన చిన్నారులు, నగర వాసులు

టెంకాయ కావాలన్నా రూ.70 ఇవ్వాల్సిందే..

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

గుంటూరు నగరానికి చెందిన రాంబాబు కుటుంబ సమేతంగా తిరుపతమ్మ ఆలయానికి వచ్చి కొబ్బరికాయ కావాలన్నారు. అప్పటికే కవర్‌లో పెట్టిన కొబ్బరికాయను చేతిలో పెట్టి రూ.70 అడిగారు. అంతెందుకని ప్రశ్నించగా 'పూజా సామగ్రి, జాకెట్ ముక్క పెట్టాం'.. అని సమాధానం. అవేమీ లేకుండా కొబ్బరి కాయ ఒక్కటే ఇవ్వండని రాంబాబు అడిగితే 'అలా కుదరదు.. అన్నీ కలిపి తీసుకోవాల్సిందే'నని చెప్పడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. పక్కనే కుటుంబ సభ్యులు ప్రశాంతంగా అమ్మవారి దర్శనానికి వెళ్తున్న సమయంలో గొడవెందుకని వారించి రెండు కొబ్బరికాయలకు రూ.140 ఇచ్చి వెళ్లారు.

.. ఇదీ గుంటూరుకు చెందిన ఒక్క రాంబాబు సమస్యే కాదు. నిత్యం ఆలయానికి వస్తున్న వేలాది మంది భక్తులు ఇలా అధిక ధరలతో దోపిడీకి గురవుతున్నారు. ఆలయం వద్ద జరుగుతున్న తంతు అధికారులకు తెలిసినా తెలియనట్లు వ్యవహరిస్తున్నారు.

దేవస్థానం నిర్ణయించిన ధరలు ఇవీ.. ఒక్కో టెంకాయ రూ.40, పూజా సామగ్రి అంటే అగర్‌బత్తీలు, గాజులు, పసుపు, కుంకుమతో కలిపి రూ.50కి విక్రయించాలి. ఒక్కో కాయ కనీసం 30 సెంటీ మీటర్ల వ్యాసార్థంతో ఉండాలి. భక్తులు విడిగా టెంకాయ అడిగితే కాయ రూ.40కు విక్రయించాలనేది దేవస్థానం నిబంధనల్లో స్పష్టంగా ఉన్నా అవేమీ అమలుకు నోచుకోవడం లేదు. టెంకాయ విక్రయాలకు వేలం పాట నిర్వహించినపుడే నిబంధనలు పొందుపర్చారు. ధరల పట్టికను ఆలయ ప్రాంగణంలోని ప్రతి దుకాణంలో ఏర్పాటు చేశారు. అదనంగా పలుచోట్ల బోర్డులు రాయించారు. అయినా భక్తులను బురిడీ కొట్టిస్తూ.. అదనపు ధరలు ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారు.



పూజా సామగ్రితో టెంకాయ

తిరుపతమ్మ ఆలయంలో భక్తుల నిలువు దోపిడీ



దేవస్థానం నిర్ణయించిన ధరల బోర్డులు

పూజా సామగ్రి రీసైక్లింగ్: టెంకాయతో పాటు భక్తులకు అంటగడుతున్న పూజా సామగ్రి పసుపు, కుంకుమ, ఊదిపుల్లలు, గాజులు, పూలు, జాకెట్‌ముక్క పూర్తిగా రీసైక్లింగ్ జరుగుతున్నాయి. భక్తులు టెంకాయతో ఆలయంలోకి ప్రవేశించగానే అంతరాలయం బయట ఉన్న సిబ్బంది వాటిని తీసుకొని పక్కనే ఉన్న సంచిలో వేసుకుంటారు. సంచి నిండగానే తీసుకొచ్చి దుకాణాలకు ఇస్తుంటారు.

నిర్దేశించిన ధరలకే విక్రయించాలి

- కిశోర్‌కుమార్, దేవస్థానం ఈవో

దేవస్థానం నిర్దేశించిన ధరలకే టెంకాయ విక్రయించాలి. అధికంగా తీసుకుంటే చర్యలు తీసుకుంటాం. భక్తులు టెంకాయ అడిగితే అంత వరకే ఇవ్వాలి. అదనంగా పూజా సామగ్రి అంటగట్టకూడదు. ఈ విషయంలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

జలదరించే... వేదన!



దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులు పాదరక్షలను ఘాట్‌రోడ్డులో లేదా కనకదుర్గానగర్ బయటో.. వాహనాల దగ్గరో విడిచి వస్తారు. అమ్మ దర్శనం అయ్యాక.. ఎండకు మలమల కాలుతున్న గచ్చుపై వెళ్తుంటే వీరి పాదాలు కందిపోతున్నాయి. మల్లికార్జునస్వామి దర్శనం తర్వాత కనకదుర్గానగర్‌లోకి వచ్చే భక్తులు కాళ్లు కాలిపోతుంటే.. చేసేదేమీ లేక అక్కడ జలప్రసాదం వైపు నుంచి వస్తున్న నీటితో కాళ్లు తడుపుకొని ఉపశమనం పొందుతున్నారు. ఇక కనకదుర్గానగర్ నుంచి రహదారిపైకి చేరుకునే మార్గంలో అభివృద్ధి పనులు జరుగుతుండగా.. అక్కడ ప్రవహించే నీటిచెమ్మపై వీలైనంత దూరం వెళ్లి ఆపై పరుగులు తీస్తున్నారు. దుర్గగుడికి వచ్చీ వెళ్లేది రెండే దారులు.. వీటి పరిధిలోనూ.. భక్తుల కాళ్లు కాలకుండా చర్యలు తీసుకోలేకపోతే ఎలా?



పిల్లల కాళ్లు కాలుతుంటే వారిని ఎత్తుకుని నడవలేక.. చూస్తూ ఉండలేక తల్లిదండ్రులు.. ఇదిగో ఇలా విలువైన జల ప్రసాదం నీటితో కాళ్లను కడుగుతున్నారు. **- ఈనాడు - అమరావతి**

ఉత్సాహంగా జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ మైదానంలో ఆదివారం నిర్వహించిన కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి మొత్తం 270 మంది అథ్లెట్లు హాజరయ్యారని కృష్ణా జిల్లా అథ్లెటిక్ సంఘం కార్యదర్శి బి.నాగలక్ష్మి తెలిపారు. అండర్-14, 16, 18, 20 బాలబాలికల విభాగాల్లో మొత్తం 42 ఈవెంట్లలో వేర్వేరుగా ఎంపిక పోటీలు నిర్వహించామని పేర్కొన్నారు. ఎంపిక పోటీలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన అథ్లెట్లను జిల్లా జట్టుకు ఎంపిక చేశామని వివరించారు. ఎంపికైన అథ్లెట్లు ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు చీరాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలో తలపడతారని ఆమె తెలిపారు.



ఎంపికైన అథ్లెట్లతో నాగలక్ష్మి తదితరులు



ఎంపీ కేశినేని శివనాథ్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

జగన్మాత సేవలో ఎంపీ శివనాథ్ కుటుంబం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని తొలుత కెనాల్ రోడ్డులోని వినాయకుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం దుర్గమ్మను దర్శించుకున్నారు. దేవస్థాన అధికారులు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఈవో శీనానాయక్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

సంచార జాతులు దేశ సంస్కృతికి ప్రతీకలు

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

పటమట, న్యూస్‌టుడే: సంచార జాతులు దేశ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని, బ్రిటిష్ వారితో స్వాతంత్ర్య సంగ్రామంలో అలుపెరగని పోరాటం చేసిన యోధులని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఆదివారం విజయవాడలోని ఓ హోటల్‌లో రాష్ట్రంలోని సంచార, అర్ధ సంచార, విముక్త జాతుల ముఖ్య నాయకులతో మాధవ్ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడిచినా.. . నేటికీ ఓటు హక్కు, కుల ధ్రువీకరణ పత్రం లేని అభాగ్యులు ఎంతోమంది ఉన్నారని పేర్కొన్నారు. సంచార జాతులు మన సంస్కృతి, సంప్రదాయాలను దేశ వ్యాప్తంగా ప్రచారం చేస్తున్న నిజమైన దేశభక్తులని కొనియాడారు. అప్పటి బ్రిటిష్ పాలకులు సంచార జాతుల్ని దొంగలుగా, దోపిడీదారులుగా ముద్ర వేసి జైలుపాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 1400, రాష్ట్రంలో 64 తెగలు సంచార జాతులుగా ఉన్నట్లు తెలిపారు. మొదటిసారి వాజ్‌పేయీ ప్రధానిగా ఉన్నప్పుడు సంచార జాతుల జనాభా లెక్కలు మొదలు పెట్టారని గుర్తు చేశారు. సంచార జాతుల సంక్షేమం, ఉన్నతికి ప్రధాని మోదీ ప్రభుత్వం డీఎన్‌టీ కమిషన్ ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఎస్ఈఈడీ పథకం ఏర్పాటు చేసి రూ.200 కోట్లు కేటాయించిందని తెలిపారు. సంచార జాతులకు స్థిర నివాసం, విద్యావకాశాలు, కళలకు గుర్తింపు ఇవ్వాలనే లక్ష్యంలో ఈ నెల 30న 75వ సంచార జాతులు విముక్తి దినోత్సవాన్ని భాజపా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం విముక్తి దినోత్సవ గోడప్రతులు ఆవిష్కరించారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివనారాయణ, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రరావు, సంచార జాతుల విముక్తి కార్యక్రమ ఛైర్మన్ దాసరి శ్రీనివాసులు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాసులు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, దాసరి శ్రీనివాసులు తదితరులు

కృష్ణా ప్రవాహం తగ్గుముఖం

సముద్రంలోకి 94,625 క్యూసెక్కులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నది దిగువన ప్రకాశం బ్యారేజీ వద్ద ఆదివారం వరద ప్రవాహం క్రమేపీ తగ్గింది. ఉదయం 6 గంటలకు ఎగువ నుంచి 1,56,479 క్యూసెక్కులు రాగా, బ్యారేజీ వద్ద 60 గేట్లను మూడు అడుగులు, మిగతా 10 గేట్లను రెండు అడుగుల మేర ఎత్తారు. సముద్రంలోకి 1,38,500 క్యూసెక్కులు విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు ఎగువ నుంచి 1,22,729 క్యూసెక్కులు రాగా, 10 గేట్లను మూడు అడుగులు, మిగతా 60 గేట్లను రెండు అడుగులు ఎత్తారు. సముద్రంలోకి 1,04,750 క్యూసెక్కులను విడుదల చేశారు. సాయంత్రం 6 గంటలకు మరింత తగ్గింది. ఎగువ నుంచి 1,12,604 క్యూసెక్కులు రాగా, 65 గేట్లను రెండు అడుగులు, మిగతా 5 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 94,625 క్యూసెక్కులు విడుదల చేశారు.

కాలువలకు 17,979 క్యూసెక్కులు

కృష్ణా డెల్టా పరిధిలోని పంట కాలువలకు 17,979 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 10,271, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 7,508, గుంటూరు ఛానల్‌కు 200 క్యూసెక్కుల చొప్పున ఇచ్చారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్ కాలువకు 5,017, బందరు 1,911, కేఈబీ 1,832, ఏలూరు కాలువకు 1,511 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు.

బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

విద్యాధరపురం: విజయవాడ బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తోందని గౌరవాధ్యక్షులు జవ్వాది సూర్యనారాయణ (రుద్రయ్య) అన్నారు. విజయవాడ బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక నగరంలోని ఓ హోటల్లో ఆదివారం నిర్వహించారు. 15 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పూర్వ కమిటీ తీసుకున్న నిర్ణయాలు, ప్రధాన కార్యదర్శి నివేదికను సభ్యులు ఆమోదించారు. గౌరవాధ్యక్షులు రుద్రయ్య మాట్లాడుతూ.. పూర్వ కమిటీలు ఏడు దశాబ్దాలుగా విద్యార్థులకు ఉపకార వేతనాలు, విపత్తులు సంభవించినప్పుడు, వరదల సమయంలో సేవలు అందించాయని గుర్తుచేశారు. సంఘ అధ్యక్షుడిగా కోనా శ్రీహరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా పి.రామారావు, ప్రధాన కార్యదర్శిగా కేఎస్ఆర్ నాయుడు, కోశాధికారిగా రామనాథం కృష్ణబాబు, సహాయ కార్యదర్శిగా మిరియాల దూండేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా ఎం.ఆనంద్ కుమార్, కిషోర్ గెల్లా, ఎస్కే నాగూర్, వై చలంబాబు, ఎం.సూర్యనారాయణ, అనిల్‌కుమార్, కె.ఉమాశంకర్, సీహెచ్ శ్రీనివాసరావు, వి.కేశవరావు, కె.ఉమాశంకర్, పి.సాంబశివరావు ఎన్నికయ్యారు. వారితో సంఘ ఎన్నికల పర్యవేక్షకులు, గౌరవాధ్యక్షులు రుద్రయ్య ప్రమాణస్వీకారం చేయించారు.



నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయిస్తున్న అసోసియేషన్ గౌరవాధ్యక్షులు సూర్యనారాయణ

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు జిల్లా జట్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగర శివారు కండ్రికలోని ఏఆర్ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ సొసైటీలో ఆదివారం జరిగిన కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సబ్ జూనియర్ బాలబాలికల జూడో జట్ల ఎంపిక పోటీలో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేశామని కృష్ణా జిల్లా జూడో సంఘం కార్యదర్శి ఎంఎల్ ఉషారాణి తెలిపారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు సంబంధించి మొత్తం 36 మంది బాలబాలికలు ఎంపికయ్యారని పేర్కొన్నారు. వారంతా ఈ నెల 9, 10వ తేదీల్లో మంగళగిరి సమీపంలోని పెదపరిమిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడుతారని ఆమె తెలిపారు.

ప్రైవేటు భాగస్వామ్యంతో రహదారుల అభివృద్ధి

- నగరంలో 19 మార్గాల గుర్తింపు
- ప్రాథమిక వ్యయం రూ.32 కోట్లు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

నగరంలోని కొన్ని రహదారులను ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసి, నిర్వహించేందుకు నగర పాలక సంస్థ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గుర్తించిన 19 మార్గాలను పబ్లిక్ ప్రైవేటు సంస్థకు అప్పగిస్తారు. వాటి అభివృద్ధి, నిర్వహణకు వెచ్చించిన వ్యయాన్ని దశల వారీగా నగరపాలక సంస్థ గుత్తేదారు సంస్థకు చెల్లిస్తుంది. అందుకు ప్రాథమికంగా రూ.32 కోట్లు అవుతుందని లెక్కించారు.

● నగరంలో 1200 కి.మీ. మేర ప్రధాన, అంతర్గత రహదారులుంటే.. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన 23.54 కి.మీ. పొడవైన 19 రహదార్లను మాత్రం ప్రైవేటు - పబ్లిక్ - భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిన గుత్తేదారు సంస్థకు అప్పగించి అభివృద్ధి చేస్తారు.



రూపుమారనున్న జీఎస్ రాజు రోడ్డు

● ఎంపికైన గుత్తేదారు సంస్థ బిడ్ విలువపై 40 శాతం సొమ్ము రూ.32 కోట్లను 12 నెలల్లో నాలుగు సార్లు చెల్లిస్తారు. మిగిలిన 60 శాతం సొమ్మును పదేళ్లలో అందజేస్తారు. గుత్తేదారు సంస్థ చేపట్టే పనులు, నిర్వహణ తీరు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని అప్పటి ఎస్ఎస్ఆర్ ధరల ఆధారంగా ఏటా రూ.10-12 కోట్లు చొప్పున చెల్లిస్తారు.

ఆ రోడ్లు ఇవే..: ● బీఆర్‌పీ రోడ్డు ● నెహ్రూ రోడ్డు ● కేటీ రోడ్డు ● కుమ్మరిపాలెం రోడ్డు ● సితార సెంటర్ - సీవీఆర్ ఫ్లైఓవర్ రోడ్డు ● బీఆర్‌టీఎస్ రోడ్డు ● సాంబమూర్తి రోడ్డు ● గాంధీనగర్ ఎమ్మార్వో ఆఫీసు రోడ్డు ● జీఎస్ రాజు రోడ్డు ● మీసాల రాజేశ్వరరావు బ్రిడ్జి రోడ్డు ● హైస్కూల్ రోడ్డు ● గురునానక్ కాలనీ మెయిన్ రోడ్డు ● పోలీస్ కంట్రోల్ రోడ్డు ● టిక్కిల్ రోడ్డు ● సిద్ధార్థ పబ్లిక్ స్కూలు రోడ్డు ● ఏఎస్ రామారావు రోడ్డు ● మదర్‌థెరిసా కూడలి - అమ్మ కల్యాణ మండపం రోడ్డు ● పీవీపీ మాల్ రోడ్డు ● దేవస్ ఉన్నతి రోడ్డు

ఏం పనులు చేస్తారంటే...: ● తారు వేయడం ● ఫుట్‌పాత్‌ల నిర్మాణం ● సెంట్రల్ మీడియన్ అభివృద్ధి ● నూతన డ్రెయిన్ల నిర్మాణం ● వీధి దీపాల అమరిక ● వ్యర్థాల తొలగింపు ● సీసీ కెమెరాల ఏర్పాటు ● స్ట్రీట్ ఫర్నీచర్ ● పార్కింగ్, వ్యాపార ప్రాంతం ● కూడళ్ల అభివృద్ధి

చెదిరిన చిరుమోము..

కేశ్యాతండా, చీమలపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: అప్పటిదాకా నాన్నతో ఆడి పాడాడు.. అంగడికి వెళ్తున్న తండ్రితో అది కావాలి.. ఇది కొనివ్వాలి అని మారాం చేశాడు.. అంతలోనే మృత్యువు కబళించింది.. ఆ చిన్నారి చిరునవ్వును చిదిమేసింది... మండలంలోని చీమలపాడు వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో కేశ్యా తండాకు చెందిన బాలుడు యశ్వంత్(6) దుర్మరణం చెందాడు. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. కేశ్యా తండాకు చెందిన బాణావత్ నంద్యానాయక్ తన కుమారుడు యశ్వంత్‌ను తీసుకుని ఆదివారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై చీమలపాడులో సరుకులు కొనుగోలుకు వచ్చాడు. తండ్రి దుకాణంలో సరుకులు కొంటున్న సమయంలో బాలుడు రోడ్డుపైకి రాగా.. అదే సమయంలో తిరువూరు నుంచి విజయవాడ వెళుతున్న కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన బాలుడిని మైలవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ఐక్య ఉద్యమం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్రంలో ప్రభుత్వ స్థలాలను పరిరక్షించుకునేందుకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. విజయవాడలో ఆర్టీసీ స్థలాన్ని లులు సంస్థకు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈ నెల 6వ తేదీ పౌరవేదిక ఆధ్వర్యంలో తలపెట్టిన మహాధర్నాకు ఆయన మద్దతు ప్రకటించారు. సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో ఆదివారం దాసరి భవన్‌లో నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దాదాపు రూ.400 కోట్ల విలువైన 4.15 ఎకరాల పాత బస్టాండు స్థలంతో పాటు విశాఖపట్నంలో 13.7 ఎకరాల ప్రభుత్వ భూములను కార్పొరేట్లకు కారుచౌకగా 99 సంవత్సరాలకు లీజుకు ఇవ్వడం దుర్మార్గమన్నారు. జీవో 137ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వానికి భూదాహం పట్టుకుందని, అమరావతిలో మరోసారి భూసమీకరణకు సిద్ధమైందని దుయ్యబట్టారు. ప్రభుత్వ భూములను ప్రైవేటుకు కట్టబెట్టడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మాజీ మేయర్ జంధ్యాల శంకర్ మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పును ఉల్లంఘిస్తూ.. కార్పొరేట్లకు ప్రోత్సాహాల పేరుతో యథేచ్ఛగా ప్రభుత్వ భూములను కట్టబెట్టడం దారుణమన్నారు. ఆర్టీసీ స్థలాన్ని లులు సంస్థకు అప్పగించడాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనెపూడి కాశీనాథ్ మాట్లాడుతూ.. లులు లాంటి వ్యాపార సంస్థల వల్ల చిరు వ్యాపారాలు దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, సీపీఐ న్యూడెమోక్రసీ నాయకుడు పి.ప్రసాద్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి దోనెపూడి శంకర్, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు జి.వి.నరసయ్య, ఎం.డి.ప్రసాద్, వై.ఎస్.రావు, కె.ఆర్.ఆంజనేయులు, లంక దుర్గారావు, నక్క వీరభద్రరావు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ. చిత్రంలో శంకర్, కాశీనాథ్, ప్రసాద్, విష్ణు, నరసింహారావు తదితరులు

'రాష్ట్రంలో భూపందేరాన్ని అడ్డుకుందాం'

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : ప్రభుత్వం అభివృద్ధి పేరుతో భూములను బలవంతంగా సేకరించి ఇష్టారాజ్యంగా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం గవర్నర్‌పేటలోని కేఎల్ రావుభవన్‌లో రైతు నాయకులు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ఆధ్వర్యంలో 'అభివృద్ధి సాకుతో భూపందేరం' అంశంపై సదస్సు నిర్వహించారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. భూములు లాక్కోవడాన్ని నిరోధించేందుకు 2013లో భూసేకరణ చట్టం తెచ్చారని, అందులో కీలకమైన అంశాలను తొలగించి చట్టాన్ని నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. బలవంతపు భూసేకరణ సామాజిక సమస్యగా మారిందన్నారు. భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడలో పాత బస్టాండ్ స్థలాన్ని లులు సంస్థకు ఇస్తున్నారని.. ఎవరిని అడిగి దీన్ని ఇస్తున్నారని ప్రశ్నించారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో అభివృద్ధి, పరిశ్రమలు, సెజ్, సోలార్ ప్లాంట్ల పేరుతో లక్షలాది ఎకరాలు తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ జులుం ప్రదర్శించి రైతుల నుంచి లాక్కుంటున్న వైనం చూస్తే.. రక్తం సలసలా కాగుతోందన్నారు. కరేడులో ఉలవపాడు మామిడితోటలు 800 ఎకరాలు ఉన్నాయని, దట్టమైన చెట్లున్న భూమిని డీమ్డ్ ఫారెస్టు అంటారని వివరించారు. అక్కడ పరిశ్రమలు పెట్టకూడదని చట్టంలో ఉందని, అయినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'అభివృద్ధి పేరుతో పంట పొలాలను లాక్కోవద్దు. వృథాగా పడి ఉన్న భూముల్లోనే పరిశ్రమలు పెట్టాలి. 5 సంవత్సరాల్లో పరిశ్రమలు పెట్టకపోతే రైతుకు భూములను వాపసు చేయాలని' తీర్మానించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ రఘురాజు, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సభ్యుడు లక్ష్మణరెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్, వి.వి.ఎస్.మహదేవ్, రైతు నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, వై.కేశవరావు, ప్రభాకర్‌రెడ్డి, అక్కినేని భవానీప్రసాద్, ఆంజనేయులు, జమలయ్య, వేదవతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్. వేదికపై లక్ష్మణరెడ్డి, మహదేవ్, రఘురాజు, శోభనాద్రీశ్వరరావు తదితరులు

చెప్పేది.. చేసేది ఒక్కడే

పోలీసులతో మాటలు.. చాటుగా చోరీలు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: విలాసవంతమైన జీవితానికి అలవాటు ఖర్చులకు డబ్బుకోసం దొంగగా మారిన ఓ యువకుడు పోలీసుల చేతికి చిక్కాడు. సేకరించిన సమాచారం మేరకు.. కొండపల్లి శివారుకు చెందిన ఓ యువకుడు గతంలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. పరువు కలిగిన కుటుంబంలో జీవిస్తున్న అతడికి కొందరు స్నేహితులు కలిశారు. నిత్యం ఏదొకచోటుకు సరదాగా వెళ్లడం..తిరగడం వారికి అలవాటుగా మారింది. ఈ క్రమంలోనే ఆ శివారు ప్రాంతంలో గతేడాది ఓ దొంగతనం జరిగింది. దీనిపై బాధితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే ఆ విషయంలో విషయంలో పోలీసులు చొరవ చూపకపోవడంతో అది పరిష్కారం కాలేదు. ఇదిలా ఉంటే జరిగిన దొంగతనం గురించి సదరు యువకుడు పోలీసులతో ప్రస్తావిస్తూ వారితో పరిచయం పెంచుకున్నాడు. కానిస్టేబుళ్లు, ఎస్సైలతో సహా అందరితో సరదాగా మాట్లాడేవాడు. ఇదే క్రమంలో తన స్నేహితులతో కలసి ఓ సమయం చూసుకుని దొంగతనాలు చేయడం ప్రారంభించి..తాము ఉండే ప్రాంతంలోనే రాత్రి సమయాల్లో చోరీలు చేయసాగారు. ఆ దొంగతనాల విషయమై పోలీసులతో చర్చించి తన స్నేహితులను అప్రమత్తం చేసేవాడు. ఇలా జరుగుతున్న చోరీల పరంపరలో ఓ రోజు దొంగతనానికి వెళ్లగా అక్కడే ఉన్న సీసీ కెమెరాను చూసి అది పని చేయడం లేదని నిర్ధారించుకొని వెళ్లిపోయాడు. అయితే పోలీసులు ఆ దృశ్యాన్ని పరిశీలించడంతో యువకుడు స్పష్టంగా కనిపించాడు. ఇంకేముంది వారం దరిసీ అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో క్రైమ్ బ్రాంచి పోలీసులు విజయవాడ కార్యాలయంలో విచారిస్తున్నారు. ప్రస్తుతం కొంత బంగారం, నగదుకు సంబంధించి వివరాలు తెలిపినట్లు సమాచారం.

బ్రాయిలర్ ధరలు (కిలో1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -99 రిటైల్ ధర 121 చికెన్ విత్ స్కిన్ - 175, చికెన్ స్కిన్‌లెస్ - 200.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 105, 113, 124 చికెన్ విత్ స్కిన్ - 200 చికెన్ స్కిన్‌లెస్ - 210.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 475 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

పోలంపల్లి డ్యాంలో తాత్కాలిక మరమ్మతులకు అనుమతించండి

పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పోలంపల్లి డ్యాంలో నీటి నిల్వ కోసం ఏర్పాటు చేసిన ఇసుక కట్టలకు తాత్కాలిక మరమ్మతులు చేసుకునేందుకు అనుమతించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య కోరారు. ఖమ్మం జిల్లా ముదిగొండలో భట్టి విక్రమార్కను ఆదివారం మునేరు ఆయకట్టు రైతులతో కలిసి సమస్యను వివరించారు. గత వారం వచ్చిన స్వల్ప వరదకు ఇసుక కట్టలు కోతకు గురికావడంతో డ్యాంలో నీటి నిల్వ లేక ఆయకట్టుకు సాగునీరందడంలేదని, 20 వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. మరమ్మతులకు అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కోరారు. పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని భట్టి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పొన్నం బాలాజీ, కొటారు సత్యనారాయణ ప్రసాద్, తోట నాగమల్లేశ్వరరావు, యార్లగడ్డ విశ్వనాథం, చిట్లూరి మౌలేశ్వరరావు, గురుప్రసాద్, వెంకటేశ్వరరావు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

? ఆత్కూరు గ్రామంలో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారిని కుక్కలు వెంటపడి ప్రమాదాలకు గురి చేస్తున్నాయి. తక్షణమే చర్యలు చేపట్టాలి. -రవి, గ్రామస్థుడు

✓ సమస్య తెలిసింది. సిబ్బందిని పంపి కుక్కలను రహదారులపై లేకుండా చర్యలు చేపడతాం. -శ్యామ్, పంచాయతీ కార్యదర్శి -న్యూస్‌టుడే, జి.కొండూరు

? ఇబ్రహీంపట్నం బాజీమాన్యం ప్రధాన కాలువ చెత్తతో నిండిపోయింది. కొన్ని రోజుల నుంచి పారిశుద్ధ్య సిబ్బంది అక్కడ పనులు నిర్వహించడం లేదు. దీంతో దుర్వాసన వస్తోంది. -హరికుమార్, ఇబ్రహీంపట్నం

✓ పారిశుద్ధ్య సిబ్బంది నిత్యం పనులు చేస్తూనే ఉన్నారు. ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి అక్కడి కాలువలో జేసీబీతో చెత్తను తొలగిస్తాం. -మధు, పారిశుద్ధ్య మేస్త్రి -న్యూస్‌టుడే, కొండపల్లి

? రెడ్డిగూడెం పంచాయతీ పరిధిలోని 1 వార్డులో సీసీ రహదారులపై వర్షం నీరు నిలిచి బురదమయంగా మారుతుండడంతో ఇబ్బందులు పడుతున్నాం. - సత్యనారాయణ, స్థానికుడు

✓ పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. -ఎన్.రామారావు, పంచాయతీ కార్యదర్శి -న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

? పట్టణంలోని బస్టాండ్ ప్రాంతం, రాజుపేట, లంబాడి తండాలోని పలు వీధుల్లో డ్రైనేజీ కాల్వలు సరిగా లేక మురుగు నీరు పల్లంలో ఉన్న నివాసాల్లోకి వెళ్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి. -కె.శేషగిరిరావు, తిరువూరు

✓ పట్టణంలోని డ్రెయినేజీ కాల్వలు ఎప్పటికప్పుడు బాగుచేస్తున్నాం. సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. -కె.మనోజ, పురపాలిక కమిషనర్.



★ పట్టణంలోని లయోలా స్కూల్ వీధిలో రహదారిపై చెత్త ఉందని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగా..కు చేసిన ఫిర్యాదును పురపాలిక కమిషనర్ కె.మనోజ దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి పురపాలిక సిబ్బందితో రహదారిపై చెత్త లేకుండా శుభ్రం చేయించారు. ★ పట్టణంలోని సుందరయ్య కాలనీ రోడ్లలో పిచ్చి మొక్కలు పెరిగాయని స్థానికులు చేసిన ఫిర్యాదును కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి పురపాలిక కార్మికులతో పిచ్చి మొక్కలను తొలగింపజేశారు. న్యూస్‌టుడే, తిరువూరు

స్పందనకు వందనం

'మా దందాకు అడ్డొస్తే వాహనాలతో తొక్కిస్తాం'

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: రేషన్ మాఫియా బరితెగిస్తోంది. తమ వ్యాపారానికి అడ్డు వచ్చే వారు ఎవరైనా సరే వాహనాల కింద తొక్కిస్తామంటూ దూకుడుగా ఉన్నారు. ఇబ్రహీంపట్నంలో ఆదివారం తెల్లవారుజామున ఇలాంటి ఓ సంఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి సేకరించిన, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. చౌక దుకాణం వ్యాపారం చేసే ఓ వ్యక్తి రేషన్ బియ్యాన్ని తరలించేందుకు ఆటోలో లోడ్ చేశారు. ఈ సమాచారం అందుకున్న బీట్ కానిస్టేబుల్ ఒకరు అక్కడకు చేరుకుని ఆ ఆటోని ఆపారు. అయితే తమను ఆపితే ఈ లోకంలో ఉండవని బెదిరించి ఆటోతో పాటు ఓ కారులో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ విషయాన్ని కానిస్టేబుల్...ఎస్సై వజీరుద్దీన్‌కు తెలియజేశారు. రాత్రి రౌండ్స్‌లో ఉన్న ఎస్సై వెంటనే కారు, ఆటో వెళ్లిన వైపు తన జీపులో వెళ్లగా ఆటో కనిపించకపోవడంతో కారుతో పాటు అందులో ఉన్న వారిని స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు.

రోగులకు ఉచిత వైద్య సేవలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని అంబారుపేట సత్యమ్మతల్లి దేవాలయ ఆవరణలో నందిగామ సంజీవని ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు ప్రారంభించారు. డాక్టర్ బొగ్గవరపు దివ్య రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తెదేపా నాయకులు చుండు వాసు, మంచాల మాధవ్, కామసాని మణికంఠ, చుండు సాయి, దేవాదాయశాఖ ఉద్యోగి బి.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు బోనాలు


తీసుకెళుతున్న భక్తులు

కొమ్మిరెడ్డిపల్లి(గంపలగూడెం): మండలంలోని కొమ్మిరెడ్డిపల్లి శివారు గొల్లగూడెంలో శ్రావణ మాసం సందర్భంగా గ్రామదేవత ముత్యాలమ్మ తల్లికి మహిళలు ఆదివారం బోనాలు సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు, పూలు, పండ్లు, చీరెలు, జాకెట్లు, పిండివంటలతో ప్రదర్శనగా వెళ్లి పూజలు నిర్వహించారు.

నేటి నుంచి నెమలి కృష్ణాలయంలో పవిత్రోత్సవాలు


నెమలి వేణుగోపాల స్వామి

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధ గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం నుంచి గురువారం వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ ఎస్.సంధ్య, పాలకవర్గ అధ్యక్షురాలు కె.శశిరేఖ తెలిపారు. 4న సాయంత్రం అఖండ దీపారాధన, అంకురార్పణ, పవిత్రశుద్ధితో వేడుకలకు శ్రీకారం చుడతారు. 5న అగ్నిప్రతిష్ఠాపన పవిత్రమాలలకు శయనాధివాసం నిర్వహిస్తారు. 6న ఉదయం స్వామికి పవిత్రాలతో అలంకరణ, ద్వాదశక్షరీ మహాయజ్ఞం, సాయంత్రం రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలుని శాంతికల్యాణం, మహామంత్ర సహిత పౌణ్డరీక మహాశాంతి హోమం జరిపిస్తారు. 7న ప్రధానహోమం, పూర్ణాహుతి, యజమానులకు పవిత్రాల బహూకరణతో వేడుకలు ముగుస్తాయి. ఆలయ ప్రధానార్చకులు తిరునఘరి గోపాలాచార్యుల ఆధ్వర్యంలోని రుత్విక బృందం వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. 16న ఆలయంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహిస్తారు. శ్రావణమాసం సందర్భంగా 22న ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతం జరుగుతుంది.

వేడుకున్నా ఆపరు.. వేదనన్నా చూడరు

బస్సుల కోసం విద్యార్థుల అగచాట్లు

ఇబ్రహీంపట్నం ప్రాంతం నుంచి డిగ్రీ కళాశాలకు వచ్చేవారు వీరే



మైలవరం, న్యూస్‌టుడే

సాయంత్రం 6.30 గంటల సమయం. పదుల సంఖ్యలో రహదారి పక్కన బస్సు కోసం వేచిచూస్తున్నారు. అంతలోనే బస్సు రావడం, వారిని పట్టించుకోకుండా ముందుకు కదలడం జరిగిపోయింది. అది గమనించిన ఒక వ్యక్తి, వెంటనే తన ద్విచక్ర వాహన సాయంతో బస్సు వెంట పడి ఆపగలిగారు. దీంతో బతుకుజీవుడా అంటూ అక్కడున్న వారంతా బస్సెక్కారు. ఇదంతా సినిమా కథ కాదు. మైలవరంలో కళాశాలలకు చదువుకోవడానికి వస్తున్న విద్యార్థులు పడుతున్న అవస్థలకు ప్రత్యక్ష ఉదాహరణ. రహదారి పక్కన వేచి చూసిన వారంతా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులైతే బైకుపై వెంబడించి బస్సు ఆపిందీ సాక్షాత్తు ఆ కళాశాలలో ఓ అధ్యాపకుడు. ఆర్టీసీ తీరుతో విసిగి వేసారిన విద్యార్థులు అధ్యాపకులకు మొరపెట్టుకోవడంతో, వారం రోజుల కిందట జరిగిన సంఘటన ఇది. పల్లెవెలుగు బస్సుల్లోనూ వారికి ఎదురవుతున్న ఇబ్బందులవి.

స్తోమతకు మించి : నియోజకవర్గంలో ఏకైక ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు మైలవరంలోనే ఉన్నాయి. వందల సంఖ్యలో పేద విద్యార్థులు ఆయా కళాశాలలకు ఇబ్రహీంపట్నం, ఎ.కొండూరు వైపు నుంచి నిత్యం వస్తున్నారు. వారందరికీ పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణానికి ఆర్టీసీ రవాణా సౌకర్యం కల్పిస్తున్నా, సరిపడా బస్సులు లేక నిత్యం తిప్పలు పడుతూనే ఉన్నారు. ఆ మార్గంలో తిరిగే ఆర్డినరీ బస్సుల్లో ఎక్కించుకోవాలని పదే పదే విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు చేస్తున్న విజ్ఞప్తులను ఆర్టీసీ అధికారులు బుట్టదాఖలు చేస్తున్నారు. అన్ని బస్సుల్లో ఎక్కాలంటే కృష్ణవేణి పాసులు తీసుకోవాలని సెలవిస్తున్నారు. కానీ మైలవరం నుంచి విజయవాడ వరకు ఛార్జీ చెల్లిస్తేనే ఆయా పాసులను మంజూరు చేస్తున్నారు. అది పేద విద్యార్థులకు పెనుభారంగా మారుతోంది. కొద్ది మొత్తంతో వచ్చే పాసులకు బదులు రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి రావడం వారి స్తోమతను మించుతోంది.



రోజూ ఇబ్బందులే: ప్రతి రోజు బస్సుల కోసం ఇబ్బంది పడుతున్నాం. కళాశాల వద్ద ఒక్కోసారి ఆగకుండా వెళ్తుంటే, అడ్డుపడినా ఆపడంలేదు. బస్టాండ్‌కు వెళ్లి వెనక్కి వద్దామంటే అక్కడి వరకు టికెట్ తీసుకోవాలంటున్నారు. బస్సులు పెంచితే బాగుంటుంది. - కె.భువనేశ్వరి, విద్యార్థిని



కృష్ణవేణి పాస్ సాధ్యం కాదు: ఎక్కువ మొత్తం చెల్లించి కృష్ణవేణి పాసులు తీసుకోవడం మాకు ఇబ్బంది. సకాలంలో పల్లెవెలుగు బస్సులైనా నడపాలి. ఇతర ఆర్డినరీ బస్సుల్లో ఎక్కే అవకాశం ఇవ్వాలి. - జయంత్, విద్యార్థి

ఆధ్యాత్మిక సేవా పురస్కారానికి ఎంపిక


దీప్తిని అభినందించిన మహిళలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శ్రీరామ భజన మందిరం, గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయాల్లో కొన్నేళ్లుగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న గ్రామానికి చెందని కొల్లా దీప్తి 'ఆధ్యాత్మిక సేవా పురస్కార్'కు ఎంపికయ్యారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఈ నెల 10వ తేదీన 'హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్' నిర్వాహకులు ఆమెకు పురస్కారం ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా దీప్తిని పలువురు మహిళల అభినందించారు.

రైతులకు విశేష సేవలు అందించాలి


ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే వసంత, మార్కెట్ యార్డ్ నూతన పాలక వర్గ సభ్యులు


రెడ్డిగూడెం నుంచి ద్విచక్రవాహనాలపై ప్రదర్శనగా వెళ్తున్న శ్రేణులు

మైలవరం, రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ లక్ష్యాల మేరకు రైతులకు విశేష సేవలు అందించాలని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ వ్యవసాయ నూతన కమిటీ పాలక వర్గానికి సూచించారు. ఆదివారం మైలవరంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నూతన పాలక వర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే వసంత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా ఎంపీ పుట్టిన రోజుని పురస్కరించుకుని అభిమానుల కోలాహలం మధ్య ఆయన కేకు కోశారు. మండలంలోని బొర్రగూడెంలో శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయం నుంచి భారీ ర్యాలీగా మైలవరం బయలుదేరారు. పట్టణంలోని ప్రధాన కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పొత్తులో భాగంగా ఏఎంసీ ఛైర్మన్ పదవిని జనసేన పార్టీకి కేటాయించినట్లు పేర్కొన్నారు. రైతుల కోసం కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో అక్కల రామ్మోహనరావు, నూతులపాటి బాల కోటేశ్వరరావు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు. ★ వ్యవసాయ కమిటీ ఛైర్మన్‌గా పొనకళ్ల నవ్యశ్రీ(జనసేన), వైస్‌ఛైర్మన్‌గా చేబ్రోలు రాజు, పాలక వర్గ సభ్యులుగా బానోతు చిన్ని, మల్లాది పోతురాజు, పిన్నిబోయిన సుబ్బారావు, టి.ఉష, మరీదు పుష్పవతి, జవ్వాది నాగేశ్వరరావు, వేమిరెడ్డి పెద్ద సత్యనారాయణరెడ్డి, జి.అనిత, షేక్.నసీమ, గరిమెళ్ల పావని, పి.వెంకటేశ్వరరావు, ఎ.లక్ష్మీతులసి, కొండపల్లి మణికంఠలు ప్రమాణ స్వీకారం చేశారు.

ఘనంగా ఎంపీ చిన్ని పుట్టినరోజు వేడుకలు


తిరువూరులో ఎంపీ చిన్ని పుట్టిన రోజు వేడుకలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తెదేపా నాయకులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో తెదేపా నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని పుట్టిన రోజు వేడుకలు ఆదివారం నిర్వహించారు. తిరువూరులో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, నాయకులు టి.రామారావు, ఎస్‌కే.అబ్దుల్‌హుస్సేన్, వి.మునియ్య, డి.వెంకటేశ్వరరావు, గంపలగూడెంలో ఏఎంసీ అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీఅనిత, నాయకులు కె.రవికుమార్, ఆర్.వీరారెడ్డి, కె.సత్యంబాబు, సర్పంచి కె.పుల్లమ్మ, విస్సన్నపేటలో ఆర్.సుబ్బారావు, కె.నాగేశ్వరరావు, ఎం.వేణుగోపాల్, ఎ.కొండూరులో బి.పీక్లానాయక్, జి.రామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో కేకులు కోసి మిఠాయిలు పంచారు.


విస్సన్నపేటలో కేకు కోస్తున్న తెదేపా నాయకులు

పనులు నిదానం..ప్రయాణించలేం


గడ్డమణుగు శివారులో తటాకాన్ని తలపిస్తున్న ఆర్అండ్‌బీ రహదారి

కందులపాడు గంగినేని ఎర్రుపాలెం (కేజీవై) ఆర్అండ్‌బీ రహదారిపై గడ్డమణుగు శివారులో మోకాలిలోతు గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం అటువైపుగా ప్రయాణించే విద్యార్థులు, పొలాలకు వెళ్లే రైతులు, చెరువుమాధవరం రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. దాదాపు 6 నెలల కిందట ఈ రహదారి అభివృద్ధి పనులు ప్రారంభించినా అవి కాస్త నత్తనడకన సాగడంతో అవస్థలు పడుతున్నామని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రహదారి అభివృద్ధి పనులపై దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, జి.కొండూరు

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం


కట్టుబడిపాలెంలో రెయిలింగ్‌లో ఇరుక్కుపోయిన కారు

జాతీయ రహదారి-30పై కారు, టిప్పర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆదివారం ఉదయం జరిగింది. సేకరించిన సమాచారం మేరకు మైలవరానికి చెంది పాస్టర్ విక్టర్‌బాబు తన కుమార్తె రవిశీరిషాను పరీక్ష రాయించేందుకు విజయవాడ కారులో బయలుదేరారు. కారు కట్టుబడిపాలెం చేరుకునేసరికి వెనుక నుంచి వస్తున్న టిప్పర్ వేగంతో ఓవర్‌టేక్ చేయబోయి కారును ఢీ కొట్టింది. దీంతో కారు పల్టీలు కొడుతూ రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌కు తగిలి రైయిలింగ్‌లో ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్నవారికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం వేరే వాహనంలో పరీక్ష రాసేందుకు విజయవాడ చేరుకున్నారు. -న్యూస్‌టుడే, జి.కొండూరు

గుంతల మార్గం.. నిత్యం నరకం



మండలంలోని కొండపర్వ ప్రధాన రహదారి చెరువును తలపిస్తోంది. గ్రామంలోని తూర్పు రామాలయం నుంచి చిత్తపూర్ వైపు వెళ్లే దారిలో పర్లాంగు దూరం మేర ప్రధాన రహదారిపై భారీగా గుంతలు పడ్డాయి. ఆపైన నెలల తరబడి మురుగు కాల్వలు బాగుజేయక పోవడంతో మురుగంతా రోడ్డుపైకే చేరుతోంది. అధికారులు, పాలకులు తమ గ్రామంలో అధ్వానంగా ఉన్న రహదారులు, డ్రెయినేజీలను పట్టించుకోవడంలేదని కె.పూర్ణచంద్రరావు, బి.సత్యనారాయణ ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పట్టించుకుని చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
న్యూస్‌టుడే, కొండపర్వ(విస్సన్నపేట)

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాల పంపిణీ


గంపలగూడెం: తోటమూలలో

గంపలగూడెం, విస్సన్నపేట, న్యూస్‌టుడే: సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం విస్సన్నపేట, గంపలగూడెం మండలాల్లో పలు గ్రామాల్లో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని విస్మరించి అధికారంలో వచ్చాక స్మార్ట్‌మీటర్లను బిగించాలని చూస్తున్నారన్నారు. ప్రజలు, వినియోగదారులు కూడా ఆర్థికంగా భారంగా ఉండే స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలని కోరారు. నాయకులు ఎం.వెంకటరెడ్డి, వి.నాగరాజు, ఎం.గోపి, జె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: గృహ విద్యుత్తు వినియోగానికి స్మార్ట్ మీటర్లు బిగించవద్దని కొండపల్లి పురపాలిక పరిధిలో సీపీఎం నాయకులు కార్యకర్తలు ఆదివారం కరపత్రాలు పంపిణీ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పురపాలిక పట్టణ కమిటీ సభ్యుడు ఎస్‌కే బాషా మాట్లాడుతూ..గత వైకాపా ప్రభుత్వం రూ.కోట్ల ముడుపులు తీసుకుని ప్రజలపై విద్యుత్తు ఛార్జీల భారం వేసిందన్నారు. కూటమి ప్రభుత్వం కూడా సర్దుబాటు ఛార్జీల రూపంలో వినియోగదారులపై మరింత భారం వేసిందన్నారు. ఇళ్లకు స్మార్ట్ విద్యుత్తు మీటర్ల ఏర్పాటును ఆపాలని లేని పక్షంలో ప్రజా ఆందోళనను తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పార్వతి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మరిడీమహాలక్ష్మికి శ్రావణ సారె


నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ మరిడీమహాలక్ష్మి అమ్మవారికి మహిళలు శ్రావణమాస సారెను ఆదివారం సమర్పించారు. వాసవీ లలితా విష్ణు జ్ఞానవాహిని మహిళలు దేవాలయానికి సారెను తీసుకువచ్చారు. అమ్మవారి మూలమూర్తిని పుష్పాలతో అలంకరణ చేశారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలి


మాట్లాడుతున్న జిల్లాధ్యక్షుడు రంగారెడ్డి, పక్కన కళాకారులు

మేడూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే: కళాకారులు తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని ప్రజానాట్యమండలి జిల్లాధ్యక్షుడు జీవీ.రంగారెడ్డి కోరారు. మండలంలోని మేడూరులో ఆదివారం ఎస్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన మండల స్థాయి కళాకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ.. కళాకారులు నిర్వహించే పోరాటాలకు ప్రజానాట్యమండలి అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం కళాకారులకు గుర్తింపుకార్డులు, ప్రదర్శనలకు ఆర్థిక చేయూత అందించాలన్నారు. పేద ప్రజల న్యాయమైన సమస్యలు, కోర్కెలు పరిష్కరించడమే ధ్యేయంగా కళాకారులు తమ కళారూపాలు, ప్రదర్శనలతో ప్రజలను జాగృతం చేయాలన్నారు. ప్రజానాట్య మండలి మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ఎ.నాగలక్ష్మి, ఎస్.చంద్రకళ, మరో ఏడుగురు సభ్యులుగా ఎన్నికయ్యారు. జిల్లా నాయకులు బి.జె.సుందరరావు, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


జనార్దన్ దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: జీవిత పరమార్థాన్ని తెలుసుకోవడానికి యోగా విద్య ఓ మార్గంగా నిలుస్తుందని ఎన్టీటీపీఎస్ పర్యవేక్షక ఇంజినీరు నాగేశ్వరరావు అన్నారు. ఎస్‌వీసీటీ సౌజన్యంతో శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్టీటీపీఎస్ ఏ కాలనీ కల్యాణ మండపంలో గత 20 రోజులుగా నిర్వహిస్తున్న యోగా శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. నాటి మన వారసత్వ సంపదగా ఉన్న యోగాను నేడు అన్ని రంగాలకు చెందిన వారు తప్పనిసరిగా ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమానికి ఎన్టీటీపీఎస్ ఏడీఈ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. అనంతరం యోగా గురువు లంకె జనార్దన్ దంపతులను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, కొండపల్లి పురపాలిక కౌన్సిలర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

నదిలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద కృష్ణా నదిలో గల్లంతైన మూలపాడుకు చెందిన కలకంటి నవీన్(19) మృతదేహం ఆదివారం ఫెర్రీ స్నానఘాట్ వద్ద లభ్యమైంది. మృతుడు శనివారం నదిలో ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు. అతడి ఆచూకీ కోసం పోలీసులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది రాత్రి వరకు గాలించినా దొరకకపోవడంతో గాలింపు చర్యలను తాత్కాలికంగా నిలిపేసి ఆదివారం తిరిగి కొనసాగించి వెలికితీశారు. సహాయ సిబ్బంది సకాలంలో స్పందించకపోవడంతోనే తమ కుమారుడు దక్కకుండా పోయాడని యువకుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదుచేసి మృతదేహాన్ని శవపరీక్ష కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

రోలుపడి(తిరువూరు), న్యూస్‌టుడే: మండలంలోని రోలుపడిలో స్పౌజ్ పింఛన్లు తీసుకున్న లబ్ధిదారులు సీఎం చంద్రబాబు చిత్రపటానికి ఆదివారం తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు కిలారు విజయబిందు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. లబ్ధిదారులు, గ్రామ సచివాలయ సంక్షేమ, డిజిటల్ సహాయకులు పాల్గొన్నారు.



విగ్రహాల ప్రతిష్ఠోత్సవానికి ఏర్పాట్లు పూర్తి


రామచంద్రాపురంలో నూతనంగా నిర్మించిన ఆలయం

రామచంద్రాపురం(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని రామచంద్రాపురంలో ప్రవాసాంధ్రుడు గుంటక సుదర్శనరెడ్డి(అంబులు) కుటుంబం గ్రామంలో రూ.కోటి వ్యయంతో నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం ఉదయం 8.10 గంటలకు శిర్డీసాయిబాబా, శివలింగం, నంది, వినాయకుడు, దత్తాత్రేయుడు విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండు రోజుల నుంచి విగ్రహాలకు శయనాధివాసం, ధాన్యాధివాసం, గ్రామోత్సవం, పుష్పాభిషేకం, చండీహోమం నిర్వహించారు. భారీగా భక్తులు పాల్గొంటారని భావిస్తూ అన్నప్రసాదం ఏర్పాట్లు చేస్తున్నారు.

ద్వారకానగర్‌లో..

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ద్వారకానగర్‌లో నిర్మించిన గుడిలో సోమవారం గణపతి, కుమారస్వామి, నాగేంద్రస్వామి, అంకమ్మతల్లి, దేవతా శిఖర ప్రతిష్ఠోత్సవానికి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 8.07 గంటలకు యంత్ర, విగ్రహ, శిఖర ప్రతిష్ఠలు వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఆదివారం యాగశాలలో హోమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం ఏర్పాట్లు చేస్తున్నారు.

బాధితులకు సాయం.. బాధలు మాయం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, గుంటుపల్లి, న్యూస్‌టుడే

౯౮ మందికి సుమారు రూ.౫ కోట్ల నగదు అందజేత


ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

అనారోగ్యం బారిన పడినా.. ప్రమాదాల్లో గాయపడినా.. ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు చేయించుకునేందుకు ఆర్థిక స్తోమతలేని ఎందరికో ముఖ్యమంత్రి సహాయనిధి ఆపన్న హస్తంలా మారింది. బాధితుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ప్రత్యేక చొరవ తీసుకుని పేదలకు సాయం అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గంలో జూన్ నెల వరకు 98 మందికి రూ.4,94,57,539 విలువైన నగదును సీఎం సహాయనిధి కింద అందజేశారు. ఒక్కొక్కరికీ రూ.పది వేల నుంచి రూ.10 లక్షల వరకు సాయం అందడంతో బాధితులు బాధలను మర్చిపోతున్నారు.

★ ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకున్న జి.కొండూరుకు చెందిన కందుల ఏసురాజుకు రూ.8లక్షలు, మైలవరం మండలం వెల్వాడం వాసి ఆరేపల్లి మాణిక్యమ్మకు రూ.2 లక్షలు, రెడ్డిగూడెం మండలంలోని రంగాపురం గ్రామం సాంబశివరావుకు రూ.2లక్షలు, కొండపల్లికి చెందిన రామకృష్ణకు రూ.80వేలు ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మైలవరం శాసనసభ్యులు కృష్ణప్రసాద్ మంజూరు చేయించారు. ఇలా ఎందరో బాధితులకు సీఎం సహాయనిధి అండగా నిలిచింది.

మండలాల వారీగా జూన్ నెల వరకు మంజూరైన సొమ్ము (రూ.లలో)

మండలం	అందిన సాయం
రెడ్డిగూడెం	6,036,672
మైలవరం	1,44,81,270
జి.కొండూరు	9,28,6169
ఇబ్రహీంపట్నం	1,32,38,952
విజయవాడ రూరల్	64,14,476

దరఖాస్తులు ఇలా

అనారోగ్యంతో శస్త్రచికిత్సలు, వైద్య సహాయం పొందిన వారు మూడు నెలలలోపు ఎమ్మెల్యే ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు సంబంధించి ఆసుపత్రిలో పొందిన వైద్యసేవలకు సంబంధించిన రికార్డులు, ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం నకళ్లను గొల్లపూడిలోని శాసనసభ్యుడి కార్యాలయంలో అందించాలి. వాటిని పరిశీలించిన సిబ్బంది ఎమ్మెల్యే సిఫార్సుతో ముఖ్యమంత్రి కార్యాలయానికి దస్త్రాలను పంపిస్తారు. సీఎం కార్యాలయం నుంచి సహాయనిధి మంజూరు అవుతుంది.

నడీడులోనే.. నడుము వంచలేక!

- ఎముకల ఆయుర్దాయం తగ్గడం.. యుక్తవయసులోనే మొదలవుతోంది
- జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పులతోనే అధిగమించాలి
- 'ఈనాడు'తో బర్డ్ డైరెక్టర్ డాక్టర్ గుడారు జగదీశ్
- నేడు జాతీయ బోన్ అండ్ జాయింట్ డే



ఈనాడు డిజిటల్, తిరుపతి: సమాజంలో ఎముకల సంబంధిత సమస్యలతో బాధపడేవారి సంఖ్య పెరుగుతోంది. ఎముకల అరుగుదల, నడుము వంచలేకపోవడం, కీళ్ల నొప్పుల వంటివి నడివయసు నుంచే మొదలవుతున్నాయి. ఆగస్టు 4న జాతీయ బోన్ అండ్ జాయింట్ డే సందర్భంగా ఈ మార్పులకు కారణాలు, అధిగమించాల్సిన చికిత్స పద్ధతులను తిరుపతిలోని బర్డ్ (శ్రీబాలాజీ దివ్యాంగుల శస్త్రచికిత్స, పునరావాస కేంద్రం) ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ గుడారు జగదీశ్ 'ఈనాడు'తో పంచుకున్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ఎముకల ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ఏ దశలో ఏ ముప్పు?

మన శరీరంలో రీజనరేషన్, డీజనరేషన్ అనే రెండు దశలు ఉంటాయి. మొదటి 20 ఏళ్ల వరకు ఎముకలు పెరుగుతాయి. 20-40 ఏళ్ల మధ్య స్థిరపడతాయి (మెయింటైన్). 65-70 మధ్యలో బలహీనపడటం (డీజనరేట్) మొదలవుతుంది. ప్రస్తుతం మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, అధిక ఒత్తిడి తదితర కారణాలతో ఎముకల డీజనరేషన్ 20-40 ఏళ్లకే మొదలవుతోంది. పసిపిల్లల్లో పుట్టుకతో వచ్చే ఎముకల వ్యాధులు, పెరుగుదలలో మెటబాలిక్ డిజార్డర్స్, విటమిన్ లోపాల వల్ల డీజనరేషన్ మొదలై చిన్న వయసులోనే కీళ్లు అరిగిపోతున్నాయి. ఈ మార్పులను ప్రాథమిక దశలోనే గుర్తించాలి. చిన్నపిల్లల్లో కొందరి ఎముకలు గట్టిగా పట్టుకుంటేనే విరిగిపోతుంటాయి. దాన్ని ఆస్టియోజెనెసిస్ ఇంపర్ఫెక్టా(ఓఐ) అంటారు. జన్యులోపం వల్ల అలా జరుగుతుంది. అలాంటివారికి చిన్నప్పుడే ఎముకల్లో చిన్నచిన్న రాడ్లు వేసి సంరక్షించాలి.

కాళ్లు వంకరపోతే ఇలా..

కాల్షియం, విటమిన్-డీ3 లోపం, మూత్రపిండాల పనితీరులో సమస్యల వల్ల రికెట్స్ వస్తుంది. కాళ్లు వంకరపోవడంతో వీరు సరిగ్గా నడవలేరు. చిన్నపిల్లల్లో ఈ తరహా లోపాలను ప్రాథమికదశలోనే గుర్తించి శస్త్రచికిత్స చేస్తే నయమవుతుంది. పెద్దలు రోజూ సూర్యరశ్మిలో తగినంతసేపు ఉండాలి. పోషకాహారం తీసుకోవడంతో పాటు వ్యాయామమూ తప్పనిసరి.



బర్డ్ ట్రస్ట్ ఆసుపత్రి


మోకీళ్ల సమస్య ఉంటే..

నేడు చాలామంది రసాయనాలతో పండించిన ఆహార పదార్థాలు తింటున్నారు. సరైన పోషకాహారం అందక ఎముకలు బలహీనపడుతున్నాయి. మోకీళ్లు వంగకపోయినా, పూర్తిగా వంచి చాపలేకపోయినా, లోపల ఉండే మృదులాస్థికి తగిన పోషణ అందదు. విటమిన్లు అందవు. వెరసి, మోకీళ్లు త్వరగా అరిగిపోతాయి. దీన్ని ఆస్టియోపొరోసిస్, ఆస్టియోమలేసియాగా పిలుస్తారు. ఎముకలు బలహీనపడి శరీర బరువునే తట్టుకోలేక విరిగిపోతుంటాయి. ఎంతో ఎత్తు నుంచి పడితే గానీ విరగని ఎముకలు.. ఈ లోపంతో సులువుగా విరుగుతున్నాయి. పోస్ట్ మెనోపాజ్, రుతుక్రమం ఆగిపోయిన మహిళల్లో హార్మోన్ల లోపం వల్ల ఈ జబ్బు కనిపిస్తుంది. శరీరంలో మెటబాలిజం మారిపోయి ఎముకలు బలహీనపడతాయి. వీరికి హార్మోన్ థెరపీ ముఖ్యం. పోషకాహారం, కాల్షియం, విటమిన్-డి అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి. ఎక్కువగా నడవాలి. మోకాళ్లు పూర్తిగా వంచడం, చాచడం చేసినపుడే ఎముకలకు శక్తి వస్తుంది.

బర్డ్‌కు మళ్లీ రెక్కలొచ్చాయ్

ఎముకలు, కీళ్లకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తూ దేశవ్యాప్తంగా పేదలు, దివ్యాంగుల పాలిట పెన్నిధిగా నిలుస్తోంది తిరుపతిలోని బర్డ్ ఆసుపత్రి. తిరుమల శ్రీవారి భక్తుల విరాళాలతో నడిచే ఈ ఆసుపత్రి.. కాళ్లు లేని ఎందరికో నడకనిచ్చింది. వంగిన నడుములను నిటారుగా నిలబెట్టింది. విరిగిన ఎముకలను అతికించి బతుకుకు భరోసానిచ్చింది. అయితే, వైకాపా పాలనలో బర్డ్ రెక్కలు విరిచేలా నిర్ణయాలు తీసుకున్నారు. 2018లో 11,200 శస్త్రచికిత్సలు జరగ్గా, 2019లో 2వేలకు పడిపోయాయి. ఆ ఐదేళ్లూ ఆసుపత్రి సేవలు మందగించాయి. కూటమి ప్రభుత్వం డాక్టర్ గుడారు జగదీశ్‌ను మే 28న తిరిగి బర్డ్ డైరెక్టర్‌గా నియమించాక మళ్లీ గాడిలో పడుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో 153 శస్త్రచికిత్సలు జరగ్గా, జులైలో 299కి పెరిగాయి. ప్రస్తుతం రోజూ సగటున 40 వరకు శస్త్రచికిత్సలు చేస్తున్నారు.

మల్లన్నసేవలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ దంపతులకు స్వామివార్ల జ్ఞాపిక బహూకరిస్తున్న ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామిని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ మహాద్వారం వద్ద దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన న్యాయమూర్తి దంపతులు స్వామికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో అర్చకులు, వేదపండితులు వేదాశీర్వచనాలు పలుకగా, ఈవో శేషవస్త్రాలు, ప్రసాదాలు, జ్ఞాపికను బహూకరించారు. సీజే వెంట ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ శ్రీశైలం తహసీల్దార్ కె.వి.శ్రీనివాసులు, సీఐ ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

పరీక్షల బుక్‌లెట్లు వచ్చేశాయ్

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఒకటి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు ఏటా రెండు ఎస్‌ఏ (సమ్మెటివ్ ఎసెస్‌మెంట్), నాలుగు ఎఫ్‌ఏ (ఫార్మెటివ్ ఎసెస్‌మెంట్) పరీక్షల్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ప్రతి పరీక్షకు ప్రశ్నపత్రంతోపాటు జవాబులు రాసేందుకు కాగితాలు ఇస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి అన్నిరకాల పరీక్షలకు సమాధానాల్ని రాసేలా ఒకే బుక్‌లెట్‌ను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రత్యేకంగా ముద్రించింది. ఆ బుక్‌లెట్‌లో ఏ పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారనే వివరాలతోపాటు ఓఎంఆర్‌ను ఎలా నింపాలి? ప్రశ్నలకు జవాబులు ఎలా రాయాలో అవగాహన కల్పించేలా కొన్ని పేజీలు ముద్రించారు. ఇక గణితానికి సంబంధించి గ్రాఫ్‌లు, సాంఘికశాస్త్రం మ్యాప్‌లతోనూ పేజీలు ముద్రించారు. 1, 2 తరగతుల విద్యార్థులకు మూడు, 3-5 తరగతుల విద్యార్థులకు నాలుగు, 6-7 తరగతుల విద్యార్థులకు ఆరు, 8-10 తరగతుల విద్యార్థులకు ఏడు చొప్పున బుక్‌లెట్లు అందజేయనున్నారు. ప్రాథమిక తరగతులకు ఇచ్చే బుక్‌లెట్‌లో 50 పేజీలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఇచ్చే బుక్‌లెట్‌లో 70 పేజీలు ఉండనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 44,303 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 1 నుంచి పదోతరగతి వరకు సుమారు 34.66 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి ఎస్‌ఏ-1 పరీక్ష జరగనున్న నేపథ్యంలో అన్ని మండలాల స్టాక్ పాయింట్లకు కొత్త బుక్‌లెట్లు చేరుకున్నాయి. వాటిని సోమవారం నుంచి విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు.

నేటి నుంచి మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు



అవనిగడ్డ, న్యూస్‌టుడే: దివిసీమ గాంధీగా పేరొందిన మాజీమంత్రి మండలి వెంకట కృష్ణారావు శతజయంతి వేడుకలు సోమవారం కృష్ణాజిల్లా అవనిగడ్డ గాంధీక్షేత్రంలో ప్రారంభం కానున్నాయి. 1977 ఉప్పెన అనంతరం తీవ్రంగా దెబ్బతిన్న దివిసీమ పునర్నిర్మాణంలో కృష్ణారావు పాత్ర ఎనలేనిది. శతజయంతి వేడుకలను అవనిగడ్డ, విజయవాడ, హైదరాబాద్, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాలతో పాటు అమెరికాలోనూ నిర్వహించడానికి ఆయన అభిమానులు ఏర్పాట్లు చేశారు. అవనిగడ్డలో జరిగే కార్యక్రమానికి శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, మంత్రి కొల్లు రవీంద్ర, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా గాంధీక్షేత్రంలో రక్తదాన, మెగా వైద్యశిబిరాలు ఏర్పాటుచేసినట్లు మండలి వెంకట కృష్ణారావు తనయుడు, అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ తెలిపారు.

మచ్చలేని నాయకుడు.. అచ్యుతానందన్

సంతాపసభలో కమ్యూనిస్టు నేతల నివాళి



మాట్లాడుతున్న రాఘవులు. వేదికపై వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, రామకృష్ణ, మధు

విజయవాడ (కృష్ణలంక), న్యూస్‌టుడే: కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం వ్యవస్థాపకుల్లో ఒకరైన వీఎస్ అచ్యుతానందన్ ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకుడిగా నిలిచారని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు కొనియాడారు. ఆదివారం విజయవాడ ఎంబీ విజ్ఞాన కేంద్రంలో అచ్యుతానందన్ సంతాపసభ నిర్వహించారు. రాఘవులు మాట్లాడుతూ సీపీఎం ఏర్పాటు సమయంలో ఉన్న 32 మంది నాయకుల్లో అచ్యుతానందన్ ఒకరని గుర్తుచేశారు. '17 ఏళ్ల యువకుడిగా పున్నప్ర వాయలార్ పోరాటంలో పాల్గొని పోలీస్ నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. ముఖ్యమంత్రిగా ప్రభుత్వ విద్యావ్యవస్థలో ఉచిత సాఫ్ట్‌వేర్‌ను ప్రోత్సహించారు. అన్ని బాధ్యతలను నీతి, నిజాయతీలతో నిర్వర్తించారు. అచ్యుతానందన్ నిరాడంబర జీవితాన్ని నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాల'ని సూచించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ స్థానిక సంస్థలకు కిందిస్థాయి వరకూ నిధులు అందించే విధానం కేరళలో మినహా మరెక్కడా లేదని, దీనికి ముఖ్యకారకుడు అచ్యుతానందన్ అని గుర్తుచేశారు. స్థానిక సంస్థలకు కేరళలో 40శాతం నిధులిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. సీపీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, పి.మధు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే 12న చలో డైరెక్టరేట్: యూటీఎఫ్

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయులను చిన్నచూపు చూస్తోందని, గిన్నిస్ రికార్డుల కోసం పాఠశాలలు ప్రారంభించిన వెంటనే యోగా పేరుతో, మెగా పీటీఎం నినాదంతో ఉపాధ్యాయులపై ఒత్తిడి తేవడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. తిరుపతిలోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లాలోని ముఖ్య నేతలతో సమీక్షాసమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధనకు ఆటంకంగా ఉన్న అన్నిరకాల యాప్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ ఛైర్మన్‌ను నియమించాలని, ఇతర బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణం ఉపాధ్యాయుల సమస్యలపై స్పందించకుంటే ఆగస్టు 12న 'చలో డైరెక్టరేట్' కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు.



అలాంటి లక్ష్యాలతో ఒరిగేదేమీ ఉండదు

పెద్దగా కష్టపడకుండానే సాధించగల లక్ష్యాలను ఎప్పుడూ విధించుకోకండి. ఎందుకంటే మీ ఎదుగుదలకు వాటితో ఒరిగేదేమీ ఉండదు. మీరు నిర్దేశించుకునే లక్ష్యం- మీ సామర్థ్యాలను సవాలు చేసేలా, మీ పరిధిని విస్తరింపజేసేలా ఉండాలి. అది మిమ్మల్ని కంఫర్ట్ జోన్ ఆవలకు తీసుకెళ్లాలి.

– కోరీ ఆర్నాల్డ్, కాపీ రైటర్

అక్రమంగా తవ్విందంతా లెక్క చూపరేం?

- గత ప్రభుత్వంలో భారీగా అక్రమ ఇసుక తవ్వకాలు
- అఫిడవిట్‌లో 3.91 కోట్ల టన్నులుగా పేర్కొన్న గనుల శాఖ
- పూర్తిస్థాయిలో రీచ్‌లను పరిగణనలోకి తీసుకోలేదనే విమర్శలు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో 2021-24 మధ్య సాగిన ఇసుక దోపిడీని పూర్తిస్థాయిలో బయటపెట్టడంలేదనే విమర్శలు వస్తున్నాయి. సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో ఇసుక అనుమతుల్లేని రీచ్‌ల్లో 3.91 కోట్ల టన్నులను అక్రమంగా తవ్వారని గనులశాఖ పేర్కొంది. ఇది ఇంకా ఎక్కువగా ఉంటుందని, అధికారులు కొంతే పరిగణనలోకి తీసుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. జగన్ హయాంలో ఇసుక అక్రమ తవ్వకాలపై దండా నాగేంద్రకుమార్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. ఈ కేసులో 4 రోజుల కిందట గనులశాఖ అఫిడవిట్ దాఖలు చేసింది. 709 చోట్ల అనుమతులు లేకుండా అనధికారికంగా ఇసుక తవ్వకాలు జరిగాయని, 3.91 కోట్ల టన్నుల ఇసుక తవ్వేశారని, ఎన్టీఆర్, కృష్ణా, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల పరిధిలో గుత్తేదార్లకు నోటీసులు ఇచ్చినట్లు పేర్కొంది. మిగిలిన జిల్లాల్లోనూ తాఖీదులు ఇవ్వనున్నట్లు వెల్లడించింది.

గూగుల్ చిత్రాలున్నా..: అక్రమ ఇసుక తవ్వకాలపై గనులశాఖ.. ఏపీ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (ఏపీ శాక్) సాయం తీసుకుంది. ఆ సంస్థ క్లౌడ్ ఫ్రీ మ్యాప్‌లను పరిగణనలోకి తీసుకొని ఎక్కడెక్కడ తవ్వకాలు జరిగాయనేది పేర్కొంది. కోర్టులో పిటిషన్ వేసిన నాగేంద్రకుమార్ గతంలో గూగుల్ ఎర్త్ చిత్రాలను సమర్పించారు. వాటిని పరిశీలిస్తే అధికారులు అన్ని రీచ్‌లనూ పరిశీలించలేదనే భావన కలుగుతోంది. తూర్పుగోదావరి జిల్లా కుమారదేవం ఇసుక రీచ్‌లో 8.81 హెక్టార్లలో ఇసుక తవ్వకాలు జరిగినట్లు ఏపీ శాక్ పేర్కొంది. కానీ 2022-24 మధ్య ఆ ప్రాంతంలో రెండుచోట్ల 65.54 హెక్టార్లలో అక్రమ ఇసుక తవ్వకాలు ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా రీచ్‌లో ఒక మీటరు లోతున ఇసుక తవ్వకాలకే అనుమతి ఇస్తారు. నిబంధనల ప్రకారం హెక్టారుకు 10వేల క్యూబిక్ మీటర్ల తవ్వకాలు చేయాలి. గత ప్రభుత్వంలో హెక్టారుకు 30-40వేల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వేశారు.

కలెక్టర్ల తప్పుడు నివేదికలపై చర్యలేవి?

రీచ్‌లలో ఎక్కడా అక్రమ తవ్వకాల్లేవని, అంతా సవ్యంగా జరిగిందంటూ వైకాపా హయాంలో పలు జిల్లాల కలెక్టర్లు ఎన్జీటీకి తప్పుడు నివేదికలు ఇచ్చారు. దీనిపై అప్పట్లో ఎన్జీటీ ఆశ్చర్యం వ్యక్తంచేసింది. వాస్తవాలు దాచిపెట్టి, తప్పుడు నివేదికలు ఇచ్చిన కలెక్టర్లపై కూడా చర్యలు తీసుకునేలా గనులశాఖ ముందడుగు వేయడం లేదు.

నేడు కూడా పింఛన్ల పంపిణీ

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ భరోసా పథకం కింద అందించే సామాజిక భద్రత పింఛన్ల పంపిణీని సోమవారం వరకు పొడిగించారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది బదిలీల నేపథ్యంలో.. కొత్తచోట్ల లబ్ధిదారుల ఇళ్లను గుర్తించడంలో సిబ్బందికి కొంతమేర ఇబ్బంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు సోమవారం కూడా పంపిణీ చేసేలా ఆదేశాలిచ్చారు.

బెంగళూరు విమానంలో సాంకేతిక లోపం

శంషాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్లాల్సిన ఓ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి 57 మంది ప్రయాణికులతో అలయన్స్ ఎయిర్ 9ఐ-518 విమానం శనివారం రాత్రి 10:40 గంటలకు పార్కింగ్ బే నుంచి పీటీబీకి బయలుదేరిన సమయంలో.. గ్రౌండ్ పవర్ యూనిట్‌లో చోటుచేసుకున్న సమస్యను పైలట్ గమనించారు. దీంతో ఏటీసీ అధికారులకు సమాచారం అందించి విమానాన్ని వెనక్కి మళ్లించారు. సాంకేతిక నిపుణులు మరమ్మతులు చేయడంతో రెండు గంటల అనంతరం అర్ధరాత్రి 12.30 గంటలకు విమానం బెంగళూరుకు టేకాఫ్ అయినట్లు ఎయిర్‌లైన్స్ అధికారులు వెల్లడించారు. ◆ శంషాబాద్ నుంచి పట్నాకు ఆదివారం ఉదయం 7:20కు బయలుదేరాల్సిన ఎయిర్‌ఇండియా ఎక్స్‌ప్రెస్ ఐఎక్స్-2886 విమానం సాంకేతిక సమస్య కారణంగా రెండు గంటలు ఆలస్యంగా టేకాఫ్ తీసుకుంది.

మొక్కజొన్న వైపు రైతుల మొగ్గు

- సుబాబుల్, యూకలిప్టస్, సరుగుడు సాగుపై ఆసక్తి
- సెనగలో కార్పొరేట్ సేద్యం
- పంట మార్పిడి దిశగా పరిణామం

ఈనాడు, అమరావతి: వ్యవసాయంలో పంటల సరళి మారుతోంది. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లోని పలు మండలాల్లో రైతులు సుబాబుల్, యూకలిప్టస్, సరుగుడు వైపు మొగ్గు చూపిస్తున్నారు. ఒకసారి నాటితే మూడేళ్లకోసారి కర్ర వస్తుంది. టన్ను ధర గతంలో రూ.1,000-1,500 ఉండగా, ఇప్పుడు సగటున రూ.ఐదారు వేలకు చేరింది. తొలి ఏడాది ఎకరాకు రూ.15వేల పెట్టుబడి పెట్టి మూడేళ్లు కాపాడుకుంటే.. తర్వాత విడతల వారీగా చేతికొస్తుంది. విత్తనం నాటితే ఎకరాకు 25 టన్నులు, క్లోనింగ్ మొక్కలు పెంచితే 40 టన్నుల వరకు దిగుబడి వస్తుందని అంచనా. కాగితపు పరిశ్రమలే క్లోనింగ్ మొక్కలను ఒక్కోటి యూకలిప్టస్ రూ.3, సుబాబుల్ అయితే రూ.4.25 చొప్పున విక్రయిస్తున్నాయి. అందుకే రైతులు పత్తి, మిరప, సెనగ, పొగాకు పంటల నుంచి వీటివైపు మళ్లుతున్నారు. కొన్నిచోట్ల దీర్ఘకాలిక ఆదాయాన్నిచ్చే కుంకుడు తోటలు వేస్తున్నారు.

మొక్కజొన్న ఒక్కటే ఆశాకిరణం

రాష్ట్రంలో రైతులకు ప్రస్తుతం ఆశాకిరణంగా కనిపిస్తున్న పంట మొక్కజొన్న ఒక్కటే. క్వింటాలు మక్కలకు రూ.2,100-2,600 వరకు ధర లభిస్తోంది. ఎకరాకు రూ.30-35వేల వరకు పెట్టుబడి అవుతోంది. ఖర్చులు మినహాయించినా ఎకరాకు రూ.50 వేల వరకు మిగులుతాయని రైతుల అంచనా. చాలాచోట్ల వర్షాలు పడుతున్నా ఖరీఫ్ పంట వేయడం లేదు. పొలాలను బీడుగా వదిలేసి, రబీలో మొక్కజొన్న వేసేందుకు సిద్ధమవుతున్నారు. పత్తి వేసిన రైతులు కూడా రెండు తీతల తర్వాత తొలగించి, మొక్కజొన్న వేయాలన్న ఆలోచనలో ఉన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో మొక్కజొన్న సాగు భారీగా విస్తరించనుంది. ఇథనాల్ ఉత్పత్తితో పాటు కోళ్ల దాణా, ఇతర అవసరాలకు ఉపయోగిస్తుండటంతో డిమాండ్ పెరిగింది.

ఎకరాల కొద్దీ కౌలుకు తీసుకొని..

ఒకప్పుడు ఉమ్మడి కడప, ప్రకాశం జిల్లాల్లోనే సెనగ సాగయ్యేది. నేడు అన్ని జిల్లాలకు విస్తరించింది. కార్పొరేట్ సేద్యాన్ని తలపిస్తోంది. విత్తనం వేయడం నుంచి అంతర సేద్యం, పురుగు మందుల పిచికారి, నూర్పిడి అంతా ట్రాక్టర్ ఆధారితమే. కొందరు రైతులు వంద, అంతకుమించి ఎకరాల్ని కౌలుకు తీసుకుని భూ యజమానులకు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.17 వేల వరకు ముందే సొమ్ము చెల్లిస్తున్నారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల రైతులు ఇతర జిల్లాలకు వెళ్లి ఇలా వేల ఎకరాలు సాగు చేస్తున్నారు. ఉపాధ్యాయులు, వ్యాపారులు కూడా ఇద్దరు ముగ్గురు కలిసి పెట్టుబడి సమకూర్చుకుని.. సెనగ పంట వేస్తున్నారు. వారు లేకుంటే గ్రామాల్లో ఈ ఏడాది పొలాలు కౌలుకు తీసుకునేవారు కూడా లేరని పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం గుడిపూడికి చెందిన రైతులు చెప్పడం గమనార్హం.

నష్టాలు భరించలేకే..

రైతులకు ఐదేళ్లుగా వ్యవసాయంలో వరస నష్టాలే. ఇదిగో ఈ ఏడాది గట్టెక్కుతామంటూ అప్పు తెచ్చి పెట్టుబడులు పెట్టడం, ఆపై ఏదో ఒక రూపంలో నష్టపోవడం ఏటా అనుభవైక సేద్యమే. ఉదాహరణకు, క్వింటాలుకు రూ.15వేలు లభించడంతో గతేడాది పొగాకు సాగు భారీగా పెరిగింది. చివరకు కొనేవారు లేరు. మిరప పంటలో ఎకరాకు రూ.3లక్షల పెట్టుబడి పెడితే, రూ.లక్ష వరకు నష్టమే వచ్చింది. సెనగ, కందులు కూడా అమ్ముడుపోలేదు. పత్తి వేసినా లాభం కన్పించడం లేదు. ఈ స్థితిలో కౌలు రైతుల్లో చాలా మంది ఈ ఏడాది కాడి కిందపడేశారు. గతంలో ఎకరా రూ.20-35 వేల మధ్య కౌలుకు తీసుకున్న పొలాలు ఈ ఏడాది రూ.10వేలకూ తీసుకునే వారులేరు. పొలాల్ని బీడుగా వదిలేయలేక యజమానులే సామాజికవనాల వైపు మళ్లుతున్నారు.

కుంభమేళాలా మూడో ప్రపంచ తెలుగు మహాసభలు



గజల్ శ్రీనివాస్

మానుకోట, న్యూస్‌టుడే: రాజధాని అమరావతిలో వచ్చే జనవరి 3, 4, 5 తేదీల్లో మూడో ప్రపంచ తెలుగు మహాసభలను తెలుగు కుంభమేళాగా నిర్వహించనున్నట్లు ఆంధ్ర సారస్వత పరిషత్ ఛైర్మన్ డాక్టర్ గజల్ శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనానికి ఆయన హాజరయ్యారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఈ మహాసభలకు మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కొన్ని రాష్ట్రాల గవర్నర్లు, పలువురు ప్రముఖులు, 60కి పైగా దేశాల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. తెలుగు సాహితీ ప్రక్రియలపై సదస్సులు, వేయి మంది కవులతో కవి సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. లక్ష మంది విద్యార్థులు, యువతతో తెలుగు భాషపై సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. రామోజీరావు పేరిట ఏర్పాటుచేసే ప్రాంగణంలో 25 సాహిత్య ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. ప్రధానవేదిక వద్ద దాశరథి, సి.నారాయణరెడ్డి పేరిట ముఖద్వారాలు ఏర్పాటుచేస్తామని చెప్పారు. ఈసారి పూర్ణకుంభ పురస్కారాన్ని ప్రజాగాయకుడు దివంగత గద్దర్‌కు ఇవ్వాలని నిర్ణయించామని, ఆయన కుమార్తె వెన్నెలకు ఈ అవార్డు ప్రదానం చేస్తామన్నారు. సమావేశంలో మానుకోట రచయితల వేదిక కన్వీనర్ గుర్రపు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



గదిలో పాఠాలు బోధిస్తున్న టీచర్

పొద్దంతా క్లాస్ రూం.. రాత్రికి పడక గది!

నెల్లూరు నగరం మధ్యలో ఉన్న దుర్గామిట్ట గిరిజన సంక్షేమ పాఠశాల గదుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. విద్యార్థుల పరిస్థితిని గమనించి తరగతి గదులు నిర్మించేందుకు గతంలో తెదేపా ప్రభుత్వం రూ.1.50 కోట్లు కేటాయించింది. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం.. పనులు ప్రారంభించలేదు. విద్యార్థులు పాత గదుల్లోనే నెట్టుకొస్తున్నారు. ఇక్కడ 3 నుంచి పదో తరగతి వరకు 150 మందికి పైగా విద్యార్థులున్నారు. ప్రస్తుతం 5 గదులు ఉండగా.. కార్యాలయానికి, వంటకు, కంప్యూటర్ ల్యాబ్‌కు మూడు పోగా.. తరగతులకు రెండే మిగిలాయి. వాటినే విద్యార్థులు తరగతి గదులుగా, హాస్టల్‌గానూ వాడుకుంటున్నారు. రాత్రి వాటిలోనే పడుకుంటున్నారు. ఇంకొన్ని తరగతులను వరండాలోనూ నిర్వహిస్తున్నారు.

–ఈనాడు నెల్లూరు, న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)



అదే గదిలో విద్యార్థుల రాత్రి నిద్ర

ఆమె ధైర్యమే అతడికి ఉచ్చు బిగించింది

- ప్రజ్వల్ కేసును దర్యాప్తు చేసిన అధికారి

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: మాజీ ఎంపీ ప్రజ్వల్ చేతిలో అత్యాచారానికి గురైన బాధితురాలు (47) ధైర్యంగా వ్యవహరించినందునే దర్యాప్తును త్వరగా పూర్తిచేశామని సిట్‌కు నేతృత్వం వహించిన సీఐడీ ఏడీజీపీ బీకే సింగ్ వెల్లడించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నిందితుడి రాజకీయ నేపథ్యానికి భయపడకుండా ఆమె ధైర్యంగా ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ప్రజ్వల్ అత్యాచారానికి పాల్పడినప్పుడు వీడియో తీసుకుని, తనకు అవసరమైనప్పుడల్లా ఆమెను వేధించాడని వివరించారు. బాధితురాలు ధైర్యంగా కోర్టుకు వచ్చి వాంగ్మూలం ఇవ్వడంతో నిందితునికి శిక్ష పడిందన్నారు. విచారణ సమయంలో తమకు ఎటువంటి ఒత్తిళ్లూ రాలేదని బీకే సింగ్ స్పష్టం చేశారు.

ఏసీఏ కార్యవర్గ ఎన్నికకు ముగిసిన నామినేషన్ ప్రక్రియ

ఈనాడు, అమరావతి: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యవర్గ ఎన్నికకు నామినేషన్ ప్రక్రియ ఆదివారం ముగిసింది. ఏసీఏ అధ్యక్ష పదవికి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) నామినేషన్ వేశారు. ఉపాధ్యక్షుడి పదవికి బండారు నరసింహారావు, కార్యదర్శి పదవికి రాజ్యసభ సభ్యుడు సానా సతీశ్‌బాబు, కోశాధికారి పదవికి దండమూడి శ్రీనివాస్, కౌన్సిలర్ పదవికి దండు గౌర్ విష్ణుతేజ్, సంయుక్త కార్యదర్శి పదవికి బి.విజయ్‌కుమార్, శ్రీనివాసరాజులు నామినేషన్ దాఖలు చేశారు.

అండర్ వరల్డ్ నేరస్థుడు కవిరాజ్ అరెస్టు

ముళబాగిలు, న్యూస్‌టుడే: దేశంలోని వివిధ ప్రాంతాల్లో హత్యలు, దోపిడీ లాంటి 14 క్రిమినల్ కేసుల్లో ప్రమేయం ఉన్న అండర్ వరల్డ్ నేరస్థుడు కవిరాజ్ ఎట్టకేలకు కర్ణాటక పోలీసులకు చిక్కాడు. కోలారు సైబర్ నేరాలు, నార్కొటిక్స్ కంట్రోల్ స్టేషన్ పోలీసులు శనివారం అతణ్ని అరెస్టు చేశారు. అతని స్వస్థలం ఉత్తరాఖండ్ సరిహద్దు ప్రాంతం. చాలా కాలం బెంగళూరులో ఉన్నాడు. 2020లో మాజీమంత్రి వర్థూర్ ప్రకాశ్ అపహరణ సహా దేశవ్యాప్తంగా 14 క్రిమినల్ కేసుల్లో పరారీలో ఉన్నాడు. పోలీసులు నోయిడాలో 10 రోజులు మకాంవేసి సాంకేతిక పరిజ్ఞాన సహాయంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అండర్‌వరల్డ్ నేరస్థులు రవిపూజారి, ముత్తప్ప రాయ్, కవిరాజ్ సహచరులు.

తల్లి, ఇద్దరు కుమార్తెల దారుణ హత్య

- కాకినాడ జిల్లా సామర్లకోటలో కలకలం



మాధురి



నిస్సి, జెస్సి

సామర్లకోట, పెద్దాపురం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా సామర్లకోట సీతారామకాలనీలో శనివారం అర్ధరాత్రి ములపర్తి మాధురి (34), ఆమె కుమార్తెలు పుష్పకుమారి ఎలియాస్ నిస్సి (8), ప్రైజ్ జెస్సి (6) దారుణహత్యకు గురయ్యారు. ఇంట్లోని ఓ గదిలో ముగ్గురి మృతదేహాలు రక్తపు మడుగులో పడి ఉన్నాయి. బలమైన ఆయుధంతో తలపై మోది హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. మాధురి భర్త దసప్రసాద్ ప్రైవేటు రోడ్డు నిర్మాణసంస్థలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. శనివారం రాత్రి విధులకు వెళ్లి, ఆదివారం ఉదయం ఇంటికి వచ్చారు. గేటు లోపల తాళం వేసి ఉండటం, ఎంత పిలిచినా స్పందన లేకపోవడంతో ప్రహరీ దూకి లోపలికి వెళ్లారు. తలుపులు కొట్టినా తీయకపోవడంతో పగలగొట్టి చూడగా భార్య, ఇద్దరు కుమార్తెలు విగతజీవులుగా పడి ఉండటాన్ని గుర్తించారు. సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ కృష్ణభగవాన్ ఘటనాస్థలానికి చేరుకున్నారు. దర్యాప్తు బృందాలు ఘటన స్థలంలో ఆధారాలు సేకరించాయి. మాధురి ఫోన్ ఇంట్లో కనిపించకపోవడంతో ఆరా తీస్తున్నారు. సెల్ ఫోన్ లొకేషన్ వేరే ప్రాంతాన్ని చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ కుటుంబానికి తెలిసిన స్థానిక వ్యక్తిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబ తగాదా లేదని అనే కోణంలోనూ పోలీసులు ఆరా తీస్తున్నారు. ప్రసాద్, మాధురికి 2016లో వివాహమైంది. స్థానిక ప్రైవేటు స్కూల్లో నిస్సి మూడు, జెస్సి రెండో తరగతి చదువుతున్నారు. ఘటనా స్థలానికి వచ్చిన కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ.. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు. తమకు ఎవరిపైనా అనుమానం లేదని బంధువులు చెబుతున్నారని చెప్పారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. ఆదివారం మృతురాలి సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా నిందితుడి కదలికలను పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

వసుంధర

vasundhara@eenadu.in

మహిళలు పురుషులతో సమానత్వాన్ని కోరుకున్నన్ని రోజులూ... యుద్ధంలో సగం ఓడిపోయినట్లే! అంతకు మించి... తమవైన లక్ష్యాలు, ఆశయాలు పెట్టుకోవాలి. ఇవి ఏ స్థాయిలో ఉండాలంటే, పురుషులే మహిళల్ని ఆదర్శంగా తీసుకునేలా! మనలోని అభద్రతా, అయోగ్యతా భావాలు పోయిన రోజు ఇది కచ్చితంగా సాధ్యమవుతుంది.



- డా. సెఫాలీ త్సబరీ, రచయిత్రి, సైకాలజిస్ట్

మీకు తెలుసా?

మరియా బీస్లీ... బ్యారెల్ హూపింగ్ యంత్రాన్ని కనుగొన్నారీమె. దీనిద్వారా బ్యారెళ్ల తయారీ ప్రక్రియ వేగవంతమైందట. అంతేకాదు, గార్డ్ రెయిలింగ్, మెటల్ ఫ్లోట్స్‌తో మరింత సురక్షితమైన, వాటర్‌ప్రూఫ్ లైఫ్ ర్యాఫ్ట్‌ను కూడా ఈమె డిజైన్ చేశారట.



సాగు'బడి'లో... పతకాల పంట!

ఈ ఇద్దరమ్మాయిలూ పుట్టి పెరిగింది పట్టణాల్లో! చిన్ననాటి నుంచే చదువుల్లో రాణించారు. వైద్య, ఐటీ రంగాల్లో స్థిరపడే అవకాశం వచ్చింది. కానీ, వీళ్లు మాత్రం వ్యవసాయ విద్యను అభ్యసించి అన్నదాతలకు అండగా నిలవాలనుకున్నారు. ఇష్టపడి డిగ్రీ పూర్తి చేయడమే కాదు, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో స్వర్ణ పతకాలు అందుకున్నారు అర్షియా తబస్సుం, గుండోజు భార్గవి.

అన్నదాతలకు అండగా...

– అర్షియా తబస్సుం



నాలుగు బంగారు పతకాల విజేత

మాది హనుమకొండ. అమ్మ రెహానా బాను ప్రభుత్వ ఉద్యోగిని. నాన్న అసద్అలీఖాన్ వ్యాపారి. పాఠశాలకు వెళ్లేరోజుల్లో కూరగాయలు, పండ్లు, బియ్యం వంటివి ఎలా వస్తాయనే ఆసక్తి ఉండేది. అది క్రమంగా వ్యవసాయంపై ఇష్టాన్ని పెంచింది. ఇంటర్ పూర్తయ్యాక ఎంసెట్‌తోపాటు నీట్ కూడా రాశా. మెడిసిన్ సీటు వచ్చే అవకాశం ఉన్నా... వద్దనుకుని వ్యవసాయ విద్యను ఎంచుకున్నా. వరంగల్‌లోని వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చర్ బీఎస్సీలో చేరా. చదువు పూర్తయ్యేసరికి విశ్వవిద్యాలయ పరిధిలో మొదటి ర్యాంకు సాధించి నాలుగు బంగారు పతకాలు సాధించా. డిగ్రీ అనంతరం హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(నిఫ్మ్)లో శిక్షణ పొంది... వరంగల్‌లోని 'క్రిమిసంహారక ప్రయోగశాల'లో ఏవోగా పనిచేస్తున్నా. రసాయన క్రిమిసంహారకాల వినియోగంతో పర్యావరణానికి కలిగే నష్టాలు, మనుషులకు వచ్చే అనారోగ్యాల గురించి అవగాహన కల్పిస్తూ... ప్రత్యామ్నాయంగా సేంద్రియ విధానంలో తయారయ్యే క్రిమిసంహారకాల తయారీ, వినియోగం గురించి అన్నదాతలను చైతన్య పరుస్తున్నా.

వ్యవసాయ సాంకేతికత లక్ష్యం

– జి.భార్గవి

ఆరు స్వర్ణ పతకాల విజేత



మాది వనపర్తి. అమ్మ విజయ, నాన్న యాదగిరి చారి. స్వర్ణకారవృత్తిలో ఉన్నారు. చిన్నప్పటి నుంచి క్లాసులో నేనే ఫస్ట్. పదో తరగతిలో ఉండగా మా ప్రిన్సిపాల్ వ్యవసాయ ఇంజినీరింగ్ చేస్తే దేశానికీ, రైతులకీ సేవ చేయొచ్చని చెప్పారు. ఆ మాటలు నన్ను ప్రభావితం చేశాయి. టెన్త్‌లో 10 జీపీఏ సాధించడంతో అందరూ బాసరలోని ట్రిపుల్ ఐటీలో చేరమన్నారు. నేను మాత్రం అగ్రికల్చరల్ ఇంజినీరింగే చేస్తానని పట్టుబట్టా. మంచి మార్కులు సాధించడంతో... మెదక్‌లోని రామానాయుడు విజ్ఞాన జ్యోతి పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమాలో చేరాను. అక్కడ చదువు పూర్తయ్యాక వ్యవసాయ ఇంజినీరింగ్ కోర్సులో నేరుగా రెండో ఏడాదిలో చేరే అవకాశం ఉంది. కానీ, కొన్ని కారణాలు చెప్పి అనుమతించలేదు. దాంతో, మళ్లీ ఎంట్రన్స్‌కి సన్నద్ధమై పరీక్ష రాశా. ఈసారి రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంక్ సాధించి సంగారెడ్డి జిల్లా, కంది అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ కాలేజీలో చేరా. నాలుగేళ్ల బీటెక్ పూర్తయ్యింది. తాజాగా జరిగిన స్నాతకోత్సవంలో ఆరు బంగారు పతకాలు అందుకున్నా. కృత్రిమమేధ, మెషీన్ లర్నింగ్, రోబోటిక్స్ వంటి సాంకేతికతలపైన పనిచేసి... అన్నదాతల శ్రమ, వారి ఖర్చుల భారం తగ్గించే దిశగా పరిశోధనలు చేయాలనుకుంటున్నా.

– ఆకారపు మల్లేశం, హైదరాబాద్

ఆటలంటేనే భయపడుతున్నాడు..!

మా బాబుకి పదేళ్లు. అవుట్‌డోర్ గేమ్స్ ఆడటానికి భయపడుతున్నాడు. రెండు రోజుల క్రితమే వాళ్ల టీచర్ ఫోన్ చేసి ఈ విషయం చెప్పారు. కారణం అడిగితే బిక్క మొహం పెడుతున్నాడు. ఇండోర్ గేమ్స్, అదీ ఇంట్లో అయితే చక్కగా ఆడుతున్నాడు. ఇదేమైనా సమస్యా? -ఓ సోదరి

■ పిల్లల్లో భయాలు సహజం. అయితే దీనికి చాలా కారణాలు ఉంటాయి. ఓవర్ ప్రొటెక్షన్‌తో... తల్లిదండ్రులు చిన్నప్పట్నుంచీ పిల్లల్ని ఆటలకు వదలరు. వారి పర్యవేక్షణలో ఇంట్లోనే ఆడుకోమంటారు. అదే పెరిగి పెద్దయ్యాక కూడా అలవాటవుతుంది. దాంతో పిల్లలు బయటకు వెళ్లడానికి ఇష్టపడరు. ఇవే వారిలో సోషల్ ఫోబియాకు కారణం అవుతాయి. అంటే తోటివాళ్లు ఏడిపిస్తారనో, బుల్లీయింగ్ చేస్తారనో, ఓడిపోతే చిన్నబోతామనో ఆడుకోవడానికి ఇష్టపడరు. అలానే వారసత్వంగానూ ఇలాంటివి వస్తాయి. లేదా ఎవరైనా పిల్లలు ఆడుతున్నప్పుడు పడిపోవడం, దెబ్బలు తగిలించుకోవడం చూసి ఉండొచ్చు. ముందు మీ అబ్బాయి ఇలా ప్రవర్తించడానికి కారణాలు తెలుసుకోండి. అందుకు తగినట్లుగా చర్యలు తీసుకోండి. ఉదాహరణకు... దెబ్బలు తగులుతాయనే భయం వల్లే ఆటలకు దూరం అవుతున్నాడనుకుంటే... మొదట్లో మీరు దగ్గరుండి ఆడించండి. ఆడే క్రమంలో అది సహజం అని నచ్చజెప్పేందుకు ప్రయత్నించండి. ఓడిపోతాడనే సంకోచమే అయితే... ఆటలో గెలుపోటములు తప్పవని చెప్పి వాటిని ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలో నేర్పండి. సంబంధిత కథల్ని చెప్పండి. ఈ వయసులో వాళ్లలో స్ఫూర్తి నింపేవి ఇవే. లేదూ ఏం చేసినా బాబు ఇలానే ఉన్నాడు అనుకుంటే... సైకియాట్రిస్టు దగ్గరకు తీసుకువెళ్లండి. సమస్యేంటో తెలుసుకుని అవసరమైన థెరపీని అందిస్తారు. సిస్టమేటిక్ డీసెన్సిటైజేషన్ పద్ధతి ద్వారా బాబులో ఉన్న భయాల్ని నెమ్మదిగా పోగొట్టేందుకు ప్రయత్నిస్తారు. బాబుకి ఎలా సహాయపడాలో మీకూ చెబుతారు.

డియర్ వసుంధర



డా. మండాది గౌరీదేవి
మానసిక నిపుణురాలు

బాధ్యతలతో... నిద్ర రావట్లేదు!

నాకు ముప్పై ఏళ్లు. ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నా. సింగిల్ మదర్‌ని. బాబు బాధ్యతలన్నీ నేనే తీసుకున్నా. ఇంటాబయటా పనులతో ఈమధ్య నిద్ర రావడం లేదు. ప్రశాంతంగా నిద్రపోయి నెలవుతోంది. ఎంత ప్రయత్నించినా ఈ ఆలోచనల్ని నియంత్రించలేకపోతున్నా. ఏం చేయను. -ఓ సోదరి

■ సింగిల్ మదర్‌గా ఒంటిచేత్తో అన్ని బాధ్యతలూ నిర్వర్తించడానికి చాలా ధైర్యం కావాలి. మనోబలం లేకుంటే పరిస్థితుల ప్రభావానికి కుంగిపోతారు. దాంతో రకరకాల ఆలోచనలు చుట్టుముట్టి ఊపిరి సలపనివ్వవు. మీరున్న పరిస్థితికి చింతిస్తున్నా. అధైర్య పడకండి. ఇప్పుడు మీరూ, మీ బాబు మాత్రమే ఉంటున్నారా... కుటుంబ సభ్యులెవరైనా మీతో ఉన్నారా అన్నది చెప్పలేదు. మీ సమస్య నుంచి బయటపడాలంటే... ముందు మీరు చేస్తోన్న వర్క్‌ని విభజించుకోండి. తగ్గించుకోవడానికి ప్రయత్నించండి. అవసరమైతే... మీ పరిస్థితిని పైవాళ్లకు వివరించి పనిలో కాస్త వెసులుబాటు ఇచ్చే ప్లాన్ చేసుకోండి. మీ సహోద్యోగి సహాయాన్నీ తీసుకోండి. లేదూ ఇవేవీ కుదరవు అనుకుంటే... ఆఫీస్ పని అక్కడ మాత్రమే చేసుకునేలా... ఇంటికి వచ్చాక వాటికోసం ఆలోచించకుండా పక్కాగా ప్రణాళికలు వేసుకోండి. ఇకపోతే, మీ బాబుని చూసుకోవడానికి అమ్మ, అత్తలను లేదా మీకు నమ్మకం ఉన్న వారిని నియమించుకోండి. వీటన్నింటి వల్లా మీకు ఒత్తిడి తగ్గి ఉపశమనం కలుగుతుంది. ఈ మార్పులన్నీ చేసినా లాభం లేదు అనుకుంటే సైకియాట్రిస్టుని కలవండి. మీ సమస్యను తెలుసుకుని ఆందోళనని నియంత్రించడానికి సహాయపడతారు. అవసరమైతే నిద్ర పట్టడానికీ, ఆందోళన తగ్గడానికీ మందులు ఇస్తారు. ఆలస్యం చేయొద్దు.

గ్రీన్ ఇండియా లక్ష్యంగా... మహిళా బృందం!

ప్రతిభ ఉండాలే కానీ... అవకాశాలు వాటంతట అవే వెతుక్కుంటూ వస్తాయి. ఈ ఆరుగురు మహిళలే అందుకు నిదర్శనం. 59 ఏళ్ల చరిత్రను తిరగరాసి... ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్(ఐఎఫ్ఎస్) ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యనిర్వాహక వర్గంలో మొదటిసారిగా అందరూ మహిళలే ఎంపికయ్యారు.

లోయను పునరుద్ధరించి...

– జ్యోత్స్న సిట్లింగ్



పశ్చిమ్ బంగాలోని నేపాల్, భూటాన్, సిక్కిం సరిహద్దు ప్రాంతమైన కాలింపాంగ్‌లో పుట్టి పెరిగారు జ్యోత్స్న. లెప్చా గిరిజన తెగ ఆమెది. చిన్నప్పట్నుంచీ ప్రకృతి మీద మమకారం ఎక్కువ. అందుకే వృక్షశాస్త్రంలో పీజీ కూడా పూర్తిచేశారు. కళాశాల రోజుల నుంచీ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో పాల్గొనేవారట. ఆ అభిరుచే ఆమెను ఐఎఫ్ఎస్ వైపు నడిపించింది. 1987లో సర్వీస్‌లో చేరారు. అనతికాలంలోనే... ద్యూన్ వ్యాలీలో వాటర్ షెడ్ ప్రాజెక్టు చేపట్టారు. కొండప్రాంతాల్లో కొన్ని వేల మొక్కల్ని నాటారు. తీర్థయాత్రల ద్వారా ఉత్పన్నమయ్యే ప్లాస్టిక్ వ్యర్థాలు స్థానిక వ్యాలీని కలుషితం చేస్తున్నాయని తెలిసి... దాని నిర్మూలనకు కృషి చేశారు. అలా ఆమె పునరుద్ధరించిన 'వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ నేషనల్ పార్క్'కు వరల్డ్ నేచురల్ హెరిటేజ్ హోదాను ఇచ్చింది యునెస్కో. ఈమె సేవల్ని మెచ్చిన ప్రభుత్వం ప్రస్తుత అసోసియేషన్‌లో రక్షణ అధికారి బాధ్యతల్ని అప్పగించింది.

లింగ వివక్షను సవాలు చేస్తూ...

– అనితా కర్ణ్



అవకాశం ఇవ్వాలే గానీ మహిళలు ఏ రంగంలోనైనా రాణిస్తారని నమ్మేవారు అనిత. ఈమె 1997 నుంచీ అటవీశాఖలో పనిచేస్తున్నారు. గుజరాత్ కేడర్‌కు చెందినవారీమె. క్షేత్ర స్థాయి ఉద్యోగాల్లో మహిళల ప్రాధాన్యం తక్కువగా ఉన్న రోజుల్లోనే... గిర్ అభయారణ్యంలో 95 మంది మహిళలకు ఫారెస్ట్ గార్డులు, రేంజర్లుగా శిక్షణ ఇచ్చి... ఉద్యోగావకాశాలు కల్పించారీమె. చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా అనిత నిర్వర్తించిన బాధ్యతలు ఇప్పటికీ అక్కడి ఉద్యోగులకు పాఠాలే. ఆ నైపుణ్యాలే ఇప్పుడామెను ఐఎఫ్ఎస్ సంఘానికి అధ్యక్షురాలిని చేశాయి.

అభివృద్ధే లక్ష్యంగా... – మోనాలిసా డాష్



ఒడిశాలో పుట్టిపెరిగారు మోనాలిసా. ఎమ్మెస్సీ, ఎం.ఫిల్, ఎల్ఎల్‌బీ చేశారు. 'ఈ విద్యా నేపథ్యం... విభిన్న రంగాల్లో సంస్థాగత మార్పులు తేవడానికి ఉపయోగపడింద'ంటారు మోనాలిసా. ప్రస్తుతం ఆయుష్ మంత్రిత్వ శాఖలో జాయింట్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్నారు. సిక్కిం సమీపంలోని ఔషధ మూలికల గుర్తింపు, స్థానికులకు ఉపాధి, సంప్రదాయ వైద్యానికి ఉండే ప్రాధాన్యతను దేశవ్యాప్తంగా చాటిచెప్పారీమె. ఆ కృషే ప్రస్తుత అసోసియేషన్‌కు ఆమెను సెక్రటరీ జనరల్‌ను చేసింది.

తనదైన పనితీరుతో... – సురభీ రాయ్



2005 ఏజీఎమ్‌యుటీ(అరుణాచల్‌ప్రదేశ్, గోవా, మిజోరాం, యూనియన్ టెరిటరీస్) కేడర్‌కు చెందిన ఐఎఫ్ఎస్ సురభీ డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్స్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అడవుల రక్షణతోపాటు... జీవవైవిధ్య పర్యవేక్షణలోనూ ఈమె దిట్ట. వ్యవసాయ, ఉపాధి, నదులు, నీటి వనరుల సంరక్షణ విషయాలపై ఈమె రూపొందించిన క్రాస్-సెక్టోరియల్ ఫారెస్ట్రీ పాలసీలకు ఎన్నో పురస్కారాలు లభించాయి. క్షేత్రస్థాయిలో అమలై పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టాయి. ఇవే ఆమెను ప్రస్తుత అసోసియేషన్‌కు జాయింట్ సెక్రటరీని చేశాయి.

ఆర్థిక అంశాల్లో... – సువీనా ఠాకూర్



హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన సువీనా పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖలో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్స్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అడవులకు హాని చేయకుండా... ఆదాయాన్ని ఎలా పొందొచ్చు, ఆ వచ్చే మొత్తంతో అటవీ సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి, సిల్వీ కల్చర్ ద్వారా వృక్షాల పెంపకం, నిర్వహణ లాంటి విషయాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. 2014 బ్యాచ్‌కు చెందినవారీమె. వీటన్నింటి దృష్ట్యా ఈమెకు కోశాధికారిగా బాధ్యతలు అప్పగించారు.

రచనల ద్వారా... – చేష్టా సింగ్



ఈమె ఐఐటీ కాన్పూర్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. తండ్రి ప్రేరణతో సివిల్స్ రాశారీమె. 2018లో అరుణాచల్ ప్రదేశ్‌లోని కామ్లాంగ్ టైగర్ రిజర్వ్ సంరక్షణా బాధ్యతలు చేపట్టారు. అక్కడ జరిగే ఘర్షణలు, జీవవైవిధ్యం మీద 'టైగర్ రిజర్వ్ ఎట్ ఎ గ్లాన్స్' అనే పుస్తకాన్ని రాశారు. మహిళా అధికారిణిగా అడవుల సంరక్షణలో ఎదురైన అడ్డంకులు, అవగాహనా లోపాల్ని సామాజిక మాధ్యమాల్లో చెబుతుంటారు. ఈమె సేవల్ని మెచ్చిన ప్రభుత్వం సాహిత్య కార్యదర్శిగా నియమించింది.

అడవుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణలో ఈ మహిళలు తమదైన పరిష్కారాలు చూపించి... గ్రీన్ ఇండియా లక్ష్యంగా పనిచేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తారని ఆశిద్దాం!



స్వీట్ హోమ్

పూలు, పిల్లులు... స్టూల్ ఎక్కాయ్!

సృజనాత్మకత ఉండాలేకానీ, ప్రతి వస్తువూ ఓ కళాఖండంగా మారగలదు. కనువిందు చేయగలదు. అందుకే, ఫర్నిచర్ కూడా రోజుకో కొత్త హంగులతో, భిన్న రూపాల్లో వచ్చేస్తుంది. అలాంటివే ఈ స్టూళ్లు కూడా. రంగు రంగుల పూలు, పిల్లి, ఎలుగుబంటి... లాంటి జంతువులు, సీతాకోకచిలుకల రూపాలతో మార్కెట్లోకి వచ్చేశాయి. ఆకర్షణీయంగా ఉండాలన్నా, ప్రత్యేకించి పిల్లలు మెచ్చాలన్నా... ఇవి మంచి ఎంపిక. చెక్కవి కాబట్టి, మనం ఎలా వాడుకున్నా, పిల్లలు ఎలా ఆడుకున్నా విరుగుతాయనే ఆందోళన ఉండదు. పైగా, పిల్లల పుట్టినరోజుల్లాంటి సందర్భాల్లో బహుమతిగా ఇవ్వటానికీ భలే ఉంటాయివి. ఉపయోగానికి ఉపయోగం, అందానికి అందం. మీకూ నచ్చాయా మరి... అయితే, ఈసారి సాధారణ స్టూళ్లకు బదులుగా ఇవి తెచ్చేయండి. ఆనందం పంచేయండి!





మాటంటే... మాటే!

కెరియర్‌లో పురోగతిని కోరుకోని మహిళలు ఉంటారా? పని చేస్తున్న రంగమేదైనా తమని తాము నిరూపించుకోవాలి... తమ బెస్ట్ ఇవ్వాలనే అనుకుంటారు. అందుకు అనుగుణంగా తమ విధులని నిర్వర్తిస్తారు కూడా. కొందరైతే కార్యాలయ వేళల తర్వాత ఇంటి నుంచీ సేవలందిస్తుంటారు. దానికోసం ప్రత్యేకంగా సమయాన్నీ కేటాయిస్తారు. ఇన్ని చేసే వాళ్లు... ఉన్నత పదవులు చేపట్టే అవకాశం వచ్చేటప్పటికీ... తమ వల్ల కాదని వెనకడుగు వేస్తుంటారు. 'బాధ్యత తీసుకుంటా అని మాట ఇచ్చినప్పుడు అది... నీటి మీద రాతలు కాకూడదన్నది' చాలామంది మహిళల అభిప్రాయం. అందుకే అన్ని శక్తిసామర్థ్యాలు ఉన్నా కొత్త పదవులకి నో చెబుతుంటారు. దీంతోపాటు సంస్థాగత, ప్రత్యక్ష, పరోక్ష పరిస్థితులు, గతానుభవాలే ఇందుకు కారణాలు. మహిళా ప్రాతినిధ్యం పెరగాలని కోరుకునే సంస్థలు... ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలి. పై స్థానాల్లో ఉండేవారు... ఏదేమైనా వెన్నంటే నడిపిస్తాం అనే భరోసానివ్వాలి. సహోద్యోగులు సత్సంబంధాలతో మెలిగి, నాయకురాలి వెంటే నడవాలి. ఈ మార్పులన్నీ చేయగలిగితే... మహిళలు వారంతట వారే ముందుకు వచ్చి... బాధ్యతలు తీసుకుంటారు.




శోధిత

అతినిద్రతో అల్జీమర్స్!

ప్రీ, పోస్ట్ మెనోపాజ్ దశల్లో ఉన్నవారికంటే పెరిమెనోపాజ్ దశలోని మహిళలు తక్కువ సమయం నిద్రపోతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ దశలో కొందరు ఏడుగంటలకంటే తక్కువ నిద్రపోతున్నట్లు వీటిలో స్పష్టమైంది. అయితే, మెదడు ఆరోగ్యానికి ఏడు గంటల నిద్ర సరైందని చెబుతున్నారు పరిశోధకులు. ఈ ఏడు గంటల్లో ఒక గంట గాఢ నిద్రలోకి వెళ్లడంతోపాటు గంటన్నర రెమ్ (ర్యాపిడ్ ఐ మూవ్‌మెంట్)లోకి వెళ్తామట. ఎనిమిది గంటల నిద్రతో కొంత నయం, కానీ అది తొమ్మిది గంటలకు పెరిగితే మెదడుకు చేటు చేయడమే కాదు, అల్జీమర్స్‌కూ దారి తీస్తుందట. నిద్రతో మెదడు తనను శుభ్రపరుచుకోవడమే కాదు, పునరుద్ధరించుకుంటుంది. దీనిద్వారా అనవసరమైన ప్రభావాలను తగ్గించి తర్వాత రోజుకు తనను సిద్ధం చేసుకుంటుంది. గాఢ నిద్ర సమయం పెరిగినా పర్వాలేదు కానీ, కలలు వచ్చే దశ అయిన 'రెమ్' నిద్ర ఒక్క శాతం పెరిగితే మతిమరుపు రిస్కు 9శాతం పెరుగుతుందట. కాబట్టి తగిన సమయం నిద్రపోవడంతోపాటు అతిగా నిద్రపోకుండా ఉండటమూ ముఖ్యమేనంటున్నారు అధ్యయనకర్తలు.

పోషకాల మూట!



పప్పు, ఉప్మా, కిచిడీ.. ఎందులో చూసినా టొమాటోలేనని విసుక్కుంటారు కొందరు. చారులోంచి కరివేపాకుని వేరుచేసినట్టు టొమాటో ముక్కల్ని తీసి పడేస్తుంటారు. దీన్లో పోషకాల గురించి తెలిస్తే ఇకపై అలా చేయలేరు.

✦ టొమాటోలో ఫోలేట్, పొటాషియం, విటమిన్ సి, విటమిన్ కె వంటి సూక్ష్మ పోషకాలు అధికం. దీన్లో యాంటీ ఆక్సిడెంట్లూ పుష్కలం. ఇవి గుండెకు, మెదడుకు మేలు చేస్తాయి. కణాలు దెబ్బతినకుండా కాపాడి క్యాన్సర్ ముప్పుని తగ్గిస్తాయి.

✦ టైప్-2 డయాబిటీస్ ప్రమాదాన్ని నివారిస్తాయి. వీటిలోని పోషకాలు రక్తపోటునీ తగ్గిస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

✦ దీన్లోని లైకోపీన్ కెరోటినాయిడ్ పిగ్మెంట్... అల్జీమర్స్ బారిన పడకుండా కాపాడుతుంది. ల్యూటేన్, జియాంజాంతిన్ డిజిటల్ పరికరాల నుంచి వెలువడే నీలికాంతి నుంచి కళ్లను రక్షిస్తాయి.

✦ వీటిలోని ఫైబర్ మలబద్ధకాన్ని తగ్గిస్తుంది.

✦ ఒక కప్పు టొమాటో రసంలో 45 మి.గ్రా. విటమిన్ సి ఉంటుంది. ఇది మనకు రోజులో అవసరమయ్యే దాన్లో 75 శాతానికి సమానం. దీనివల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

అందుకే కూరగాయల్లో కలిపి వండుతారో, కూర, పచ్చడి చేస్తారో టొమాటోని అయితే రోజూ ఇంట్లోవాళ్ల ఒంట్లోకి పంపండి!

సమాచారం ఎవరిస్తున్నారు?



ఆన్‌లైన్ మోసాలు, వేధింపుల బారినపడుతోన్న వారిలో అమ్మాయిలే ఎక్కువ. దీన్నుంచి తప్పించుకోవాలంటే, ఇవి గమనించుకోవాలి. మనం ఇంటర్నెట్‌లో చేసే ప్రతి స్క్రోల్, స్వైప్, కొనుగోలు... అల్గారిథమ్‌లోకి చేరుతుంది. కొన్ని సంస్థలు మన సమాచారాన్ని వాణిజ్య సంస్థలకు అందిస్తాయి. వాటి నుంచి మనకు నోటిఫికేషన్లు, ప్రకటనలు వస్తాయి. పరోక్షంగా మన మీద నిఘా పెట్టడమే కాదు, మన జీవన విధానాన్నీ నిర్దేశిస్తాయివి. కాబట్టి ఆన్‌లైన్లో ప్రతి అడుగునీ జాగ్రత్తగా వేయాలి. ఈసారి వెబ్‌సైట్లలో సైనప్ అయినప్పుడు మిడిల్ నేమ్‌గా ఆ కంపెనీల పేర్లనే ఇవ్వండి. తర్వాత మీకు వచ్చే మెసేజ్‌లు, ఈ-మెయిల్‌లో మిడిల్ నేమ్‌గా ఏ కంపెనీ పేరుందో గమనించుకోండి. అప్పుడు అర్థమవుతుంది మన వ్యక్తిగత వివరాల్ని వాణిజ్య ప్రయోజనాల కోసం పంచుకుంటుందెవరో! ఇంకోసారి ఆ వెబ్‌సైట్‌కి వెళ్లేటప్పుడు జాగ్రత్తపడండి. అలాగే వ్యక్తిగత వివరాల్ని అడగ్గానే ఇవ్వకుండా, ఆ వెబ్‌సైట్ నమ్మకమైనదా కాదా... అనే కోణంలో ఆలోచించండి.

చిట్టి చిట్టి ఆనందాలు...

ఇదో ట్రెండ్



వారాంతం వచ్చిందంటే చాలు... స్పాలు, రిట్రీట్‌లు, గంటల తరబడి షాపింగ్‌లకు ప్రాధాన్యమిచ్చే అమ్మాయిలే ఎక్కువ. కానీ, జెన్‌జీ అమ్మాయిలు మాత్రం... ఇవన్నీ మాకు బోరింగ్ అంటున్నారు. సెల్ఫ్‌కేర్ కోసం ఓ రోజు ప్రత్యేకంగా కేటాయించుకోవట్లేదు. ఆనందించటానికి వారమంతా ఎదురుచూడటమూ లేదు. చేసే పని నుంచి ఓ పది నిమిషాలు బ్రేక్ తీసుకుని... అలా ఇష్టమైన ఓ కప్ ఐస్‌క్రీమ్ తినటమో, ఎప్పుడూ రుచి చూడని ఓ కేక్ ముక్కని లాగించేయటమో చేస్తున్నారు. లేదూ స్నేహితులతో కలిసి... 'ఇట్స్ కాఫీ టైమ్...' అంటూ ఎంజాయ్ చేస్తున్నారు. దీనివల్ల చిన్న చిన్న ఆనందాల్ని కోల్పోకుండా ఉంటామన్నది వాళ్ల ఫీలింగ్ మరి. ఇదే 'లిటిల్ ట్రీట్ కల్చర్'గానూ మారింది. ఖరీదైన వస్తువులు కొంటే ఆ సంతోషం కాసేపే. కానీ, తక్కువ ఖర్చయ్యే ఇలాంటి చిన్నచిన్నవే ఎక్కువ ఆనందాన్ని ఇస్తాయంటున్నారు. అంతేకాదు, ఈ చిన్న ట్రీట్స్... సెల్ఫ్ కంట్రోల్‌ని ఇవ్వటంతోపాటు, ఒత్తిళ్ల నుంచి మనసు మళ్లేలానూ చేస్తాయట. భావోద్వేగాలనూ నియంత్రించి, ఫీల్‌గుడ్‌నీ ఇస్తాయట. అందుకే, జెన్‌జీల మనసు తెలుసుకున్న ఇంటర్నేషనల్ బ్రాండ్‌లూ, స్థానిక వ్యాపార సంస్థలు సైతం ఈ 'లిటిల్ ట్రీట్ ఎకానమీ'ని మార్కెటింగ్ చేస్తున్నాయట.



వేటగాళ్లకు సింహస్వప్నం

మధ్యప్రదేశ్‌లోని శహడోల్ ఫారెస్ట్ సర్కిల్‌లో సేవలందిస్తున్న 'జీని' అనే ఈ శునకం వన్య ప్రాణుల వేటగాళ్లు, స్మగ్లర్ల పాలిట సింహ స్వప్నంగా మారింది. నేరగాళ్లను అడ్డుకోవడం తోపాటు అడవి జంతువులను చంపినవారిని గుర్తించడంలో అధికారులకు సాయపడుతోంది. 2020 నుంచి ఇప్పటివరకు 66 కేసుల్లో మొత్తం 248 మంది నిందితులను పట్టించింది. బెల్జియన్ మాలినోయిస్ జాతికి చెందిన జీనిని బెల్జియం నుంచి తీసుకొచ్చారు.

తేజస్వీకి తాఖీదు

పట్నా: ఆర్జేడీ నేత, బిహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ ఓటరు కార్డు విషయంలో చిక్కుల్లో పడ్డారు. తన దగ్గర ఉన్న ఎపిక్ నంబరుతో ఓటరు ఐడీ కార్డు కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేశానని, తన పేరు ముసాయిదా ఓటర్ల జాబితాలో కనిపించలేదని లేదని తేజస్వీ పేర్కొన్న సంగతి తెలిసిందే. దీనికి అధికారులు స్పందిస్తూ.. ఆయన ఓటరు ఐడీ కార్డు నంబరు మారిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తేజస్వీకి దిఘా అసెంబ్లీ నియోజవర్గ ఎన్నికల అధికారి ఆదివారం నోటీసులు పంపారు. "మీరు ప్రస్తావించిన నంబరును మేం జారీ చేయలేదని మా దర్యాప్తులో తేలింది. దీనిపై సమగ్ర విచారణ చేయాలి. అసలైన ఎపిక్ కార్డును మాకు స్వాధీనం చేయండి'' అని ఆ నోటీసులో పేర్కొన్నారు.



మీ ఆలోచనలను వారికి తెలియజేయండి!

చాలా విషయాల్లో మన అసంతృప్తులకు మూలం ఏంటో తెలుసా..? ఇతరులకు తెలియకుండా వారిపై మనం పెట్టుకునే అంచనాలు! మీ ఆలోచనలను మీ మెదడులోనే ఉంచుకొని.. వాటికి అనుగుణంగా ఇతరులు నడుచుకోవాలని ఆశించడం దురాశే అవుతుంది. అవతలి వ్యక్తులపై మీకున్న అంచనాలను వారికి స్పష్టంగా తెలియజేయడం అలవాటు చేసుకోండి.


– ఒలుడాయో సోకుంబి, ఇమ్మిగ్రేషన్ ఎక్స్‌పర్ట్

శివాజీ గడ్డపై ఇవేంటి?

- ఎంఎన్ఎస్ ఆగ్రహం.. ఓ బార్‌పై దాడి

ఠాణే: నవీ ముంబయిలోని ఓ డాన్స్ బార్‌పై మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన(ఎంఎన్ఎస్) కార్యకర్తలు శనివారం రాత్రి దాడికి పాల్పడ్డారు. మందుబాటిళ్లు, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. అద్దాలను పగలగొట్టారు. ఛత్రపతి శివాజీ పుట్టిన నేలపై డాన్స్‌బార్లకు చోటులేదని నినాదాలు చేశారు. మహారాష్ట్ర వ్యాప్తంగా డాన్స్‌బార్ల విష సంస్కృతి నానాటికీ పెరిగిపోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గడ్కరీ నివాసానికి బాంబు బెదిరింపు



నాగ్‌పుర్: కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ.. నాగ్‌పుర్‌లో ఉంటున్న నివాసానికి బాంబు బెదిరింపు వచ్చింది. అప్రమత్తమైన పోలీసులు బాంబ్‌స్క్వాడ్ సహాయంతో తనిఖీలు నిర్వహించారు. పేలుడు పదార్థాలు దొరకకపోవడంతో అది నకిలీ బెదిరింపు అని తేల్చారు. అనంతరం ఫోన్ నంబరు ఆధారంగా గంటల వ్యవధిలోనే నిందితుడిని అరెస్టు చేశారు. కాల్ చేసిన వ్యక్తిని నాగ్‌పుర్ తులసీ బాగ్ రోడ్‌లోని మద్యం దుకాణంలో పనిచేసే ఉమేష్ విష్ణు రౌత్‌గా గుర్తించామన్నారు.

త్వరలోనే పట్టాలెక్కనున్న తొలి బుల్లెట్ రైలు: వైష్ణవ్



భావ్‌నగర్: దేశంలో తొలి బుల్లెట్ రైలు అతి త్వరలో ముంబయి- అహ్మదాబాద్ మధ్య అందుబాటులోకి రాబోతోందని, ఇది రెండు గంటల ఏడు నిమిషాల్లో గమ్యాన్ని చేరుకుంటుందని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఆదివారం భావ్‌నగర్ నుంచి మూడు రైళ్లను ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. బుల్లెట్ రైలు గంటకు 302 కి.మీ. గరిష్ఠ వేగంతో ప్రయాణిస్తుందని చెప్పారు. నరేంద్రమోదీ సర్కారులో 11 ఏళ్ల హయాంలో 34 వేల కి.మీ. నూతన రైలు మార్గాల నిర్మాణం పూర్తయిందని, రోజుకు సగటున 12 కి.మీ. చొప్పున ఇవి తయారవుతున్నాయని తెలిపారు.

చిన్న రాష్ట్రంలో పెద్ద డ్రగ్స్ పుట్ట

ఆయిజోల్: ఈశాన్య రాష్ట్రం మిజోరంలో డ్రగ్స్ పుట్ట బయటపడింది. ట్రక్కులో తరలిస్తున్న రూ.350 కోట్ల విలువైన క్రిస్టల్ మెథాంఫెటామైన్, హెరాయిన్‌ను పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. సబ్బుల పెట్టెల మధ్యలో ఉంచి తరలిస్తున్న ఈ డ్రగ్స్‌ను పట్టుకున్నారు. వాహన డ్రైవరును అదుపులోకి తీసుకున్నారు.

మనిషే పుస్తకం



పాలక్కాడ్: లైబ్రరీలో పుస్తకాల స్థానంలో మనుషులుంటే.. ఆ ఊహే విచిత్రంగా ఉంది కదా.. కానీ అది నిజం కాబోతోంది.. కేరళలోని ఐఐటీ పాలక్కాడ్ దీనిని ఆచరణలోకి తీసుకురాబోతోంది. ఈ 'హ్యూమన్ లైబ్రరీ'లో సందర్శకులు మనుషులను చదవొచ్చు. అంటే లైబ్రరీలో ఉండే వ్యక్తులు తమ కథలను సంభాషణల ద్వారా సందర్శకులకు వివరిస్తారు. గత ఏడాది డెన్మార్క్‌లో ప్రారంభమైన హ్యూమన్ లైబ్రరీ స్ఫూర్తితో దీనిని ప్రారంభిస్తున్నామని ఐఐటీ పాలక్కాడ్ అధికారులు తెలిపారు.

రోదసిలో మన పంట



దిల్లీ: లద్దాఖ్‌లో పండే బెర్రీలు (సీబక్‌థోర్న్), హిమాలయన్ గోధుమల (బక్‌వీట్) విత్తనాలను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో పరీక్షించేందుకు రంగం సిద్ధమైంది. క్రూ-11 మిషన్ ద్వారా వీటితోపాటు 11 దేశాలకు చెందిన విత్తనాలను ఐఎస్ఎస్‌కు తీసుకెళ్లిన అమెరికా అంతరిక్ష సంస్థ నాసా వాటిని పరీక్షించనుంది. బయో ఆస్ట్రోనాటిక్స్ సంస్థ జాగ్వార్ స్పేస్ ఈ ప్రయోగంలో భాగంగా వారంపాటు విత్తనాలను మైక్రోగ్రావిటీ పరిస్థితులకు తీసుకెళ్లి పరీక్ష జరపనుంది. క్రూ-11 శుక్రవారం నింగిలోకి దూసుకెళ్లింది.

దేశాధినేతతో ప్రభుత్వాధినేత భేటీ

ఆంతర్యమేమిటో!



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో సమావేశమైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

దిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా గంటల వ్యవధిలో ఆదివారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో వేర్వేరుగా రాష్ట్రపతి భవన్‌లో సమావేశమయ్యారు. ఈ వరుస భేటీల వెనక కారణాలు తెలియరాలేదు. దీనిపై ప్రధాని కార్యాలయం ఎలాంటి ప్రకటనా విడుదల చేయలేదు. అమిత్‌షా మాత్రం రాష్ట్రపతితో తన సమావేశానికి సంబంధించిన ఫొటోను 'ఎక్స్'లో షేర్ చేశారు. బ్రిటన్, మాల్దీవుల పర్యటన తర్వాత రాష్ట్రపతిని మోదీ కలవడం ఇదే తొలిసారి. బిహార్ ఓటర్ల జాబితాపై జరుగుతున్న ప్రత్యేక ముమ్మర సవరణపై ప్రత్యేక చర్చ కోసం పార్లమెంటులో విపక్షాలు పట్టుబడుతున్న నేపథ్యంలో అటు ప్రధాని.. ఇటు హోంమంత్రి రాష్ట్రపతిని కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

సభలు సజావుగా సాగేనా..

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచి ఇంతవరకు ఉభయసభల్లో కొనసాగుతున్న ప్రతిష్టంభన సోమవారం తర్వాతైనా వీడిపోతుందనే ఉద్దేశంతో కొన్ని బిల్లుల్ని ముందుకు తీసుకువెళ్లాలని ప్రభుత్వం యోచిస్తోంది. క్రీడాసంస్థల పనితీరులో పారదర్శకతకు ఉద్దేశించిన 'జాతీయ క్రీడా పాలన బిల్లు'ను లోక్‌సభ ఆమోదానికి ప్రవేశపెట్టనున్నారు. ఆపరేషన్ సిందూర్‌పై రెండ్రోజులు జరిగిన ప్రత్యేక చర్చ తప్పిస్తే మిగతా రోజులన్నీ బిహార్ ఓటర్ల జాబితా అంశంతో కొట్టుకుపోయాయి. విపక్షం తన పట్టు సడలించకపోతే గందరగోళం నడుమే బిల్లుల్ని ఆమోదింపజేసుకోవాలని ప్రభుత్వం ప్రయత్నించనుంది. ఓటర్ల జాబితా అంశంపై నిరసన వ్యక్తం చేయడానికి ఈ నెల 8న ర్యాలీ నిర్వహణకు విపక్షాలు యోచిస్తున్నాయి. రాహుల్ 7వ తేదీ రాత్రి విపక్ష నేతలకు విందు ఇవ్వనున్నట్లు తెలిసింది.



తూటా రక్షక కవచం.. 'చెక్క' చెదరదు

వాషింగ్టన్: మనం ఇప్పటివరకు ప్రత్యేక పదార్థాలతో తయారయ్యే తూటారక్షక (బుల్లెట్‌ప్రూఫ్) కవచాలు/ వాహనాల గురించి విన్నాం. ఈ జాబితాలో బుల్లెట్‌ప్రూఫ్ కలప చేరుతోంది. ఉక్కు కంటే దృఢంగా ఉండే కలపను అమెరికాకు చెందిన ఓ కంపెనీ తయారుచేసింది. యుద్ధభూమిలో సైనిక అవసరాలకు తగ్గట్టుగా దీనిని రూపొందించారు. ఈ కలపతో నిర్మించిన భవనాలు వాతావరణ మార్పులకు ప్రభావితం కావు. సాధారణ కలప కంటే దృఢంగా ఉంటాయి. ఆకాశహర్మ్యాల్లో కూడా వీటిని వినియోగించవచ్చు. కలపలో ఉండే లెగ్నిన్ అనే పాలిమర్‌ను రసాయనాల సాయంతో తొలగించి దాని పరిమాణాన్ని 80% తగ్గిస్తారు. దీంతో బుల్లెట్‌ని కూడా ఆపగలిగేలా దృఢంగా అది తయారవుతుంది. ఈ కలప వినియోగంతో నిర్మాణ వ్యయం తగ్గుతుంది. స్వీడన్‌లో ఓ పెద్ద అపార్ట్‌మెంటును కూడా దీనితో నిర్మించారు.

మోదీ పేరు చెప్పాలని హింసించారు

ప్రజ్ఞా ఠాకుర్ ఆరోపణ



భోపాల్: మాలేగావ్ పేలుళ్ల కేసులో నిర్దోషిగా విడుదలైన తర్వాత తొలిసారిగా ఆదివారం భోపాల్‌కు వచ్చిన భాజపా మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకుర్‌కు ఘనస్వాగతం లభించింది. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె.. 'ప్రధాని మోదీ, యూపీ సీఎం ఆదిత్యనాథ్, ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్‌లపై తప్పుడు ఆరోపణలు చేయాలని నాపై ఒత్తిడి తెచ్చారు. రామ్ మాధవ్‌సహా పలువురు నేతల పేర్లు చెప్పాలని చిత్రహింసలకు గురిచేశారు. ఎంత ఒత్తిడి చేసినా నోరు విప్పలేదు. తప్పుడు పేర్లు చెప్పలేదు' అని పేర్కొన్నారు.

ఉత్తరాదిన కుండపోత

శిమ్లా, లఖ్‌నవూ: ఉత్తర భారతాన్ని వర్షాలు ముంచెత్తుతున్నాయి. భారీగా వరద నీరు వచ్చి చేరడంతో పలు రాష్ట్రాల్లో నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. దిల్లీలో ఆదివారం ఉదయం భారీవర్షాలు కురవడంతో పలు ప్రాంతాలు నీట మునిగాయి. ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఉన్న త్రివేణీ సంగమం వద్ద నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. వారణాసిలో గంగానది నీటిమట్టం 71.50 మీటర్లకు చేరింది. హిమాచల్ ప్రదేశ్‌లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వానల కారణంగా రెండు జాతీయ రహదారులతో పాటు 370 రోడ్లను మూసివేశారు. సోమ, మంగళవారాల్లో ఈ రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) హెచ్చరించింది. జూన్ 20 నుంచి ఆగస్టు 2 వరకూ కురిసిన వానలకు హిమాచల్‌లో 101 మంది మృతిచెందారు. రూ.1,692 కోట్ల ఆస్తినష్టం వాటిల్లింది. పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తీస్తా, జలఢాకా నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. అటు బిహార్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అస్సాంలో రానున్న రెండు రోజులు, కేరళలో మరో ఐదు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ ప్రకటించింది.



నీటిలో గ్యాస్ సిలిండర్లు తేలియాడుతున్న ఈ దృశ్యం ఉత్తర్‌ప్రదేశ్‌లో వర్షబీభత్సానికి అద్దం పడుతోంది. మీర్జాపుర్‌లో ఆదివారం ఓ గోదామును వరదనీరు ముంచెత్తడంతో సిలిండర్లను భద్రంగా తరలించడానికి శ్రమిస్తున్న కార్మికుడు

ఈసీది అధికార దుర్వినియోగం: చిదంబరం

- ఖండించిన ఎన్నికల సంఘం



దిల్లీ: ఎన్నికల సంఘం(ఈసీ)పై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి.చిదంబరం కీలక వ్యాఖ్యలు చేశారు. బిహార్‌లో ఓటర్ల జాబితాపై చేస్తున్న ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)తో ఈసీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించారు. రాష్ట్రాల ఎన్నికల స్వరూపాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. దీన్ని రాజకీయంగా, చట్టబద్ధంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. "బిహార్‌లో 65 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదంలో ఉన్నారు. తమిళనాడులో 6.5 లక్షల మంది ఓటర్లు పెరిగారు. ఇది చట్టవిరుద్ధం. ఆందోళన కలిగించే విషయం" అని చిదంబరం ఆందోళన వ్యక్తంచేశారు. అయితే చిదంబరం వ్యాఖ్యలను నిరాధారమైనవిగా, తప్పుదోవ పట్టించేవిగా ఈసీ పేర్కొంది. ప్రజాప్రాతినిధ్య చట్టం- 1950లోని సెక్షన్ 19(బీ) ప్రకారం.. ఒక నియోజకవర్గంలో నివసిస్తున్న వ్యక్తి స్థానిక ఓటర్ల జాబితాలో తన పేరు నమోదు చేసుకోవడానికి అర్హుడని పేర్కొంది. తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తి దిల్లీలో నివసిస్తున్నట్లయితే.. దిల్లీలో ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హుడని పేర్కొంది. అలాగే బిహార్‌కు చెందిన వ్యక్తి చెన్నైలో ఉంటే.. అదే విధానం వర్తిస్తుందని తెలిపింది. ఈ నేపథ్యంలో.. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి నేతలు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం తగదని ఈసీ పేర్కొంది. ఈ ప్రక్రియను అడ్డుకునేందుకు ఉద్దేశపూర్వకంగానే ఇటువంటి సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. అదేవిధంగా.. తమిళనాడులో 6.5 లక్షల మంది ఓటర్ల నమోదు గురించి తప్పుడు ప్రచారం జరుగుతోందని చెప్పింది. ఆ రాష్ట్రంలో ఇంకా ఓటర్ల జాబితా సవరణ చేపట్టలేదని.. కాబట్టి బిహార్‌లోని ఎస్ఐఆర్ ప్రక్రియతో ముడిపెట్టడం అసంబద్ధమని స్పష్టం చేసింది.

నా సమాధి నేనే తవ్వుకుంటున్నా

- సొరంగంలో జీవచ్ఛవంలా ఇజ్రాయెల్ బందీ



ఇంటర్నెట్ డెస్క్: ఇజ్రాయెల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ వ్యవహారం కొలిక్కి రాకపోవడంతో గాజాలో పరిస్థితులు దారుణంగా మారిపోతున్నాయి. నిర్బంధంలో ఉన్న బందీల పరిస్థితిని వివరిస్తూ హమాస్ ఇటీవల కొన్ని వీడియోలు విడుదల చేసింది. 22 నెలలుగా భూగర్భ సొరంగంలో బందీగా ఉంటూ.. ఆహారం దొరికే పరిస్థితి లేక ఎముకల గూడులా మిగిలిన ఎవ్యతార్ డేవిడ్ (24) అనే యువకుడు తన సమాధిని తానే తవ్వుకుంటున్నానని చెబుతున్నట్లు ఓ వీడియోలో ఉంది. "రోజురోజుకీ శరీరం క్షీణిస్తోంది. విడుదలకు సమయం మించిపోతోంది. నా సమాధిని నేనే సిద్ధం చేసుకుంటున్నా" అని పేర్కొన్నాడు. రెండ్రోజుల వ్యవధిలో ఇలాంటి రెండు వీడియోలను హమాస్ విడుదల చేసి.. కేవలం కాల్పుల విరమణ మాత్రమే ఇలాంటి 50 మందిని సజీవంగా ఉంచుతుందనే వ్యాఖ్యలు జోడించింది. ఆహార కేంద్రాల వద్ద జరిగిన తాజా దాడుల్లో 23 మంది ప్రాణాలు కోల్పోయారు. మరోపక్క సిరియాలో పెద్దఎత్తున ఘర్షణలు చోటుచేసుకున్నాయి.

పాక్ హస్తం మరోసారి బహిర్గతం

- పీవోకేలో పహల్గాం ఉగ్రవాది అంత్యక్రియలు

ఇంటర్నెట్ డెస్క్: పహల్గాం ఉగ్ర దాడికి పాల్పడింది పాక్ ఉగ్రవాదులే అనడానికి మరో ఆధారం బయటపడింది. ఇటీవలే 'ఆపరేషన్ మహాదేవ్'లో హతమైన ముగ్గురు ఉగ్రవాదుల్లో ఒకడైన తాహిర్ హబీబ్‌కు పీవోకేలో జనాజా విధానంలో అంత్యక్రియలు నిర్వహించారు. చనిపోయిన వ్యక్తి మృతదేహం అందుబాటులో లేనప్పుడు ఈ విధానంలో అంతిమ సంస్కారాలు నిర్వహిస్తారు. రావల్‌కోట్ ఖైగలాలో పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వీడియోలు, చిత్రాలను ఓ టెలిగ్రామ్ ఛానల్‌లో పోస్టు చేశారు. స్థానిక లష్కరే తయ్యిబా కమాండర్ రిజ్వాన్ హనీఫ్, ఇతర సభ్యులు అంత్యక్రియల్లో భాగం కావాలని ప్రయత్నించారు. అయితే హనీఫ్‌ను తాహిర్ కుటుంబీకులు అడ్డుకున్నారు.

ఇరాన్ అణు పరిశోధనలకు పూర్తి మద్దతు: పాక్

శాంతియుత అవసరాల కోసం అణు సామర్థ్యాన్ని పెంపొందించుకునే హక్కు ఇరాన్‌కు ఉందని పాకిస్థాన్ స్పష్టం చేసింది. ఈ అంశంలో ఆ దేశానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని పేర్కొంది. శనివారం పాక్‌కు చేరుకున్న ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్.. ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో భేటీ అయ్యారు. అనంతరం విడుదల చేసిన ఉమ్మడి ప్రకటనలో ఇరాన్ అణు పరిశోధనలకు మద్దతిస్తూ పాక్ తన వైఖరిని వెల్లడించింది. అమెరికా, ఇరాన్‌ల మధ్య ఘర్షణాత్మక వాతావరణం నెలకొన్న నేపథ్యంలో.. పాక్ ఈ ప్రకటన చేయడం గమనార్హం.

కుక్కలు నాకిన కూరగాయలతో విద్యార్థులకు భోజనం

- 78 మందికి రేబిస్ టీకా!

బలౌదబజార్: వీధి కుక్కలు కలుషితం చేసిన కూరగాయలతో వండిన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు పెట్టడం ఛత్తీస్‌గఢ్‌లో కలకలం రేపింది. ఆ భోజనం తిన్న 78 మంది విద్యార్థులకు రేబిస్ టీకా వేశారు. బలౌదబజార్ జిల్లా లఛన్‌పుర్ గ్రామంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఈ ఘటన జరిగింది. మధ్యాహ్న భోజనం వండుతున్న సమయంలో వీధి కుక్కలు వచ్చి వంటగది దగ్గర ఉన్న కూరగాయలను నాకాయి. ఈ విషయాన్ని సిబ్బందికి విద్యార్థులు చెప్పినా పట్టించుకోలేదు. అలాంటిదేమీ జరగలేదని, మొత్తం 84 మందికి భోజనం పెట్టారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో వంట చేసే సహాయక సంఘాన్ని తాత్కాలికంగా తొలగించారు.

రష్యా చమురు గిడ్డంగిపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి

మాస్కో: రష్యాలోని నల్ల సముద్రం సోచీ రిసార్టు సమీపంలో ఉన్న చమురు గిడ్డంగిపై ఉక్రెయిన్ డ్రోన్ చేసిన దాడి భారీ అగ్ని ప్రమాదానికి దారి తీసింది. డ్రోన్ శకలాలు ఇంధన ట్యాంకుపై పడటంతో మంటలు చెలరేగాయి. వీటిని అదుపులోకి తెచ్చేందుకు 120 మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది శ్రమించారు. సోచీ విమానాశ్రయంలో పలు విమాన రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. కీవ్ 93 డ్రోన్లతో దాడిచేసిందని మాస్కో అధికారులు తెలిపారు. 76 డ్రోన్లు, 7 క్షిపణులతో రష్యా దాడిచేసిందని ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. వీటిలో 60 డ్రోన్లు, 6 క్షిపణులను అడ్డుకున్నట్లు వెల్లడించారు.

ప్రియుడితో భర్తను చంపించిన మహిళ

- సన్నిహిత వీడియోను కుమార్తె చూడటంతో ఘాతుకం

గురుగ్రామ్: ఓ మహిళ పక్కింటి వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగించింది. వారిద్దరూ సన్నిహితంగా ఉన్న ఓ వీడియోను ఆమె కుమార్తె అతడి ఫోన్‌లో చూసింది. ఆ విషయాన్ని తన తండ్రికి(మహిళ భర్తకు) చెప్పడంతో ఎలాగైనా భర్త అడ్డు తొలగించుకోవాలని ఆ మహిళ తన ప్రియుడితో కలిసి పథకం వేసింది. అనుకున్నట్లుగానే భర్తను ప్రియుడి సాయంతో హత్య చేయించింది. ఆ తర్వాత తన భర్త కనిపించడం లేదంటూ ఆందోళన నటిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారిస్తున్న క్రమంలో పక్కింటి వ్యక్తి తనపై అత్యాచారం చేసి, వీడియో తీసి బెదిరిస్తున్నాడని పొంతన లేని సమాధానాలు చెప్పింది. అనుమానం వచ్చిన పోలీసులు క్షుణ్నంగా దర్యాప్తు చేయడంతో ఈ హత్యోదంతం వెలుగులోకి వచ్చింది. గురుగ్రామ్‌లో జులై 26న జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు మృతుడు విక్రం భార్య సోనీ దేవి(35)తోపాటు ఆమె ప్రియుడు రవీందర్(34), హత్యకు సహకరించిన మనీశ్(19), ఫరియాద్(20), సంతర్‌పాల్(60)లను తాజాగా అరెస్టు చేశారు.




యూపీలోని గోండా జిల్లాలో సరయూ నది కాలువలో పడిన ఎస్‌యూవీ

యూపీలో ఘోర ప్రమాదం..

- వాహనం కాలువలో పడి 11 మంది మృతి

గోండా: ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోండా జిల్లాలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు మహిళలు, ముగ్గురు చిన్నారులు సహా 11మంది మృతి చెందారు. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. సీహాగావ్ గ్రామానికి చెందిన 15 మంది ఖర్గుపుర్‌లోని పృథ్వీనాథ్ ఆలయ దర్శనానికి బొలెరో వాహనంలో బయలుదేరారు. పరాసరాయ్- అలావాల్ డియోర మార్గంలోని రెహారా గ్రామ సమీపంలోని వంతెన వద్దకు రాగానే వీరి వాహనం అదుపుతప్పి సరయూ కాలువలో పడింది.

రూ.2 వైద్యుడి కన్నుమూత



కన్నూర్: కేరళలోని కన్నూర్‌లో 5 దశాబ్దాలపాటు వేల మంది రోగులకు రూ.2కే వైద్యం చేసిన ప్రముఖ వైద్యుడు ఎ.కె. రాయరు గోపాల్ (80) శనివారం కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యల కారణంగా ఆయన మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం అంత్యక్రియలు జరిగాయి. గోపాల్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అందరూ ఆయన్ను 2 రూపాయల వైద్యుడని పిలిచేవారు. ఔషధాలు సైతం కొనలేని వారికి గోపాలే స్వయంగా మందులు సమకూర్చేవారు.

భారతీయ వృద్ధుల ప్రయాణం విషాదాంతం



న్యూయార్క్: అమెరికాలోని న్యూయార్క్‌కు చెందిన నలుగురు భారత సంతతి వృద్ధులు అదృశ్యమైన ఘటన విషాదంగా మారింది. వెస్ట్ వర్జీనియాలోని ఓ ఆధ్యాత్మిక ప్రదేశానికి వెళ్తుండగా వీరు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో నలుగురూ ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన ఆశా దివాన్(85), కిశోర్ దివాన్ (89), శైలేష్ దివాన్ (86), గీతా దివాన్ (84)లుగా గుర్తించారు. గత నెల 29న వీరి వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లడంతో వెంటనే ఎవరూ గమనించలేదని తెలుస్తోంది. పోలీసులు నాలుగు రోజులుగా వీరికోసం హెలికాప్టర్ల సాయంతో గాలించారు.

విమాన సిబ్బందిపై లెఫ్టినెంట్ కర్నల్ దాడి



నలుగురికి తీవ్రగాయాలు

దిల్లీ: పరిమితికి మించి తీసుకొచ్చిన లగేజీకి అదనపు రుసుం చెల్లించాలని కోరిన స్పైస్‌జెట్ సిబ్బందిపై సీనియర్ సైనికాధికారి ఒకరు తీవ్రంగా దాడిచేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదుచేశారు. గతనెల 26న శ్రీనగర్ విమానాశ్రయంలో ఈ దాడి చోటు చేసుకుంది. ముష్టిఘాతాలతో కొందరిపై, బలమైన ఇనుప స్టాండుతో మరికొందరిపై లెఫ్టినెంట్ కర్నల్ ఆర్.కె.సింగ్ దాడిచేయడంతో వారందరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఒకరికి వెన్నెముక దెబ్బతింది. మరొకరికి ముక్కు, దవడ చిట్లిపోయి రక్తం కారింది. స్పృహతప్పి పడిపోయినా విడవకుండా కొడుతున్న దృశ్యాలు వీడియోలో నమోదయ్యాయి.

హసీనా నేరాలపై విచారణ ఆరంభం



ఢాకా: విద్యార్థుల ఉద్యమాన్ని అణచివేయడంలో నేరాలకు పాల్పడినట్లు అభియోగాలు ఎదుర్కొంటున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై 'అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్' (ఐసీటీ) ఆదివారం విచారణ ప్రారంభించింది. హసీనాయే అన్ని నేరాలకు మూల కేంద్రమని తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ ప్రాసిక్యూటర్ తాజుల్ ఇస్లాం ఆరోపించారు. ఆమెకు గరిష్ఠ శిక్ష విధించాలన్నారు. భారీ సంఖ్యలో ఉద్యమకారులను హతమార్చడం లేదా హింసించడం వంటి నేరాభియోగాలను ఆమెపై మోపారు. హసీనా భారత్‌లో ఆశ్రయం పొందడంతో ఆమె పరోక్షంలో విచారణ మొదలైంది. జులై 10న హసీనాతో సహా ముగ్గురిపై ఐసీటీ అభియోగాలు మోపింది. ధిక్కరణ కేసులో ఆమెకు కోర్టు ఇదివరకు ఆరు నెలల జైలుశిక్ష విధించింది.

యెమన్ తీరంలో పడవ బోల్తా 68 మంది వలస జీవుల మృతి

74 మంది గల్లంతు

కైరో: యెమన్ సముద్ర జలాల్లో ఆదివారం పడవ బోల్తాపడి 68 మంది ఆఫ్రికన్ వలస జీవులు మృతిచెందగా, 74 మంది గల్లంతైనట్లు ఐరాస వలస సంస్థ తెలిపింది. ఆ పడవలో మొత్తం 154 మంది ఇథియోపియన్ వలసదారులు ప్రయాణిస్తున్నట్లు యెమన్‌లోని అంతర్జాతీయ వలస సంస్థ అధిపతి అబ్దుసత్తోర్ ఎసోయెవ్ మీడియాకు తెలిపారు. వారిలో 12 మంది ఈ ప్రమాదం నుంచి బయటపడ్డారు.

ప్రశాంతంగా నీట్-పీజీ పరీక్ష

- 2.42 లక్షల మందికిపైగా హాజరు

దిల్లీ: దేశవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన నీట్-పీజీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్(ఎన్‌బీఈఎంఎస్) ఆధ్వర్యంలో మొత్తం 301 నగరాల్లోని 1,052 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 2.42 లక్షల మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. ఎలాంటి చీటింగ్, సైబర్ మోసాలు జరగకుండా చూసేందుకు అభ్యర్థుల మొబైల్ సిగ్నళ్లను జామ్ చేయడంతోపాటు 300కు పైగా సైబర్ కమాండోలను మోహరించారు. 200 మంది సిబ్బంది పరీక్ష కేంద్రాల్లోని సీసీటీవీ లైవ్ దృశ్యాలను క్షుణ్నంగా పరిశీలించారు.



గిల్‌కు గావస్కర్ బహుమతి

లండన్: భారత టెస్టు క్రికెట్లో ఒక సిరీస్‌లో అత్యధిక పరుగులు రాబట్టిన బ్యాటర్ రికార్డును త్రుటిలో చేజార్చుకున్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు దిగ్గజ ఆటగాడు సునీల్ గావస్కర్ ప్రత్యేక బహుమతి అందించాడు. అండర్సన్- తెందుల్కర్ ట్రోఫీలో అయిదు మ్యాచ్‌ల్లో కలిపి 10 ఇన్నింగ్స్‌ల్లో గిల్ 754 పరుగులు సాధించాడు. మరో 21 పరుగులు చేసుంటే గావస్కర్ (774) రికార్డును గిల్ బద్దలు కొట్టేవాడు. అయితే తన రికార్డును అందుకోనప్పటికీ గిల్‌ను ప్రశంసిస్తూ గావస్కర్ బహుమతి అందించాడు. తన సంతకంతో కూడిన టోపీ, షర్ట్‌ను అందజేశాడు. ''ఇదో చిన్న టోపీ. నా సంతకంతో చాలా తక్కువ మందికి ఇస్తా'' అని గిల్‌తో గావస్కర్ అన్నాడు.



జస్సీ భాయ్.. ఎందుకు వెళ్తున్నావ్?

లండన్: ఇంగ్లాండ్‌తో అయిదో టెస్టులో ఎందుకు ఆడట్లేదని స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను అడిగినట్లు మహ్మద్ సిరాజ్ తెలిపాడు. చివరి టెస్టులో బుమ్రా ఆడట్లేదని తెలిసిన తర్వాత అతనితో జరిగిన సంభాషణను సిరాజ్ బయటపెట్టాడు. ''నువ్వు ఎందుకు వెళ్తున్నావు? నేను అయిదు వికెట్లు తీసినప్పుడు నన్ను ఎవరు ఆలింగనం చేసుకుంటారు? అని జస్సీ భాయ్‌ని అడిగాను. 'నేను ఇక్కడే ఉన్నా. నువ్వు అయిదు వికెట్లు తీసుకో' అని బుమ్రా బదులిచ్చాడు. ఇక ఇంగ్లాండ్‌లో ఆడేందుకు అందరూ ఇష్టపడతారు. పిచ్‌పై ఎక్కువ స్వింగ్ ఉంటుంది. ఫాస్ట్‌బౌలర్లకు సహకారం లభిస్తుంది. సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా కొనసాగుతుండటం ఆనందంగా ఉంది. కానీ మ్యాచ్‌లో గెలిస్తేనే నాకు ఎక్కువ ఆనందంగా ఉంటుంది'' అని సిరాజ్ తెలిపాడు.

ప్రపంచ రికార్డు సాధించిన అమెరికా మహిళల బృందం



అమెరికా అదరహో..

9 స్వర్ణాలతో ప్రపంచ స్విమ్మింగ్‌లో అగ్రస్థానం

సింగపూర్: ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో అమెరికా క్రీడాకారులు అదరగొట్టారు. 9 స్వర్ణాలు సహా 29 పతకాలతో టోర్నీలో ఆ దేశమే అగ్రస్థానం సాధించింది. చివరి రోజు, ఆదివారం మహిళల 4×100 మీటర్ల మెడ్లీ రిలే పోటీలో ఆ దేశ స్విమ్మర్లు ప్రపంచ రికార్డుతో స్వర్ణం సాధించారు. అమెరికా బృందం 3 నిమిషాల 49.34 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని తన పేరిటే ఉన్న రికార్డు (3:49.63 సె)ను బద్దలు కొట్టింది. పోటీల్లో ఆస్ట్రేలియా 8 స్వర్ణాలు సహా 20 పతకాలతో రెండో స్థానం సాధించింది. ఫ్రాన్స్ (4 స్వర్ణాలు), కెనడా (4 స్వర్ణాలు) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. కెనడా స్విమ్మర్ సమ్మర్ మెకింతోష్ నాలుగు స్వర్ణాలతో ఈ పోటీల్లో ఉత్తమ వ్యక్తిగత ప్రదర్శనను నమోదు చేసింది.

ముగింపులోనూ పేలవమే: ప్రపంచ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత్ పేలవ ప్రదర్శనను చివరి రోజూ కొనసాగించింది. ఆదివారం పురుషుల 400మీ వ్యక్తిగత మెడ్లేలో షోవన్ గంగూలీ 28వ స్థానంలో నిలిచాడు. 4 నిమిషాల 30.40 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేసిన అతడు.. ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయాడు. ఈ పోటీల్లో ఒక్క భారత స్విమ్మర్ కూడా హీట్స్ దాటలేదు. కనీసం వ్యక్తిగత అత్యుత్తమ టైమింగ్‌నూ నమోదు చేయలేదు.

ఛాంపియన్

ఆఖరి టెస్టు రసవత్తరం. క్లైమాక్స్ ఉత్కంఠ రేపుతోంది. గెలవాలంటే ఆఖరి రోజు భారత్ 4 వికెట్లు పడగొట్టాలి.. వోక్స్ ఆడకపోతే 3 వికెట్లే చాలు. ఇంగ్లాండ్ 35 పరుగులు చేయాలి. భారీ లక్ష్యాన్ని నిర్దేశించి, ఎన్నో ఆశలతో నాలుగో రోజు బరిలోకి దిగిన భారత్.. బ్రూక్, రూట్ చెలరేగిన వేళ ఓ దశలో మ్యాచ్‌ను దాదాపుగా చేజార్చుకున్నట్లే కనిపించింది. కానీ ఆఖర్లో పుంజుకున్న టీమ్‌ఇండియా చకాచకా వికెట్లు పడగొట్టి పోటీలోకి వచ్చింది. ఇంకొన్ని పరుగులే చేయాల్సిన ఇంగ్లాండ్‌ను ఒత్తిడిలోకి నెట్టిన భారత్.. ఆఖరి పంచ్‌ను విజయవంతంగా విసురుతుందా? సిరీస్‌ను సమం చేస్తుందా..! సోమవారం ఉదయం ఆట ఎంతో ఆసక్తికరం.

అటో.. ఇటో!



- రసవత్తర ముగింపు దిశగా ఆఖరి టెస్టు
- బ్రూక్, రూట్ శతకాలు
- ఇంగ్లాండ్ 339/6

లండన్

భారత్, ఇంగ్లాండ్ మధ్య వరుసగా అయిదో టెస్టూ అయిదో రోజుకు చేరింది. ఆఖరి మ్యాచ్ రసవత్తర ముగింపు దిశగా సాగుతోంది. 374 పరుగుల లక్ష్య ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 50/1తో నాలుగో రోజు, ఆదివారం బ్యాటింగ్ కొనసాగించిన ఇంగ్లాండ్.. ఆట ముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 339 పరుగులు చేసింది. బ్రూక్ (111; 98 బంతుల్లో 14×4, 2×6), రూట్ (105; 152 బంతుల్లో 12×4)ల అదిరే శతకాలతో ఆ జట్టును పైచేయిలో నిలిపారు. కానీ ఆఖర్లో పుంజుకున్న టీమ్ ఇండియా.. పోటీలోకి వచ్చింది. వర్షం కారణంగా కాస్త ముందే ఆట ముగిసింది. జేమీ స్మిత్ (2), ఓవర్టన్ (0) క్రీజులో ఉన్నారు. ఇంకో 3.4 ఓవర్లలో రెండో కొత్త బంతి రానుండడం భారత్‌కు కలిసొచ్చే విషయమే. గాయం కారణంగా వోక్స్ బ్యాటింగ్‌కు రావడం సందేహమే. తొలి ఇన్నింగ్స్‌లో అతడు బ్యాటింగ్‌కు దిగలేదు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 224 పరుగులకు ఆలౌట్ కాగా.. ఇంగ్లాండ్ 247 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 396 పరుగులు సాధించింది.

బాగానే మొదలెట్టినా..: నాలుగో రోజును టీమ్‌ఇండియా బాగానే మొదలెట్టింది. మూడో రోజు ఆఖరి బంతికి క్రాలీని ఔట్ చేసిన సిరాజ్.. ఆదివారం ఆకాశ్‌దీప్‌తో కలిసి దాడిని ఆరంభించాడు. పదునైన స్పెల్‌తో డకెట్ (ఓవర్‌నైట్ 34), ఒలీ పోప్ డకెట్‌లను పరీక్షించాడు. కానీ నాలుగో రోజు ప్రత్యర్థి వికెట్ల పతనాన్ని ఆరంభించింది మాత్రం ప్రసిద్ధ్‌కృష్ణనే. ప్రసిద్ధ్ బంతిని డ్రైవ్ చేయబోయిన డకెట్ (54).. రెండో స్లిప్‌లో దొరికిపోయాడు. పట్టుదలతో బ్యాటర్లపై ఒత్తిడి పెంచిన సిరాజ్ కూడా ఎట్టకేలకు ఫలితం రాబట్టాడు. అతడు సీమ్‌ను ఉపయోగించుకుంటూ పోప్ (27)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. అప్పటికి ఇంగ్లాండ్ స్కోరు 106. పోప్ సమీక్షకు వెళ్లినా ఫలితం లేకపోయింది. అతడు తొలి ఇన్నింగ్స్‌లోనూ సిరాజ్ బౌలింగ్‌లోనే ఔటయ్యాడు. అయితే మరోవైపు రూట్ నిలవగా బ్రూక్ ధాటిగా ఆడడంతో లంచ్ వేళకు ఇంగ్లాండ్ 164/3తో నిలిచింది. రూట్ కూడా అలవోకగా బ్యాటింగ్ చేయడంతో ఇంగ్లాండ్ విజయంవైపు సాగింది. స్కోరు మూడొందలు దాటడంతో ఆ జట్టు విజయం తేలికే అనుకున్నారంతా!

తిరిగొచ్చిన ఆశ: 106కే మూడు ఇంగ్లాండ్ వికెట్లు పడగొట్టినా బ్రూక్, రూట్ సూపర్ బ్యాటింగ్‌తో టీమ్‌ఇండియా వెనుకబడిపోయింది. చెలరేగి ఆడిన బ్రూక్.. భారత్ ఆశలపై నీళ్లు చల్లాడు. బలమైన షాట్లు బాదుతూ ఎడాపెడా బౌండరీలతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. లంచ్‌కు ముందు సిరాజ్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన బ్రూక్.. అవకాశాన్ని పూర్తిగా ఉపయోగించుకున్నాడు. లంచ్ తర్వాత కూడా జోరు కొనసాగించాడు. అతడు 39 బంతుల్లోనే అర్ధశతకాన్ని అందుకోవడం విశేషం. రూట్ కూడా ఎలాంటి తడబాటు లేకుండా బ్యాటింగ్ చేస్తూ పరుగులు రాబట్టాడు.



వీలైనప్పుడల్లా బంతిని బౌండరీ దాటించాడు. అతడు 81 బంతుల్లో అర్ధశతకాన్ని అందుకున్నాడు. ముగ్గురు భారత పేసర్లు కూడా ఎలాంటి ప్రభావం చూపలేకపోయారు. స్పిన్నర్లూ అంతే. బ్యాటర్లపై పేసర్ల షార్ట్ బంతి వ్యూహం ఎలాంటి ఫలితాన్ని ఇవ్వలేదు. బ్రూక్, రూట్ ఆ బంతులను అలవోకగానే ఎదుర్కొన్నారు. బ్రూక్ 91 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు. జోరు కొనసాగిస్తూ ఆకాశ్‌దీప్ బౌలింగ్‌లో అతడు వరుసగా రెండు బంతులను బౌండరీ దాటించడంతో ఇంగ్లాండ్ స్కోరు 300 దాటింది. భారత ఆటగాళ్లలో నిరాశ స్పష్టంగా కనిపించింది. కానీ ఆకాశ్‌దీప్ తర్వాతి బంతిని ఆడే ప్రయత్నంలో బ్రూక్ బ్యాటును చేజార్చుకున్నాడు. బ్యాటును తాకి గాల్లోకి లేచిన బంతిని మిడాఫ్‌లో సిరాజ్ తేలికగా అందుకున్నాడు. టీ విరామానికి కాసేపు ముందు పడ్డ ఆ వికెట్ భారత్‌కు ఊరటే. కానీ అప్పటికి ఇంగ్లాండ్ విజయానికి కావాల్సింది 73 పరుగులే. పైగా బెతెల్ అండగా రూట్ చక్కని బ్యాటింగ్ కొనసాగించడంతో ఇంగ్లాండ్ విజయం వైపు సాగింది. టీ విరామం తర్వాత ఓ దశలో స్కోరు 332/4. ఇంగ్లాండ్ గెలుపు ఇక లాంఛనమే అనిపించింది. భారత్‌కు ఎలాంటి అవకాశమూ కనపడలేదు. కానీ అనూహ్యంగా మళ్లీ భారత్ ఆశలు చిగురించాయి. ప్రసిద్ధ్ వరుస ఓవర్లలో బెతెల్ (5), రూట్‌ను ఔట్ చేయడంతో టీమ్‌ఇండియా పోటీలోకి వచ్చింది. బెతెల్ బౌల్డయ్యాడు. ఆఖరి వరకు క్రీజులో నిలిచేలా కనిపించిన రూట్.. ప్రసిద్ధ్ బంతిని డ్రైవ్ చేయబోయి వికెట్‌కీపర్ జురెల్ చేతికి చిక్కాడు. అంతే టీమ్ ఇండియా మైదానంలో రెట్టించిన ఉత్సాహంతో కదిలింది. పేసర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో బ్యాటర్లు జేమీ స్మిత్, ఓవర్టన్‌లపై ఒత్తిడి పెంచారు. ఏమాత్రం స్వేచ్ఛగా ఆడనివ్వలేదు. పరుగులు రాబట్టడం వాళ్లకు కష్టమైపోయింది. ప్రతి బంతికీ కూడా వికెట్ పడేలా కనిపించింది. హఠాత్తుగా భారత్‌కు కూడా మ్యాచ్‌లో గెలుపు అవకాశాలు ఏర్పడ్డాయి. రూట్ ఔటయ్యాక 20 బంతుల్లో ఇంగ్లాండ్ రెండు పరుగులే చేయడం గమనార్హం. వెలుతురులేమి కారణంగా ఆట ఆగగా.. ఆ తర్వాత వర్షం కూడా మొదలైంది. దీంతో నాలుగో రోజు ఆట త్వరగానే ముగిసింది.

భారత్ తొలి ఇన్నింగ్స్: 224; **ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్:** 247

భారత్ రెండో ఇన్నింగ్స్: 396; **ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్:** క్రాలీ (బి) సిరాజ్ 14; డకెట్ (సి) రాహుల్ (బి) ప్రసిద్ధ్ 54; పోప్ ఎల్బీ (బి) సిరాజ్ 27; రూట్ (సి) జురెల్ (బి) ప్రసిద్ధ్ 105; బ్రూక్ (సి) సిరాజ్ (బి) ఆకాశ్‌దీప్ 111; బెతెల్ (బి) ప్రసిద్ధ్ 5; స్మిత్ బ్యాటింగ్ 2; ఓవర్టన్ బ్యాటింగ్ 0; ఎక్స్‌ట్రాలు 21; **మొత్తం:** (76.2 ఓవర్లలో 6 వికెట్లకు) **339; వికెట్ల పతనం:** 1-50, 2-82, 3-106, 4-301, 5-332, 6-337; **బౌలింగ్:** ఆకాశ్‌దీప్ 20-4-85-1; ప్రసిద్ధ్‌కృష్ణ 22.2-3-109-3; సిరాజ్ 26-5-95-2; సుందర్ 4-0-19-0; జడేజా 4-0-22-0





ఆ క్యాచ్ పట్టుంటే..

అద్భుతమైన బౌలింగ్‌తో అందరి మన్ననలు పొందిన ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్.. నాలుగో రోజు ఓ ఖరీదైన తప్పు చేశాడు. అతడు క్యాచ్ చేజార్చడంకు టీమ్‌ఇండియాకు పెద్ద నష్టమే చేసింది. ఇంగ్లాండ్ ఛేదనలో 35వ ఓవర్ అది. ఉదయం అప్పటికే రెండు వికెట్లు పడగొట్టిన భారత్ మంచి స్థితిలోనే ఉంది. జట్టును గట్టెక్కించడానికి ప్రయత్నిస్తోన్న రూట్, బ్రూక్‌లపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. అప్పుడు ప్రసిద్ధ్ బౌలింగ్‌లో బ్రూక్ ఫైన్ లెగ్‌లో పుల్ షాట్ ఆడాడు. బంతి గాల్లోకి లేచింది. బౌండరీ వద్ద సౌకర్యంగానే నిలబడ్డ సిరాజ్.. బంతిని ఎలాంటి ఇబ్బంది లేకుండా అందుకున్నాడు. కానీ అనూహ్యంగా తడిబడి బౌండరీ కుషన్‌ను కాలితో తాకి, బయట అడుగుపెట్టాడు. అది సిక్సయిపోయింది. అప్పటికే సంబరాలు మొదలెట్టిన ప్రసిద్ధ్.. చివరికి తీవ్ర నిరాశకు గురయ్యాడు. మిగతా ఫీల్డర్లు, అభిమానులూ అంతే. సిరాజ్ కూడా తన వైఫల్యాన్ని తానే నమ్మలేకపోయాడు. అతడు క్యాచ్ వదిలేయడమే మ్యాచ్‌లో మలుపు అనుకోవచ్చు. అప్పటికి ఇంగ్లాండ్ 137/3తో ఉంది. వ్యక్తిగత స్కోరు 19 వద్ద బతికిపోయిన బ్రూక్.. ఆ తర్వాత చెలరేగిపోయాడు. ఎడాపెడా బౌండరీలతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. సిరాజ్ క్యాచ్ పట్టుంటే మ్యాచ్‌లో భారత్ పరిస్థితి భిన్నంగా ఉండేదే.



భావన, యాత్రిలకు పతకాలు ఖాయం

బ్యాంకాక్: ఆసియా అండర్-22 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు భావన శర్మ, యాత్రి పటేల్‌లకు పతకాలు ఖాయమయ్యాయి. వీళ్లిద్దరూ తమ విభాగాల్లో సెమీస్ చేరడంతో కనీసం కాంస్యం ఖరారైంది. మహిళల 48 కేజీల క్వార్టర్ ఫైనల్లో భావన.. వియత్నాం



బాక్సర్ లిన్ చి ఎంగోపై విజయం సాధించింది. 57 కేజీల క్వార్టర్స్‌లో కీర్తన ఉదయకుమార్ (శ్రీలంక)పై యాత్రి పైచేయి సాధించింది. ఇద్దరినీ జడ్జీలు ఏకగ్రీవంగా విజేతలుగా ప్రకటించారు. 54 కేజీల క్వార్టర్స్‌లో తను.. నట్నిచా (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలైంది. అండర్-19 పురుషుల 55 కేజీల తొలి రౌండ్లో శివమ్ సంపూర్ణ ఆధిపత్యంతో బెజిగ్గెన్ అనాయెవ్ (తుర్క్‌మెనిస్తాన్)పై విజయం సాధించాడు. మూడు రౌండ్లలోనూ ప్రత్యర్థిపై శివమ్ ఆధిపత్యం చలాయించాడు. 65 కేజీల పోరులో మౌసమ్ 3-2తో నూర్కబిలులీ ముఖిత్‌పై గెలుపొందాడు. 60 కేజీల బౌట్‌లో శుభమ్ 0-5తో టోర్టుబెక్ అడిలెట్ (కజకిస్థాన్) చేతిలో పరాజయం చవిచూశాడు.



మినీ వేలంలో లోపాల్ని సరిచేస్తాం

చెన్నై: తమ జట్టులో కొన్ని లోపాలు ఉన్నాయని.. ఆటగాళ్ల మినీ వేలంలో వాటిని సరిచేస్తామని చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోని అన్నాడు. వచ్చే సీజన్ కోసం బ్యాటింగ్ లైనప్‌పై ఇప్పటికే అంచనాకు వచ్చినట్లు ధోని తెలిపాడు. ''గత సీజన్‌లో నిర్లక్ష్యంగా ఆడామని చెప్పను. కానీ జట్టులో కొన్ని లోపాలు ఉన్నాయి. వాటిని సరిచేయాల్సిన అవసరం ఉంది. సీజన్ ద్వితీయార్థంలో మా బ్యాటింగ్ ఆర్డర్‌పై ఆందోళన చెందాం. ఆటగాళ్లు భిన్నమైన స్థానాల్లో బ్యాటింగ్ చేయాల్సొచ్చింది. అయితే ఇప్పుడు బ్యాటింగ్ ఆర్డర్ సమస్యను పరిష్కరించాం. రుతురాజ్ గైక్వాడ్ జట్టులోకి తిరిగొస్తున్నాడు. డిసెంబరులో మినీ వేలం పాట ఉంది. అక్కడ లోపాల్ని సరిచేస్తాం. జట్టులోని వనరుల్ని సమర్థంగా వాడుకుంటూ లీగ్ ప్రారంభంలో అత్యుత్తమంగా ఆడాలి. వచ్చే అయిదేళ్లు క్రికెట్ ఆడగలనని చెప్పారు. కానీ అది కంటి చూపు గురించి. నా దేహం నుంచి కూడా అనుమతి లభించాలి. కేవలం కంటి చూపుతోనే ఆడలేను కదా (నవ్వుతూ)'' అని ధోని వివరించాడు.

పాక్ ఇక డబ్ల్యూసీఎల్‌లో ఆడదు

లాహోర్: భవిష్యత్తులో తమ ఆటగాళ్లు వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్)లో పాల్గొనకుండా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నిషేధం విధించింది. టోర్నీ నిర్వాహకులు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని, వాళ్లలో నిజాయితీ లోపించిందని పీసీబీ ఆరోపించింది. తాజాగా ముగిసిన డబ్ల్యూసీఎల్‌లో భారత లెజెండ్స్ జట్టు పాకిస్థాన్‌తో ఆడేందుకు నిరాకరించిన నేపథ్యంలో పీసీబీ ఈ నిర్ణయం తీసుకుంది. గ్రూప్ దశలో పాక్‌తో ఆడని భారత్.. సెమీస్‌లోనూ ఆ జట్టుతో మ్యాచ్‌ను బహిష్కరించింది. దీంతో పాక్ నేరుగా ఫైనల్ చేరింది. నిజానికి డబ్ల్యూసీఎల్ యాజమాన్యమే పాక్‌ను లీగ్ నుంచి తప్పించాలని భావించినట్లు తెలుస్తోంది. బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్ డబ్ల్యూసీఎల్‌కు సహ యజమాని. ఫైనల్లో పాక్.. 9 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో చిత్తయింది. మొదట షర్జీల్ ఖాన్ (76) మెరుపులతో పాక్ 5 వికెట్లకు 195 పరుగులు చేసింది. అనంతరం డివిలియర్స్ (120 నాటౌట్; 60 బంతుల్లో 12×4, 7×6), డుమిని (50 నాటౌట్; 28 బంతుల్లో 4×4, 2×6) చెలరేగిపోవడంతో సఫారీ జట్టు 16.5 ఓవర్లలో ఒక్క వికెట్టే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.



రెండో టీ20లో విండీస్ విజయం

లాడర్‌హిల్ (అమెరికా): జేసన్ హోల్డర్ ఆల్‌రౌండ్ మెరుపులు మెరిపించడంతో రెండో టీ20లో పాకిస్థాన్‌పై వెస్టిండీస్ 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' హోల్డర్ (4/19) బంతితో నిప్పులు చెరగడంతో మొదట పాక్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 133 పరుగులే చేయగలిగింది. కెప్టెన్ సల్మాన్ ఆఘా (38; 33 బంతుల్లో 3×4, 1×6), హసన్ నవాజ్ (40; 23 బంతుల్లో 1×4, 4×6) జట్టును ఆదుకున్నారు. అనంతరం విండీస్ 8 వికెట్లు కోల్పోయి ఆఖరి బంతికి విజయాన్ని అందుకుంది. చివరి బంతికి 3 పరుగులు కావాల్సి ఉండగా.. హోల్డర్ (16 నాటౌట్; 10 బంతుల్లో 1×4, 1×6) ఫోర్ కొట్టి జట్టును గెలిపించాడు. పాక్ బౌలర్లలో మహ్మద్ నవాజ్ (3/14), సయిమ్ అయూబ్ (2/20) రాణించారు. విండీస్ విజయంతో సిరీస్ 1-1తో సమమైంది. నిర్ణయాత్మక మూడో టీ20 సోమవారం జరుగుతుంది.

భయానికి బై.. బై..!





పిల్లల్లో చిన్నతనం నుంచి అనేక ఫోబియాలుంటాయి.

మొదట్లో బడికి వెళ్లేందుకు నిరాకరిస్తూ ఉంటారు.

ఆ తర్వాత పరీక్షలకు భయపడతారు. కొత్త వారితో కలవలేరు.

వీటిని చిన్నతనంలోనే తొలగిస్తే వారు బాగా ఎదగగలుగుతారని నిపుణులు చెబుతున్నారు.

స్కూల్ ఫోబియా

- బడి సమయం అయ్యే సరికి వెళ్లనని మారాంచేయడం, ఇంట్లో దాక్కోవడంలాంటి అనేక ప్రయత్నాలు చేస్తుంటారు.
- తల్లిదండ్రులు కూడా దీనికి కారణమే. పిల్లలు అల్లరి చేస్తే బడికి పంపేస్తామని, టీచర్‌కు చెబుతామని బెదిరిస్తుంటారు. దీనివల్ల చిన్నారుల్లో బడి అంటే భయం, ఒకలాంటి ద్వేషం ఏర్పడుతుంది.
- మరికొంతమంది అప్పటివరకు ఇల్లే ప్రపంచంగా గడిపి, పాఠశాలకు వెళ్లాల్సి రావడంతోనూ ఈ ఫోబియా ఏర్పడుతుంది.

ఇలా చేద్దాం..: ఈ ఫోబియా పోవాలంటే పిల్లల్ని ముందుగా బడికి తీసుకువెళ్లి, అక్కడి వాతావరణం పరిచయం చేయాలి. అక్కడ ఉండే పిల్లలు ఆడుకోవడం, స్నేహితులతో గడపడాన్ని చూపించాలి..

ఎగ్జామినో..

- పిల్లలు బాగా చదువుతూ ఉంటారు.. కానీ, పరీక్ష మాత్రం బాగా రాయలేరు.
- మార్కులు, ర్యాంకులు అనుకున్నవి వస్తాయో రావోనని.. లక్ష్యాన్ని చేరుకుంటానో లేదోనని భయపడుతూ ఉంటారు.
- ఈ ఫోబియా ఉన్నవారు అన్ని ప్రశ్నలు వచ్చినవే ఉన్నా సరిగా రాయలేరు. ఒక్కోసారి పరీక్షల సమయంలో అనారోగ్యానికీ గురవుతారు.

ఇలా చేద్దాం..: 'పరీక్ష బాగా రాయగలవు' అనే పాజిటివ్ ఆలోచనలను వారిలో ప్రోది చేయాలి. ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలి. అవసరమైతే కౌన్సెలర్, సైకాలజిస్టుల సహాయం తీసుకోవాలి.

సోషల్..

- పిల్లలు కొందరు నలుగురిలో కలవడానికి ఇబ్బంది పడుతూ ఉంటారు.
- ఇంట్లో నుంచి బయటకు వెళ్లలేరు. కొత్తవారితో కలవడానికి ఇష్టపడరు.

ఇలా చేద్దాం..: ఈ ఫోబియా పిల్లల్లో గమనిస్తే చిన్నప్పటి నుంచే దీన్ని పోగొట్టేందుకు ఇద్దరు, ముగ్గురితో కలిసి మాట్లాడేటట్లుగా చేయాలి. బయటకు షాపింగ్‌లు, శుభ కార్యక్రమాలకు తీసుకువెళ్లాలి. అక్కడ బంధువులు, పరిచయం ఉన్న వారితో కలిసేలా.. వారితో మాట్లాడేలా చేయాలి.

హాస్టల్..

- పిల్లలు హాస్టల్‌లో ఉండేందుకు భయపడతారు. అక్కడి వాతావరణాన్ని ఊహించుకుని ఇబ్బందిపడుతూ ఉంటారు.
- దీంతో తల్లిదండ్రులు బంధువుల ఇళ్లల్లో ఉంచడంలాంటివి చేస్తారు.

ఇలా చేద్దాం..: పిల్లలు సర్దుబాటు కావడానికి ఉండే ఇబ్బంది ఇది. హాస్టల్‌లో ఉండాల్సిన అవసరం... చదువు ప్రాధాన్యాన్ని పిల్లలకు వివరించాలి. అవసరమైతే కాగ్నెటివ్ బిహేవియర్ థెరపీ(సీబీటీ) చికిత్స ఇవ్వాల్సి ఉంటుంది.

మోనో..

- కొంతమంది పిల్లలు ఒంటరిగా ఉండలేరు. తల్లిదండ్రులు ఎక్కడికైనా వెళ్తే వేరే వాళ్లను తోడుగా ఉంచాల్సి వస్తుంది.

ఇలా చేద్దాం..: పిల్లల్లో ఒంటరితనం పోగొట్టేందుకు ఇంటి వద్దనే ప్రయత్నించొచ్చు. అబ్బాయి లేదా అమ్మాయిని ఇంట్లో ఒంటరిగా ఉంచి, తల్లిదండ్రులు కొంత సమయం బయట కూర్చోవడం.. ఏదైనా భయమేసినట్లు ఉంటే తలుపు తీసుకుని రమ్మని చెప్పడంలాంటివి చేయాలి.

-ఈనాడు, అమరావతి



జాబ్ ర్దస్త్!

ఉద్యోగం పురుష లక్షణం అంటారు. దీన్ని పుణికిపుచ్చుకున్నారనే చెప్పాలి.. నల్గొండ జిల్లా మిర్యాలగూడలోని వినోభానగర్ కాలనీవాసులు. ఇక్కడ దాదాపు 300 కుటుంబాలు ఉండగా 150 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు.. మరో వంద మందికి పైగా ప్రైవేటు ఉద్యోగులు ఉన్నారు. సుమారు 60 ఏళ్ల క్రితం కాలనీ సమీపంలో సెయింట్ మేరీస్ పాఠశాల ఏర్పాటు చేయడంతో.. స్థానికుల్లో విద్యపై ఆసక్తి పెరిగిందని చెబుతారు. సుమారు 40 ఏళ్లుగా కాలనీలోని ప్రతి కుటుంబంలోని పిల్లలను చదివించడం మొదలు పెట్టగా.. ప్రస్తుతం ఇంటికి ఒకరికంటే ఎక్కువ మంది పట్టభద్రులు ఉన్నారు. ఆ పాఠశాలలో చదివిన వసంతకుమారి 1980ల్లో మొదటి డాక్టర్ అయ్యారు. అదే పేరున్న ఓ యువతి సైతం.. ఆమె స్ఫూర్తితో ప్రస్తుతం వైద్యురాలు కావడం విశేషం. ప్రస్తుతం ఉన్న ఉద్యోగుల్లో ఐదుగురు డాక్టర్లు, ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్సైలు, నలుగురు కానిస్టేబుళ్లు, 30 మంది ఉపాధ్యాయులు, పలువురు పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల్లో ఏడీఈలు, ఏఈలు, 20 మందికి పైగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో పలువురు విధుల అనంతరం వ్యవసాయం సైతం చేస్తూ.. తమ కుటుంబ వారసత్వాన్ని కొనసాగిస్తుండడం గమనార్హం. – న్యూస్‌టుడే, మిర్యాలగూడ పట్టణం

మొసళ్ల పండగ చూస్తారా!





ఓ గ్రామంలోని కొలనులో 60కి పైగా మొసళ్లు వృద్ధి చెందడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. నిర్మల్ జిల్లా సోన్ మండలం పాక్‌పట్ల గ్రామ శివారులోని ఈ నీటి కొలను 25 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. శ్రీరామసాగర్ ప్రాజెక్టుకు సమీపంలోనే ఉన్న ఈ కొలనులోకి వర్షం నీటితో పాటు నది నుంచి ఊట నీరు చేరుతుండడంతో ఎప్పుడూ ఎండిపోలేదని గ్రామస్థులు తెలిపారు. మొసళ్లు భారీగా వృద్ధి చెందడానికి ఇదే కారణం కావచ్చని భావిస్తున్నారు. ఇందులో కొన్ని నీటికుక్కలూ (ఓటర్స్) ఉన్నట్లు పంచాయతీ అధికారులు లెక్కతేల్చారు. నీటి కోసం వచ్చే అడవి పందులు, కొంగలు, కోతులే మొసళ్లకు ఆహారమవుతున్నాయి. గతంలో నిర్మానుష్యంగా ఉండే ఈ కొలనుకు.. పంచాయతీ మట్టిరోడ్డు నిర్మించింది. మూడేళ్ల క్రితం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చుట్టూ 20 ఎకరాల్లో వేల మొక్కలు నాటి ప్రకృతి వనంగా అభివృద్ధి చేశారు. ఈ కొలనులో మొసళ్ల ఆవాసం గణనీయంగా పెరగడంతో 'కమ్యూనిటీ కన్జర్వ్'గా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు అటవీ శాఖ నిర్మల్ డిప్యూటీ రేంజ్ అధికారి సంతోష్ తెలిపారు.

– న్యూస్‌టుడే, సోన్, నిర్మల్



ఆధునికతను పట్టుకొచ్చారు!

పట్టుగూళ్ల నుంచి దారం తీయాలి. ఆ దారాన్ని ఉడికించి.. దానికి పట్టి ఉండే సెరిసిన్ అనే జిగురు పదార్థాన్ని తొలగించి శుద్ధి చేయాలి. దానికి రంగులు అద్దాలి. ఆ తర్వాత పట్టు చీరలు తయారుచేయాలి. ఇదీ ప్రక్రియ.. జాతీయ భౌగోళిక గుర్తింపు సాధించిన పోచంపల్లి పట్టుచీర అందంగా కనిపించడంలో... నాణ్యమైన మల్బరీ పట్టుదారం ఉపయోగించడంతో పాటు రంగుల అద్దకం కీలకం. ప్రస్తుతం పోచంపల్లిలో పట్టుదారాన్ని శుద్ధి చేసి, రంగులద్దే యంత్రాలు ప్రవేశించడం మేలిమలుపు కానుందని చెబుతున్నారు. సెరికల్చర్‌శాఖ రూ.90 లక్షల రాయితీ ఇవ్వగా.. యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌కు చెందిన గంజి అరుణ మూడేళ్ల క్రితం చైనా నుంచి పట్టుగూళ్ల నుంచి దారం తీసే యంత్రాన్ని తెప్పించారు. దీనిపై రోజుకు 200 కిలోల పట్టు దారాన్ని ఉత్పత్తి చేసి సరఫరా చేస్తున్నారు. ఆ దారాన్ని కార్మికులు వేడినీటిలో ఉడికించి శుద్ధి చేసి, రంగులు అద్దుతున్నారు. ఇక్కడ తగిన ఉష్ణోగ్రత వద్ద.. తగిన సమయం ఉడికించడం కీలకం. ఈ పనులకు ఇటలీలో ఆధునిక యంత్రాలు వినియోగిస్తున్నారని తెలుసుకున్న అరుణ.. వాటిని గత నెలలో తెప్పించారు. ఈ యంత్రంతో 20 నిమిషాల్లో 16 కిలోల పట్టుదారాన్ని వేడి నీటిలో శుద్ధి చేస్తున్నారు. ఇందులో అవసరమైన ఉష్ణోగ్రతను.. సమయాన్ని నమోదు చేస్తే సరిపోతుంది. మరో యంత్రంతో కోరిన రంగులు అద్దుతున్నారు. దీనివల్ల వస్త్రం నాణ్యత పెరుగుతుందంటున్నారు. – న్యూస్‌టుడే, చౌటుప్పల్





అంటుకట్టింది శ్రమ జీవన సౌందర్యం..

ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయం. ఖమ్మం- సూర్యాపేట జాతీయ రహదారిపై వాహనాలు దూసుకెళుతున్నాయి. వర్షాకాలమైనా ఎండ కొంచెం ఎక్కువగానే ఉంది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం లోక్యాతండా సమీపంలో.. మామిడి మొక్కల నర్సరీలో గొడుగుల కింద కొందరు తమ పనిలో నిమగ్నమై కనిపించారు. వాహనం దిగి చూస్తే.. అర్థమైంది.. మొక్కలకు అంటు కడుతున్నట్లు. మాట కలిపితే.. ఆ వివరాలన్నీ చెప్పారు. ఆమ్‌చూర్ తయారు చేసే ప్రాంతాల్లో.. మామిడి టెంకలు కొనుగోలు చేసి తెచ్చి.. ఇక్కడ నాటుతారట. అవి మొలకెత్తిన తర్వాత.. మంచి మామిడి మొక్కల కొమ్మలను తెచ్చి వీటికి అంటుకడుతున్నామని చెప్పారు. దీంతో అవి నాణ్యమైన మొక్కలుగా పెరిగి మంచి ఫలసాయాన్ని ఇస్తాయని వివరించారు. – న్యూస్‌టుడే, కూసుమంచి



ఆడితే.. ఆనందం ఆచరిస్తే.. ఆరోగ్యం!

శీతలపానీయాలు తాగారో 'ఫ్యాటీ లివర్' అనే పాము మింగేస్తుంది. జంక్‌ఫుడ్ తింటే కొవ్వనే సర్పం చుట్టేస్తుంది. అదే.. గుడ్లు, పాలు తీసుకుంటే ఆరోగ్యమనే నిచ్చెన మెట్లు ఎక్కొచ్చు. ఇలాంటి ఆరోగ్య రహస్యాలెన్నో వైకుంఠపాళి ఆడుతూ తెలుసుకోవచ్చు.

కృష్ణా జిల్లా గన్నవరం మండలం చిన్నఅవుటపల్లిలోని డా.పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలలో దీన్ని ఏర్పాటు చేశారు. సిద్ధార్థ అకాడమీ ఎడ్యుకేషన్ సంస్థ 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా వైద్య రంగంలోని సాంకేతికత, ఆరోగ్య సంరక్షణ విధానాలపై అవగాహన ప్రదర్శన ఏర్పాటు చేశారు. అందులోనిదే ఈ వైకుంఠపాళి. ఆహారం ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో అందులో చక్కగా వివరించారు. ప్రదర్శనలో శస్త్రచికిత్స, కీళ్ల మార్పిడి విధానం, మెదడు, వెన్నెముక పెరుగుదల గురించి తెలిపే బొమ్మలూ ఉన్నాయి. ఈ ప్రదర్శన నేటి నుంచి 10వ తేదీ వరకు ఉంటుందని కళాశాల డీజీ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు తెలిపారు.

– కృష్ణా, ఈనాడు; న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం



వారిని ఎన్నడూ దూరం చేసుకోవద్దు

మీ వెన్నంటే ఉంటూ, మీలో ఆత్మస్థైర్యం నింపేవారిని ఎన్నడూ దూరం చేసుకోకండి. అలాంటివారు ప్రతిఒక్కరి జీవితంలోనూ అవసరం. వారు మన శక్తి సామర్థ్యాలను ద్విగుణీకృతం చేయగలరు. మీరూ ఇతరుల జీవితాల్లో అలాంటి వ్యక్తులుగా నిలిచేందుకు ప్రయత్నించండి.

– పోలా ఐనా, లీడర్‌షిప్ మెంటార్

భస్మ తాండవం



రాజస్థాన్ రాజధాని నగరమైన జైపుర్‌లో ఆదివారం శ్రావణమాస సందర్భంగా నిర్వహించిన కావడి యాత్రలో నృత్యం చేస్తున్న శివుని వేషధారి



స్వాగతం



దైవసన్నిధిలో ప్రశాంతత లభిస్తుంది. పచ్చటి వాతావరణంలో ఉల్లాసం దొరుకుతుంది. అనకాపల్లి సమీపంలోని చింతమాని గణపతి ఆలయాన్ని సందర్శిస్తే ఈ రెండు అనుభూతులను ఒకేసారి ఆస్వాదించవచ్చు. ఈ ఆలయంలో తీగజాతి మొక్కలు అల్లుకున్న పైకప్పు ఎంతగానో ఆకట్టుకుంటుంది. సుమారు 300 మీటర్ల పొడవునా ఈ మార్గం ఉంది. పైకప్పుపై పచ్చని తీగ అల్లుకుని భక్తులకు నీడనిస్తుంది. ఆలయంలో ప్రకృతి స్వాగతం పలుకుతుంది. – ఈనాడు, అనకాపల్లి

నిత్యం తప్పదు ఈ సర్కస్

ఎప్పుడు కూలిపోతుందో అన్నట్లు కనిపిస్తున్న వంతెనపై విద్యార్థులు నదిని దాటుతున్న ఈ దృశ్యం ఒడిశాలోనిది. కొరాపుట్ జిల్లా బొలిగాన్ పంచాయతీ మాలిగూడ ప్రజలు సూరా నదిని దాటి వెళ్లడానికి వంతెన లేదు. అటువైపున్న ఐదు గ్రామాలకు వెళ్లాలంటే వెదురు బొంగులతో నిర్మించిన వంతెనే దిక్కు. దీన్ని దాటుతున్నప్పుడు పట్టుతప్పి కాలు జారితే నదిలో పడిపోవాల్సిందే. ఈ విషయమై బీడీవో అభిమన్యుకవి శత్పతి వద్ద 'ఈనాడు' ప్రస్తావించగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, జయపురం





మేలు జాతికి జైకొట్టి.. లండన్‌కు బై చెప్పి

ప్రవాస భారతీయులు చిలకపాటి రాజేష్, అంజనా దంపతులు పదేళ్ల కిందట లండన్‌లో ఉద్యోగాలు వదిలేసి కృష్ణా జిల్లా వీరవల్లిలో స్వగ్రామానికి వచ్చారు. పాల ఉత్పత్తికి మేలు జాతి పశు సంపదను వృద్ధి చేయాలని భావించారు. ఆధునిక డెయిరీ ఫామ్ నెలకొల్పారు. అత్యుత్తమమైన 50 దున్నలు, 100కు పైగా ముర్రా గేదెలను పెంచుతున్నారు. వీటి ద్వారా ఏటా 10 లక్షల డోసుల వీర్యం, రోజుకు 600 లీటర్ల పాలు ఉత్పత్తి చేస్తున్నారు. వీటి ధరలు సైతం సాధారణ పాడిగేదెలు, దున్నలతో పోలిస్తే రెండు, మూడు రెట్లు ఎక్కువ ఉండటం గమనార్హం. – న్యూస్‌టుడే, హనుమాన్ జంక్షన్

ఇంటి పెరట్లో సేంద్రియ పంట



సంతలో కూర్చొని కూరగాయలు విక్రయిస్తున్న ఈయన పేరు చింతం రాజయ్య. పెద్దపల్లి జిల్లా ఓదెలకు చెందిన ఆయన సింగరేణి కార్మికుడిగా పదేళ్ల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి స్వగ్రామం ఓదెలలో ఉంటూ భార్య లక్ష్మీతో కలిసి ఇంటి ఆవరణలోని సుమారు 10 గుంటల పెరట్లో సేంద్రియ పద్ధతిలో పూలు, పండ్లతోపాటు కూరగాయలు పండిస్తూ ఆరోగ్యంతోపాటు ఆదాయాన్ని పొందుతున్నారు. ఇంటి అవసరాలకుపోనూ మిగిలిన టమాట, బీర, బెండ, సొరకాయ, గోరుచిక్కుడు, కొత్తిమీర, పాలకూర, మిరప పంటలను వార సంతల్లో విక్రయిస్తున్నారు. – ఈనాడు కరీంనగర్

ఒక ప్రవేశం.. రెండు దేశాల్లో చదువు

- ఇంటిగ్రేటెడ్ డబుల్ డిగ్రీ కోర్సులు
- విదేశీ వర్సిటీలతో కలిసి అందిస్తున్న జేఎన్‌టీయూహెచ్
- ఏపీలోని కొన్ని విశ్వవిద్యాలయాలు సైతం..

విదేశాల్లో చదువంటే తెలుగు విద్యార్థులకు ఎంతో క్రేజ్. అధిక శాతం మంది బీటెక్ తర్వాత ఎంఎస్ లేదా ఎంటెక్ చేయడానికి విదేశాలకు వెళ్తున్నారు. అందుకు భిన్నంగా ఒక్కసారి ప్రవేశంతోనే ఇటు మన విశ్వవిద్యాలయాల్లో, అటు విదేశీ వర్సిటీల్లోనూ చదివి... బీటెక్‌తో పాటు ఎంటెక్/ఎమ్మెస్సీ పట్టాలు అందుకోవచ్చు. ఈ తరహా ఇంటిగ్రేటెడ్ డబుల్ డిగ్రీ కోర్సులను తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని వర్సిటీలు అందిస్తున్నాయి. జేఎన్‌టీయూహెచ్ 2009 నుంచి స్వీడన్‌లోని బ్లెకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) వర్సిటీతో కలిసి ఇంటిగ్రేటెడ్ డబుల్ డిగ్రీ కోర్సు అందిస్తోంది. మొత్తం 90 సీట్లున్నాయి. ఖాళీగా మిగిలిన 17 సీట్ల భర్తీకి ఆగస్టు 5న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. మరోవైపు, ప్రస్తుత విద్యాసంవత్సరం (2025-26) నుంచి జర్మనీలోని రాయ్‌ట్లింగెన్ వర్సిటీ, క్యాసల్ వర్సిటీలతో జేఎన్‌టీయూహెచ్ ఎంఓయూ కుదుర్చుకుని కోర్సులను అందుబాటులోకి తెచ్చింది.

జేఎన్‌టీయూహెచ్-బీటీహెచ్

- **కోర్సు వ్యవధి:** ఐదేళ్లు, **సీట్లు:** 90
- **బీటెక్:** జేఎన్‌టీయూహెచ్‌లో మూడున్నరేళ్లు... ఏడు సెమిస్టర్లు.. **సెమిస్టర్ ఫీజు:** రూ.1.25 లక్షలు.
- **ఎంటెక్:** బీటీహెచ్‌లో ఏడాదిన్నర.. మూడు సెమిస్టర్లు... సెమిస్టర్ ఫీజు సుమారు రూ.5.22 లక్షలు (57,500 సెక్‌లు)
- **ఉద్యోగావకాశాలు:** చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగాన్వేషణ కోసం స్వీడన్‌లో ఏడాది వరకు ఉండొచ్చు. ఈ ఏడాది ప్రవేశాలు పొందేవారు 2029-30లో జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో పాల్గొనవచ్చు. విద్యాభ్యాసం పూర్తి చేసినవారిలో 70 శాతం మంది స్వీడన్‌తోపాటు ఐరోపాలోని ఇతర దేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని బీటీహెచ్ అంతర్జాతీయ డైరెక్టర్ గురుదత్ వేల్పుల తెలిపారు.





జర్మనీలోని రాయ్‌ట్లింగెన్ వర్సిటీ

జేఎన్‌టీయూహెచ్-రాయ్‌ట్లింగెన్ వర్సిటీ


- **కోర్సు:** ఐదున్నర ఏళ్ల ఇంటిగ్రేటెడ్ డబుల్ డిగ్రీ
- **బీటెక్:** జేఎన్‌టీయూహెచ్‌లో మూడేళ్లు,
- **ఎమ్మెస్సీ:** జర్మనీలోని రాయ్‌ట్లింగెన్ వర్సిటీలో రెండున్నరేళ్లు
- **ట్యూషన్ ఫీజు:** జేఎన్‌టీయూహెచ్‌లో రూ.7.50 లక్షలు, జర్మనీలో రూ.24 లక్షలు(24 వేల యూరోలు). వసతి, ఇతర ఖర్చులు అదనం.
- ఇదే వర్సిటీతో కలిసి రెండేళ్ల పీజీ కోర్సు కూడా అందిస్తున్నారు. ఒక సెమిస్టర్ ఇక్కడ.. . మూడు సెమిస్టర్లు జర్మనీలో అభ్యసించాలి.
- జర్మనీలోని క్యాసల్ వర్సిటీతో కలిసి జేఎన్‌టీయూహెచ్ రెన్యువబుల్ ఎనర్జీలో పీజీ కోర్సును అందుబాటులోకి తెచ్చింది.

– ఈనాడు, హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్‌లో...

ఉమ్మడి రాష్ట్రంలోనే ఏపీలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం స్వీడన్ బీటీహెచ్‌తో కలిసి కోర్సులు ప్రారంభించింది. ఆ తర్వాత జేఎన్‌టీయూ కాకినాడలోనూ ప్రవేశపెట్టారు. రాష్ట్ర విభజన తర్వాత 2016 నుంచి జేఎన్‌టీయూ అనంతపురం, తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం బీటీహెచ్‌తో కలిపి డబుల్ డిగ్రీ కోర్సులు అందిస్తున్నాయి. ప్రస్తుతం ఏపీలో తొలి విడత కౌన్సెలింగ్ పూర్తయింది.

- జేఎన్‌టీయూ కాకినాడ అమెరికాలోని నార్తర్న్ అయోవా యూనివర్సిటీ(యూఎన్‌ఐ)తో కలిసి నాలుగేళ్ల బీటెక్ కోర్సు ప్రవేశపెట్టింది. ఒక ఏడాది అమెరికాలో చదవాల్సి ఉంటుంది. ప్రస్తుతం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది.



స్వీడన్‌లోని బ్లెకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వర్సిటీ

ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉండే దేశాల్లో...



నాణ్యమైన విద్యను తక్కువ ఖర్చుతో అందించడంతోపాటు ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉండే దేశాలను అన్వేషిస్తున్నాం. జర్మనీలో 50 లక్షల స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం) ఉద్యోగాల కొరత ఉందని వర్సిటీల సమాచారం. అందుకే అక్కడి వర్సిటీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నాం. జపాన్‌లోనూ మన విద్యార్థులకున్న అవకాశాలను పరిశీలిస్తున్నాం.

– ఆచార్య కిషన్‌కుమార్‌రెడ్డి, ఉపకులపతి, జేఎన్‌టీయూహెచ్

EENADU Vol: 51, Issue: 356 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

బ్యాంకుల్లో క్లర్కు కొలువులు

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కస్టమర్ సర్వీస్ అసోసియేట్ (క్లర్కు) పోస్టుల భర్తీ కోసం ఐబీపీఎస్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా దేశవ్యాప్తంగా 10,277 (ఆంధ్రప్రదేశ్‌లో 367, తెలంగాణలో 261) పోస్టులు భర్తీ కానున్నాయి. మొత్తం 11 బ్యాంకుల్లో ఇండియన్, యూకో బ్యాంకులు ఖాళీల వివరాలు పేర్కొననందున తుది ఎంపిక సమయానికి ఖాళీల సంఖ్య పెరగొచ్చు. ఈ పోస్టుల నియామకానికి జరిగే పరీక్షలో మెరుగైనరీతిలో ఎలా సిద్ధం కావాలో తెలుసుకుందాం!



ప్రిలిమ్స్ పరీక్ష విధానంలో ఎలాంటి మార్పూ జరగలేదు. పూర్వం జరిగిన పరీక్షలతో పోలిస్తే... ప్రస్తుతం మెయిన్స్ పరీక్ష విధానంలో మార్పు జరిగింది.

- గతంలో మొత్తం 4 విభాగాలకు కలిపి 190 ప్రశ్నలు, 160 నిమిషాల వ్యవధి ఉండేది. ప్రస్తుతం 4 విభాగాలకు కలిపి 155 ప్రశ్నలు, 120 నిమిషాల వ్యవధి ఇచ్చారు.
- రీజనింగ్ విభాగంలో ఉండే కంప్యూటర్ ఆప్టిట్యూడ్‌ను ప్రస్తుతం తీసివేశారు.
- విభాగాల వారీగా ప్రశ్నల సంఖ్య, వాటి మార్కు, వ్యవధిలోనూ మార్పులు జరిగాయి.

10,277 పోస్టుల భర్తీకి ఐబీపీఎస్ ప్రకటన

తెలుగులోనూ పరీక్ష: ఈ పరీక్షను తెలుగులోనూ రాసుకునే సదుపాయం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు, ఇంగ్లిష్, హిందీల్లోనూ, తెలంగాణలో ఈ మూడు భాషలతో పాటు ఉర్దూలోనూ రాయవచ్చు. పుదుచ్చేరిలో కూడా ఈ పరీక్షను తెలుగులో రాసే వెసులుబాటు ఉంది.

ఎంపిక: రెండు దశల్లో నిర్వహించే ఆన్‌లైన్ రాత పరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. మొదటి దశ ప్రిలిమ్స్‌లో నెగ్గినవారిలో నుంచి పోస్టుల సంఖ్యను బట్టి నిర్ణీత సంఖ్యలో రెండో దశలోని మెయిన్స్‌కు ఎంపిక చేస్తారు. దీనిలో సాధించిన మార్కుల ఆధారంగానే తుది ఎంపిక జరుగుతుంది. ప్రిలిమ్స్.. అర్హత పరీక్షగానే ఉంటుంది.

భాషా పరీక్ష: అభ్యర్థులు ఏ రాష్ట్రం/ కేంద్రపాలిత ప్రాంతానికైనా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే సంబంధిత స్థానిక భాషలో మాట్లాడటం, చదవడం, రాయడం వచ్చివుండాలి. అందువల్ల మెయిన్స్ తర్వాత భాషా ప్రావీణ్య పరీక్షను నిర్వహిస్తారు. దీనిలో ఉత్తీర్ణత తప్పనిసరి. అయితే అభ్యర్థులు పదో తరగతి/ఆపైన చదివినవాటిలో ఆ స్థానిక భాష ఒక సబ్జెక్టుగా ఉన్నట్లయితే భాషా ప్రావీణ్య పరీక్ష రాయనక్కర్లేదు.

దేనిలో ఏ అంశాలు?

గతంలో జరిగిన పరీక్షల ఆధారంగా వివిధ సబ్జెక్టుల్లో ప్రిలిమ్స్, మెయిన్స్‌లో ప్రశ్నలు వచ్చే ముఖ్యమైన టాపిక్స్

న్యూమరికల్ ఎబిలిటీ/క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్: సింప్లిఫికేషన్స్, నంబర్ సిరీస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్, డేటా ఇంటర్‌ప్రెటేషన్, ముఖ్యమైన అరిథ్‌మెటిక్ అంశాలు.

రీజనింగ్: పజిల్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, సిలాజిజం, ఇనీక్వాలిటీ, కోడింగ్-డీకోడింగ్, డైరెక్షన్ సెన్స్, బ్లడ్ రిలేషన్స్, ఆర్డర్ అండ్ ర్యాంకింగ్, డేటా సఫిషియెన్సీ..

ఇంగ్లిష్ లాంగ్వేజ్: రీడింగ్ కాంప్రహెన్షన్, ఒకాబ్యులరీ (సినానిమ్స్, యాంటనిమ్స్)తో పాటు గ్రామర్ ఆధారంగా వివిధ మోడల్ ప్రశ్నలు.

జనరల్/బ్యాంకింగ్ అవేర్‌నెస్: గత ఐదారు నెలల కరెంట్ అఫైర్స్ బాగా చూసుకోవాలి. బ్యాంకింగ్ అవేర్‌నెస్ కోసం ఆర్‌బీఐ, మానిటరీ పాలసీలు, బ్యాంకింగ్ వ్యవస్థ, ఫైనాన్షియల్ టర్మ్‌లు, డిజిటల్ బ్యాంకింగ్, బ్యాంకుల ప్రధాన కార్యాలయాలు, ట్యాగ్‌లైన్స్, చూడాలి. ఆర్థిక వార్తలు, బడ్జెట్ ముఖ్యాంశాల కూడా ప్రధానమే. ప్రభుత్వ పథకాలు, స్టాటిక్ జీకే నుంచీ ప్రశ్నలు అడుగుతారు.

కటాఫ్ మార్కులు

గతంలో జరిగిన పరీక్షల్లో కటాఫ్ మార్కులు ఎలా ఉన్నాయో గమనిస్తే ప్రస్తుతం జరిగే పరీక్షలో ఎలా ఉండే అవకాశం ఉందో ఒక అంచనా వస్తుంది. అయితే కటాఫ్ మార్కులు .. ఖాళీల సంఖ్య, పోటీపడే అభ్యర్థుల సంఖ్య, పరీక్ష కఠినత్వ స్థాయి.. వీటిమీద ఆధారపడివుంటుందని గుర్తుంచుకోవాలి.

గతంలో జరిగిన మూడు ప్రిలిమ్స్ పరీక్షల్లో జనరల్ అభ్యర్థుల కటాఫ్ మార్కులు ...

రాష్ట్రం	2024	2023	2022
ఆంధ్రప్రదేశ్	77.5	81.25	76.5
తెలంగాణ	68.25	78.50	68.25

నోటిఫికేషన్ ముఖ్యాంశాలు

పోస్టులు: 10,277 **విద్యార్హత:** డిగ్రీ **వయసు:** 20-28 ఏళ్లు (జనరల్ అభ్యర్థులు) **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 21 **దరఖాస్తు ఫీజు:** రూ.850. రిజర్వేషన్ వర్గాల అభ్యర్థులకు రూ.175. **ప్రిలిమ్స్ పరీక్ష:** అక్టోబరు 4, 5, 11. **మెయిన్స్ పరీక్ష:** నవంబరు 29 **వెబ్‌సైట్:** https://www.ibps.in/

సన్నద్ధత ఇలా..

ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు రెండిటిలోనూ ఉన్న సబ్జెక్టులు ఒకటే కాబట్టి ప్రిపరేషన్ కూడా కలిపే సాగించాలి.

- **సిలబస్, పరీక్ష విధానం:** పరీక్షలో ఉండే సబ్జెక్టులు, ప్రశ్నలు వచ్చే టాపిక్స్ పట్ల పూర్తి అవగాహన పెంచుకోవాలి.
- **స్టడీ ప్లాన్:** ప్రతి రోజూ ఏయే సబ్జెక్టుల్లో ఏం చదవాలో ప్రణాళిక వేసుకోవాలి. అవి పూర్తయ్యేలా శ్రద్ధ తీసుకోవాలి. దేనికి ఎంత సమయం కేటాయించాలో కూడా ప్లాన్ చేసుకోవాలి.
- **బేసిక్స్:** సబ్జెక్టుల్లోని వివిధ టాపిక్స్‌కు సంబంధించిన ప్రాథమికాంశాలు (బేసిక్స్) బలంగా ఉండాలి. ముఖ్యంగా అరిథ్‌మెటిక్, రీజనింగ్, ఇంగ్లిష్‌లలో బేసిక్స్‌పై పట్టు పెంచుకోవాలి.
- **రివిజన్:** ఏ రోజు నేర్చుకున్న అంశాలు ఆరోజు చివర్లో, వారం చివర్లో ప్రత్యేకంగా సమయం కేటాయించుకుని పునశ్చరణ (రివిజన్) చేయాలి. ఇలా చేస్తేనే నేర్చుకున్నవి గుర్తుంటాయి. చదివేటప్పుడే పాయింట్లతో నోట్సు రాసుకుంటే రివిజన్‌కు బాగా ఉపయోగం.
- **పాత ప్రశ్నపత్రాలు:** గతంలో జరిగిన పరీక్షల ప్రశ్నపత్రాలను సాధన చేయాలి. దీనివల్ల ప్రశ్నలు అడిగే తీరు తెలుస్తుంది. కొన్నిసార్లు అదే మాదిరి ప్రశ్నలు పరీక్షలో వచ్చే అవకాశం కూడా ఉంది.
- **సమయ పాలన:** వివిధ విభాగాల్లో ఉన్న ప్రశ్నలు, వాటికి కేటాయించిన సమయం గమనించి దానికి అనుగుణంగా ప్రశ్నలు సాధించే వేగం పెంచుకోవాలి.
- **మాక్ టెస్టులు:** సమయ నిర్వహణ తెలియటానికి మాక్ టెస్టులు రాయాల్సిందే. ప్రిపరేషన్ ఎలా సాగుతోందో కూడా అవగాహన కలుగుతుంది. వివిధ సబ్జెక్టుల్లో/టాపిక్స్‌లో బలాలూ, బలహీనతలూ అధిగమించేలా వాటిని బాగా సాధన చేయాలి.
- **షార్ట్‌కట్ పద్ధతులు:** ప్రశ్నలు వేగంగా సాధించడానికి వివిధ షార్ట్‌కట్ పద్ధతులు నేర్చుకోవాలి. కాల్‌క్యులేషన్స్ వేగంగా చేయడానికి స్పీడ్ మ్యాథ్స్/ వేదగణిత కిటుకులు బాగా నేర్చుకోవాలి.
- **ఒత్తిడిని అధిగమించడం:** ప్రిపరేషన్ సమయంలో ఒత్తిడి సహజంగా ఉంటుంది. దీన్ని అధిగమించడానికి ప్రతి గంట సన్నద్ధతలో 5-10 నిమిషాల విరామం తీసుకోవాలి. అలాగే 6-8 గంటల నిద్ర అవసరం. సరైన ఆహారం సకాలంలో తీసుకోవడమూ అవసరమే.
- **ఆత్మవిశ్వాసం:** తప్పనిసరిగా విజయం సాధించగలననే ఆత్మవిశ్వాసంతో ఉండాలి. ఇతరులతో పోల్చుకోకూడదు. నిజాయతీగా, పట్టుదలగా ప్రిపరేషన్ సాగించాలి.




- డా. జి.ఎస్. గిరిధర్, డైరెక్టర్, రేస్ ఇన్‌స్టిట్యూట్

కృత్రిమ మేధతో గెలుపు సాధిద్దాం!

జస్ప్రీత్ బింద్రా, అనుజ్ మ్యాగజైన్ రచించిన 'విన్నింగ్ విత్ ఏఐ' కృత్రిమ మేధపై నేటి యువతకు అవసరమైన అవగాహనను అందిస్తుంది. సాధారణ భాషలో, క్లిష్టమైన సాంకేతిక పదజాలం లేకుండా ఆ పుస్తకం ఆచరణాత్మకంగా అంశాలను వివరిస్తుంది.

పుస్తకం



కృత్రిమ మేధను వృత్తి, వ్యక్తిగత జీవితాల్లో ఎలా వినియోగించాలి? అనే ప్రశ్నకు ఈ పుస్తకంలో స్పష్టమైన సమాధానం లభిస్తుంది. ఏఐ అక్షరాస్యత అంటే కేవలం ఒక సాంకేతిక నైపుణ్యం కాదు, దాన్ని అర్థం చేసుకోవడం, విమర్శించడం, బాధ్యతాయుతంగా ఉపయోగించడం. అలాగే దానితో కలిసి సృజనాత్మకంగా పనిచేయడం.

పుస్తకంలో ఒక ఆసక్తికరమైన ఫ్రేమ్‌వర్క్‌ను పరిచయం చేశారు. అంటే.. రీడ్స్ (చదవడం), రైట్స్ (రాయడం), యాడ్స్ (చేర్చడం), థింక్స్ (ఆలోచించడం), డజ్ (చేయడం). దీనివల్ల ఏఐను ఉపయోగించేటప్పుడు ఏ స్థాయిలో ఉన్నామో తెలుసుకోవచ్చు.

- రీడ్స్ అంటే ఏఐ ఎలా పనిచేస్తుందో తెలుసుకోవడం
- రైట్స్ అంటే ఎలా సరిగ్గా ప్రాంప్ట్ (ప్రశ్నల్లో సమస్యను ఏఐకు బోధించే/ప్రేరేపించే పద్ధతి) ఇవ్వాలో నేర్చుకోవడం
- యాడ్స్ అనగా ఏఐతో కలిసి కొత్త అంశాలను సృష్టించడం
- థింక్స్ అంటే విశ్లేషణ దృష్టితో చూడటం
- డజ్ అంటే ప్రాక్టికల్‌గా దాన్ని అమలు చేయడం.

ఈ ఫ్రేమ్‌వర్క్ ఒక రోడ్‌మ్యాప్‌లా పని చేయటం వల్ల విద్యార్థులకు ఇది ఉపయోగపడుతుంది.

బ్రింగ్ యువర్ ఓన్ ఏఐ (BYOAI) అనే ధోరణి ఈ రోజుల్లో పెరుగుతోంది. అంటే ఉద్యోగులు పనిలో స్వయంగా ఏఐ టూల్స్‌ను ఉపయోగిస్తున్నారు. ఈ దిశగా ముందుకు సాగాలంటే ప్రతి విద్యార్థికీ, కెరియర్ ప్రారంభ దశలో ఉన్న ఉద్యోగులకూ ఏఐ స్కిల్స్ అవసరం. ఉద్యోగానికి దరఖాస్తు చేసిన సందర్భాల్లో ఏఐ పట్ల అవగాహన ఉన్నవారే ప్రాధాన్యం పొందుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పుస్తకం విద్యార్థులకు కెరియర్‌ను అర్థవంతంగా మలచుకునే సాధనంగా నిలుస్తుంది.

ఏఐను ఒక టెక్నికల్ టూల్‌గా మాత్రమే కాకుండా సృజనాత్మక భాగస్వామిగా చూడాలి. ఉదాహరణకు ప్రోగ్రామింగ్ స్క్రిప్టులు రాయాలన్నా, విశ్లేషణ చేయాలన్నా, డేటాను వివరించాలన్నా ఏఐ సహాయపడుతుంది. దీనివల్ల వృత్తి సామర్థ్యం పెరుగుతుంది. అలాగే దీన్ని ఎలాగైనా వాడేయమని కాదు. ఏఐలో బయాసెస్ (పక్షపాత ధోరణులు) ఉండొచ్చు, హలూసినేషన్స్/యంత్ర భ్రమ (తెలియని సమాచారాన్ని తెలిసిన సమాచారంతో భర్తీ చేసి అబద్ధాలను అందించే ధోరణి) రావొచ్చు. అందుకే దాన్ని విమర్శించగలగడం, బాధ్యతగా ఉపయోగించగలగడం ముఖ్యమైన నైపుణ్యాలు.

ఏఐకి ఇచ్చే సూచనలు ఎంత స్పష్టంగా, లక్ష్యబద్ధంగా ఉంటాయో అంత మంచి ఫలితం వస్తుంది. ఈ క్రమంలో రోజూ కొన్ని నిమిషాల సాధన, ప్రాంప్టింగ్ ఫ్రేమ్‌వర్క్‌లను అనుసరించడం అవసరం. అలాగే పక్షపాతాలు, యంత్రభ్రమల వంటి సమస్యలపై కూడా అవగాహన పెంచుకోవాలి. ఏఐ ఆధారిత నిర్ణయాల్లో పాల్గొంటున్నప్పుడు ఇవి బాధ్యతగా మారతాయి.

ఈ పుస్తకం చదవడం పూర్తి చేస్తే... ఏఐ పట్ల స్పష్టమైన దృక్కోణం వచ్చే అవకాశం ఉంది. కొత్త టెక్నాలజీ అంటే భయపడకుండా, దాన్ని అర్థం చేసుకొని, నిజమైన విలువ సృష్టించడంపై స్పష్టమైన దిశను ఇది సూచిస్తుంది. ఏఐ టూల్స్ వాడటం, విమర్శించటం, ఏఐపై పని చేసే జట్టులో భాగమవటం లాంటి నైపుణ్యాలు అలవడతాయి. అవగాహన లేని అంతిమ వినియోగదారుడిగా కాకుండా అవగాహనతో కృత్రిమ మేధ పనితనాన్ని ప్రభావితం చేయగలిగే భాగస్వామిగా మారాలంటే.. ఈ పుస్తకం ఇచ్చే పాఠాలు ఎంతో కీలకం.

– రహ్మాన్ & సంపత్

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

ఎడ్యుకేషన్ సేల్స్ అసోసియేట్

సంస్థ: టెకియర్/ కాన్‌సెప్టిక్స్ అనలిటిక్స్ ప్రై.లి. స్టైపెండ్: రూ.12,000
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్
☛ https://shorturl.at/OmA5e

బ్యాక్‌ఎండ్ ఏఐ ఏజెంట్

సంస్థ: సమర్థ్ గుగ్‌నాని స్టైపెండ్: రూ. 30,000- 50,000 నైపుణ్యాలు: కర్సర్ (జెన్ ఏఐ), జనరేటివ్ ఏఐ టూల్స్, జావా స్క్రిప్ట్, నోడ్. జేఎస్, ప్రాంప్ట్ ఇంజినీరింగ్, టైప్‌స్క్రిప్ట్, వైబ్ కోడింగ్
☛ https://shorturl.at/LYVFK

ఈ రెండిటికీ దరఖాస్తు గడువు: ఆగస్టు 28

హిందీ వాయిస్‌ఓవర్ ఆర్టిస్ట్

సంస్థ: సాల్విట్యూడ్ స్టైపెండ్: రూ.10,000- 50,000 నైపుణ్యాలు: ఇంగ్లిష్, హిందీ, మ్యూజిక్, ప్రూఫ్ రీడింగ్, వాయిస్‌ఓవర్ ఆర్టిస్ట్
☛ https://shorturl.at/CXXel

గేమ్ టెస్టర్

సంస్థ: రెన్‌స్కై టెక్నాలజీస్ ఇంక్ స్టైపెండ్: రూ.15,000- 20,000 నైపుణ్యాలు: బగ్ ట్రాకింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, రిపోర్ట్ రైటింగ్, టెస్ట్ ఆటోమేషన్
☛ https://shorturl.at/32GK7

ఇంటీరియర్ డిజైన్

సంస్థ: షాడోస్ ఇన్‌కార్పొరేషన్ స్టైపెండ్: రూ.15,000 నైపుణ్యాలు: అడోబ్ ఫొటోషాప్, ఆటోక్యాడ్, ఆటోడెస్క్ త్రీడీస్ మ్యాక్స్, గూగుల్ స్కెచప్, ఇంటీరియర్ డిజైన్, రెండరింగ్, వీ-రే
☛ https://shorturl.at/x6GOc

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: ఆగస్టు 29

ఉద్యోగాలు

ఈస్ట్ కోస్ట్ రైల్వేలో గ్రూప్-సీ&డీ

ఈస్ట్ కోస్ట్ రైల్వే భువనేశ్వర్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటాలో 8 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- గ్రూప్-సీ: 02
- గ్రూప్-డీ: 06

అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్, పదో తరగతి, ఐటీఐ. **వయసు:** 18 నుంచి 33 ఏళ్లు ఉండాలి.
దరఖాస్తు ఫీజు: రూ.500. ఎస్సీ, ఎస్టీ, ఈఎస్ఎం, పీడబ్ల్యూడీఎస్, మహిళలకు రూ.250.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 11.09.2025
ఎంపిక: రాత పరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్‌తో
వెబ్‌సైట్: https://rrcbbs.org.in/

ఎన్ఐఓటీలో పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఐఓటీ) 25 పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ కోసం దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పోస్టును అనుసరించి పీహెచ్‌డీ.
వయసు: 35 ఏళ్లు. **ఫెలోషిప్:** నెలకు రూ.80,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 11.09.2025
ఎంపిక: ఇంటర్వ్యూతో
వెబ్‌సైట్: https://www.niot.res.in/

వెస్టర్న్ రైల్వేలో స్పోర్ట్స్ కోటా

వెస్టర్న్ రైల్వే ముంబయి స్పోర్ట్స్ కోటాలో వివిధ విభాగాల్లో 64 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
క్రీడా విభాగాలు: ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, గోల్ఫ్, కబడ్డీ, రెజ్లింగ్, షూటింగ్, సైక్లింగ్, హాకీ, క్రికెట్, వాలీబాల్.

- గ్రూప్-సీ: 21 ● గ్రూప్-డీ: 43

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, ఇంటర్, పదో తరగతి, ఐటీఐ. **వయసు:** 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 - 25 ఏళ్లు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 2025 ఆగస్టు 29. **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.500. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీలకు రూ.250. **ఎంపిక:** డాక్యుమెంట్ వెరిఫికేషన్, క్రీడా ప్రదర్శనతో.
వెబ్‌సైట్: https://www.rrc-wr.com/

నోటీస్ బోర్డు

ఏసీటీఆర్ఈసీలో నాన్-మెడికల్ ఉద్యోగాలు

నవీ ముంబయిలోని టాటా మెమోరియల్ సెంటర్- అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ ట్రీట్‌మెంట్, రిసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఇన్ క్యాన్సర్ (ఏసీటీఆర్ఈసీ).. 14 నాన్ మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- సైంటిఫిక్ ఆఫీసర్ 'ఈ'- 01
- సైంటిఫిక్ ఆఫీసర్ 'సీ'- 02
- సైంటిఫిక్ అసిస్టెంట్ 'బీ'- 05
- కో-ఆర్డినేటర్ 'బీ'- 02
- టెక్నీషియన్ 'ఏ'- 04

అర్హత: పోస్టును అనుసరించి బీఈ/ బీటెక్, బీఎస్సీ, హెచ్ఎస్‌సీ, పీజీ, పీహెచ్‌డీతో పాటు ఉద్యోగానుభవం.
మూల వేతనం: నెలకు సైంటిఫిక్ ఆఫీసర్ 'ఈ'కి రూ.78,800; సైంటిఫిక్ ఆఫీసర్ 'సీ'కి రూ.56100; సైంటిఫిక్ అసిస్టెంట్, కోఆర్డినేటర్‌లకు రూ.35400; టెక్నీషియన్‌కు రూ.19,900.
గరిష్ఠ వయసు: సైంటిఫిక్ ఆఫీసర్ 'ఈ'కి 45 ఏళ్లు; సైంటిఫిక్ ఆఫీసర్ 'సీ'కి 35 ఏళ్లు; సైంటిఫిక్ అసిస్టెంట్, కోఆర్డినేటర్‌లకు 30 ఏళ్లు, టెక్నీషియన్‌కు 27 ఏళ్లు.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 22.08.2025.
వెబ్‌సైట్: https://tmc.gov.in/

మెడికల్ ఉద్యోగాలు

నవీ ముంబయిలోని ఏసీటీఆర్ఈసీ.. కింది మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- అసిస్టెంట్ ప్రొఫెసర్ 'ఈ' (పాథాలజీ)- 01
- కన్సల్టెంట్ 'డి' (పాథాలజీ)- 02

అర్హత: పోస్టును అనుసరించి ఎండీ/డీఎన్‌బీ, డీఎం లేదా తత్సమాన మెడికల్ పీజీతో పాటు ఉద్యోగానుభవం
మూల వేతనం: నెలకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.78,800; కన్సల్టెంట్‌కు రూ.67,700.
వయసు: అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 45 ఏళ్లు; కన్సల్టెంట్‌కు 40 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: ఇంటర్వ్యూతో
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 22.08.2025.
వెబ్‌సైట్: https://tmc.gov.in/

వాక్ ఇన్

అగ్రికల్చర్ వర్సిటీలో టీచింగ్ అసోసియేట్లు

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఒప్పంద ప్రాతిపదికన 8 టీచింగ్ అసోసియేట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
అర్హత: పోస్టును అనుసరించి ఎంటెక్‌తో పాటు పని అనుభవం.
వేతనం: నెలకు రూ.40,000.
వెబ్‌సైట్: https://pjtau.edu.in/

ఏఆర్‌సీఐలో ప్రాజెక్ట్ అసోసియేట్లు

హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రిసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్ (ఏఆర్‌సీఐ) 28 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ప్రాజెక్ట్ అసోసియేట్-2: 01
- ప్రాజెక్ట్ అసోసియేట్-1: 02
- ప్రాజెక్ట్ టెక్నికల్ అసిస్టెంట్: 19
- ప్రాజెక్ట్ టెక్నీషియన్: 06

అర్హత: పోస్టును అనుసరించి ఎమ్మెస్సీ, బీఎస్సీ బీఈ/బీటెక్‌తో పాటు పని అనుభవం. **గరిష్ఠ వయసు:** ప్రాజెక్ట్ అసోసియేట్‌కు 35 ఏళ్లు, ప్రాజెక్ట్ టెక్నికల్ అసిస్టెంట్‌కు 35-50 ఏళ్లు, ప్రాజెక్ట్ టెక్నీషియన్‌కు 50 ఏళ్లు.
వేతనం: నెలకు ప్రాజెక్ట్ అసోసియేట్-2కు రూ.35,000, ప్రాజెక్ట్ అసోసియేట్-1కు రూ.31,000, ప్రాజెక్ట్ టెక్నీషియన్ & టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.27,000. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 06.08.2025
ఎంపిక: ఇంటర్వ్యూతో.
ఇంటర్వ్యూ తేదీ: 2025 ఆగస్టు 11, 12, 13, 14. **వెబ్‌సైట్:** https://www.arci.res.in/careers/

ఓఐఎల్‌లో అవకాశాలు

ఆయిల్ ఇండియా లిమిటెడ్ (ఓఐఎల్)... 54 గ్రూప్-సీ పోస్టులను భర్తీచేయనుంది.

మొత్తం ఖాళీల్లో.. సూపరింటెండింగ్ జియాలజిస్ట్-1, మేనేజర్-5, సూపరింటెండింగ్ ఇంజినీర్ (ఎస్ఈ)- ఇన్‌స్ట్రుమెంటేషన్ -2, ఎస్ఈ- (పైప్‌లైన్ టీ అండ్ ఐ)-5, ఎస్ఈ-(ఎలక్ట్రికల్)-8, ఎస్ఈ-(సివిల్)-2, ఎస్ఈ-(డ్రిల్లింగ్)-10, ఎస్ఈ-(ప్రొడక్షన్)-7, ఎస్ఈ-(ఎన్విరాన్‌మెంట్)-1, ఎస్ఈ-(లాజిస్టిక్స్)-1, ఎస్ఈ-(ఫీల్డ్ ఇంజినీరింగ్)-1, ఎస్ఈ-(పైప్‌లైన్ మెకానికల్)-2, ఎస్ఈ-(రిజర్వాయర్)-1, మేనేజర్ (హెచ్ఆర్)-3, మేనేజర్ (ఫైనాన్స్.అకౌంట్స్)-5.

సూపరింటెండింగ్ ఇంజినీర్: ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్/ ఇన్‌స్ట్రుమెంటేషన్/ సివిల్/ మెకానికల్/ కెమికల్/ పెట్రోలియం/ ఎన్విరాన్‌మెంటల్/ ప్రొడక్షన్/ ఆటోమొబైల్/ ఇండస్ట్రియల్/ మైనింగ్/ మెరైన్/ రోబోటిక్స్ బ్రాంచ్‌తో ఇంజినీరింగ్ డిగ్రీ. సంబంధిత రంగంలో నాలుగేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి.

మేనేజర్ (ఎఫ్అండ్ఏ): ఐసీఏఐ/ ఐసీఎంఏఐ అసోసియేట్ మెంబర్, నాలుగేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి.

మేనేజర్ (హెచ్ఆర్): పర్సనల్ మేనేజ్‌మెంట్/ హెచ్ఆర్/ హెచ్ఆర్ఎంతో ఎంబీఏ. లేదా పర్సనల్ మేనేజ్‌మెంట్‌తో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ. సంబంధిత రంగంలో నాలుగేళ్ల ఉద్యోగానుభవం.

వయసు: ఇంజినీరింగ్ పోస్టులకు 32 సంవత్సరాలు, మేనేజర్‌కు 34 ఏళ్లు మించకూడదు. ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు, సంబంధిత బ్రాంచ్‌లో పీహెచ్‌డీ చేసినవారికి మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీ, మాజీ సైనికోద్యోగులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది. డిపార్ట్‌మెంటల్ ఉద్యోగులకు గరిష్ఠ వయసు 54 సంవత్సరాలు.

దరఖాస్తు ఫీజు: రూ.500 (జీఎస్టీ అదనం). ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, మాజీ సైనికోద్యోగులకు ఫీజు లేదు.

ఎంపిక: ఫేజ్-1లో సీబీటీ, ఫేజ్-2లో పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 18.08.2025

వెబ్‌సైట్: https://www.oil-india.com/advertisement-list

ప్రభుత్వ ఉద్యోగం పొందడానికి అవరోధమా?

డిగ్రీ తర్వాత పోలీసు జాబ్ కోసం కోచింగ్ తీసుకుని పోలీస్ జాబ్ ప్రయత్నంలో ఉన్నాను. విటిలిగో (బొల్లి) లాంటి చర్మవ్యాధులుంటే కేంద్ర, రాష్ట్ర పోలీసు ఉద్యోగాల్లోకి తీసుకోరని విన్నాను. ఇది నిజమేనా? – మణికిరణ్





■ ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రభుత్వ మెడికల్ ప్రమాణాల ప్రకారం విటిలిగో (బొల్లి) అనే చర్మవ్యాధి ఉన్నవారు కేంద్ర/ రాష్ట్ర పోలీస్ ఉద్యోగాలకు సాధారణంగా అర్హులు కారు. కేంద్ర సాయుధ పోలీసు దళాలు, ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ వంటి దళాల్లో, పోలీస్ ఉద్యోగాలకు కూడా ఈ వ్యాధి ఉన్నవారిని అనర్హులుగా పరిగణిస్తున్నారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం పోలీస్ ఉద్యోగాలకు విటిలిగోను నిర్దిష్ట నిరాకరణ జాబితాలో చేర్చారు. ఢిల్లీ హైకోర్టుతో పాటు వివిధ న్యాయస్థానాలు కూడా ఈ నియమాలను సమర్థిస్తూ, ఈ వ్యాధి పెరగకపోయినా, తక్కువగా ఉన్నా పోలీసు ఉద్యోగాలకు అర్హత కల్పించడం కష్టమని తీర్పులు వెలువరించాయి.

పైన చెప్పిన సమాధానం విటిలిగోకి సంబంధించిందే కానీ, అన్ని రకాల చర్మవ్యాధులగురించి కాదు అనే విషయాన్ని దృష్టిలో పెట్టుకోండి. ఏదైనా ఉద్యోగానికి దరఖాస్తు చేసేముందు ఉద్యోగ నోటిఫికేషన్లో పేర్కొన్న నిబంధనలనూ, మెడికల్ ఫిట్‌నెస్ సమాచారాన్నీ పూర్తిగా చదివి మీ విద్యా, వైద్య అర్హతలను నిర్ధరించుకోండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఈనాడు సినిమా

తెలుగు చిత్రసీమకు సెకండాఫ్ ఆరంభంలోనే షాక్ తగిలింది. సరైన విజయాల్లేక జులై నెల వెలవెలబోయింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఆశలన్నీ ఆగస్టుపై పడ్డాయి. ఓవైపు వందల కోట్ల బడ్జెట్‌తో ముస్తాబైన భారీ బడ్జెట్ చిత్రాలు.. మరోవైపు వైవిధ్య భరితమైన కథలతో సిద్ధమైన చిన్న, మీడియం రేంజ్ చిత్రాలు బాక్సాఫీస్ బరిలో అదృష్టం పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యాయి. మరి వీటిలో హిట్టు మాట వినిపించి చిత్రసీమకు కళ తెచ్చేవెన్ని.. భారీ వసూళ్లతో రికార్డులు తిరగరాసేవెన్ని? అన్నది సినీప్రియుల్లో ఆసక్తిరేకెత్తిస్తోంది.

ఆశలన్నీ ఆగస్టుపైనే

ఆగస్టు నెలకు అనువాద చిత్రం 'సార్ మేడమ్'తో స్వాగతం పలికారు విజయ్ సేతుపతి, నిత్యా మేనన్. ఈ ఇద్దరూ జంటగా నటించిన ఈ సినిమా ఇప్పటికే తమిళంలో విడుదలై మంచి ఆదరణ దక్కించుకుంది. ఈ నేపథ్యంలోనే దీన్ని ఈ నెల 1న తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురాగా మిశ్రమ స్పందనతో బాక్సాఫీస్ బరిలో నిలబడే ప్రయత్నం చేస్తోంది. ఈ రెండో వారంలో హాస్యనటులు ప్రవీణ్, వైవా హర్ష ప్రధాన పాత్రల్లో నటించిన 'బకాసుర రెస్టారెంట్' థియేటర్లలో అదృష్టం పరీక్షించుకోనుంది. హంగర్ థ్రిల్లర్ అనే కొత్త కాన్సెప్ట్‌తో రూపొందిన చిన్న చిత్రమిది. వినోదానికి పెద్ద పీట వేసినట్లు ప్రచార చిత్రాల్ని బట్టి అర్థమవుతోంది. థియేటర్లలో ఆ కామెడీ పండిందంటే హిట్టు మాట వినిపించే అవకాశముంది. మరి అది సాధ్యమవుతుందో లేదో తెలియాలంటే ఈ నెల 8వరకు వేచి చూడక తప్పదు. అదే రోజు 'బన్ బటర్ జామ్', 'మాతృ' అనే రెండు అనువాద చిత్రాలు థియేటర్లలోకి రానున్నాయి. మరి అవి ప్రేక్షకుల దృష్టిని ఏమేర ఆకర్షిస్తాయో చూడాలి.



'కూలీ'


'వార్ 2'

పోరు ఊరిస్తోంది..

ఈ ఏడాది సినీప్రియులంతా ఎంతో ఆసక్తికరంగా ఎదురు చూస్తున్న రెండు భారీ బడ్జెట్ చిత్రాలు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బాక్సాఫీస్ బరిలో తలపడనున్నాయి. అవే రజనీకాంత్ 'కూలీ', హృతిక్ రోషన్ - ఎన్టీఆర్‌ల 'వార్ 2'. కాంబినేషన్.. కంటెంట్.. తారాగణం.. బడ్జెట్.. ఇలా ఏ కోణంలో చూసినా రెండూ వేటికవే సాటి అన్నట్లుగా ఉన్నాయి. రజనీ హీరోగా నటించిన 'కూలీ'కి లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించారు. ఇందులో నాగార్జున, ఆమిర్ ఖాన్, ఉపేంద్ర, సౌబిన్ షాహిర్, శ్రుతిహాసన్.. ఇలా అన్ని భాషలకు చెందిన స్టార్ తారాగణమంతా ఉంది. దీనికి తోడు ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రచార చిత్రాలు ప్రేక్షకుల్లో అంచనాల్ని రెట్టింపు చేశాయి. దీంతో ఇది హిట్టు మాట వినిపించిందంటే చాలు వెయ్యి కోట్ల వసూళ్లను అవలీలగా చూసే అవకాశముందని ట్రేడ్ వర్గాలు అంచనాలు వేస్తున్నాయి. మరోవైపు అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన 'వార్ 2'పైనా ఇదే స్థాయిలో అంచనాలు నెలకొన్ని ఉన్నాయి. 'ఆర్ఆర్ఆర్', 'దేవర' లాంటి విజయాల తర్వాత ఎన్టీఆర్ నుంచి వస్తున్న సినిమా కావడం. హృతిక్ రోషన్ లాంటి బాలీవుడ్ స్టార్‌తో కలిసి తొలిసారి తెర పంచుకోవడం.. 'వార్'కు, యశ్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌కు సినీప్రియుల్లో ఓ క్రేజ్ ఉండటం.. ఇవన్నీ 'వార్ 2'పై అంచనాల్ని అంతకంతకూ రెట్టింపు చేస్తున్నాయి. అంతా అనుకున్నట్లుగా ఇది ప్రేక్షకుల అంచనాల్ని అందుకుందంటే వసూళ్ల పరంగా కొత్త రికార్డులు నమోదవ్వడం ఖాయమైనట్లే. మరి ఈ రెండు చిత్రాలు సినీప్రియుల్ని మురిపిస్తూ.. భారీ వసూళ్లతో బాక్సాఫీస్‌కు కొత్త కళను తీసుకొస్తాయో లేదో తెలియాలంటే ఈ నెల 14వరకు వేచి చూడక తప్పదు.

చవితి బరిలో గెలుపెవరిదో..


'మాస్ జాతర'


'పరదా'

ఈ నెల చివరి వారం నుంచి వినాయక చవితి సందడి మొదలు కానుండగా.. దానికి నాలుగైదు రోజుల ముందు నుంచే థియేటర్లలో కొత్త చిత్రాల అల్లరి కనిపించనుంది. ఈ నెల 22న అనుపమ పరమేశ్వరన్ 'పరదా'తో పాటు నరేశ్ అగస్త్య 'మేఘాలు చెప్పిన ప్రేమకథ' అనే మరో చిన్న సినిమా థియేటర్లలోకి రానుంది. వీటిలో అనుపమ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలే ఉన్నాయి. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దీనికి దర్శకత్వం వహించారు. దర్శన రాజేంద్రన్, సంగీత తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఓ విభిన్నమైన సోషల్ డ్రామా కథాంశంతో రూపొందిన ఈ చిత్రం సినీప్రియుల అంచనాల్ని అందుకుంటుందా? లేదా? చూడాలి. ఇక అగ్ర హీరో రవితేజ 'మాస్ జాతర'తో పాటు నారా రోహిత్ 'సుందరకాండ' గణేశ్ చతుర్థి సందర్భంగా ఈ నెల 27న థియేటర్లలో సందడి చేయనున్నాయి. ఈ చిత్ర విజయాలపై ఇద్దరు హీరోలూ చాలా ఆశలే పెట్టుకున్నారు. ఇటీవల రవితేజ నుంచి వచ్చిన చిత్రాలన్నీ ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయాయి. ఈ నేపథ్యంలోనే తనకు బాగా అచ్చొచ్చిన మాస్ యాక్షన్ కథతో.. శక్తిమంతమైన పోలీసు పాత్రతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమయ్యారు. దీన్ని కొత్త దర్శకుడు భాను భోగవరపు తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణే దక్కింది. దీంతో ఈసారి రవితేజ హిట్టు మాట వినిపించడం పక్కా అన్న ధీమా అందరిలోనూ కనిపిస్తోంది. ఇక ఇటీవలే 'భైరవం'తో సినీప్రియుల్ని పలకరించిన నారా రోహిత్‌కు అదేమంత కలిసి రాలేదు. ఈ నేపథ్యంలోనే ఇప్పుడాయన సోలో హీరోగా నటించిన 'సుందరకాండ'పై చాలా నమ్మకాలు పెట్టుకున్నారు. ఇది రోహిత్‌కు 20వ సినిమా. ఓ యువకుడి జీవితంలోని రెండు దశల్ని ఆవిష్కరించే విభిన్నమైన ప్రేమకథతో రూపొందింది. మరి ఇది ప్రేక్షకులకు ఎలా కనెక్ట్ అవుతుందో వేచి చూడాలి.

నా పాట వింటూ పిల్లలు అన్నం తింటున్నారు!


తమన్నా

"ప్రేక్షకులు సినిమాలను మర్చిపోవచ్చేమో కానీ.. పాటలను కచ్చితంగా గుర్తుంచుకుంటార"ని అంటోంది అందాల తార తమన్నా. వైవిధ్యమైన కథలలో నటిస్తూనే.. ప్రత్యేక పాటలతో కుర్రకారుని ఉర్రూతలూగిస్తోందీ భామ. ఇటీవలే 'ఆజ్ కి రాత్..' అంటూ 'స్త్రీ 2'లో ఆడిపాడిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. ఈ గీతం గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. "నేను ఒక ప్రాజెక్టుకు సంతకం చేసేటప్పుడు.. దాని ద్వారా నాకు వచ్చే డబ్బు గురించి ఆలోచించను. నేను చేస్తున్న పని ప్రేక్షకులపై ప్రభావం చూపిస్తుందా? లేదా? అనేదే దృష్టిలో పెట్టుకుంటా. పాట, నటన, సినిమా.. ఇలా ఏదో ఒక విధంగా నేను చేస్తున్న పని ప్రేక్షకుల జీవితాల్ని తాకడం ముఖ్యం. ఇటీవల చాలా మంది తల్లులు నాకు ఫోన్ చేసి 'ఆజ్ కి రాత్' పాట పెడితేనే తమ పిల్లలు ఆహారం తింటున్నారని చెప్పారు. ఇందులో ఆందోళన పడాల్సిన అవసరం ఏం లేదు. ఎందుకంటే పిల్లలకు సాహిత్యం అర్థం కాదు. కానీ వాళ్లు సంగీతం వింటూ ఎంజాయ్ చేస్తూ అన్నం తింటున్నార"ని చెప్పుకొచ్చింది తమన్నా.

మూడో భాగమూ ఉంది!


రిషబ్ శెట్టి

'కాంతార' చిత్రంతో జాతీయ స్థాయిలో మెరిశారు రిషబ్ శెట్టి. ఇప్పుడా సినిమాకి ప్రీక్వెల్‌గా 'కాంతార: చాప్టర్ 1' సిద్ధమైన సంగతి తెలిసిందే. రిషబ్ హీరోగా నటిస్తూ.. స్వయంగా తెరకెక్కించిన ఈ చిత్రాన్ని హోంబలే ఫిల్మ్స్ సంస్థ నిర్మించింది. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా అక్టోబరు 2న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడీ చిత్రానికి సంబంధించి మరో ఆసక్తికర విషయం బయటకొచ్చింది. ఈ ఫ్రాంఛైజీలో మూడో భాగాన్ని రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇది 'కాంతార'కు సీక్వెల్‌గా ఉండనున్నట్లు తెలిసింది. దీనికి సంబంధించి రిషబ్‌కు నిర్మాణ సంస్థకు మధ్య ఇప్పటికే ఒప్పందాలు కుదిరినట్లు తెలుస్తోంది. అయితే ఇది సెట్స్‌పైకి వెళ్లడానికి చాలా సమయం పట్టనుంది. ప్రస్తుతం రిషబ్ శెట్టి చేతిలో ఉన్న చిత్రాలు పూర్తయ్యాకే ఈ మూడో భాగం మొదలయ్యే అవకాశముంది.

'మహావతార్ నరసింహ'ను పవన్ చూడాలని కోరుకుంటున్నా
– అల్లు అరవింద్


అల్లు అరవింద్, శిల్పా ధావన్, అశ్విన్ కుమార్

తమ కుటుంబ సభ్యులు, సన్నిహితుల్లో సనాతన ధర్మం గురించి పవన్ కల్యాణ్‌కు తెలిసినంతగా మరెవరికీ తెలియదని అన్నారు నిర్మాత అల్లు అరవింద్. పవన్ సనాతన ధర్మం గురించి ప్రసంగిస్తే అందరూ ముగ్ధులవుతారని.. ఆయన 'మహావతార్ నరసింహ' చిత్రాన్ని చూసి, దాని గురించి మాట్లాడాలని కోరుకుంటున్నానని ఆశాభావం వ్యక్తం చేశారు. అశ్విన్ కుమార్ తెరకెక్కించిన ఈ యానిమేటెడ్ చిత్రాన్ని హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో శిల్పా ధావన్, కుశాల్ దేశాయ్, చైతన్య దేశాయ్ నిర్మించారు. ఈ సినిమా గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఇటీవలే తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలోనే ఆదివారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ.. "ఈ చిత్రాన్ని నేను విడుదల చేసేలా అనుగ్రహించిన నరసింహ స్వామికి నమస్కారం. ఈ సినిమా కోసం దర్శక నిర్మాతలు ఎంతో కష్టపడ్డారు. 2021లో సినిమాని మొదలు పెట్టి ఎన్నో సవాళ్లు ఎదుర్కొని, పట్టుదలతో దీన్ని మన ముందుకు తీసుకొచ్చారు. ఇప్పుడా నరసింహ స్వామి వారే వాళ్లకు ఈ అద్భుతమైన విజయాన్ని అందించారు. ఎప్పుడూ థియేటర్స్‌కు రాని ప్రేక్షకులు కూడా ఈ చిత్రాన్ని వీక్షిస్తున్నారు. ఓ ఉద్వేగంతో తమ తోటి వారికి ఈ సినిమా గురించి గొప్పగా చెప్తున్నారు" అన్నారు. "ఈ చిత్రం చూస్తున్నంత సేపూ ఒక గుడిలో ఉన్నామన్న అనుభూతి కలిగింది. ఈ సినిమాతో దర్శకుడు అశ్విన్ యావత్ ప్రపంచానికి నరసింహ స్వామిని దర్శనం చేయించారు. దీన్ని తీసిన వారు.. రాసిన వారు.. చూసిన వారు.. అందరూ ధన్యులే" అన్నారు నటుడు తనికెళ్ల భరణి. దర్శకుడు అశ్విన్ కుమార్ మాట్లాడుతూ.. "ఇది సినిమా కాదు.. మహా దర్శనమని ప్రేక్షకులే చెప్తున్నారు. ఈ చిత్రానికి వచ్చిన ప్రతి ప్రశంస నరసింహ స్వామికే చెందుతుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, శిల్పా ధావన్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు స్వారీ వీరుడిగా?


నితిన్

కథానాయకుడు నితిన్ చేతిలో ప్రస్తుతం రెండు సినిమాలున్నాయి. వాటిలో ఒకదాన్ని విక్రమ్ కె.కుమార్ తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. 'ఇష్క్' విజయం తర్వాత వీళ్ల కాంబోలో రూపొందనున్న రెండో చిత్రమిది. ఇదొక క్రీడా నేపథ్య కథాంశంతో రూపొందనున్నట్లు ఇప్పటికే నితిన్ ప్రకటించారు. కాగా, ఇప్పుడాయన పాత్రకు సంబంధించి ఓ ఆసక్తికర విషయం బయటకొచ్చింది. నితిన్ దీంట్లో గుర్రపు స్వారీ వీరుడిగా కనిపించనున్నట్లు సమాచారం. ఈ పాత్ర కోసం ఆయన తన శరీరాకృతిని మార్చుకోనున్నట్లు తెలుస్తోంది. ఇది తన కెరీర్‌లోనే భారీ బడ్జెట్ చిత్రంగా నిలవనుందని.. విజువల్ ఎఫెక్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యముందని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రం ఈ ఏడాది చివర్లో మొదలయ్యే అవకాశముంది. నితిన్ ప్రస్తుతం 'బలగం' వేణు దర్శకత్వంలో 'ఎల్లమ్మ' అనే చిత్రాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.

వేతనాలు 30శాతం పెంపునకు అంగీకరిస్తేనే చిత్రీకరణలో పాల్గొంటాం

● తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కీలక నిర్ణయం

తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. తాము కోరినట్లుగా నిర్మాతలు వేతనాల్ని 30శాతం పెంచి ఇవ్వాల్సిందేనని పట్టుబట్టింది. ఈరోజు నుంచి అలా ఇచ్చేందుకు అంగీకరించిన నిర్మాతల సినిమాల చిత్రీకరణల్లోనే పాల్గొనాలని కార్మిక సంఘాల నాయకులకు ఫెడరేషన్ తేల్చి చెప్పింది. పెంచిన వేతనాల్ని కూడా ఏరోజుకు ఆరోజే చెల్లించాలని డిమాండ్ చేసింది. నిర్మాతలు 30శాతం వేతనం పెంచి ఇస్తామని ఒప్పంద పత్రాన్ని ఫెడరేషన్ ద్వారా యూనియన్‌లకు తెలియజేసిన తర్వాతే చిత్రీకరణలకు వెళ్లాలని.. అప్పటి దాకా ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులెవరూ సినిమాలు, వెబ్‌సిరీస్‌ల చిత్రీకరణలకు హాజరు కాకూడదని నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం జరిగిన ఫెడరేషన్ సర్వసభ్య సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. వేతనాల పెంపు అంశంపై కో-ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్‌లుగా సయ్యద్ హ్యూమయున్, వీరశంకర్‌ను నియమించినట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. కార్మికుల వేతనాల పెంపు విషయమై కొన్నిరోజులుగా ఫిల్మ్ ఫెడరేషన్ - ఫిల్మ్ ఛాంబర్ మధ్య చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇక ప్రస్తుతం ఫెడరేషన్ తీసుకున్న ఈ నిర్ణయం నేపథ్యంలో ఈరోజు జరగాల్సిన అల్లరి నరేశ్ కొత్త సినిమా ప్రారంభ వేడుక వాయిదా పడింది.

ఫెడరేషన్ పక్షపాతంగా వ్యవహరిస్తోంది: తెలుగు ఫిల్మ్ ఛాంబర్

సినీ కార్మికుల 30శాతం వేతనాల పెంపును డిమాండ్ చేస్తూ ఫెడరేషన్ తీసుకున్న నిర్ణయాన్ని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఖండించింది. ఫెడరేషన్ పక్షపాతంగా వ్యవహరిస్తుందని అంది. ప్రస్తుత చట్టాల ప్రకారం, నైపుణ్యం ఉన్నవారికి, లేని వర్కర్లకు ఇప్పటికే కనీస వేతనాల కంటే ఎంతో ఎక్కువ చెల్లిస్తున్నామని తెలిపింది. ఫెడరేషన్ సృష్టిస్తున్న అంతరాయం నిర్మాణంలో ఉన్న చిత్రాలకు భారీ నష్టాన్ని కలిగిస్తుందని పేర్కొంది. ఈ సమస్యకు స్థిరమైన పరిష్కారం సాధించేందుకు ఛాంబర్ సంబంధిత అధికారులతో చర్చలు చేస్తుందని.. అప్పటి దాకా నిర్మాతలు కార్మిక సంఘాలతో ప్రత్యేక ఒప్పందాలు చేసుకోకుండా, ఛాంబర్ జారీ చేసే మార్గనిర్దేశాలను కచ్చితంగా అనుసరించాలని తెలిపింది. శాశ్వత పరిష్కారం కోసం, మెరుగైన భవిష్యత్తు కోసం మనమంతా ఐక్యతతో ఉండాలని నిర్మాతలకు పిలుపునిచ్చింది.

త్వరలో ఏపీలోనూ ఫిల్మ్ అవార్డ్స్ వేడుక: మురళీ మోహన్


సురేశ్ కొండేటి, మురళీ మోహన్, కేఎస్ రామారావు

సంతోషం సౌత్ ఇండియన్ ఫిల్మ్ అవార్డ్స్, సంతోషం ఓటీటీ అవార్డ్స్ 2025 వేడుక ఈనెల 16న హైదరాబాద్‌లో జరగనుంది. ఈ మేరకు ఈ అవార్డ్స్‌కు సంబంధించిన కర్టెన్ రైజర్ కార్యక్రమం ఇటీవల హైదరాబాద్‌లో జరిగింది. నటుడు మురళీ మోహన్, నిర్మాతలు కేఎస్ రామారావు, ఏడిద రాజా తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నటుడు మురళీ మోహన్ మాట్లాడుతూ.. "24ఏళ్లుగా అవార్డుల వేడుక చేస్తున్న ఏకైక మ్యాగజైన్ సంతోషం. సురేశ్ కొండేటి ఒక్కడు ఎంతో కష్టపడి ఇన్నేళ్లుగా ఈ వేడుక చేస్తున్నారు. తెలంగాణలో పదేళ్ల తర్వాత గద్దర్ అవార్డులు ఇచ్చారు. త్వరలో ఏపీలోనూ ఫిల్మ్ అవార్డులు ఇవ్వనున్నారు. సూర్య చంద్రులకు గ్రహణం పట్టినంత మాత్రానా వారికేం కాదు. అలాగే ఏవో కష్టాలొచ్చినందుకు సురేశ్‌కు ఏం కాదు" అన్నారు. '2002లో తొలి సంతోషం అవార్డుల వేడుకలో నాగార్జున ఇది ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్‌లా పేరు తెచ్చుకోవాలన్నారు. ఆయన మాట మీద నేను కనీసం 25ఏళ్లు ఫిల్మ్ అవార్డ్స్ ఇవ్వాలని లక్ష్యం పెట్టుకున్నా. ఇది 24వ సంవత్సరం. అందరి ప్రోత్సాహం వల్లే ఇంత సుదీర్ఘ ప్రయాణం చేయగలుగుతున్నా" అన్నారు. ఈ అవార్డుల కార్యక్రమానికి శ్రీ విజయ వారాహి మూవీస్ సంస్థ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు.

యువతలో మార్పు తెచ్చే చిత్రమిది


కృష్ణసాయి

మాదకద్రవ్యాల్ని అరికట్టేందుకు.. దీనిపై యువతకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు కృష్ణసాయి హీరోగా నటిస్తూ.. స్వయంగా సమర్పిస్తున్న చిత్రం 'డేంజర్'. పీఎస్ నారాయణ దర్శకత్వం వహిస్తున్నారు. కృష్ణసాయి చారిటబుల్ ట్రస్ట్ నిర్మిస్తోంది. ఈ సినిమాలోని "ఓ యువతా నీ గమ్యం ఎటువైపు" అనే గీతాన్ని ఇటీవల విడుదల చేశారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో కృష్ణసాయి మాట్లాడుతూ.. 'మాదకద్రవ్యాల్ని అరికట్టేందుకు మా బాధ్యతగా ఈ సినిమాని రూపొందించాం. ఇది యువతను మార్పు దిశగా నడిపిస్తుందని నమ్మకముంది" అన్నారు.

"ఎప్పుడైనా పోరాట ఘట్టాలకు ప్రేక్షకులు కనెక్ట్ అవ్వాలంటే దాని వెనుక బలమైన భావోద్వేగాలు ఉండాలని నేను నమ్ముతా. 'కింగ్డమ్'లో అది సరిగ్గా కుదిరింది కాబట్టే అందరి నుంచి మంచి ఆదరణ లభిస్తోంది" అన్నారు నటుడు సత్యదేవ్. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించారు. సత్య ఇందులో విజయ్‌కు సోదరుడిగా నటించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు సత్యదేవ్.

నో చెప్పడమనే ఆర్ట్‌లో నేను ఫెయిల్యూర్ స్టూడెంట్‌నే!


సత్యదేవ్

నా కోసం రాసుకుని.. వేరొకరితో చేద్దామనుకున్నారు!

"దర్శకుడు గౌతమ్ 'కింగ్డమ్' కథ చెప్పగానే ఎలాంటి లెక్కలు వేసుకోకుండా ఈ చిత్రం చేస్తున్నానని వెంటనే చెప్పేశా. నాకంతగా నచ్చిందీ స్క్రిప్ట్. ఈరోజు నా నమ్మకం నిజమై.. ప్రేక్షకుల నుంచి ఆదరణ లభిస్తుండటం ఆనందాన్నిస్తోంది. నిజానికి దీంట్లోని శివ పాత్రను గౌతమ్ నన్ను దృష్టిలో పెట్టుకునే రాసుకున్నా.. ఏవో కారణాల వల్ల ఆయన తొలుత నన్ను సంప్రదించలేదు. వేరే నటులతో చేద్దామని కూడా అనుకున్నారు. అయితే చిత్రీకరణ మొదలవ్వడానికి కొద్దిరోజుల ముందు గౌతమ్ నన్ను కలిసి కథ గురించి చెప్పారు. ఆ కథ.. నా పాత్రను భిన్న కోణాల్లో తీర్చిదిద్దిన తీరు నచ్చి వెంటనే ఓకే చెప్పా. మనం తినే ప్రతి మెతుకు మీద మన పేరు రాసి ఉంటుందంటారు కదా. అలాగే ఏ పాత్ర ఎవరు చేయాలనేది కూడా రాసి పెట్టి ఉంటుందేమోనని అప్పుడనిపించింది".

ఆ రెండూ సవాల్‌గా అనిపించాయి..

"ఈ చిత్ర విషయంలో నటుడిగా నాకు సవాల్ అనిపించిన సీక్వెన్స్‌లు రెండున్నాయి. విజయ్ నా తమ్ముడని తెలిశాక జైల్లో మా ఇద్దరి మధ్య సంభాషణ జరుగుతుంది. తమ్ముడంటే మనసులో ఎంత ప్రేమున్నా.. పైకి మాత్రం అది చూపించకూడదు. ఒకవేళ చూపిస్తే తమ్ముడు నాతోనే ఉండిపోతాను అంటాడనే భయం నాలో ఉంటుంది. ఓవైపు తమ్ముడు, మరోవైపు దీవి ప్రజలు, ఇంకోవైపు తనకు తెలిసిన నిజం.. ఇలా పాత్ర చుట్టూ ఎంతో ఎమోషన్ దాగి ఉంటుంది. ఆ డ్రామా అంతటినీ ప్రభావవంతంగా పండించడం బాగా సవాల్‌గా అనిపించింది. అలాగే ఈ చిత్ర విషయంలో శారీరకంగా బాగా శ్రమ పెట్టినది మాత్రం క్లైమాక్స్ ఎపిసోడే. ఇప్పుడు ప్రేక్షకుల నుంచి వస్తున్న ఆదరణ చూశాక.. నేను పడిన కష్టమంతా మర్చిపోయాను".

ప్రమాదాల నుంచి బయటపడ్డాం..

"ఈ సినిమాలో బోట్ సీక్వెన్స్‌కు ప్రేక్షకుల నుంచి చక్కటి ఆదరణ లభిస్తోంది. మేము ఆ ఎపిసోడ్ కోసం చాలా కష్టపడ్డాం. నిజానికి నాకు బోట్ నడపడం రాదు. కానీ, నన్ను నమ్మి విజయ్ బోట్‌లో కూర్చోవాలి. ఆ నీటి ప్రవాహానికి తగ్గట్లుగా నేను దాన్ని నడపాలి. కాకపోతే దాన్ని కుడివైపు తిప్పితే ఎడమ వైపుకు.. ఎడమకు తిప్పితే కుడివైపుకు వెళ్తోంది. దీంతో తొలుత బోట్ నడపడానికి చాలా భయపడ్డా. ఈ క్రమంలోనే ఆ సీక్వెన్స్ చిత్రీకరణ సమయంలో కొన్ని ప్రమాదాల నుంచి బయటపడ్డాము. ఓసారి చెట్ల కొమ్మల్లోకి వెళ్లిపోయాము. మరోసారి చెట్టు మీద పడబోయింది. దీంతో బాగా ప్రాక్టీస్ చేసి విజయవంతంగా బోట్ నడిపా".

అదే నా ప్రాధాన్యతైతే పొలం పనులు చేసుకునేవాణ్ని!

"నేను నో చెప్పడమనే ఆర్ట్‌లో ఫెయిల్యూర్ స్టూడెంట్‌నే. ఎదుటి వాళ్లను నొప్పించకుండా ఆ మాట చెప్పడం కోసం చాలా కష్టపడుతుంటా. కేవలం డబ్బు కోసమే సినిమాలు చేయాలని నేనైతే అనుకోవట్లేదు. ఒకవేళ అదే నా ప్రాధాన్యత అయితే వెళ్లి పొలం పని చేసుకుంటా గానీ సినిమాలు చేయను. ప్రస్తుతం నేను చేసిన 'అరేబియన్ కడలి' వెబ్‌సిరీస్ ఈనెల 8న అమెజాన్ ప్రైమ్‌లో విడుదల కానుంది. 'ఫుల్ బాటిల్' అనే సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. వెంకటేశ్ మహా దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తున్నా. 'ఆరంభం' ఫేమ్ అజయ్ నాగ్‌తోనూ ఓ సినిమా చేయనున్నా. మరో రెండు చిత్రాలకీ సంతకాలు చేశా".

పీఎల్ఐ తరహా పథకం కావాలి

- ఆర్థికంగా సహాయం చేయండి
- ట్రంప్ సుంకాల నేపథ్యంలో ప్రభుత్వాన్ని కోరుతున్న ఎగుమతిదారులు



దిల్లీ: అమెరికా విధించిన 25% సుంకాలను భరించేందుకు ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకం తరహాలో ప్రత్యేక పథకాన్ని తీసుకురావాలని వివిధ రంగాలకు చెందిన దేశీయ ఎగుమతిదారులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముంబయిలో జరిగిన ఒక సమావేశంలో కేంద్ర, వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు తమ అభ్యర్థనను తెలియజేసినట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. టారిఫ్ భారాన్ని భరించేందుకు ఆర్థిక సాయం, రుణాలు అందించాలని కోరినట్లు పేర్కొన్నాయి. అధిక సుంకాల కారణంగా అమెరికా మార్కెట్లో తమకు ఎదురయ్యే సమస్యలను మంత్రితో పంచుకున్నట్లు వివరించాయి. తమ సమస్యలను లిఖిత పూర్వకంగా పంపాలని మంత్రి సూచించారని తెలిపాయి. దేశంలోని ఎగుమతిదారులకు బ్యాంకులు అందించే రుణాలపై వడ్డీ రేట్లు 8-12 శాతంగా ఉన్నాయి. పోటీ దేశాల్లో ఈ ధరలు చాలా తక్కువగా ఉన్నాయి. దుస్తులు, రొయ్యల రంగాల పరిస్థితి బాగాలేదు. అమెరికా దిగుమతిదారులు తమ ఆర్డర్లను రద్దు చేస్తున్నారు. రానున్న నెలల్లో ఎగుమతులపై ఇది ప్రభావం చూపిస్తుందని, దీనివల్ల ఉద్యోగ నష్టం లాంటివి ఉండొచ్చని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. అధిక భారం పడే రంగాల్లో జౌళి రంగం (10.3 బిలియన్ డాలర్లు), రత్నాలు-ఆభరణాలు (12 బి.డాలర్లు), రొయ్యలు (2.24 బి.డాలర్లు), తోలు, పాదరక్షలు (1.18 బి.డాలర్లు), రసాయనాల పరిశ్రమ (2.34 బి.డాలర్లు), ఎలక్ట్రికల్-మెకానికల్ యంత్రాల (9 బి.డాలర్లు) రంగాలున్నాయి.

జౌళి శాఖ మంత్రితోనూ..

మన దేశం నుంచి అమెరికాకు అవుతున్న మొత్తం ఎగుమతుల్లో జౌళి పరిశ్రమ వాటా 25 శాతం వరకూ ఉంది. ఈ నేపథ్యంలో ఈ పరిశ్రమ వర్గాలు త్వరలోనే కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌తో సమావేశం కానున్నాయి. ఈ భేటీలో భారత్-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) ద్వారా పరిశ్రమకు ఉన్న అవకాశాల గురించి చర్చించే అవకాశాలున్నాయి. దీంతోపాటు, సుంకాల ద్వారా ఏర్పడే పరిణామాల ప్రభావాన్ని తగ్గించే అంశాలూ చర్చకు వచ్చే వీలుందని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి.

ఈనాడు బిజినెస్

సహ్యాద్రి హాస్పిటల్స్ కొనుగోలుకు సీసీఐ అనుమతి కోరిన మణిపాల్

దిల్లీ: పుణె కేంద్రంగా ఉన్న సహ్యాద్రి హాస్పిటల్స్‌ను కొనుగోలు చేసేందుకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అనుమతిని మణిపాల్ హాస్పిటల్స్ కోరింది. అంతర్జాతీయ పెట్టుబడిదారు ఒంటారియో టీచర్స్ పెన్షన్ ప్లాన్ బోర్డ్ నుంచి ఈ సంస్థను దాదాపు రూ.6,400 కోట్లకు మణిపాల్ కొనుగోలు చేయనుంది. లావాదేవీ పరిమాణాన్ని ఇరు కంపెనీలు ప్రకటించలేదు. అయితే ఈ లావాదేవీ విలువ రూ.6200-6400 కోట్ల శ్రేణిలో ఉండొచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సహ్యాద్రి హాస్పిటల్స్ కొనుగోలుతో మణిపాల్ మొత్తం ఆసుపత్రుల సంఖ్య 49కు, పడకల సంఖ్య దాదాపు 12,000కు పెరగనుంది.

భారత్‌పై రూ.96,000 కోట్ల భారం

రష్యా చమురు దిగుమతులపై అమెరికా జరిమానాలతో



దిల్లీ: భారత ఎగుమతులపై అదనపు సుంకాలు, జరిమానాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అమెరికా బెదిరింపులకు స్పందనగా రష్యా చమురు దిగుమతులను తగ్గించుకుంటే, భారత్‌పై ఏటా 9-11 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.78,000-96,000 కోట్లు) భారం పడొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు వినియోగదారు, దిగుమతి దేశంగా భారత్ ఉంది. 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా చమురుపై పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించాయి. దీంతో రాయితీ ధరలకు రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుని భారత్ గణనీయంగా లబ్ధి పొందింది. యుద్ధానికి ముందు భారత దిగుమతుల్లో రష్యా చమురు వాటా 0.2 శాతం కంటే తక్కువగా ఉంది. ప్రస్తుతం 35-40 శాతానికి చేరింది. ఫలితంగా భారత దిగుమతి భారం తగ్గి, రిటెయిల్ ఇంధన ధరలు, ద్రవ్యోల్బణం అదుపులో ఉండటానికి దోహదపడింది.

- రష్యా నుంచి వచ్చిన రాయితీ ముడిచమురును శుద్ధి చేసి, ఆ దేశంపై ఆంక్షలు విధించిన దేశాలకు భారత్ ఎగుమతి చేసింది. ఈ ద్విముఖ వ్యూహంతో భారత చమురు కంపెనీలు రికార్డు లాభాలను నమోదు చేయగలిగాయి. అయితే, భారత వస్తువులపై 25 శాతం సుంకాలను ట్రంప్ ప్రకటించారు. రష్యా చమురు, ఆయుధాలను కొనుగోలు చేస్తే అదనంగా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ 25% సుంకాలను ఇప్పటికే నోటిఫై చేయగా, జరిమానా విషయంలో స్పష్టత రాలేదు.
- రష్యా చమురు నుంచి ఉత్పత్తి చేసిన ఉత్పత్తుల దిగుమతులను వచ్చే జనవరి నుంచి ఐరోపా సమాఖ్య (ఈయూ) నిషేధం విధించడంతో, రాబోయే రోజుల్లో భారత సంస్థల ఇబ్బందులు రెట్టింపు అయ్యే అవకాశాలున్నాయి.
- గతేడాది ముడిచమురు దిగుమతులపై భారత్ 137 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. భారత్‌లోకి రోజుకు వచ్చిన 1.7-2 మిలియన్ బ్యారెళ్ల రష్యా చమురు దిగుమతుల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్, నయారా వాటా 50 శాతం కంటే ఎక్కువగా ఉంది. రష్యా చమురు దిగ్గజం రాస్‌నెఫ్ట్‌కు చెందిన నయారాపై ఈయూ గత నెలలో ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే.
- ఐరోపాకు అతిపెద్ద చమురు ఎగుమతిదారుగా రిలయన్స్ ఉంది. 2024లో రోజుకు సగటున 2 లక్షల బ్యారెళ్ల, 2025లో 1,85,000 బ్యారెళ్లను ఈ కంపెనీ ఎగుమతి చేసింది. రష్యా చమురును వినియోగించుకుని గత రెండేళ్లలో రిలయన్స్ తన రిఫైనింగ్ మార్జిన్లను పెంచుకుంది. తాజా ఆంక్షల నేపథ్యంలో ఐరోపాయేతర మార్కెట్లపై రిలయన్స్ దృష్టి పెట్టొచ్చు.

గత 6–7 త్రైమాసికాల్లో ఐటీ నియామకాలు సున్నా



ప్రస్తుత త్రైమాసికంలోనూ అంతంతే • క్వెస్‌కార్ప్ సీఈఓ గురుప్రసాద్

దిల్లీ: గత 6-7 త్రైమాసికాల్లో ఐటీ సేవల రంగంలో నియామకాలు స్తబ్దుగా ఉన్నాయని, ప్రస్తుత జులై-సెప్టెంబరు త్రైమాసికంలోనూ గిరాకీ పుంజుకోకపోవచ్చని స్టాఫింగ్ సంస్థ క్వెస్ కార్ప్ ఈడీ, సీఈఓ గురుప్రసాద్ శ్రీనివాసన్ పేర్కొన్నారు. గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ (జీసీసీలు), నాన్ ఐటీ కంపెనీల నుంచి టెక్నాలజీ నైపుణ్యాలు కలిగిన వారికి గిరాకీ లభిస్తోందన్నారు. 'గత 6-7 త్రైమాసికాల్లో నియామకాలు దాదాపు శూన్యంగా ఉన్నాయి. రెండో త్రైమాసికంలోనూ గిరాకీ పెద్దగా కనిపించడం లేదు. ఐటీ సేవల పరిశ్రమలో నియామకాలు స్తబ్దుగా లేదా లేకపోవడం జరుగుతోంది. క్వెస్ కార్ప్‌పై ఎటువంటి ప్రభావం లేదు' అని గురుప్రసాద్ పేర్కొన్నారు. కంపెనీకి 73% నియామకాల గిరాకీ నాన్-ఐటీ, జీసీసీల నుంచే వస్తోందన్నారు. 'కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్, సైబర్ భద్రత వంటి నైపుణ్యాలకు గిరాకీ అధికంగా ఉంది. ఈ ఉద్యోగాలకు సగటు వేతనం దాదాపు రూ.1.25 లక్షలు. ఇది మాకు చాలా ఎక్కువ మార్జిన్. మార్జిన్ విషయానికొస్తే దాదాపు 15-18 శాతంగా ఉంద'ని గురుప్రసాద్ వివరించారు.

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో క్వెస్‌కార్ప్ రూ.51 కోట్ల ఏకీకృత లాభాన్ని నమోదు చేసింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.49 కోట్ల లాభంతో పోలిస్తే ఇది 4 శాతం ఎక్కువ. ప్రొఫెషనల్ సిబ్బంది విభాగంలో వృద్ధి ఇందుకు దోహదపడింది. సాధారణ నియామకాలు, విదేశీ వ్యాపారం స్తబ్దుగా కొనసాగాయి. డిజిటల్ ప్లాట్‌ఫామ్ వ్యాపార ఆదాయం సగాని కంటే ఎక్కువగా తగ్గింది. జూన్ త్రైమాసికంలో సాధారణ నియామకాలు పుంజుకునే సంకేతాలు కనిపించాయి. సాధారణ నియామకాల విభాగ ఆదాయం రూ.3122 కోట్లుగా ఉంది.

ఈసారి కీలక రేట్లు యథాతథం: విశ్లేషకుల అంచనా

ముంబయి: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పరపతి విధాన సమీక్ష నేటి (సోమవారం) నుంచి ప్రారంభం కాబోతోంది. 3 రోజుల పాటు సాగే ఈ సమీక్ష నిర్ణయాలను బుధవారం ప్రకటిస్తారు. గత మూడు సమీక్షల్లో వరుసగా కీలక రేట్లను తగ్గించిన ఆర్‌బీఐ, ఈసారి రేట్లను (ప్రస్తుతం రెపో రేటు 5.5శాతం) యథాతథంగా ఉంచే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ లక్షిత శ్రేణిలో ఉండటంతో 25 బేసిస్ పాయింట్ల మేర కోత విధించే అవకాశం లేకపోలేదని కొంత మంది చెబుతున్నారు.

కెనరా బ్యాంక్ నేషనల్ హ్యాకథాన్ ఫినాలే

బెంగళూరు: బ్యాంకింగ్ రంగంలో ఆవిష్కరణలను పెంపొందించేందుకు నేషనల్ సైబర్ హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలేను కెనరా బ్యాంక్ నిర్వహించింది. బెంగళూరులోని ఐఐఎస్‌సీ క్యాంపస్‌లోని ఏవీ రామారావు ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్), ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) మార్గదర్శకత్వంలో ఈ ఫినాలేను నిర్వహించారు. మొబైల్ బ్యాంకింగ్ భద్రతను బలోపేతం చేయడం, వెండర్ పరిసరాల్లో వినియోగదారు డేటాను భద్రంగా ఉంచడం వంటి సవాళ్లపై ఈ హ్యాకథాన్ దృష్టి పెట్టింది.



ఈ కార్యక్రమంలో ఐబీఏ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఏకే గోయల్, కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కె.సత్యనారాయణ రాజు, కెనరా బ్యాంక్ ఈడీ హర్దీప్ సింగ్ అహ్లువాలియా, భవేంద్ర కుమార్, ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ శైలజా రాణి పాల్గొన్నారు. ఈ హ్యాకథాన్‌లో ఏపీజే అబ్దుల్ కలాం టెక్నికల్ యూనివర్సిటీ (లఖ్‌నవూ) నుంచి టీమ్ ఫినావట్ విజేతగా నిలిచింది. రెండో స్థానంలో పుణె విశ్వకర్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి టీమ్ పిన్‌డ్రాప్, మూడో స్థానంలో కొట్టాయం ఐఐఐటీ నుంచి టీమ్ జిజ్ఞాస నిలిచాయి. బ్యాంకింగ్ సవాళ్లను ఎదుర్కొనేందుకు యువతను సన్నద్ధం చేయడమే ఈ హ్యాకథాన్ బలమని సత్యనారాయణ రాజు తెలిపారు.

రూ.30 లక్షల కోట్లకు పీఎన్‌బీ వ్యాపారం

బ్యాంక్ ఎండీ, సీఈఓ అశోక్ చంద్ర

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) చివరకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) మొత్తం వ్యాపారం రూ.30 లక్షల కోట్ల మైలురాయికి చేరొచ్చని బ్యాంక్ ఎండీ, సీఈఓ అశోక్ చంద్ర వెల్లడించారు. ఈ మైలురాయిని చేరడానికి సరైన వ్యూహాలను బ్యాంక్ అమలు చేస్తోందని తెలిపారు. 2025-26 మొదటి త్రైమాసికంలో పీఎన్‌బీ మొత్తం వ్యాపారం 11.6% వృద్ధి చెంది రూ.27.19 లక్షల కోట్లుగా నమోదైంది. పీఎన్‌బీ తర్వాత బ్యాంక్ ఆఫ్ బరోడా (రూ.26.43 లక్షల కోట్లు), కెనరా బ్యాంక్ (రూ.25.64 లక్షల కోట్లు) నిలిచాయి. 'ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం వ్యాపార లక్ష్యాన్ని రూ.29.56 లక్షల కోట్లుగా నిర్దేశించుకున్నాం. అయితే మెరుగ్గా రాణిస్తే రూ.30 లక్షల కోట్లను కూడా తాకొచ్చు. ఇందుకు అవసరమైన దిశగా పనిచేస్తున్నాం' అని అశోక్ పేర్కొన్నారు. నిర్వహణ లాభంపై చాలా అప్రమత్తంగా ఉన్నామని, ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అత్యధిక స్థాయిలో రూ.7081 కోట్ల నిర్వహణ లాభాన్ని ఆర్జించామని తెలిపారు. 2025-26లో రుణాల్లో 11-12 శాతం, డిపాజిట్లలో 9-10 శాతం వృద్ధి బ్యాంక్ లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు.

రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ కొరత పరిష్కారానికి ఇంజినీరింగ్ ప్రయత్నాలు: ఎం అండ్ ఎం

దిల్లీ: మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) వచ్చే 9 నెలల పాటు ప్రత్యామ్నాయ వనరుల ద్వారా అరుదైన భూ అయస్కాంతాల (రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్) సరఫరాను కొనసాగించాలని యోచిస్తున్నట్లు గ్రూప్ ముఖ్య ఆర్థిక అధికారి (సీఎఫ్‌ఓ) అమరజ్యోతి బారువా వెల్లడించారు. ఉత్పత్తి పోర్ట్‌ఫోలియో పెరుగుతున్న నేపథ్యంలో ముడి పదార్థాల కొరతను పరిష్కరించడానికి 'ఇంజినీరింగ్ ప్రయత్నాల'ను కొనసాగిస్తున్నామని తెలిపారు. అరుదైన భూ అయస్కాంతాలపై చైనా ఎగుమతి ఆంక్షలు విధించడం వల్ల సరఫరా చైన్‌లో ఆటంకాలు ఏర్పడ్డాయి. ఇవి వాహన, ఎలక్ట్రానిక్స్ రంగాలతో పాటు వినియోగదారు పరిశ్రమలపై ప్రభావం చూపుతున్నాయి. ఆటోమొబైల్స్, గృహోపకరణాలు, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాల్లో అయస్కాంతాలు చాలా ముఖ్యమైన భాగాలుగా ఉంటాయి. 'ప్రత్యామ్నాయ వనరుల ద్వారా సమస్యను పరిష్కరించడానికి మేము తీసుకున్న చర్యలతో 2025-26 ఆర్థిక సంవత్సరంలో మిగిలిన 9 నెలల కాలానికి రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ సమస్యను అధిగమించనున్నాం. ఇప్పుడు మధ్య, దీర్ఘ కాలిక చర్యలకు సన్నద్ధం కావాల్సి ఉంద'ని బారువా వెల్లడించారు.

ఓలా, ఉబర్‌కు పోటీగా 'భారత్' ట్యాక్సీ సేవలు

దిల్లీ: ఓలా, ఉబర్ వంటి దిగ్గజ సంస్థలకు పోటీ ఇవ్వడానికి భారత సహకార రంగం సిద్ధమవుతోంది. ఈ ఏడాది చివరకు 'భారత్' బ్రాండ్ కింద ట్యాక్సీ సేవలను 8 సహకార సంస్థలు ప్రారంభించనున్నాయి. దిల్లీ, గుజరాత్, ఉత్తర్ ప్రదేశ్, మహారాష్ట్రల్లో సేవలను అందించేందుకు ఇప్పటికే 200 మంది డ్రైవర్లను నియమించుకున్నారు. ఇందుకోసం రూ.300 కోట్ల పెట్టుబడులను పెట్టనున్నారు. ఈ ఏడాది జూన్ 6న 8 అగ్రగామి సహకార సంస్థలు కలిసి ది మల్టీ స్టేట్ సహకారి ట్యాక్సీ కోపరేటివ్ లిమిటెడ్‌ను నమోదు చేశాయి. ఈ 8 సంస్థల్లో నేషనల్ కోపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ), ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కోపరేటివ్ లిమిటెడ్ (ఇఫ్కో), గుజరాత్ కోపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ (జీసీఎంఎంఎఫ్), క్రిషాంక్ భారతీ కోపరేటివ్, నాబార్డ్, ఎన్‌డీడీబీ, ఎన్‌సీఈఎల్ ఉన్నాయి. ఈ ఏడాది చివరకు కోపరేటివ్ ట్యాక్సీ సేవలను ప్రారంభించనున్నట్లు కేంద్ర సహకార మంత్రి అమిత్ షా గత నెలలో సంకేతాలు ఇచ్చారు. ప్రయాణికులకు సురక్షితమైన, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యమని ఎన్‌సీడీసీ డిప్యూటీ ఎండీ రోహిత్ గుప్తా పేర్కొన్నారు.

కోడి గుడ్లు

4న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయులలో)

హైదరాబాద్	435	గోదావరి	470
వరంగల్	437	విశాఖపట్నం	470
విజయవాడ	475	చిత్తూరు	513

రాగి దిద్దుబాటు!

కమొడిటీస్ ఈ వారం

పసిడి




పసిడి ఆగస్టు కాంట్రాక్టు ఈవారం రూ.98,748 కంటే దిగువన చలించకుంటే.. మరింతగా రాణించే అవకాశం ఉంది. అయితే రూ.1,00,447 వద్ద నిరోధం ఎదురుకావచ్చనే విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి.

వెండి



వెండి ఆగస్టు కాంట్రాక్టు ఈవారం రూ.1,09,754 కంటే దిగువన ట్రేడయితే రూ.1,05,168 వరకు దిద్దుబాటు అయ్యే అవకాశం ఉంటుంది. ఒకవేళ సానుకూల ధోరణిలో చలిస్తే రూ.1,13,200 వద్ద నిరోధం ఎదురుకావచ్చు.

ప్రాథమిక లోహాలు



- రాగి ఆగస్టు కాంట్రాక్టు ఈవారం రూ.896 కంటే పైన కదలాడకుంటే రూ.855 వరకు దిద్దుబాటు అయ్యే అవకాశం ఉంది. అందువల్ల రూ.897 వద్ద స్టాప్‌లాస్‌ను పరిగణిస్తూ.. షార్ట్ సెల్ పొజిషన్లను కొనసాగించడం మేలే.
- సీసం ఆగస్టు కాంట్రాక్టుకు ఈవారమూ ప్రతికూల ధోరణి కొనసాగే అవకాశం ఉంది. అందువల్ల స్టాప్‌లాస్‌ను సవరిస్తూ... షార్ట్ సెల్ పొజిషన్లను అట్టేపెట్టుకోవడం మంచి వ్యూహమే అవుతుంది.
- జింక్ ఆగస్టు కాంట్రాక్టు ఈవారం రూ.261.45 కంటే దిగువన చలిస్తే షార్ట్ సెల్ పొజిషన్లను కొనసాగించవచ్చు. అయితే రూ.259.05 వద్ద మద్దతు లభించవచ్చు..
- అల్యూమినియం ఆగస్టు కాంట్రాక్టు ఈవారం రూ.253.45 కంటే ఎగువన ట్రేడ్ కాకుంటే మరింత అమ్మకాల ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉంది. రూ.247.75 కంటే కిందకు వస్తే రూ.245.85; రూ.242.95 వరకు దిద్దుబాటు కావచ్చు.

ఇంధన రంగం



- ముడి చమురు ఆగస్టు కాంట్రాక్టు ఈవారం కొంత దిద్దుబాటు అయ్యే అవకాశం కనిపిస్తోంది. అయితే రూ.5,634 వద్ద మద్దతు లభించవచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.5,382; రూ.5,107 వరకు దిగిరావచ్చు. ఒకవేళ రూ.6,161 కంటే పైకి వెళితే రూ.6,436; రూ.6,688 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.
- సహజవాయువు ఆగస్టు కాంట్రాక్టు ఈవారం రూ.260.20 కంటే కిందకు వస్తే రూ.250.10; రూ.240.60 వరకు దిగిరావచ్చు.

వ్యవసాయ ఉత్పత్తులు



- పసుపు ఆగస్టు కాంట్రాక్టు ఈవారం సానుకూల ధోరణిలో చలిస్తే రూ.13,396 వద్ద నిరోధం ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.13,674; రూ.14,022 వరకు పెరగొచ్చు. ఒకవేళ ప్రతికూల ధోరణిలో కదలాడితే రూ.12,770 వద్ద మద్దతు లభించవచ్చు.
- పత్తి క్యాండీ ఆగస్టు కాంట్రాక్టు ఈవారం రూ.55,300 కంటే దిగువకు వస్తే రూ.53,560 వరకు దిద్దుబాటు కావచ్చు. ఒకవేళ రూ.56,890 కంటే పైన కదలాడితే రూ.56,740; రూ.58,480 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి
	(రూ.లలో)		(శాతంలో)
పసిడి (ఆగస్టు)	98,748	99,735	1.00
వెండి (సెప్టెంబరు)	1,13,165	1,10,258	(2.57)
రాగి (ఆగస్టు)	888.30	879.70	(0.97)
సీసం (ఆగస్టు)	180.25	179.25	0.55
జింక్ (ఆగస్టు)	266.60	262.00	(1.73)
అల్యూమినియం (ఆగస్టు)	253.10	249.60	(1.38)
ముడి చమురు (ఆగస్టు)	5,671	5,887	3.81
సహజ వాయువు (ఆగస్టు)	269.90	270.30	0.15
పసుపు (ఆగస్టు)	12,902	13,118	1.67
పత్తి క్యాండీ (ఆగస్టు)	53,410	57,040	6.80

ఆర్‌బీఐ నిర్ణయాలు, టారిఫ్ పరిణామాలు

- ఇవే ఈ వారం మార్కెట్‌కు కీలకం • మొత్తం మీద బలహీనతలే కనిపిస్తున్నాయ్
- బ్యాంకు, ఫార్మా, లోహ షేర్లకు ఒత్తిళ్లు • విశ్లేషకుల అంచనాలు

స్టాక్ మార్కెట్ ఈ వారం



మార్కెట్లో ఈ వారం బలహీనతలు కొనసాగొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 'ప్రస్తుత స్థూల ఆర్థిక వాతావరణం సానుకూలంగా కనిపించడం లేదు. ముఖ్యంగా అమెరికాకు వెళ్లే మన దేశ ఎగుమతులపై టారిఫ్ అనంతరం మరింత డీలా పడింది. ఇందుకు తోడు కార్పొరేట్ ఫలితాల్లో స్తబ్దత, పెరుగుతున్న ముడి చమురు ధరలు, తగ్గుతున్న రూపాయి విలువ, విదేశీ మదుపర్ల విక్రయాలు, షేర్ల ధరల్లో అధిక విలువలు కలిసి మరింత బలహీనతలను తెచ్చిపెడుతున్నాయ'ని అంటున్నారు. ఆగస్టు విధాన సమావేశం(4-6) నిర్ణయాలు, గవర్నర్ వ్యాఖ్యలు మార్కెట్‌కు కీలకం కానున్నాయి. నిఫ్టీకి 24,600 స్థాయి కీలకంగా పనిచేయగలదని, ఈ స్థాయి దిగువకు వస్తే మరిన్ని నష్టాలు తప్పవని సాంకేతిక నిపుణులు అంటున్నారు. రంగాల వారీగా అంచనాలు..

- **బ్యాంకింగ్** షేర్లపై ఒత్తిడి కొనసాగనుంది. ఆర్‌బీఐ రేట్ల కోతను వినియోగదార్లకు బదిలీ చేస్తున్నందున మార్జిన్లు తగ్గొచ్చని పలు బ్యాంకులు సంకేతాలివ్వడం ఇందుకు నేపథ్యం. ఎస్‌బీఐ 8న ఫలితాలను ప్రకటించనుంది.
- **టెలికాం** షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. భారతీ ఎయిర్‌టెల్ 8న వెలువరచే ఫలితాలను బట్టి సంకేతాలను అందుకోవచ్చు. ఈ వారం ఎయిర్‌టెల్ రూ.1850-1900 మధ్య, వొడాఫోన్ ఐడియా రూ.6-7 మధ్య ట్రేడవవచ్చు.
- **చమురు-గ్యాస్** కంపెనీల షేర్లు ఒక శ్రేణికి లోబడి కదలాడవచ్చు. ఓఎన్‌జీసీ, హెచ్‌పీసీఎల్(గురు), ఐఓసీఎల్ ఫలితాలను బట్టి కూడా కదలికలు ఉండొచ్చు.
- ప్రధాన వార్తలేమీ లేనందున **సిమెంటు** కంపెనీల షేర్లు పరిమిత శ్రేణికి లోబడి కదలాడవచ్చు. వర్షాల సీజను ముగిసే వరకూ ఇదే ధోరణి కనిపించొచ్చు.
- **యంత్రపరికరాల** కంపెనీల షేర్లు స్వల్పకాలంలో లాభాల స్వీకరణకు గురికావొచ్చు. షేర్లలో అధిక విలువలు, టారిఫ్ ఆందోళనలు ఇందుకు నేపథ్యం. త్రివేణి టర్బైన్ (సోమ), కంటైనర్ కార్పొరేషన్ (మంగళ), కిర్లోస్కర్ ఆయిల్(బుధ), కమిన్స్ ఇండియా (గురు) ఫలితాలున్నాయి.
- అమెరికా టారిఫ్‌పై స్పష్టత వచ్చేంత వరకు **ఐటీ** షేర్లు స్వల్పకాలానికి ఒక శ్రేణిలోనే చలించొచ్చు. 25% టారిఫ్ తాత్కాలికమేననీ, ఒప్పందంలో తగ్గొచ్చనీ అంచనాలున్నాయి. ఈ రంగంపై నేరుగా ప్రభావం లేకున్నా, అమెరికా కంపెనీల వ్యయాలు తగ్గే అవకాశం ఉంది.
- మార్కెట్ బలహీనంగా ఉన్నందున **ఎఫ్ఎమ్‌సీజీ** కంపెనీలు రాణించవచ్చు. డాబర్ ఇండియా, హిందుస్థాన్ యునిలీవర్‌పై మార్కెట్లు 'బులిష్'గా ఉన్నారు. గ్రామీణ గిరాకీ పుంజుకుంటుండడం కలిసిరావొచ్చు. వరుణ్ బేవరేజెస్ లక్ష్యం ధరను ఓ బ్రోకరేజీ రూ.625 నుంచి రూ.600కు తగ్గించింది.
- **వాహన**, వాహన విడిభాగాల షేర్లు ఒక శ్రేణికి లోబడి కదలాడవచ్చు. హ్యుందాయ్, మహీంద్రా, టీవీఎస్, మారుతీ, ఐషర్ మంచి ఫలితాలనే ప్రకటించినా, సరఫరా వ్యవస్థ, ముడిపదార్థాల వ్యయాల రీత్యా ఆయా షేర్లు పెద్దగా పెరగకపోవచ్చు.
- **ఫార్మా** కంపెనీల షేర్లు కొద్ది వారాల పాటు బలహీనతలను కొనసాగించొచ్చు. అమెరికా టారిఫ్ అనిశ్చితులు ఇందుకు కారణంగా నిలవవచ్చు. ధరలు తగ్గించాలంటూ ఎలీ లిల్లీ, నోవో నార్డిస్క్, ఫైజర్ సహా 17 అంతర్జాతీయ దిగ్గజాలను ట్రంప్ డిమాండ్ చేయడం ఇందుకు నేపథ్యం.
- **లోహ** కంపెనీల షేర్లు నష్టపోవచ్చు. అమెరికా-చైనా మధ్య చర్చలు జరుగుతున్నందున అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలు ఎక్కువగానే ఉండొచ్చు. భారత్‌పై అమెరికా టారిఫ్ విధింపు కూడా ప్రభావం చూపొచ్చు.

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	120.35	123.30	116.20
బజాజ్ ఆటో	8044.50	8168.50	7889.50
ఐషర్ మోటార్స్	5528.00	5752.70	5362.70
హీరో మోటోకార్ప్	4311.60	4373.20	4209.20
ఎం అండ్ ఎం	3159.30	3248.60	3072.00
మారుతీ	12302.00	12957.30	11945.30
టాటా మోటార్స్	648.85	675.60	633.70
టీవీఎస్ మోటార్	2858.20	2932.10	2762.10

ఎఫ్ఎమ్‌సీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	5798.00	5947.00	5702.00
కోల్గేట్ పామోలివ్	2258.00	2307.50	2215.90
డాబర్ ఇండియా	534.35	553.80	522.20
ఇమామీ	619.30	641.10	582.20
హిందుస్థాన్ యునిలీవర్	2553.70	2796.60	2415.40
ఐటీసీ	416.45	423.40	408.30
మారికో	711.20	732.30	696.60

యంత్రపరికాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	231.60	241.10	226.40
సీజీ పవర్	651.30	671.90	639.20
ఎల్ అండ్ టీ	3,587.30	3,658.40	3,542.60
సీమెన్స్	3,023.60	3,075.90	2,971.90
థెర్మాక్స్	3,778.70	4,019.60	3,639.60

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1079.80	1168.40	1031.00
బయోకాన్	383.10	397.00	374.90
సిప్లా	1502.80	1571.20	1459.80
డాక్టర్ రెడ్డీస్	1220.60	1276.40	1185.80
గ్లెన్‌మార్క్ ఫార్మా	2067.80	2164.10	2005.50
లుపిన్	1867.30	1956.60	1816.00

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	2012.20	2035.60	1997.60
ఐసీఐసీఐ బ్యాంక్	1471.60	1490.80	1460.20
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	67.58	69.50	66.50
ఇండస్‌ఇండ్ బ్యాంక్	783.70	806.30	768.40
కోటక్‌మహీంద్రా బ్యాంక్	1992.40	2025.40	1955.60
పీఎన్‌బీ	103.18	106.20	101.50
ఎస్‌బీఐ	794.00	804.70	786.70

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిండాల్కో	672.45	688.00	663.10
హిందుస్థాన్ జింక్	415.40	429.20	406.60
ఎన్ఎమ్‌డీసీ	70.46	73.70	68.70
సెయిల్	120.12	126.20	116.70
టాటా స్టీల్	153.01	159.90	149.10
వేదాంతా	424.45	434.60	417.30

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1452.10	1473.20	1439.40
ఇన్ఫోసిస్	1469.60	1511.10	1444.70
పర్సిస్టెంట్ సిస్టమ్స్	5061.50	5207.80	4966.80
టీసీఎస్	3003.00	3050.10	2976.50
టెక్ మహీంద్రా	1438.80	1471.10	1416.30
విప్రో	242.75	248.70	239.30

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1393.70	1416.20	1373.00
బీపీసీఎల్	317.85	334.00	308.50
హెచ్‌పీసీఎల్	403.80	427.90	390.10
ఐఓసీఎల్	141.03	148.30	137.00
ఓఎన్‌జీసీ	236.79	243.80	230.50
ఆయిల్ ఇండియా	434.05	444.70	424.70

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1794.60	1833.50	1771.50
అంబుజా సిమెంట్స్	607.95	630.60	577.40
ఇండియా సిమెంట్స్	362.10	374.00	354.00
శ్రీ సిమెంట్	30650.00	31236.70	30246.70
అల్ట్రాటెక్ సిమెంట్	12113.00	12373.00	11945.00

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	1,884.40	1935.70	1852.30
ఎమ్‌టీఎన్ఎల్	45.60	47.30	44.30
టాటా కమ్యూనికేషన్స్	1667.20	1758.70	1614.30
వొడాఫోన్ ఐడియా	6.60	7.00	6.30

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు




* 80వ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశాలకు అధ్యక్షురాలిగా ఇటీవల ఎవరు ఎన్నికయ్యారు? (ఈమె జర్మనీ మాజీ విదేశాంగ మంత్రి.) జ: అన్నాలెనా బేర్‌బాక్
* ప్రపంచ ఆకలి దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (2011లో 'ది హంగర్ ప్రాజెక్టు' ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది.) జ: మే 28
* భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే ఇటీవల ఏ రాష్ట్ర అటవీ శాఖ, వన్య ప్రాణుల సంరక్షణకు రాయబారిగా నియమితులయ్యారు? జ: కర్ణాటక
* భారత దేశపు మొదటి ఏఐ సెజ్ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ స్పెషల్ ఎకనామిక్ జోన్)ను రూ.1000 కోట్ల పెట్టుబడితో ఏ రాష్ట్రంలోని నవా రాయ్‌పుర్‌లో ఏర్పాటు చేయనున్నారు? జ: ఛత్తీస్‌గఢ్
* పోర్చుగల్ నూతన ప్రధానిగా ఇటీవల ఎవరు తిరిగి నియమితులయ్యారు? జ: లూయిస్ మోంటెనెగ్రో
* ఏషియన్ ప్రొడక్టివిటీ ఆర్గనైజేషన్ (ఆసియా ఉత్పాదకత సంస్థ) అధ్యక్ష పదవిని 2025 – 26 కాలానికి ఇటీవల ఏ దేశం చేపట్టింది? (జకార్తాలో జరిగిన 67వ ఏపీఓ పాలక మండలి సమావేశంలో ఈ దేశం అధ్యక్ష పదవిని చేపట్టింది.) జ: భారత్

మరింత సమాచారం

జనరల్ స్టడీస్
ఆంధ్రప్రదేశ్ భూగోళ శాస్త్రం

పాడిపంటలే ప్రగతి మూలాలు!



ఆంధ్రప్రదేశ్ ప్రధానంగా వ్యవసాయ ఆధారిత రాష్ట్రం. వివిధ రకాల నేలలు, నీటిపారుదల సౌకర్యాలు ఇక్కడి వ్యవసాయానికి మూలాలు. కృష్ణా, గోదావరి డెల్టాలు దక్షిణ భారత వరి ధాన్యాగారాలుగా ప్రసిద్ధికెక్కాయి. వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాల్లోనూ రాష్ట్రం ముందంజలో నిలుస్తోంది. ప్రత్యేకంగా ఉద్యాన, మత్స్య సంపద ఉత్పత్తుల్లో అగ్రగామిగా కొనసాగుతోంది. మొత్తం ఈ ప్రాథమిక రంగం స్వరూపంపై పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు అవగాహన ఉండాలి. రాష్ట్రంలోని వ్యవసాయ మండలాలు, ప్రధాన ఆహార, వాణిజ్య పంటలు, పండే ప్రాంతాలు, పశుసంపద విస్తరణ, మత్స్య సంపద ఉత్పత్తి తీరుతెన్నులు, జిల్లాల వారీగా ప్రత్యేకతలను తెలుసుకోవాలి.



2015-16 పదో కమతాల గణన ప్రకారం ఏపీలో ఉపాంత కమతాల సంఖ్య అధికం. సగటు కమతం 0.94 హెక్టార్లు. కమతాల సంఖ్య 76.21 లక్షల నుంచి 85.24 లక్షలకు పెరిగింది. అనంతపురం జిల్లాలో సగటు కమతం ఎక్కువ.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయం

(పంటలు – విస్తరణ)

ఏపీ పంట కాలాలు: వీటిని మూడురకాలుగావర్గీకరించారు.

1) ఖరీఫ్ (జూన్–అక్టోబరు): స్థానికంగా 'సార్వా కాలం' అంటారు. ప్రధాన పంటలు వరి, పత్తి, చిరుధాన్యాలు.

2) రబీ (నవంబరు–మార్చి/ఏప్రిల్): స్థానికంగా 'దాళ్వా కాలం' అంటారు. ప్రధాన పంటలు వేరుశనగ, శనగలు, ఆవాలు, అవిసెలు.

3) జయాద్ (ఏప్రిల్–జూన్): దీనినే 'వేసంగి పంట కాలం' అంటారు. తీగజాతి పండ్లు (కర్బూజ, పుచ్చకాయ), కూరగాయలు లాంటివి పండిస్తారు.

వ్యవసాయ మండలాలు

1) **ఉత్తర కోస్తా మండలం:** అనకాపల్లి, విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం.
2) **గోదావరి మండలం:** ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కాకినాడ, కోనసీమ.
3) **కృష్ణా మండలం:** ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, కృష్ణా, ప్రకాశం, బాపట్ల.
4) **దక్షిణ మండలం:** నెల్లూరు, కడప, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య.
5) **వర్షాభావ మండలం:** అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాల.
6) **గిరిజన మండలం:** అల్లూరి, మన్యం, ఇతర గిరిజన ప్రాంతాలు.

ఆహార పంటలు



వరి: వరి ఉత్పత్తిలో ఏపీ దేశంలో అయిదో స్థానంలో ఉంది. రాష్ట్రంలో 60 % పైగా వరి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాల్లోనే పండిస్తారు. రాష్ట్ర వరి పరిశోధనా సంస్థ మార్టేరులో, ఐఆర్ఆర్ఐ ప్రాంతీయ కార్యాలయం నైరా (శ్రీకాకుళం)లో ఉన్నాయి. కర్నూలులో బాస్మతి వరి పండిస్తారు.

జొన్న: వరి తర్వాత ప్రధాన పంట జొన్న. పల్నాడు, కర్నూలు జిల్లాల్లో సాగు ఎక్కువ.

మొక్కజొన్న: ఉత్పత్తిలో ఏపీ దేశంలో మూడో స్థానంలో ఉంది. పశ్చిమ గోదావరి, పల్నాడులో సాగు అధికం.

రాగులు: ఉత్పత్తిలో అల్లూరి జిల్లా ప్రథమం.

సజ్జ: ఉత్పత్తిలో ప్రకాశం, కర్నూలు ముందున్నాయి.

పప్పుధాన్యాలు: మినుములు - కృష్ణా, గుంటూరు; పెసలు - పల్నాడు, శ్రీకాకుళం; కందులు- ప్రకాశం, కర్నూలు; అలసందలు - కర్నూలు, ఉలవలు - అనంతపురం.

వాణిజ్య పంటలు

సుగంధద్రవ్యాలు: 1) పసుపు ఉత్పత్తిలో ఏపీ మొదటి స్థానంలో ఉంది. పల్నాడు, కర్నూలు జిల్లాల్లో సాగు ఎక్కువ. రాష్ట్ర పసుపు పరిశోధనా సంస్థ దుగ్గిరాలలో ఉంది. 2) మిర్చి ఉత్పత్తిలో ఏపీ ప్రథమ స్థానంలో ఉంది. గుంటూరు, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో సాగు ఎక్కువ. రాష్ట్ర మిర్చి పరిశోధనా సంస్థ-లాం (గుంటూరు)లో ఉంది.

కాఫీ: ఉత్పత్తిలో అల్లూరి జిల్లా (పద్మాపురం గ్రామం) ముందంజలో ఉంది. ఏపీలో ఉత్పత్తయ్యే కాఫీ 'అరకు కాఫీ' పేరుతో ప్రసిద్ధికెక్కింది.

పొగాకు: ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఎక్కువగా పండిస్తారు. కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ (సీటీఆర్ఐ)- రాజమహేంద్రవరం (తూర్పు గోదావరి)లో ఉంది.

పత్తి: ఉత్పత్తిలో కర్నూలు, నంద్యాల, పల్నాడు ముందున్నాయి. రాష్ట్ర పత్తి పరిశోధనా సంస్థ నంద్యాలలో ఉంది.

చెరకు: ఉత్పత్తిలో కృష్ణా, చిత్తూరు, అనకాపల్లి ప్రధాన జిల్లాలు. రాష్ట్ర చెరకు పరిశోధనా సంస్థ అనకాపల్లిలో ఉంది.



నూనెగింజలు: వేరుశనగ - అనంతపురం, కర్నూలు; ఆవాలు -కర్నూలు, ఆముదం - ప్రకాశం, కర్నూలు; పొద్దుతిరుగుడు- కర్నూలులో ఎక్కువగా పండిస్తారు.

పామాయిల్: పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కాకినాడలో సాగు ఎక్కువ. రాష్ట్ర పామాయిల్ పరిశోధనా సంస్థ-పెదవేగి(పశ్చిమ గోదావరి)లో ఉంది.

కొబ్బరి: కోనసీమ, శ్రీకాకుళంలో ఎక్కువగా పండిస్తారు. రాష్ట్ర కొబ్బరి పరిశోధనా సంస్థ - అంబాజీపేట (కోనసీమ)లో ఉంది.

నువ్వులు: విజయనగరం, కడపలో పండిస్తారు.

ముఖ్యాంశాలు

▮ ఆహార ధాన్యాల ఉత్పత్తిలో మొదటి స్థానం - పశ్చిమ గోదావరి. ▮ చిరుధాన్యాల ఉత్పత్తిలో మొదటి స్థానం-కర్నూలు. ▮ పప్పుధాన్యాల ఉత్పత్తిలో మొదటి స్థానం-కృష్ణా, కర్నూలు. ▮ సుగంధద్రవ్యాల ఉత్పత్తిలో ఏపీ మొదటి స్థానంలో ఉంది. సుగంధద్రవ్యాల పార్కు గుంటూరు జిల్లా యడ్లపాడు మండలం వంకాయపాడు గ్రామంలో ఏర్పాటైంది. ▮ పామాయిల్, బొప్పాయి, అరటి, మిర్చి, కోకో, టమాటా ఉత్పత్తిలో ఏపీ దేశంలో మొదటి స్థానంలో, మామిడి, జీడిమామిడి ఉత్పత్తిలో రెండో స్థానంలో ఉంది. ▮ అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ 'ఇన్నోవేషన్ సెంటర్'ను నెల్లూరులో ఏర్పాటు చేశారు.

మత్స్య సంపద



మత్స్య సంపద ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. చేపల ఉత్పత్తిలో రాష్ట్ర వాటా 29.7 % కాగా, రొయ్యల ఉత్పత్తిలో 70 % ఉంది. రొయ్యల పెంపకంలో నెల్లూరు (సముద్ర రొయ్య), కృష్ణా (చెరువు రొయ్య); చేపల ఉత్పత్తిలో విశాఖ, పశ్చిమ గోదావరి జిల్లాలు ముందున్నాయి. మొత్తంగా ఆక్వాకల్చర్‌లో కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలు ప్రధానమైనవి. కాకినాడలో రెండు చవిటి నీటి చేపల క్షేత్రాలున్నాయి. వీటిలో ఒకటి ఏపీ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రెండోది సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్ నిర్వహిస్తున్నాయి. విశాఖ జిల్లా మంగమూరిపేట వద్ద రొయ్యల బీజోత్పాదక క్షేత్రాన్ని నెలకొల్పారు.




ముఖ్యాంశాలు

✣ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ ప్రధాన కార్యాలయం-డోనా పౌలా(గోవా)లో, ప్రాంతీయ కార్యాలయం విశాఖపట్నంలో ఉన్నాయి. ✣ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషియన్ టెక్నాలజీ (ఎన్ఐఓటీ) చెన్నైలో ఉంది. ఇదే పేరుతో మరో సంస్థను తిరుపతి జిల్లా తుపిలిపల్లం గ్రామం వద్ద ఏర్పాటు చేస్తున్నారు. ✣ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫ్రెష్ వాటర్ ఆక్వాకల్చర్ విజయవాడ వద్ద ఉంది. ✣ ఏపీలో మత్స్య సహకార సంఘాల సంఖ్య 2,361. ✣ మహిళా మత్స్యకారుల స్వయంసహాయక బృందాలను 'మత్స్య మిత్ర గ్రూప్‌లు' (ఎంఎంజీ) అంటారు. ✣ ఏపీలో భూసార పరీక్షా కేంద్రాలు 47, సంచార భూసార పరీక్షా కేంద్రాలు 13, మినీ ల్యాబ్‌లు 1338, గ్రామస్థాయి ల్యాబ్‌లు 5 కలిపి మొత్తంగా 1393 ఉన్నాయి. ✣ వెటర్నరీ సంస్థలు 3188. అందులో ఆస్పత్రులు/ పాలీక్లినిక్‌లు 337, డిస్పెన్సరీలు 1576, వెటర్నరీ ఎయిడ్ సెంటర్లు 1275. ✣ వెటర్నరీ అంబులెన్స్ నంబరు-1962 ✣ రైతుల కోసం కిసాన్ కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నంబరు -1800 180 1551 ✣ అరకు కాఫీ బ్రాండ్‌ను నాంది ఫౌండేషన్ ప్రపంచ వ్యాప్తంగా పరిచయం చేస్తోంది. ✣ 2025-26కి రాష్ట్ర వ్యవసాయ బడ్జెట్ - రూ. 48,341.14 కోట్లు. ✣ విజన్ స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికలోని పది మార్గదర్శక సూత్రాల్లో 'రైతులు, వ్యవసాయ సాంకేతికత' ఒకటి. ✣ ఏపీలో రైతులకు పెట్టుబడి సాయం పథకం 'అన్నదాత సుఖీభవ'. దీని కింద రూ. 20,000 ఇస్తారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 14,000, కేంద్రం (పీఎం కిసాన్) రూ. 6,000. ✣ 'అన్నదాత సుఖీభవ' టోల్‌ఫ్రీ నంబరు -1800-180-155251

ఏపీలో పశుసంపద

పశుగణన ప్రకారం రాష్ట్రంలో పశుసంపద - 34.04 మిలియన్లు. ఈ విషయంలో ఏపీ ఆరో స్థానంలో నిలిచింది. ✣ ఆవులు, ఎద్దుల సంఖ్యలో ఏపీ 14వ స్థానంలో ఉంది. ఆవులు ఎక్కువగా ఉన్న జిల్లాలు: చిత్తూరు, ప్రకాశం. ఇక్కడి ఒంగోలు, పుంగనూరు జాతులు ప్రత్యేకమైనవి. పిండమార్పిడి ప్రక్రియ ద్వారా ఒంగోలు జాతి ఆవు దూడల ఉత్పత్తి కోసం కేంద్ర ప్రభుత్వం 15 లేబొరేటరీలను ఏర్పాటు చేసింది. అందులో ప్రధానమైంది - గుంటూరులోని లాం ఫాం. ✣ గేదెల సంఖ్యలో ఏపీ 6వ స్థానంలో ఉంది. ముర్రా సంకర జాతి గేదెలు, గోదావరి డెల్టా జాతి గేదెలు ఎక్కువగా ఉన్నాయి. గేదెల సంఖ్య ప్రకాశం, పల్నాడులో అధికం. ✣ గొర్రెల సంఖ్యలో ఏపీది రెండో స్థానం. రాష్ట్రంలో దక్కాని రకం గొర్రెలు ప్రసిద్ధి. సంఖ్యాపరంగా అనంతపురం, నెల్లూరు, కర్నూలులో ఇవి ఎక్కువ. మేకల సంఖ్యలో రాష్ట్రం 11వ స్థానంలో ఉండగా అనంతపురం, కర్నూలులో ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం క్షేత్రం నెల్లూరు జిల్లా చింతలదీవిలో ఉంది. ✣ పందులు అధికంగా ఉన్న జిల్లాలు తూర్పు గోదావరి, అనంతపురం. పందుల పెంపకం క్షేత్రాలు విజయనగరం, కృష్ణా జిల్లా మక్తాల, పశ్చిమ గోదావరి జిల్లా గోపన్నపాలెంలో ఉన్నాయి. ✣ కోళ్ల సంఖ్యలో ఏపీ 2వ స్థానంలో ఉంది. రాష్ట్రంలోని కోళ్ల రకాలు అస్సీల్, గిరిరాజ, వనరాజా. వీటి సంఖ్య తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఎక్కువ. ✣ గుడ్ల ఉత్పత్తిలో ఏపీది మొదటి స్థానం. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరిల్లో ఉత్పత్తి ఎక్కువ. ✣ మాంసం ఉత్పత్తిలో ఏపీ రెండో స్థానంలో ఉంది. కర్నూలులో ఉత్పత్తి అధికం. ✣ పాల ఉత్పత్తిలో రాష్ట్రం 5వ స్థానంలో ఉంది. గుంటూరు, కృష్ణా జిల్లాలు ఉత్పత్తిలో ముందున్నాయి.

పండ్ల తోటలు



పండ్ల తోటల విస్తీర్ణం, ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. ✦ **మామిడి:** కృష్ణా, చిత్తూరు. ✦ **నిమ్మ, నారింజ:** పశ్చిమ గోదావరి, అనంతపురం. ✦ **జీడిమామిడి:** అల్లూరి, శ్రీకాకుళం. ✦ **ద్రాక్ష:** అనంతపురం ✦ **జామ:** కృష్ణా, గుంటూరు. ✦ **బొప్పాయి:** కడప ✦ **సపోటా:** ప్రకాశం ✦ **అరటి:** పశ్చిమ గోదావరి, కడప జిల్లాల్లో ఎక్కువ. రాష్ట్ర అరటి పరిశోధనా సంస్థ కొవ్వూరు (తూర్పు గోదావరి), రాష్ట్ర పండ్ల పరిశోధనా సంస్థ - అనంతరాజుపేట (కడప)లో ఉన్నాయి.



రచయిత: మండ సతీష్

భూమిపై జీవజాతుల్లో కీటకాలే ఎక్కువ!




భూమిపై మొక్కలు, జంతువులతో పాటు అనేకానేక సూక్ష్మ జీవులు, శిలీంధ్రాలు ఉన్నాయి. జీవకోటిలో ఉన్న ఈ వైవిధ్యమే జీవుల మనుగడకు, పర్యావరణ వ్యవస్థల సమతౌల్యతకు ఆధారం. జీవవైవిధ్యం కారణంగానే ఆహారం, నీరు, గాలి లాంటివి సమకూరుతున్నాయి. జీవవైవిధ్యం ప్రాధాన్యం, భూమిపై విస్తరించిన తీరు, ఈ విషయంలో భారతదేశ ప్రత్యేకతపై పోటీ పరీక్షార్థులకు సమగ్ర అవగాహన ఉండాలి. జాతుల వైవిధ్యం, జన్యు వైవిధ్యాల అవసరం, జీవవైవిధ్య పరిరక్షణ దిశగా ప్రపంచాన్ని నడిపిస్తున్న ఒప్పందాలు, అవి కుదిరిన సదస్సులు, జీవవైవిధ్య హాట్‌స్పాట్‌లుగా గుర్తించిన ప్రాంతాల సమాచారం తదితరాలన్నింటినీ తెలుసుకోవాలి.

పర్యావరణ అంశాలు

జీవవైవిధ్యం

1. జీవవైవిధ్యంలో 'జాతుల సమృద్ధి' దేన్ని కొలుస్తుంది?
   1) ఒక జాతిలో జన్యువైవిధ్యం
   2) ఒక ప్రాంతంలోని వివిధ రకాల పర్యావరణ వ్యవస్థలు
   3) ఒక ప్రాంతంలోని వివిధ జాతుల మొత్తం సంఖ్య
   4) జాతుల మధ్య వర్గీకరణ సంబంధం
2. పరాగసంపర్కం లేదా విత్తనాల వ్యాప్తి లాంటి సహజ ప్రక్రియల కారణంగా జనాభాలో జన్యువుల కదలికను వివరించడానికి ఏ పదాన్ని ఉపయోగిస్తారు?
   1) జన్యు మలుపు 2) జన్యు ప్రవాహం
   3) జన్యు కోత 4) జన్యు దుర్బలత్వం
3. భూమిపై ఉన్న జాతుల్లో ఎక్కువ భాగం జీవుల సమూహం ఏది?



   1) కీటకాలు 2) పుష్పించే మొక్కలు
   3) సకశేరుకాలు 4) శిలీంధ్రాలు
4. కింది వాటిలో ఏది 'జన్యువైవిధ్యం'ను ఉత్తమంగా నిర్వచిస్తుంది?
   1) పర్యావరణ వ్యవస్థలో మొత్తం జాతుల సంఖ్య
   2) జనాభా లేదా జాతుల్లోని జన్యువుల్లో వైవిధ్యం
   3) పర్యావరణ వ్యవస్థలో జాతుల మధ్య పరస్పర చర్యలు
   4) పర్యావరణ వ్యవస్థ భౌతిక నిర్మాణం
5. ఆవరణ వ్యవస్థ వైవిధ్యం ప్రాథమిక కొలత ఏమిటి?
   1) ఆవరణ వ్యవస్థలోని జనాభాలో జన్యువైవిధ్యం
   2) ఆవరణ వ్యవస్థలో జాతుల మధ్య పరస్పర చర్యల సంఖ్య
   3) జీవులు, వాటి ఆవరణం మధ్య వివిధ రకాల అనుబంధాలు
   4) ఆవరణ వ్యవస్థలో వృక్ష జాతుల గొప్పదనం.
6. జీవవైవిధ్యపు ఏ వర్గంలో సంతానోత్పత్తి, నిర్మాణానికి అవసరమైన మృత్తికా జీవులు ఉన్నాయి?
   1) జన్యు వైవిధ్యం
   2) జాతుల వైవిధ్యం
   3) ఆవరణ వ్యవస్థ వైవిధ్యం
   4) క్రియాత్మక వైవిధ్యం
7. కింది వాటిలో జన్యు వైవిధ్యానికి ఉదాహరణ ఏది?
   1) వర్షారణ్యంలో అనేక రకాల కప్పలు
   2) భారతీయ రైతులు పండించే విశిష్టమైన వరి పంట జాతులు
   3) వివిధ జాతుల చేపలకు మద్దతునిచ్చే పగడపు దిబ్బలు
   4) ఆకురాల్చే సతతహరిత, శంఖు ఆకార చెట్లతో కూడిన అడవులు
8. జీవవైవిధ్య హాట్‌స్పాట్‌ల సందర్భంలో, భారతదేశానికి సంబంధించి కింది వాటిలో ఏది సరైంది?



   ఎ) భారత దేశంలో నాలుగు జీవవైవిధ్య హాట్‌స్పాట్‌లు ఉన్నాయి.
   బి) ప్రపంచ మానవ జనాభాలో భారత జనాభా 17%, ప్రపంచ జీవవైవిధ్యంలో 8% భారతదేశంలోనే ఉన్నాయి.
   సి) పశ్చిమ కనుమలు, సుందర్‌బన్స్ భారత్‌లోని జీవవైవిధ్య హాట్‌స్పాట్‌లు
   1) ఎ, బి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి, సి
9. కింది ప్రమాణాల్లో ఏది ఒక ప్రాంతంలో జాతుల వైవిధ్యాన్ని నిర్ణయిస్తుంది?
   ఎ) జాతుల సమృద్ధి బి) వర్గీకరణ వైవిధ్యం
   సి) క్రియాత్మక వైవిధ్యం
   1) ఎ 2) బి 3) ఎ, బి 4) ఎ, బి, సి
10. సాగు చేసిన మొక్కల ఆవిర్భావ కేంద్రాలపై వావిలోవ్ భావన ప్రధానంగా దేనిపై దృష్టి పెడుతుంది?



   1) పంటల్లో జన్యువైవిధ్యం
   2) పంటలు మొదట పెంచిన భౌగోళిక ప్రాంతాలు
   3) ఉష్ణమండల ప్రాంతాల్లో జీవవైవిధ్యం
   4) అడవి జాతుల్లో ప్రకృతి వర్ణన యంత్రాంగాలు
11. జీవవైవిధ్యం కింది వర్గాలను వాటి నిర్వచనాలతో సరిపోల్చండి.

వర్గం	నిర్వచనం
ఎ) జాతుల వైవిధ్యం	1) జనాభాలో జన్యు లక్షణాల్లో తేడాలు
బి) జన్యు వైవిధ్యం	2) నిర్దిష్ట నివాస స్థలంలో వివిధ రకాల జాతులు
సి) పర్యావరణ వ్యవస్థ వైవిధ్యం	3) వివిధ పర్యావరణ వ్యవస్థలు, వాటి పరస్పర చర్యల పరిధి.

   1) ఎ-2, బి-1, సి-3 2) ఎ-1, బి-3, సి-2
   3) ఎ-3, బి-1, సి-2 4) ఎ-2, బి-3, సి-1
12. కింది వాటిలో ఒక ప్రాంతంలో జాతుల వైవిధ్యం ప్రాథమిక కొలత ఏది?
   1) స్థానిక జాతుల సంఖ్య 2) జాతుల సమృద్ధి
   3) ఒక జాతి లోపల జన్యువైవిధ్యం
   4) ఆధిపత్య జాతుల మొత్తం జనాభా పరిమాణం
13. పర్యావరణ వ్యవస్థ వైవిధ్యానికి సంబంధించి కింది ప్రకటనల్ని పరిగణించండి.
   ఎ) సముద్ర పర్యావరణ వ్యవస్థలు భూసంబంధమైన పర్యావరణ వ్యవస్థల కంటే ఎక్కువ వర్గీకరణ వైవిధ్యాన్ని ప్రదర్శిస్తాయి.



   బి) ఉష్ణమండల వర్షారణ్యాలు అన్ని భూసంబంధ జాతుల్లో 80% కలిగి ఉంటాయి.
   సి) పర్యావరణ వ్యవస్థ వైవిధ్యం జన్యు, జాతుల వైవిధ్యం నుంచి స్వతంత్రంగా ఉంటుంది.
   పై ప్రకటనల్లో ఏది సరైంది?
   1) ఎ 2) ఎ, బి 3) సి 4) ఎ, బి, సి
14. జాతులకు జన్యువైవిధ్యం ముఖ్యమైంది. ఎందుకంటే?
   1) ఇది మారుతున్న పర్యావరణ పరిస్థితుల్లో మనుగడను నిర్ధారిస్తుంది.
   2) ఇది పర్యావరణ వ్యవస్థలో జాతుల మధ్య పరస్పర చర్యలను నిర్ణయిస్తుంది.
   3) ఇది జనాభాలో జన్యు ప్రవాహాన్ని పరిమితం చేస్తుంది.
   4) ఇది స్పీషియేషన్ సంభావ్యతను తగ్గిస్తుంది.
15. జీవ వైవిధ్యానికి సంబంధించి కింది ప్రకటనలను పరిగణించండి.
   ఎ) జాతుల వైవిధ్యాన్ని ఒక ప్రాంతంలోని జాతుల సంఖ్య ద్వారా మాత్రమే కొలుస్తారు.
   బి) పర్యావరణం మార్పులకు, ఒక జాతి అనుకూలతకు జన్యువైవిధ్యం కీలకం.
   సి) ఒక ప్రాంతంలోని ఎబయోటిక్, బయోటిక్ భాగాల మధ్య పర్సపర చర్యను సూచిస్తుంది.
   పై ప్రకటనల్లో సరైనవి?
   1) ఎ, బి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి, సి
16. కింది ప్రపంచ సదస్సుల్లో ఏది జీవవైవిధ్య పరిరక్షణ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించింది?
   1) రామ్‌సర్ కన్వెన్షన్ 2) జీవవైవిధ్యంపై సమావేశం
   3) వాతావరణ మార్పులపై ఐక్యరాజ్య సమితి ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్
   4) స్టాక్‌హోమ్ కన్వెన్షన్
17. పర్యావరణ వ్యవస్థలకు చెందిన కింది ఉదాహరణలను పరిగణించండి.
   ఎ) మడ అడవులు బి) ఉష్ణమండల వర్షారణ్యాలు
   సి) పగడపు దిబ్బలు
   పై వాటిలో ఏవి అధిక జీవవైవిధ్యానికి ప్రసిద్ధి చెందాయి?
   1) ఎ, బి 2) ఎ, సి 3) బి, సి 4) ఎ, బి, సి
18. మెగాడైవర్స్ కంట్రీ అనే పదం దేన్ని సూచిస్తుంది?
   1) ప్రపంచంలోని మొత్తం జనాభాలో 50% పైగా ఉన్న దేశం.
   2) పెద్ద భౌగోళిక ప్రాంతం, ప్రత్యేకమైన వాతావరణం ఉన్న దేశం.
   3) భూమిపై నివసించే జాతుల వైవిధ్యంలో గణనీయ భాగం ఉన్న దేశం.
   4) స్థానికేతర జాతుల కంటే స్థానిక జాతులు ఎక్కువగా ఉన్న దేశం.
19. వ్యవసాయ వ్యవస్థల్లో జాతుల వైవిధ్యాన్ని కోల్పోవడానికి కింది కార్యకలాపాల్లో ఏది ఎక్కువగా దారితీస్తుంది?
   1) బహుళ పంటల సాగు వ్యవసాయం
   2) వ్యవసాయంలో రసాయనాల విస్తృత వినియోగం
   3) ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్
   4) సేంద్రియ వ్యవసాయం
20. జీవవైవిధ్యంపై సదస్సును ఏ సమావేశంలో ఆమోదించారు?



   1) స్టాక్‌హోమ్ కాన్ఫరెన్స్ - 1972
   2) రియో ఎర్త్ సమ్మిట్ - 1992
   3) జోహన్నెస్‌బర్గ్ సమ్మిట్ - 2002
   4) ప్యారిస్ ఒప్పందం - 2015
21. జీవవైవిధ్యంలోని కింది వర్గాలను పరిగణించండి.
   ఎ) జాతుల వైవిధ్యం బి) జన్యు వైవిధ్యం
   సి) పర్యావరణ వ్యవస్థ వైవిధ్యం
   పర్యావరణ వ్యవస్థ మొత్తం స్థితిస్థాపకతకు ఈ వర్గాల్లో ఏది దోహదం చేస్తుంది?
   1) ఎ, 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి, సి
22. కింది ఉదాహరణలను పరిగణించండి.
   ఎ) పడగపు దిబ్బలు బి) మడ అడవులు
   సి) పట్టణ పచ్చని ప్రదేశాలు
   పైన పేర్కొన్న వాటిలో ఏది పర్యావరణ వ్యవస్థ వైవిధ్యానికి దోహదం చేస్తుంది?
   1) ఎ, బి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి, సి
23. జీవవైవిధ్యం విషయంలో కింది వాటిలో సరైంది ఏది?
   1) ఉష్ణమండల ప్రాంతాల్లో సాధారణంగా సమశీతోష్ణ ప్రాంతాల కంటే అధిక జాతుల వైవిధ్యం ఉంటుంది.
   2) అధిక పునరుత్పత్తి రేట్లు ఉన్న జాతుల్లో జన్యువైవిధ్యం తక్కువగా ఉంటుంది.
   3) సముద్ర పర్యావరణ వ్యవస్థలు భూసంబంధ పర్యావరణ వ్యవస్థల కంటే తక్కువ ఫైలాను కలిగి ఉంటాయి.
   4) జాతుల సమృద్ధి ప్రాంతం పర్యావరణ స్థిరత్వం నుంచి స్వతంత్రంగా ఉంటుంది.
24. పర్యావరణ వ్యవస్థ వైవిధ్యాన్ని కింది ఏ స్థాయిలో ఉత్తమంగా గమనించవచ్చు?
   1) వివిధ పంటలు, నేల రకాలతో కూడిన స్థానిక వ్యవసాయ పర్యావరణ వ్యవస్థలు
   2) మడ అడవులు, ఆకురాల్చే అడవుల మధ్య ప్రాంతీయ వ్యత్యాసాలు
   3) సముద్ర, భూసంబంధమైన బయోమ్‌ల గ్లోబల్ నమూనాలు
   4) పైవన్నీ

సమాధానాలు

1-3; 2-2; 3-1; 4-2; 5-3; 6-3; 7-2; 8-1; 9-4; 10-2; 11-1; 12-2; 13-2; 14-1; 15-2; 16-2; 17-4; 18-3; 19-2; 20-2; 21-4; 22-4; 23-1; 24-4.

క్షేత్రమితి - 2D

ముఖ్యాంశాలు

- త్రిభుజం భుజాలు a, b, c అయితే త్రిభుజ చుట్టుకొలత $= a + b + c$
- త్రిభుజ వైశాల్యం $= \frac{1}{2} \times$ భూమి $\times$ ఎత్తు
- a, b, c త్రిభుజ భుజాలైతే త్రిభుజ వైశాల్యం
  $\Delta = \sqrt{s(s-a)(s-b)(s-c)}$
  $s = \frac{a+b+c}{2}$
- సమబాహు త్రిభుజం వైశాల్యం $= \frac{\sqrt{3}}{4} a^2$
- సమబాహు త్రిభుజం ఎత్తు $h = \frac{\sqrt{3}}{2} a$
- దీర్ఘచతురస్ర చుట్టుకొలత $= 2(l + b)$
- దీర్ఘచతురస్ర వైశాల్యం = పొడవు $\times$ వెడల్పు
- చతురస్ర చుట్టుకొలత $= 4 \times$ భుజం $= 4S$
- చతురస్ర వైశాల్యం = భుజం $\times$ భుజం $= S^2$
- వృత్త పరిధి $= 2\pi r$
- వృత్త వైశాల్యం $= \pi r^2$
- ట్రెపీజియం వైశాల్యం $= \frac{1}{2}(a+b)h$
- సమాంతర చతుర్భుజ వైశాల్యం = భూమి $\times$ ఎత్తు
- రాంబస్ వైశాల్యం $= \frac{1}{2} d_1 d_2$

1. ఒక త్రిభుజం భూమి 6 సెం.మీ., ఎత్తు 4 సెం.మీ. అయితే దాని వైశాల్యం ఎంత?
1) 24 చ. సెం.మీ. 2) 12 చ. సెం.మీ.
3) 18 చ. సెం.మీ. 4) 10 చ. సెం.మీ.

సాధన: త్రిభుజ వైశాల్యం $= \frac{1}{2} \times$ భూమి $\times$ ఎత్తు

$= \frac{1}{2} \times 6 \times 4 = 12$ చ. సెం.మీ.

సమాధానం: 2

2. ఒక త్రిభుజ భుజాలు 6 సెం.మీ., 8 సెం.మీ., 10 సెం.మీ. అయితే ఆ త్రిభుజ వైశాల్యం ఎంత?
1) 40 చ. సెం.మీ. 2) 12 సెం.మీ.
3) 24 చ. సెం.మీ. 4) 30 చ. సెం.మీ.

సాధన: త్రిభుజ భుజాలు a, b, c అయితే త్రిభుజ వైశాల్యం

$\Delta = \sqrt{s(s-a)(s-b)(s-c)}$

$s = \frac{a+b+c}{2}$

కాబట్టి $s = \frac{6+8+10}{2} = 12$

త్రిభుజం వైశాల్యం $= \sqrt{12(12-6)(12-8)(12-10)}$

$= \sqrt{12 \times 6 \times 4 \times 2} = \sqrt{6 \times 2 \times 6 \times 2 \times 2 \times 2}$

$= 6 \times 2 \times 2 = 24$ చ. సెం.మీ.

సమాధానం: 3

3. ఒక సమద్విబాహు త్రిభుజం భూమి 6 సెం.మీ., మిగిలిన భుజాలు 5 సెం.మీ., 5 సెం.మీ. అయితే దాని వైశాల్యం ఎంత?
1) 12 చ. సెం.మీ. 2) 15 చ. సెం.మీ.
3) 11.5 చ. సెం.మీ. 4) 11 చ. సెం.మీ.

సాధన: సమద్విబాహు త్రిభుజ వైశాల్యం $= \frac{b}{4}\sqrt{4b^2 - a^2}$

$= \frac{6}{4}\sqrt{4 \times 5^2 - 6^2} \Rightarrow \frac{6}{4}\sqrt{100 - 36}$

$= \frac{6}{4} \times 8 = 12$ చ. సెం.మీ.

సమాధానం: 1



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
అరిథ్‌మెటిక్

ఆ తీగను వృత్తాకారంలో వంచితే ఆక్రమించే వైశాల్యం?

4. ఒక తీగను చతురస్రాకారంలో వంచితే అది 484 చ. సెం.మీ. వైశాల్యాన్ని ఆక్రమిస్తుంది. ఇదే తీగను వృత్తాకారంలో వంచితే ఆక్రమించే వైశాల్యం ఎంత?
1) 462 చ. సెం.మీ. 2) 539 చ. సెం.మీ.
3) 632 చ. సెం.మీ. 4) 616 చ. సెం.మీ.

సాధన: చతురస్ర భుజం $a = \sqrt{484} = 22$ సెం.మీ.

చతురస్ర చుట్టుకొలత $= 4a = 4 \times 22 = 88$ సెం.మీ.

వృత్తం చుట్టుకొలత $= 2\pi r = 88$

$r = \frac{88}{2} \times \frac{7}{22} = 14$ సెం.మీ.

వృత్త వైశాల్యం $= \pi r^2 = \frac{22}{7} \times 14 \times 14 = 616$ చ. సెం.మీ.

సమాధానం: 4

5. ఒక రాంబస్ భుజం 41 సెం.మీ. దాని ఒక కర్ణం 18 సెం.మీ. అయితే రెండో కర్ణం పొడవు ఎంత? (సెం.మీ.లలో)
1) 80 2) 60 3) 75 4) 82

సాధన: మరో కర్ణం $= 2\sqrt{(\text{భుజం})^2 - \left(\frac{\text{కర్ణం}}{2}\right)^2}$

$= 2\sqrt{(41)^2 - \left(\frac{18}{2}\right)^2}$

$= 2\sqrt{(41)^2 - (9)^2} \Rightarrow 2\sqrt{(41+9)(41-9)}$

$= 2\sqrt{50 \times 32} \Rightarrow 2\sqrt{25 \times 64}$

$= 2 \times 5 \times 8 = 80$ సెం.మీ.

సమాధానం: 1



రచయిత
హెచ్. అరుణ శివప్రసాద్, విషయ నిపుణులు

6. ఒక రాంబస్ కర్ణాలు 12 సెం.మీ., 16 సెం.మీ. అయితే దాని వైశాల్యం ఎంత? (చ. సెం.మీ.లలో)
1) 20 2) 36 3) 40 4) 96

సాధన: రాంబస్ వైశాల్యం $= \frac{1}{2} \times$ కర్ణాల లబ్ధం

$= \frac{1}{2} \times 12 \times 16 = 96$ చ. సెం.మీ.

సమాధానం: 4

7. ఒక త్రిభుజాకార పొలం భూమి దాని ఉన్నతి (ఎత్తు)కి 3 రెట్లు. ఈ పొలాన్ని చదును చేసేందుకు హెక్టారుకు రూ. 6 చొప్పున రూ. 81 ఖర్చు అయితే ఆ పొలం భూమి కొలత ఎంత?
1) 300 మీ. 2) 600 మీ.
3) 900 మీ. 4) 1000 మీ.

సాధన: త్రిభుజాకార పొలం వైశాల్యం

$= \frac{81}{6} = \frac{27}{2}$ హెక్టార్లు $= \frac{27}{2} \times 10,000$ చ. మీ.

భూమి : ఎత్తు = 3 : 1,

భూమి = 3x,

ఎత్తు = x

వైశాల్యం $= \frac{1}{2} bh = \frac{1}{2} \times 3x \times x$

$= \frac{27}{2} \times 10000$

$x^2 = 90000 \Rightarrow x = 300$ మీ.

$\therefore$ భూమి $= 3x = 3 \times 300$

$= 900$ మీ.

సమాధానం: 3

731 Word of the Day

Maculate

Telugu meaning: మలినం చేయు, భ్రష్టు పట్టించు

English meaning: The word maculate (మ్యాకులేట్) is a verb that means to stain, blemish, or make impure. As an adjective, it means marked with spots or stains.

Synonyms: Stain, Tarnish

Antonyms: Purify, Spotless

***Usage:* 1. (As a Verb):** His reputation was maculated by false accusations spread by his rivals.

2. (As an Adjective): The once white cloth was now maculate with ink and grime.


కరెంట్ అఫైర్స్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'సర్దుబాటు చేసిన ప్రతీకార సుంకం' భారత్‌పై 25 శాతంగా ఉంటుందని ప్రకటించారు. ఇది ఆగస్టు 7 నుంచే అమలవుతుందని వెల్లడించారు. భారత్‌తో సహా ఇతర దేశాలపై 10% నుంచి 41% వరకు సుంకాలు విధించే కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. 'ప్రతీకార సుంకాల్లో మరిన్ని మార్పులు' పేరుతో దీన్ని వెలువరించారు.
- సిరియాపై అత్యధికంగా 41 శాతం టారిఫ్‌ను విధించారు.



భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టుకు చీఫ్ కోచ్‌గా ఖలీద్ జమీల్ 2025, ఆగస్టు 1న ఎంపికయ్యాడు. జాతీయ జట్టుకు భారతీయుడు చీఫ్ కోచ్‌గా నియమితుడవటం 13 ఏళ్లలో ఇదే తొలిసారి. పురుషుల జట్టుకు ప్రధాన కోచ్‌గా పనిచేసిన చివరి భారతీయుడు సావియో మెదీరా. 2011 నుంచి 2012 వరకు అతను చీఫ్ కోచ్‌గా వ్యవహరించాడు.
- 2017 ఐ-లీగ్‌లో ఐజ్వాల్ ఫుట్‌బాల్ క్లబ్‌ను జమీల్ విజేతగా నిలిపాడు. ప్రస్తుతం ఇండియన్ సూపర్ లీగ్‌లో జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు.



జులై 2025లో దేశవ్యాప్తంగా జీఎస్టీ వసూళ్లు రూ.1,95,735 కోట్ల మేర నమోదయ్యాయి. 2024, జులైతో పోలిస్తే వసూళ్లు 7.5% వృద్ధి చెందినట్లు కేంద్ర ఆర్థికశాఖ 2025, ఆగస్టు 1న విడుదల చేసిన గణాంకాల్లో వెల్లడైంది. దేశీయ వ్యాపారాలు, సేవల ద్వారా రూ. 1,43,023 కోట్లు, దిగుమతుల ద్వారా రూ. 52,712 కోట్లు వసూలయ్యాయి. నెలవారీ వసూళ్లు రూ. 1.80 లక్షల కోట్లు దాటడం వరుసగా ఏడోసారి.

అధునాతన గైడెడ్ మిసైల్ ఫ్రిగేట్ యుద్ధనౌక 'హిమగిరి' భారత నౌకాదళం చేతికి అందింది. కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్‌ఎస్‌ఈ) సంస్థ దీన్ని రూపొందించింది. ప్రాజెక్ట్-17ఏ కింద ఈ సంస్థ నిర్మించే మూడు యుద్ధ నౌకల్లో ఇది మొదటిది. హిమగిరి యుద్ధనౌక పొడవు 149 మీటర్లు కాగా బరువు 6,670 టన్నులు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ఈస్టిండియా కంపెనీపై జరిగిన ముఖ్య తిరుగుబాట్లు

స్టడీ - జోన్



వ్యాపారం కోసం భారతదేశానికి వచ్చిన ఈస్టిండియా కంపెనీ ఇక్కడి పాలకుల అనైక్యత, ప్రజల అమాయకత్వాన్ని స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకుంది. ఆధునిక ఆయుధ పద్ధతులతో ఒక్కొక్క సంస్థానాన్ని జయిస్తూ సామ్రాజ్యాన్ని విస్తరించింది. బెంగాల్‌తో మొదలుపెట్టి మొత్తం భారతదేశాన్ని గుప్పిట్లో పెట్టుకుంది. క్రీ.శ. 1857 నాటికి ఈస్టిండియా కంపెనీ భారతదేశంలో బ్రిటిష్ ఇండియా మహా సామ్రాజ్యాన్ని నెలకొల్పింది. బ్రిటన్‌కు భారతదేశం వలస రాజ్యమైంది. ఇక్కడి ఆర్థిక వనరులను కొల్లగొట్టడమే వారి లక్ష్యమైంది. కంపెనీ విపక్షపూరిత వాణిజ్య, రెవెన్యూ, వ్యవసాయ విధానాలను అవలంబించింది. దీంతో భారతదేశ సంప్రదాయ, ఆర్థిక వ్యవస్థలు క్షీణించాయి. ఆంగ్లేయుల అరాచక పాలనపై అంతటా తీవ్ర అసంతృప్తి చెలరేగింది. వారిపై భారతీయుల్లో వ్యతిరేకత ప్రారంభమైంది. అది తిరుగుబాట్ల రూపంలో బయటపడింది. సంస్థానాధీశులు మొదలు, గిరిజనుల వరకు వలస దోపిడీలపై పోరాటాలు చేశారు. అయితే ఈ తిరుగుబాట్లన్నీ స్థానిక సమస్యల ప్రాతిపదికన నిర్వహించినవే. కేవలం ఒక వర్గం లేదా ప్రాంతానికి చెందివారు మినహా ప్రజలంతా వీటిలో పాల్గొనలేదు. నాయకత్వలేమి, ప్రాచీన యుద్ధ పద్ధతులు, ఆయుధ సంపత్తి కొరత, సరైన కార్యాచరణ లేకపోవడం లాంటి కారణాల వల్ల ఈ తిరుగుబాట్లను ఈస్టిండియా కంపెనీ తేలిగ్గా అణచివేసింది. అయినప్పటికీ బ్రిటిష్ వారిని ఎదిరించి, వీరోచితంగా పోరాడిన ఘట్టాలన్నీ తర్వాతి తరాలకు స్ఫూర్తిగా నిలిచాయి. వీటిలో ముఖ్యమైన వాటిని పరిశీలిస్తే....

తిరుగుబాటు చేసినవారు/సంస్థానం	ప్రాంతం	కాలం
వీరపాండ్య కట్టబ్రహ్మన	తిరునల్వేలి, తమిళనాడు	1792-99
సన్యాసీలు	బెంగాల్	1763-1800
ట్రావెన్‌కోర్	కేరళ	1808
రామోసిల	సతారా, మహారాష్ట్ర	1822-29
రాణి చెన్నమ్మ	కిత్తూరు, కర్ణాటక	1824
కోల్ తెగ	బిహార్	1831-32
ఉయ్యాలవాడ నరసింహారెడ్డి	కర్నూలు	1846-47
సంతాల్ తెగ	చోటానాగ్‌పూర్	1854-55

జనరల్ స్టడీస్ - పర్యావరణ సమస్యలు

వ్యర్థ నిర్వహణ - తాజా అంశాలు

అత్యంత వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామికీకరణ, ప్రపంచీకరణ కారణంగా ప్రపంచవ్యాప్తంగా కాలుష్యం అధికమవుతోంది. అంతర్జాతీయ స్థాయిలో వ్యర్థ నిర్వహణ కోసం కార్యక్రమాలను రూపొందించి, అమలు చేస్తున్నా విడుదలవుతున్న వ్యర్థాలతో పోలిస్తే వాటి నిర్వహణ అంతంతే. దీనికోసం భారత్ అమలు చేస్తున్న కార్యక్రమాలు, రూపొందించిన చట్టాలు మొదలైన అంశాలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన అవసరం.



మన దేశంలో రోజూ సుమారు 33 వేల మిలియన్ లీటర్ల మురుగు నీరు విడుదలవుతోంది. ఈ మురుగు నీటిలో కొంత శాతమే శుద్ధి చేస్తున్నారు. దీనికి కారణం, భారతదేశ పట్టణాలు, నగరాల మురుగునీటి నిర్వహణ సామర్థ్యం 18.6% మాత్రమే.

భారత్‌లో ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్

ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి ఉత్పన్నమయ్యే వ్యర్థాలు అంటే తిరిగి వినియోగించడానికి లేదా వేరొక వస్తువులు తయారు చేయడానికి రిఫర్బిష్‌మెంట్ లేదా రిపేరింగ్ ప్రక్రియలకు వినియోగించని వ్యర్థాలను ఈ-వేస్ట్‌గా పరిగణిస్తారు. గ్లోబల్ ఈ-వేస్ట్ మానిటర్ 2024 ప్రకారం భారతదేశం మూడో అతిపెద్ద ఈ-వేస్ట్ ఉత్పత్తిదారుగా నిలిచింది. చైనా, అమెరికా మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. భారతదేశం మురుగునీటి నిర్వహణను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తోంది.

ఈ-వేస్ట్ వ్యర్థాల నిర్వహణకు కార్యాచరణ, వేస్ట్ టు వెల్త్, భారతదేశంలో ప్లాస్టిక్ వ్యర్థ నిర్వహణ, కేంద్రీకృత ఆన్‌లైన్ పోర్టల్ మొదలైన అంశాలతోపాటు పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

EPFO Recruitment 2025

Union Public Service Commission (UPSC) has released Special Advertisement No. 52/2025 for direct recruitment to 230 posts in Employees' Provident Fund Organisation (EPFO) under the Ministry of Labour & Employment. The application fee is Rs.25. Eligible candidates can apply online before 18 August 2025.

Mining Mate Posts

Uranium Corporation of India Limited, Jaduguda Mines in the state of Jharkhand, has released a notification for the recruitment of Mining Mate posts on a contract basis. The total no. of posts is 55. The last date for online applications is 20 August 2025.

Assistant Professor Jobs

Employees State Insurance Corporation (ESIC), Delhi is inviting applications for the filling of Assistant Professor posts in various departments on a direct recruitment basis. No. of posts is 243. Application fee is Rs.500. Eligible candidates can apply offline before 15 September 2025.

Did You Apply..?

Today (August 4) is the last date for the following Jobs

- PGIMER Group 'B' & 'C' Recruitment 2025 - 114 posts.
  Eligibility: Bachelor's degree.
- 18 Technician posts in East Coast Railway.
  Eligibility: ITI.

For more information and other notifications - scan QR code

Phrasal Verbs

Directions (Qs. 1-20): *Select the most appropriate option to substitute the underlined segment in the given sentence.*

1. Ramesh always tries to **put his best foot forward** during interviews.
A) walk confidently
B) show his best side
C) stay silent
D) pretend to be perfect

2. Priya **let the cat out of the bag** about the surprise party.
A) rescued a pet B) spoiled the plan
C) revealed the secret
D) ran away in fear

3. The manager's instructions **went in one ear and out the other** for most workers.
A) were strictly followed
B) were forgotten instantly
C) were appreciated
D) echoed loudly

4. After the argument, he decided to **bury the hatchet**.
A) hide his weapon B) take revenge
C) forget the quarrel
D) stay away from others

5. She **jumped on the bandwagon** and started investing in crypto.
A) followed a trend B) got scared
C) started driving
D) hesitated to try

6. Ishan **burned the midnight oil** to complete his project.
A) wasted time
B) did household chores
C) used extra electricity
D) worked late at night

7. The soldier was praised for **keeping a stiff upper lip** during the crisis.
A) showing courage
B) remaining silent
C) blaming others
D) looking arrogant

8. Despite her injury, Mithali **went the extra mile** to help her team win.
A) walked far B) followed the leader
C) slowed down D) put in more effort

9. When asked about his failure, he tried to **beat around the bush**.
A) cut trees B) spoke indirectly
C) explained clearly
D) ignored the question

10. You need to **pull up your socks** if you want to pass this exam.
A) dress formally B) stop studying
C) take rest D) make a stronger effort

11. He **spilled the beans** about the company's secret strategy.

SSC Exams
English

A) wasted food B) played a prank
C) disclosed the information
D) made a guess

12. The politician tried to **blow his own trumpet** during the debate.
A) praise himself B) play music
C) attack others D) stay silent

13. The scientist's new theory was **ahead of its time**.
A) too early to be accepted
B) copied from others
C) outdated D) easily understood

14. He was caught **red-handed** while stealing the documents.
A) in a red shirt
B) with the evidence
C) while escaping
D) acting suspiciously

15. During the recession, many businesses had to **cut corners** to survive.
A) move carefully
B) expand operations
C) change direction
D) reduce quality to save money

16. She always **keeps her cards close to her chest** in business meetings.
A) plays fair B) reveals secrets
C) remains secretive
D) asks questions

17. His explanation was just a **cock and bull story**.
A) a true event B) a confusing tale
C) a fabricated story
D) a long discussion

18. I told him to **bite the bullet** and face the consequences.
A) act brave in a tough situation
B) use a weapon
C) leave the situation
D) argue continuously

19. The boss was in a bad mood and **read the riot act** to the team.
A) gave an award B) told a story
C) started crying
D) gave strict warning

20. He was **under the weather** after returning from the trip.
A) facing a storm B) feeling unwell
C) acting confused
D) celebrating

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert